

'గ్రామాల్లో సంపద పెరగాలి.
పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 189

శుక్రవారం 29-9-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL









స్టోన్ స్టార్స్

ఫ్యాషన్

ఆభరణాలలో రాళ్లు అనగానే
మనకు వజ్ర వైఢూర్యాలు గుర్తుకు వస్తుంటాయి.
సంప్రదాయ ఆభరణాలలో పొదిగిన
రత్నాలు కళ్లముందు కనిపిస్తుంటాయి.
కానీ, వేషధారణలో ఇండోవెస్ట్రన్ స్టైల్‌ని ఇష్టపడినట్టే
ఆభరణాలనూ వెస్ట్రన్ లుక్‌ను తీసుకువస్తున్నారు డిజైనర్లు.
ధరించిన వెస్ట్రన్ డ్రెస్‌కు మరిన్ని హంగులు తీసుకురావడానికి
రంగు రంగుల రాళ్లతో ఫ్యాషన్ జ్యువెలరీ రూపుదిద్దుకుంటోంది.
స్టోన్ జ్యువెలరీని ధరించినవారు వేడుకలో ఎక్కడ ఉన్నా
స్టార్‌లలా మెరిసిపోతున్నారు.
స్టోన్ స్టార్స్ అని కితాబులు అందుకుంటున్నారు.




ఇటీవల అట్రాక్ట్ చేస్తున్న ఫ్యాషన్ జ్యువెలరీలో స్టోన్ ముందువరసలో ఉన్నాయి. వెడల్పాటి స్టోన్స్, బీడ్స్ కాంబినేషన్‌లో వస్తున్న జ్యువెలరీని నవతరం మరింతగా ఇష్టపడుతుంది.



బ్రాస్ మెటల్‌తో...

రాళ్లను పట్టి ఉంచాలంటే అందుకు తగిన గట్టి తీగల అల్లిక కూడా ఉండాలి. దానికి అనువైన లోహంగా ఇత్తడి డిజైనర్ల చేతిలో కొత్తగా మెరుస్తోంది. దీనితో స్టోన్ జ్యువెలరీని ఇండోవెస్ట్రన్ దుస్తులకు తగ్గట్టు ధరించేలా విన్నూతమైన డిజైన్స్‌ని మన ముందు కనువిందు చేస్తున్నాయి.. వందల రూపాయల నుంచి వేల రూపాయల వరకు ధర పలుకుతున్నాయి ఈ డిజైన్స్.











రంగు రాళ్లు

అచ్చమైన బంగారు ఆభరణాల్లో రత్నాలను పొదగడం చూస్తుంటాం. అయితే, ఇప్పుడు ఫ్యాషన్ జ్యువెల్రీలో రంగు రాళ్లను ఉపయోగించి డిజైన్స్ రూపొందిస్తున్నారు. సిల్వర్, స్టీల్ మెటల్‌తోనూ రంగు రాళ్లు కనువిందు చేస్తున్నాయి. తక్కువ ధరలో అతివల చూపులను ఇట్టే ఆకట్టుకుంటున్నాయి.

రాళ్లలోనూ రెప్లికా..

రాతి యుగంలో తమను తాము కాపాడుకోవడానికి రకరకాల లోహాలు, జంతువుల ఎముకలు, రంగు రాళ్లను ఆభరణాలుగా వాడుతూ వచ్చేవారు. నాగరికత మారుతున్న కొద్దీ డిజైన్స్‌లో మార్పులు వచ్చాయి కానీ, రాతి రూపం అలాగే ఉంటోంది. పిన్స్, బ్రోచెస్, రింగ్స్, పెండెంట్స్, నెక్లెస్‌లు, పొడవైన హారాలు, రాళ్ల వరసలు .. వీటిలో పూసలు కూడా జత చేరి మరింత హంగులతో స్టోన్ జ్యువెలరీ ముస్తాబు అవుతోంది. ఖరీదు ఎక్కువైన రత్నాలనే కాదు వాటి రెప్లికాలుగా రంగు రాళ్లతోనూ సంప్రదాయ, ఇండోవెస్ట్రన్ డిజైన్లు సృష్టిస్తున్నారు డిజైనర్లు.


బయోగ్రఫీ

'సావిత్రిబాయి పూలే ప్రతిరోజూ సంచిలో అదనంగా చీర పెట్టుకుని స్కూల్‌కు వెళ్లేవారు. దారిలో ఎవరో ఒకరు ఆమె మీద పేడ విసిరితే కడుక్కుని కట్టుకోవడానికి' అని రాస్తుంది రీతా రామస్వామి గుప్తా. నిమ్న వర్గాల ఆడపిల్లల విద్యకు జీవితాన్ని అంకితం చేసిన సావిత్రిబాయి పూలేమీద ఎన్నో పుస్తకాలు వచ్చాయి. కాని రచయిత్రి రీతా రామస్వామి మరిన్ని జీవిత చిత్రాలను సేకరించి తెచ్చిన పుస్తకం 'సావిత్రిబాయి పూలే' తాజాగా విడుదలైంది. రీతా రామస్వామి గురించి, పుస్తకంలో ఉన్న విశేషాల గురించి...

మహిళా విద్యకు తొలి వెలుతురు



సావిత్రిబాయి పూలే



'ఇవాళ బాలికల విద్య అనగానే ప్రపంచానికి మలాలా పేరు గుర్తుకొస్తుంది. కాని బాలికల విద్య కోసం జీవితాన్ని అర్పించిన తొలి మహిళ సావిత్రిబాయి పూలే. మన దేశంలో ఆమె తొలి మహిళా ఉపాధ్యాయిని. ఆడపిల్లల చదువును ప్రచారం చేయడానికి ఆమె ఎదుర్కొన్న వ్యతిరేకత అంతా ఇంతా కాదు' అంటుంది రీతా రామస్వామి గుప్తా.

గతంలో నటుడు సంజీవ్ కుమార్‌పై రాసిన బయోగ్రఫీతో పాఠకులకు తెలిసిన రీతా రామస్వామి ఆ తర్వాత 'రంగ్ దే బసంతి' దర్శకుడు ఓం ప్రకాష్ మెహ్రాతో కలిసి అతని జీవిత సంగ్రహం రాసింది. 'ఇలా ఇంకొన్ని పుస్తకాలు రాయాలనుకుంటుండగా నా 18 ఏళ్ల కుమార్తె- అమ్మా... ఎందుకు నువ్వు ఎప్పుడూ మగ వాళ్ల గురించే రాస్తావు. నువ్వు రాయదగ్గ స్త్రీలు లేరా? అని ప్రశ్నించింది. ఆ ప్రశ్న నన్ను ఆలోచింపచేసింది. దానికి జవాబే నా కొత్త పుస్తకం- సావిత్రిబాయి పూలే.. హర్ లైఫ్.. హర్ రిలేషన్‌షిప్స్.. హర్ లెగసీ' అంది రీతా రామస్వామి. హార్పర్ కాలిన్స్ ఇండియా ప్రచురణ సంస్థ నుంచి ఈ పుస్తకం తాజాగా విడుదలైంది.



రీతా రామస్వామి

బలహీనులకు అందని విద్య

'బ్రిటిష్ వారు 1813లో క్రైస్తవ మిషనరీల ద్వారా మన దేశంలో పాశ్చాత్య విద్యకు అంకురార్పణ చేశారు. అయితే వారి ఉద్దేశాలు వేరే. తమ వ్యవహారాల కోసం ఇంగ్లిష్ తెలిసిన కొంతమంది ఉద్యోగులు అవసరం కనుక పై వర్గాల వారికి చదువు నేర్పిస్తే వారి నుంచి కింది వర్గాల వారికి చదువు అందుతుంది అని భావించారు. కాని పై వర్గాలకు మొదలైన చదువు కింది వర్గాల వరకూ చేరలేదు. కింది వర్గాల వారికి పాఠశాలల్లో అనుమతి లేని పరిస్థితి. అంటరానితనం విస్తృతంగా ఉండేది. ఇక చదువుకు ఆడపిల్లలు నిషిద్ధం చేయబడ్డారు. ప్రభుత్వ టీచర్లకు ఇంగ్లిష్ వచ్చి ఉండాలన్న నియమం కూడా బ్రిటిష్ ప్రభుత్వం పెట్టింది. వీటన్నింటినీ దాటి సావిత్రిబాయి పూలే టీచర్ అయ్యింది. జ్యోతిబా పూలేతో కలిసి 1848లో బ్రిటిష్ వారితో సంబంధం లేని, మిషనరీలతో సంబంధం లేని బాలికల తొలి పాఠశాలను మొదలెట్టింది. దిగువ వర్గాల బాలికల విద్య కోసం పోరాడింది' అంటుంది రీతా రామస్వామి.

ఆ ఇద్దరు

'సావిత్రిబాయి పూలే హర్ లైఫ్, హర్ రిలేషన్‌షిప్స్, హర్ లెగసీ'... పుస్తకంలో రీతా రామస్వామి కేవలం సావిత్రిబాయి పూలే గురించే రాయలేదు. ఆమెను ఆదర్శంగా తీసుకుని బాలికల విద్య కోసం తోడైన తొలి ముస్లిం ఉపాధ్యాయిని ఫాతిమా షేక్ గురించీ... సావిత్రి, ఫాతిమా కలిసి మహారాష్ట్రలో బాలికల విద్య కోసం స్కూళ్లు స్థాపించి నిర్వహించడానికి పడిన ఆరాటం గురించి కూడా రాసింది. 'ఫాతిమ షేక్ తొలి క్వాలిఫైడ్ ముస్లిం ఉమెన్ టీచర్ మన దేశంలో. ఆమె సావిత్రిబాయి పూలేకి బాసటగా నిలిచింది. ఒక దశలో సావిత్రిబాయి సుదీర్ఘకాలం జబ్బు పడితే స్కూళ్ల నిర్వహణభారం మోసింది. ఆ వివరాలన్నీ నా పుస్తకంలో ఉన్నాయి' అని తెలిపింది రీతా రామస్వామి.

ఎన్నెన్నో అవమానాలు

'దిగువ వర్గాల వారిలో ఆడపిల్లలకు చదువెందుకు అనే భావన విపరీతంగా ఉండేది. వాళ్లకు చిన్న వయసులో పెళ్లిళ్లు చేసేవారు. కాని వారి ఇళ్లకు వెళ్లి బడికి పంపమని కోరేది సావిత్రి. వారు శాపనార్థాలు పెట్టేవారు. దారిన పోతూ ఉంటే రాళ్లు విసిరేవారు. దానికి తోడు పేద వర్గాల వారిని చదివిస్తున్నందుకు అగ్ర వర్ణాలు కక్ష కట్టి సావిత్రిబాయి మీద పేడనీళ్లు చల్లేవారు. అందుకని ఆమె స్కూలుకు వెళుతున్నప్పుడు తన సంచిలో చీర అదనంగా పెట్టుకునేది. ఎవరైనా పేడ నీళ్లు చల్లినా వెరవకుండా స్కూలుకు వెళ్లి చీర మార్చుకుని పాఠాలు చెప్పేది. ఆమె స్ఫూర్తి నేటికీ కొనసాగడం వల్ల మన దేశంలో బాలికల విద్య గణనీయంగా పెరిగింది. చదువులో ఉద్యోగాల్లో అమ్మాయిలు గొప్పగా రాణిస్తున్నారు. వారంతా తప్పక తెలుసుకోవాల్సిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే' అంది రీతా రామస్వామి.

వంటిల్లు

ఆకు రుచులు



పిల్లల నుంచి పెద్దల వరకు ఆకుకూర అనగానే... ఆమడ దూరం పరిగెడతారు. పోషకాలు ఎక్కువగా ఉండే ఆకుకూరలను ఎలాగైనా మీ వాళ్లకు తినిపించాలనుకుంటున్నారా? అయితే ఈ వారం మన 'వంటిల్లు'ను ఫాలో అయిపొండి...

తోటకూర ఉండలు



కావలసినవి: తోటకూర తరుగు – మూడు కప్పులు; సెనగపిండి – అరకప్పు; పచ్చిమిర్చి – నాలుగు; అల్లం వెల్లుల్లి పేస్టు – టీస్పూను; జీలకర్ర – టీస్పూను; కారం – అరటీస్పూను; ఉప్పు – రుచికి సరిపడా; పచ్చికొబ్బరి తురుము – టేబుల్ స్పూను; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా. తాలింపు కోసం: నువ్వులు – ఒకటిన్నర టేబుల్ స్పూన్లు; కరివేపాకు – రెండు రెమ్మలు; ఎండు మిర్చి – రెండు; ఆవాలు – అర టీస్పూను; ఇంగువ – చిటికెడు; నూనె – రెండు టీస్పూన్లు.

తయారీ: ● పచ్చిమిర్చిని సన్నగా తరిగి పెట్టుకోవాలి ● ఒక గిన్నెలో తోటకూర తరుగు, పచ్చిమిర్చి, అల్లంవెల్లుల్లి పేస్టు, కారం, జీలకర్ర, సెనగపిండి, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి ● ఈ మిశ్రమంలో కొద్దికొద్దిగా నీళ్లు చల్లుకుంటూ ముద్దగా కలపాలి ● పిండి ముద్దను మీడియం సైజు ఉండలుగా చుట్టి సలసలా కాగుతున్న నూనెలో వేసి గోల్డెన్ బ్రౌన్ కలర్ లోకి మారేంత వరకు వేయించాలి ● ఇప్పుడు తాలింపు కోసం తీసుకున్న దినుసులతో తాలింపు పెట్టాలి ● వేయించి పక్కన పెట్టుకున్న తోటకూర ఉండలను ఈ తాలింపులో వేసి ఉండలకు తాలింపు గింజలు పట్టేటట్లు కలపాలి ● చివరిగా పచ్చికొబ్బరి తురుమును ఉండలపై చల్లాలి ● వేడివేడి మసాలా టీతో ఈ తోటకూర ఉండలు చాలా రుచిగా ఉంటాయి.

పెసర-పాలకూర ఇడ్లీ



కావలసినవి: పెసరపప్పు – కప్పు; పాలకూర – కప్పు; నూనె – రెండు టీస్పూన్లు; ఉప్పు – రుచికి సరిపడా; కారం – పావు టీస్పూను; వంట సోడా – పావు టీస్పూను.

తయారీ: ● పెసర పప్పును శుభ్రంగా కడిగి ఐదారు గంటలు నానబెట్టుకోవాలి ● నానిన పప్పును మెత్తగా గ్రైండ్ చేయాలి ● పాలకూరను కూడా శుభ్రంగా కడిగి మెత్తగా గ్రైండ్ చేయాలి ● పాలకూర పేస్ట్‌లో రుబ్బిన పెసర పప్పు, కారం, వంటసోడా, రుచికి సరిపడా ఉప్పు, కొద్దిగా సోడా ఉప్పు వేసి కలపాలి ● పిండిని మరీ జారుడుగా కాకుండా తగినంత నీటిని చేరుస్తూ ఇడ్లీ పిండిలా కలుపుకోవాలి ● ఇడ్లీప్లేటుకు కొద్దిగా నూనె రాసి పిండిని ఇడ్లీ ప్లేటులో వేసి ఆవిరి మీద ఉడికించాలి ● పదిహేను లేదా ఇరవై నిమిషాలు ఉడికిస్తే ఇడ్లీ రెడీ ● పెసర పాలకూర ఇడ్లీలను పుదీనా చట్నీ లేదా సాంబార్‌తో వేడిగా వడ్డించాలి.

బతువా పకోడీ



కావలసినవి: సెనగపిండి – రెండు టేబుల్ స్పూన్లు; గోధుమపిండి – రెండు టేబుల్ స్పూన్లు; బతువా(పప్పు ఆకు) తరుగు – కప్పు; పాలకూర తరుగు – అరకప్పు; పన్నీర్ తురుము – పావు కప్పు; పాలు – రెండు టేబుల్ స్పూన్లు; పచ్చిమిర్చి తరుగు – రెండు టీస్పూన్లు; అల్లం వెల్లుల్లి పేస్టు – అర టీస్పూను; ఉప్పు, మిరియాల పొడి – రుచికి సరిపడా; చాట్ మసాలా – ఒకటిన్నర టీస్పూన్లు; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: ● ఒక గిన్నెలో పదార్థాలన్నింటి వేసి కలపాలి ● దీనిలో రుచికి సరిపడినంత ఉప్పు; మిరియాలపొడి కొద్దిగా నీళ్లు చల్లుకుంటూ పకోడీపిండిలా కలుపుకుని పక్కన పెట్టుకోవాలి ● మరుగుతున్న నూనెలో పిండిని పకోడీల్లా వేసి దోరగా వేయించి తీయాలి ● వేడివేడి పకోడీలపై చాట్ మసాలా చల్లి సర్వ్ చేసుకోవాలి.

బచ్చలి జొన్న పరోటా



కావలసినవి: జొన్న పిండి – కప్పు; గోధుమ పిండి – అరకప్పు; బచ్చలి ఆకు పేస్ట్– రెండు కప్పులు; అల్లం తరుగు – పావు టీస్పూను; జీలకర్ర పొడి – పావు టీస్పూను; పసుపు – పావు టీస్పూను; నీళ్లు – అర కప్పు; ఉప్పు – రుచికి సరిపడా. నూనె – పరోటా కాల్చడానికి తగినంత.

తయారీ: అరకప్పు నీళ్లలో చిటికెడు ఉప్పువేసి వేడిచేయాలి ● మరుగుతున్న నీటిలో జొన్నపిండి వేసి నాలుగు ఐదు నిమిషాలు కలుపుతూ మగ్గనిచ్చి దించేయాలి ● ఇప్పుడు జొన్న పిండిలో బచ్చలి ఆకు పేస్టు వేసి కలపాలి ● అల్లం తరుగు, జీలకర్ర, పసుపు, గోధుమ పిండివేసి కలిపి ఇరవై నిమిషాలు పక్కన పెట్టుకోవాలి ● నానిన పిండిని చిన్న చిన్న ఉండలుగా చుట్టుకుని పరోటాల్లా వత్తుకోవాలి ● కొద్దిగా నూనె వేస్తూ రెండువైపులా చక్కగా కాల్చుకుంటే బచ్చలి జొన్నపరోటా రెడీ.

గ్రీన్ దోశ



కావలసినవి: బియ్యం – కప్పు; మినప పప్పు – కప్పు; మెంతులు – టీస్పూను; కొత్తిమీర – కప్పు; పుదీనా – కప్పు; కరివేపాకు – అర కప్పు; జీలకర్ర – అరటీస్పూను; వాము – చిటికెడు; ఉల్లిపాయ – ఒకటి; పచ్చిమిర్చి – నాలుగు; ఉప్పు – టీస్పూను; నూనె – పావు కప్పు.

తయారీ: ● బియ్యం, మినప పప్పు, మెంతులను శుభ్రంగా కడిగి ఐదు గంటలపాటు నానబెట్టుకోవాలి ● నానాక వీటన్నింటినీ గ్రైండర్‌లో వేసి రుబ్బుకోవాలి ● సగం మెదిగిన తరువాత అందులో కొత్తిమీర, పుదీనా, కరివేపాకు, ఉల్లిపాయ, పచ్చిమిర్చిలను వేయాలి ● అవసరాన్ని బట్టి నీళ్లు చల్లుకుంటూ పిండిని మెత్తగా రుబ్బుకోవాలి ● చక్కగా మెదిగిన పిండిని గిన్నెలో తీసుకుని అందులో ఉప్పు, జీలకర్ర, వాము కలపాలి ● కాలిన పెనం పైన పిండిని దోశలా పోసుకుని కొద్దిగా నూనె వేయాలి ● రెండు వైపులా చక్కగా కాల్చుకుంటే ఎంతో రుచికరమైన గ్రీన్ దోశ రెడీ.


గోంగూర బజ్జీ



కావలసినవి: తాజా గోంగూర – కప్పు; సెనగపిండి – కప్పు; బియ్యప్పిండి – మూడు టేబుల్ స్పూన్లు; కారం – టీస్పూను; పసుపు – పావు టీస్పూను; ఇంగువ – చిటికెడు; ఉప్పు – రుచికి సరిపడా; నూనె – పావు కేజీ.

తయారీ: ● గోంగూరను శుభ్రంగా కడిగి పక్కన పెట్టుకోవాలి ● సెనగ పిండిలో బియ్యప్పిండి, ఇంగువ, కారం, పసుపు, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి ● కొద్దిగా నీళ్లుపోసి చిక్కగా కలుపుకోవాలి. చివరిగా టేబుల్ స్పూన్ నూనె వేసి కలపాలి ● ఇప్పుడు గోంగూర ఆకులను ఈ పిండిలో ముంచి మరుగుతోన్న నూనెలో వేసి గోల్డెన్ బ్రౌన్‌లోకి మారేంత వరకు వేయించి తీసేయాలి ● నూనె ఎక్కువగా ఉన్నట్లు అనిపిస్తే బజ్జీలను టిష్యూ పేపర్ మీద వేసి, నూనెను పేపర్ పీల్చుకున్న తరువాత సర్వ్ చేసుకోవాలి.


సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 189
శుక్రవారం 29-9-2023
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'



మన గురి అదిరె..
షూటింగ్‌లో భారత్‌కు నాలుగో స్వర్ణం.. పతకాల పట్టికలో ఐదో స్థానం - 13లో


బుల్ మరోసారి కుదేల్..
సెన్సెక్స్ 610 పాయింట్లు నష్టం.. 19,550 దిగువకు నిఫ్టీ - 13లో


నిరసనలతో దద్దరిల్లిన ఇంఫాల్
మణిపూర్‌లోని ఇంఫాల్ వెస్ట్‌లో డిప్యూటీ కమిషనర్ కార్యాలయంపై ఆందోళనకారులు దాడి చేశారు. రెండు కార్లకు నిప్పపెట్టారు.
వివరాలు 6లో ▸


కరువు పరిస్థితులు
భారత్‌లోని 500కు పైగా జిల్లాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయని 'డౌన్ టు ఎర్త్' అనే సంస్థ అంచనా వేసింది.
వివరాలు 6లో ▸


కమి రిటా సరికొత్త రికార్డు
నేపాలీ పర్వతారోహకుడు కమి రిటా షెర్పా 8 వేల మీటర్లకు పైగా ఎత్తైన పర్వతాలను 42 సార్లు అధిరోహించిన ఘనతను సాధించారు.
వివరాలు 6లో ▸


కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య
రాజస్తాన్‌లోని కోటాలో మరో విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. యూపీకి చెందిన తన్వీర్‌ఖాన్ ఉరేసుకుని తనువు చాలించాడు.
వివరాలు 6లో ▸

పేదలను బెదిరించారు..
'అసైన్డ్' కాజేశారు

పక్కా స్కెచ్‌తో బడుగుల భూములు కొల్లగొట్టిన బాబు ముఠా

వాటికి ప్యాకేజీ లేదని బెదిరించి మరీ హస్తగతం

- 1954 తరువాత భూపంపిణీ రికార్డులు లేవని కోర్టుకు బురిడీ
- ఆ కుట్రతో 617.70 ఎకరాల అసైన్డ్ భూములు చంద్రబాబు, నారాయణ బ్యాచ్ హస్తగతం
- భూసమీకరణ ప్యాకేజీ కింద వాటి విలువ రూ.3,737.30 కోట్లు..
- చివరికి.. 1954 తరువాత భూ పంపిణీ రికార్డులు వెలుగులోకి.. దాంతో ఎల్లో గ్యాంగ్ భూదాహం బట్టబయలు




అప్పటి ఉన్నతాధికారుల అభ్యంతరాలూ బేఖాతరు

(వడ్డాది శ్రీనివాస్/ సాక్షి, అమరావతి)

టీడీపీ ప్రభుత్వ హయాంలో రాజధాని అమరావతి ముసుగులో చంద్రబాబు బరితెగించి పాల్పడిన భారీ భూదోపిడీ బండారం బట్టబయలైంది. గతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద రైతులకు కేటాయించిన అసైన్డ్ భూములను కొల్లగొట్టేందుకు పక్కాగా అమలుచేసిన కుతంత్రం ఆధారాలతో సహా నిగ్గుతేలింది. ఏకంగా రూ.3,737.30 కోట్ల విలువైన 617.70 ఎకరాల అసైన్డ్ భూదోపిడీ విస్మయపరుస్తోంది. ఈ భూములకు పరిహారం ఇవ్వబోమని అప్పట్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులను బెదిరించి వారి భూములను చంద్రబాబు, నారాయణ, తదితర టీడీపీ పెద్దలు 814 మంది బినామీల ముసుగులో హస్తగతం చేసుకుని
మిగతా 3వ పేజీలో ▶

● హరిత విప్లవ పితామహుడు
ఎం.ఎస్. స్వామినాథన్
కన్నుమూత

- అనారోగ్యంతో చెన్నైలోని స్వగృహంలో తుదిశ్వాస
- తరమణిలోని ఫౌండేషన్‌లో పార్థీవదేహం
- రేపు అంత్యక్రియలు నిర్వహిస్తామన్న సన్నిహితులు
- సంతాపం ప్రకటించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ



సాక్షి, చెన్నై: భారత హరిత విప్లవ పితామహుడు, ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త, పద్మ విభూషణ్ డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ (98) అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. దేశంలో ఆకలితో అలమటించే అభాగ్యులు ఉండకూడదన్న లక్ష్యంతో జీవితాంతం పోరాటం సాగించిన మహా మనిషి తమిళనాడు రాజధాని చెన్నైలోని తన స్వగృహంలో గురువారం ఉదయం 11.15 గంటలకు శాశ్వత నిద్రలోకి చేరుకున్నారు. ఆయన కొంతకాలంగా వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు డాక్టర్ సౌమ్యా స్వామినాథన్, మధురస్వామినాథన్, నిత్యారాయ్ ఉన్నారు. భార్య మీనా స్వామినాథన్ గతంలోనే
మిగతా 6వ పేజీలో ▶

ఆకలి లేని సమాజమే ఆయన కల

దేశంలో హరిత విప్లవానికి బాటలు వేసిన స్వామినాథన్ | సుస్థిర ఆహార భద్రతలో ప్రపంచ నాయకుడిగా గుర్తింపు 6లో

వ్యవసాయరంగ గతిని మార్చిన మహనీయుడు స్వామినాథన్
ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 10లో

న్యూస్‌రీల్

విశాఖలో ఎక్సైజ్ ల్యాబ్ ప్రారంభం



మద్యాన్ని పరీక్షించేందుకు దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఆంధ్ర యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన అత్యాధునిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ లేబొరేటరీని గురువారం డిప్యూటీ సీఎం, ఎక్సైజ్ శాఖ మంత్రి నారాయణస్వామి ప్రారంభించారు. కల్తీ మద్యానికి అవకాశం లేకుండా ఉండేందుకు ఈ ల్యాబ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.
వివరాలు 2లో ▸

నేడు ఐదో విడత వాహన మిత్ర సాయం విడుదల



సొంత వాహనంతో స్వయం ఉపాధి పొందుతున్న ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు, ఎండీయూ ఆపరేటర్లకు అండగా నిలిచేందుకు వైఎస్సార్ వాహన మిత్ర పథకాన్ని ప్రవేశపెట్టిన సీఎం జగన్.. నేడు విజయవాడలో ఐదో విడత ఆర్థిక సాయాన్ని అందించనున్నారు.
వివరాలు 2లో ▸



కన్నుల పండువగా గణేశ్ నిమజ్జనం

- ఆధ్యాత్మికతను సంతరించుకున్న హైదరాబాద్
- సకాలంలో గంగ ఒడికి చేరిన ఖైరతాబాద్ మహా గణపతి
- వేడుకలను తిలకించిన భక్తజనం

- వివరాలు 14లో

సీఎం జగన్‌ను కలిసిన
గౌతమ్ అదానీ

సాక్షి, అమరావతి: అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ గురువారం సాయంత్రం తాడేపల్లిలోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. గంగవరం పోర్టుకు సంబంధించి వివిధ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడంపై సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. వీరి మధ్య రాష్ట్రంలో అదానీ కంపెనీ పెట్టుబడులకు సంబంధించిన పలు అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం.


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ

ఇదండీ సంగతి


సార్! మీరిప్పుడు కాంగ్రెస్‌లో ఉన్నారు!

ఆరోగ్యశ్రీ సేవలు
చాలా బాగున్నాయి

99.71 శాతం మంది రోగుల అభిప్రాయం

- పథకం కింద చికిత్స చేయించుకున్న రోగుల నుంచి అభిప్రాయ సేకరణ
- రోగుల ఇళ్లకు వెళ్లి అభిప్రాయాలు తెలుసుకుంటున్న ఏఎన్‌ఎంలు
- ఇప్పటి వరకూ 15.43 లక్షల మంది నుంచి అభిప్రాయ సేకరణ
- అందులో 15.39 లక్షల మంది సంతృప్తి వ్యక్తీకరణ



2లో

కష్టకాలంలో ఆదుకున్నారు

"గుండెకు బైపాస్ సర్జరీ చేయాలన్నారు. నా భర్త ఆటో డ్రైవర్. రోజువారి సంపాదన కుటుంబ పోషణకు సరిపోతుంది. బైపాస్ సర్జరీ అంటే బయట అప్పులు చేయాలని భయపడ్డాను. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా ఆపరేషన్ చేయిస్తుందని చెప్పారు. ఫిబ్రవరిలో ఆపరేషన్ చేశారు. అనంతరం విశ్రాంత సమయానికి రూ. 9,500 భృతిని ఆరోగ్య ఆసరా కింద ఇచ్చారు. చేతి నుంచి డబ్బు ఖర్చు పెట్టకుండా ఆపరేషన్ పూర్తి అయింది. పేదల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధకు నాలాంటి ఎంతోమంది ప్రాణాలను నిలుపుకుని సంతోషంగా ఉంటున్నారు. కష్టకాలంలో సీఎం జగన్ ప్రభుత్వం మమ్మల్ని ఆదుకుంది.

- అల్లంశెట్టి రాజ్యలక్ష్మి, ఒంగోలు, ప్రకాశం జిల్లా

క్లుప్తంగా...

మానవాళికి మహ్మద్ ప్రవక్త మహోన్నత సందేశాలు

• ముఖ్యమంత్రి వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: ప్రపంచ శాంతి కోసం మానవాళికి విలువైన సందేశాలు ఇచ్చిన మహోన్నత వ్యక్తి మహ్మద్ ప్రవక్త అని సీఎం వైఎస్ జగన్ అన్నారు. 'నేడు ఆయన జన్మదినం సందర్భంగా ఆ అల్లాహ్ దీవెనలు మన రాష్ట్రంపై ఉండి, అందరికీ మంచి జరగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ముస్లిం సోదర సోదరీమణులకు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు' అంటూ గురువారం ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

ఏపీ శాక్స్ ఆధ్వర్యంలో రెడ్ రన్

సాక్షి, అమరావతి: ఎయిడ్స్, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ(ఏపీ శాక్స్) ఆధ్వర్యంలో శనివారం విజయవాడలో రాష్ట్ర స్థాయి యూత్ ఫెస్ట్ 5కె మారథాన్(రెడ్ రన్) నిర్వహించనున్నట్టు ఏపీడీ డాక్టర్ కోటేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 26 జిల్లాల నుంచి 17–25 సంవత్సరాల వయసు కలిగిన ఔత్సాహిక కళాశాల విద్యార్థులు 5కె మారథాన్‌లో పాల్గొంటారన్నారు.

ఏకలవ్య పాఠశాలల్లో 'ఏఐ' పాఠాలు

సాక్షి, అమరావతి: గిరిజన ప్రాంతాల్లోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు ఐటీ విద్య చేరువ కానుంది. ముఖ్యంగా కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్- ఏఐ), కోడింగ్‌ను పాఠ్యాంశాలుగా చేర్చారు. నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్ విభాగంలో సీబీఎస్‌ఈ అనుసంధానమైన ఏకలవ్య స్కూల్స్‌లో ఈ ప్రోగ్రామ్ అందించనున్నారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు కంప్యూటర్ సైన్స్ ఫండమెంటల్స్ తప్పనిసరి చేశారు. ఈ ఏడాది నుంచి అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఏఐ, కోడింగ్, మెషీన్ లెర్నింగ్, ఎక్స్‌పాండ్ ఫండమెంటల్స్ మాడ్యూల్‌ను పరిచయం చేయనున్నారు. ఆరో తరగతి విద్యార్థులకు కంప్యూటర్ సైన్స్ ప్రాథమిక అంశాలను బోధిస్తుండగా, ఏడో తరగతిలో విజువల్ ప్రోగ్రామింగ్, ఎనిమిదో తరగతికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను పరిచయం చేస్తారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు ఏఐ టెక్నాలజీ ప్రాథమికాంశాలను నేర్చుకుంటారు. కాగా వచ్చే విద్యా సంవత్సరం (2024–25)లో 10వ తరగతి విద్యార్థులకు ఏఐ మాడ్యూల్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఆంధ్రప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఒడిశా, రాజస్థాన్, తెలంగాణ రాష్ట్రాల్లో 54 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఉండగా, ఒక్క మన రాష్ట్రంలోనే 28 ఉన్నాయి. దాదాపు సగం పాఠశాలలు రాష్ట్రంలోనే ఉన్నందున రాష్ట్ర విద్యార్థులకు మేలు కలగనుంది.

ఐటీ నిపుణుల్ని తయారు చేసేందుకు ఎంవోయూ



ఎంవోయూలతో ఇరు సంస్థల ప్రతినిధులు

సాక్షి, విశాఖపట్నం: విశాఖలో ఐటీ రంగం విస్తరిస్తోన్న నేపథ్యంలో భవిష్యత్తులో ఐటీ, ఐటీ అనుబంధ సంస్థలకు అవసరమైన నైపుణ్య యువతని తీర్చిదిద్దాలనే సంకల్పంతో డీప్ టెక్ నైపుణ్య ఫౌండేషన్, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఐటీ, ఐటీఈఎస్ ఎంప్లాయిబిలిటీ స్కిల్ ట్రైనింగ్ (ఐటెస్ట్) పేరుతో ట్రైనింగ్ ప్రోగ్రామ్ అందించేందుకు ఇరు సంస్థలు విశాఖలోని ప్రముఖ ఐటీ సంస్థల ప్రతినిధుల సమక్షంలో అంగీకరించాయి. విశాఖలోనే కాకుండా.. ఏపీలోని పలు ప్రాంతాల్లో విస్తరిస్తోన్న ఐటీ, ఐటీ అనుబంధ సంస్థలకు అవసరమైన నైపుణ్యంతో కూడిన మానవ వనరుల్ని సిద్ధం చేయడమే ఈ ఎంవోయూ లక్ష్యమని డీప్‌టెక్ సంస్థ అధినేత, ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఏపీ (ఐటాప్) అధ్యక్షుడు శ్రీధర్ కొసరాజు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి విశాఖలో ఇప్పటికే విస్తరించి ఉన్న టెక్ మహీంద్ర, డబ్ల్యూఎన్‌ఎస్, పాత్రా, కాన్సంట్రిక్స్, కాండ్యూయెంట్, ఫెడ్‌సర్వ్, ప్రోవిజిల్, మాపెల్ సాఫ్ట్, వెంచర్ ఆఫ్ షోర్ తదితర సంస్థల్లో ఉద్యోగవకాశాలు ఇవ్వనున్నారు. అక్టోబర్ 10 నాటికి 2 పైలట్ బ్యాచ్‌లకు శిక్షణ తరగతులు ప్రారంభిస్తామని శ్రీధర్ చెప్పారు. కార్యక్రమంలో పలు సాఫ్ట్‌వేర్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

11 మంది మున్సిపల్ కమిషనర్లకు పదోన్నతి



సాక్షి, అమరావతి: పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలో పనిచేస్తున్న 11 మంది మున్సిపల్ కమిషనర్లకు ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. ఐదుగురు స్పెషల్ గ్రేడ్ కమిషనర్లకు సెలక్షన్ గ్రేడ్ కమిషనర్లుగా, ఆరుగురు ఫస్ట్ గ్రేడ్ కమిషనర్లకు స్పెషల్ గ్రేడ్ కమిషనర్లుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్బీకేల హేతుబద్ధీకరణ

- ప్రస్తుతం జనాభా ప్రాతిపదికన ఆర్బీకేలు
- ఇకపై పంటల విస్తీర్ణం ప్రాతిపదికన హేతుబద్ధీకరణ
- అదనపు సిబ్బంది సర్దుబాటు
- అక్టోబర్ నెలాఖరులోగా సర్దుబాటు పూర్తి
- నవంబర్‌లో పోస్టింగులు
- ఏజెన్సీలో 600 నుంచి 800 ఎకరాలకు ఒకరు
- మైదాన ప్రాంతాల్లో 1,000 నుంచి 1,500 ఎకరాలకు ఒకరు



సాక్షి, అమరావతి: విత్తు నుంచి విక్రయం వరకు రైతులకు అండగా నిలుస్తున్న వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను (ఆర్బీకేలను) వైఎస్ జగన్ ప్రభుత్వం మరింత బలోపేతం చేస్తోంది. ఇందులో భాగంగా ప్రస్తుతం జనాభా ప్రాతిపదికన ఉన్న ఆర్బీకేలను పంటల విస్తీర్ణం ప్రాతిపదికన హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్)కు నిర్ణయించింది. అవసరానికి మించి ఉన్న మండలాల్లోని ఆర్బీకేల సిబ్బందిని తక్కువ ఉన్న మండలాలకు సర్దుబాటు చేయనుంది. అక్టోబర్ కల్లా సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేసి, ఖరీఫ్ సీజన్ పూర్తయిన తర్వాత నవంబర్‌లో తాజా పోస్టింగుల ఉత్తర్వులు ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తోంది.

ప్రజల గుమ్మం వద్దకు పౌర సేవలందించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతి 2వేల జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేశారు. ఈ సచివాలయాలకు అనుబంధంగా రైతు సేవల కోసం ప్రత్యేకంగా 10,778 వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పూర్వపు జిల్లా ప్రాతిపదికన జరిగిన నియామకాల ద్వారా వీటిలో 6,218 మంది వ్యవసాయ, 2,352 మంది ఉద్యాన, 374 మంది పట్టు సహాయకులతో పాటు 4,652 మంది పశుసంవర్థక, 731 మంది మత్స్య సహాయకులు ఆర్బీకేల్లో సేవలందిస్తున్నారు. వీరికి అదనంగా 904 మంది వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈవో), 1,396 మంది వ్యవసాయ మల్టీపర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్ (ఎంపీఈవో), 77 మంది ఉద్యాన ఎంపీఈవోలు పని చేస్తున్నారు. ఆర్బీకేలను పంటల విస్తీర్ణం ప్రాతిపదికన కాకుండా జనాభా ప్రాతిపదికన ఏర్పాటు చేశారు. ఒక్కో ఆర్బీకేకు స్థానికంగా సాగయ్యే పంటలనుబట్టి గ్రామ వ్యవసాయ, ఉద్యాన, పట్టు సహాయకులను ఇన్‌చార్జిలుగా నియమించారు.

సిబ్బందిపై పనిఒత్తిడి తగ్గించడమే లక్ష్యం

కొన్ని మండలాల్లో ఒక సచివాలయం పరిధిలో రెండు, అంతకు మించి ఆర్బీకేలు కూడా ఉన్నాయి. ఈ కారణంగా ఒకే మండలంలో కొన్ని ఆర్బీకేల పరిధిలో సాగు విస్తీర్ణం పదుల ఎకరాల్లో ఉంటే, కొన్నింటిలో వందల ఎకరాలు, మరికొన్నింటిలో 7 వేలు, 8 వేల ఎకరాల్లో ఉంది. విస్తీర్ణం ఎక్కువగా ఉన్న ఆర్బీకేల్లో సిబ్బందిపై పని ఒత్తిడి పెరిగింది. సర్టిఫై చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల పంపిణీ, పంటల వివరాలను ఈ క్రాప్ యాప్‌లో నమోదు చేయడం, పొలాలకు వెళ్లి ఫొటోలతో పాటు రైతుల ఈ కేవైసీ నమోదు చేయడం, వైపరీత్యాల వేళ నష్టపోయిన పంటల వివరాలను నమోదు చేయడం, పంట కోత ప్రయోగాలు, పంటల బీమా అమలు.. ఇలా రైతుల కోసం ప్రభుత్వం అమలు చేసే ప్రతి కార్యక్రమంలో భాగస్వాములవ్వాల్సి వస్తుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఆర్బీకే వ్యవస్థలో హేతుబద్ధీకరణకు ప్రభుత్వం సంకల్పించింది.

విస్తీర్ణం ప్రాతిపదికన సిబ్బంది సర్దుబాటు

హేతుబద్ధీకరణలో భాగంగా పంటల విస్తీర్ణం ప్రాతిపదికన మండలం యూనిట్‌గా సిబ్బందిని సర్దుబాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏజెన్సీ ప్రాంతాల్లో 600 నుంచి 800 ఎకరాలకు, మైదాన ప్రాంతాల్లో 1000 నుంచి 1500 ఎకరాలకు ఒకరు చొప్పున సిబ్బంది ఉండేలా ఏర్పాటు చేస్తోంది. అవసరానికి మించి ఉన్న సిబ్బందిని ఇతర మండలాల్లో సర్దుబాటు చేస్తారు. స్థానికంగా సాగయ్యే ఉద్యాన, పట్టు పంటలను బట్టి వీఏఏ, వీహెచ్‌ఏలకు తొలి ప్రాధాన్యతనిస్తారు. ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉన్న చోట ఉద్యాన ఎంపీఈవోలను సర్దుబాటు చేస్తారు. వ్యవసాయ పంటలు సాగు ఎక్కువగా ఉంటే ఏఈవో, వ్యవసాయ ఎంపీఈవోలను సర్దుబాటు చేస్తారు. అర్బన్ ప్రాంతాల్లో మాత్రం ఏఈవో, ఎంపీఈవోలను నియమిస్తారు. ఏఈవోలను జిల్లా పరిధిలో సర్దుబాటు చేస్తుండగా, ఎంపీఈవోలను అవసరాన్ని బట్టి ఇతర జిల్లాల పరిధిలో సర్దుబాటు చేసేలా వెసులుబాటు కల్పించారు.

ఖరీఫ్ తర్వాతే రిపోర్టింగ్

ప్రస్తుతం ఖరీఫ్–2023 సీజన్ ఈ క్రాప్ బుకింగ్ జోరుగా సాగుతోంది. మరో వైపు కోతలు ప్రారంభమైన తర్వాత ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమవుతాయి. ఖరీఫ్ సీజన్ పూర్తయిన తర్వాతే సర్దుబాటు చేసిన సిబ్బంది వారికి కేటాయించిన స్థానాల్లో రిపోర్టింగ్ చేయాలి. జిల్లాల పరిధిలో స్థానిక అవసరాలనుబట్టి సర్దుబాటు చేసుకునే వెసులుబాటు కల్పించారు.

– చేవూరు హరికిరణ్,
వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్

వైట్ హౌస్‌లో ఏపీ విద్యా ప్రభ

- అమెరికా అధ్యక్ష భవనాన్ని సందర్శించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- అన్ని విభాగాల గురించి వివరించిన వైట్‌హౌస్ సిబ్బంది
- ముగిసిన విద్యార్థుల అమెరికా పర్యటన



అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌లో ఏపీ విద్యార్థుల బృందం

సాక్షి, అమరావతి: ఐక్యరాజ్య సమితిలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు (ఎస్డీజీ) సదస్సుకు వెళ్లిన రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు బుధవారం అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌ను సందర్శించారు. ఇప్పటి వరకు వైట్‌హౌస్‌ను బయటి ప్రాంతాలను చూసేందుకు మాత్రమే అనుమతినిచ్చే ఆ దేశ అధికారులు.. తొలిసారి మన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు భవనం లోపలి ప్రదేశాలను కూడా సందర్శించే అవకాశం కల్పించారు. విద్యార్థులను వైట్ హౌస్ భద్రత సిబ్బంది శ్వేత సౌధం మొత్తం తిప్పారు. భవనంలో ప్రతి ఒక్క విభాగం పని విధానాన్ని అర్థమయ్యేలా వివరించారు. విద్యార్థులు కూడా ఎంతో ఆసక్తిగా భవనంలో కలియదిరిగారు. అక్కడి విభాగాలు, సిబ్బంది పనితీరు, సెక్యూరిటీ సిస్టం, అధ్యక్షుడు నివసించే భవనం, కార్యాలయం పని విధానాలను తెలుసుకున్నారు. ఏపీలో ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంస్కరణలు, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై అంతర్జాతీయ వేదికపై వివరించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10 మంది విద్యార్థులను ప్రభుత్వం ఎంపిక చేసింది. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని లబ్ధిపొందిన వారే చెప్పడం సమంజసమని భావించిన ప్రభుత్వం.. పేద కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులను బ్రాండ్ అంబాసిడర్లుగా ఎంపిక చేసింది. ఇలా దేశ చరిత్రలో తొలిసారి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మన రాష్ట్రం నుంచే ఐక్యరాజ్య సమితిలో అడుగుపెట్టారు. సమగ్ర శిక్ష రాష్ట్ర ఎస్పీడీ బి.శ్రీనివాసరావు నేతృత్వంలో యునైటెడ్ నేషన్స్‌లోని స్పెషల్ కన్సల్టేటివ్ స్టేటస్ మెంబర్ ఉన్నవ షకిన్ కుమార్ సమన్వయంతో, ఉత్తర అమెరికాలో ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి పండుగాయల రత్నాకర్ పర్యవేక్షణలో విద్యార్థుల బృందం ఈనెల 14న అమెరికాకు వెళ్లింది. ఈ బృందంలో మాల శివలింగమ్మ, (తండ్రి సోమనాథ్ రైతు కూలీ, తల్లి గంగమ్మ), మోతుకూరి చంద్రలేఖ (ఏఎస్ఆర్ జిల్లా,తండ్రి రామారావు ఆటో డ్రైవర్), గుండుమోగుల గణేష్ అంజన సాయి (పశ్చిమ గోదావరి జిల్లా, తండ్రి గోపీ, కౌలు రైతు), దదాల జ్యోత్స్న (కాకినాడ జిల్లా, తండ్రి సింహాచలం సెక్యూరిటీ గార్డు), చాకలి రాజేశ్వరి (నంద్యాల జిల్లా, తండ్రి దస్తగిరి లారీ డ్రైవర్), పసుపులేటి గాయత్రి (ఏలూరు జిల్లా, తండ్రి రమేష్, తల్లి కూలీలు), అల్లం రిషితా రెడ్డి (విజయనగరం జిల్లా, తండ్రి రామకృష్ణారెడ్డి మెకానిక్), వంజివాకు యోగేశ్వర్ (తిరుపతి జిల్లా, తండ్రి నాగరాజు కేబుల్ ఆపరేటర్), షేక్ అమ్మాజన్(శ్రీ సత్యసాయి జిల్లా, తల్లి షేక్ ఫాతిమా వ్యవసాయ కూలీ), సామల మనస్విని (పార్వతీపురం మన్యం జిల్లా, తల్లి కృష్ణవేణి) ఉన్నారు. ఈ నెల 15 నుంచి ఐక్యరాజ్య సమితి ఆర్థిక, సామాజిక మండలిలో జరిగే సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్(ఎస్డీజీ) సదస్సుతో పాటు కొలంబియా యూనివర్సిటీలో జరిగిన గ్లోబల్ స్కూల్స్ సమ్మిట్‌లో రాష్ట్రంలో అమలు చేస్తున్న 'నాడు–నేడు', విద్యా సంస్కరణలపై వీరు ప్రసంగించారు. న్యూయార్క్‌లోని జాన్ జే కాలేజ్ ఆఫ్ క్రిమినల్ జస్టిస్‌లో నిర్వహించిన ఎస్‌డీఎస్ స ర్వీస్ సదస్సు, ఇంటర్నేషనల్ యూత్ కాన్ఫరెన్స్‌లో సైతం పాలుపంచుకున్నారు. వరల్డ్ బ్యాంక్, ఐఎంఎఫ్‌లో ఉన్నతాధికారులతో సమావేశమై రాష్ట్రంలో అమలు చేస్తున్న విద్యా, సంక్షేమ పథకాలను వివరించారు. అమెరికా అధ్యక్షుడి అధికారిక నివాసం, కార్యాలయాలను సందర్శించి భారత్‌కు తిరుగుపయనమయ్యారు.

సీఎంకు విద్యార్థుల కృతజ్ఞతలు

ఎంతో ప్రతిష్టాత్మకమైన ఐక్యరాజ్య సమితి సదస్సు కోసం రాష్ట్రం తరఫున బ్రాండ్ అంబాసిడర్లుగా ఎంపికైనందుకు విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. తాము నేర్చుకున్న అంశాలను రాష్ట్రంలోని విద్యార్థులకు తెలియజేస్తామని చెప్పారు. పేద కుటుంబాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న తమను ఎంపిక చేసినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్, కమిషనర్ సురేష్‌కుమార్‌కు కూడా కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఐదో విడత వాహన మిత్ర సాయం విడుదల

- విజయవాడలో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేయనున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: సొంత వాహనంతో స్వయం ఉపాధి పొందుతున్న ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు, ఎండీయూ ఆపరేటర్లకు అండగా నిలిచేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ వాహన మిత్ర పథకాన్ని ప్రవేశపెట్టారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలోనే అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా ప్రతి లబ్ధిదారుకు ఏటా రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారు. ఇప్పటివరకు నాలుగు విడతల సాయాన్ని అందించిన సీఎం వైఎస్ జగన్.. వరుసగా ఐదో విడత ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందించనున్నారు. విజయవాడ నగరం విద్యాధరపురంలో నిర్వహించే కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్ బటన్ నొక్కి లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా నగదును జమ చేయనున్నారు. 2023–24 సంవత్సరానికి 2,75,931 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున రూ. 275.93 కోట్ల ఆర్థిక సాయం అందజేయనున్నారు. దీనితో కలిపి వైఎస్సార్ వాహన మిత్ర పథకం లబ్ధిదారులకు వైఎస్ జగన్ ప్రభుత్వం ఇప్పటివరకు రూ.1,301.89 కోట్లు అందించినట్లు అవుతుంది. సీఎం జగన్ శుక్రవారం ఉదయం 10.15 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయల్దేరి విద్యాధరపురం స్టేడియంకు చేరుకొంటారు. అక్కడ ఏర్పాటు చేసిన వేదికపై బటన్ నొక్కి వైఎస్సార్ వాహన మిత్ర లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేస్తారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

ఎస్వీయూకు అరుదైన గౌరవం

- టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో చోటు

తిరుపతి సిటీ: టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్–2024లో తిరుపతి శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ సత్తా చాటింది. టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ వరల్డ్ యూనివర్సిటీ ప్రపంచవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో ఐదు ప్రధాన కార్యకలాపాలపై విస్తృత సర్వే నిర్వహించి ర్యాంకులను ప్రకటిస్తుంది. ఈ మేరకు ఎస్వీ యూనివర్సిటీ 1201–1500 ర్యాంకును సొంతం చేసుకుంది.

ర్యాంకులు ఇలా...

టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకులను ప్రకటించే ముందు ఐదు ప్రధాన కార్యకలాపాలపై అధ్యయనం చేస్తుంది. యూనివర్సిటీల పనితీరు పట్టికలు, బోధన, పరిశోధన, జ్ఞాన బదిలీ, అంతర్జాతీయ దృక్పథం అంశాలపై క్షేత్రస్థాయిలో నిపుణుల ద్వారా అభిప్రాయాలు సేకరిస్తుంది. ఆ తర్వాత క్షేత్రస్థాయిలో తనిఖీల ద్వారా ర్యాంకులను నిర్ణయిస్తుంది. ఈ ర్యాంకుల కోసం సంబంధిత సంస్థ ప్రతినిధులు 108 దేశాల్లోని 1,904 విశ్వవిద్యాలయాలను గుర్తించారు. ఐదు అంశాల ఆధారంగా ప్రపంచస్థాయి ర్యాంకులను ప్రకటించారు. ఈ క్రమంలోనే ఎస్వీయూకి 1201–1500 ప్రపంచ ర్యాంకును ప్రకటించారు.

సంతోషంగా ఉంది



టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో ఎస్వీయూ ప్రపంచ స్థాయిలో ప్రతిభ కనబరచడం సంతోషం. మొత్తం 16.5 మిలియన్ పరిశోధన ప్రచురణలు, 134 మిలియన్ కంటే ఎక్కువ అనులేఖనాలను విశ్లేషించి, 68,402 పండితుల నుంచి అభిప్రాయాలను స్వీకరించి ఈ ర్యాంకులు ప్రకటించారు.

– ప్రొ.రాజారెడ్డి, వీసీ, ఎస్వీయూ

ఆరోగ్యశ్రీ సేవలు ▸ చాలా బాగున్నాయి

99.71% మంది రోగుల అభిప్రాయం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 1.42 కోట్ల కుటుంబాలకు సంజీవని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఆయా కుటుంబాల వారికి ఏదైనా అనారోగ్యం వస్తే రూపాయి ఖర్చు లేకుండా కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం లభిస్తుంది. ఇంతటి ప్రతిష్టాత్మకమైన ఈ పథకం అమలుపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తొలి నుంచి ప్రత్యేక దృష్టి పెడుతూ వస్తోంది. సంతృప్తకర స్థాయిలో ప్రజలకు సేవలు అందించేలా విప్లవాత్మక చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో పథకం కింద చికిత్స పొందిన రోగుల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టారు. చికిత్స పొందిన రోగుల్లో సుమారు వంద శాతం సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అతి కొద్ది మంది మాత్రమే సేవల్లో సమస్యలను ప్రస్తావించారు. ఈ స్వల్ప సమస్యలను కూడా సరిదిద్దడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది.

99.71 శాతం మంది సంతృప్తి

ఆరోగ్యశ్రీ సేవల్లో లోటుపాట్లు ఏమైనా ఉంటే వాటిని సర్దుబాటు చేసి ప్రజలకు వంద శాతం సంతృప్తికరంగా సేవలు అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనిలో భాగంగా గతేడాది ఆగస్టు 16 నుంచి ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందిన రోగుల నుంచి అభిప్రాయ సేకరణను ప్రారంభించారు. రోగి ఆస్పత్రి నుంచి డిశ్చార్జయి ఇంటికి వెళ్లిన వారం నుంచి 10 రోజుల్లో ఏఎన్ఎం సంబంధిత రోగి ఇంటికి వెళ్లి రోగి ఆరోగ్య పరిస్థితులపై వాకబు చేస్తున్నారు. అలాగే ఆరోగ్యశ్రీ సేవలపైనా అభిప్రాయం సేకరిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించారు. ఇప్పటి వరకూ పథకం కింద చికిత్స పొందిన 15,43,831 మంది నుంచి అభిప్రాయాలు తీసుకోగా.. 15,39,506 మంది అంటే 99.71 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం 0.29 శాతం మంది మాత్రమే సేవలు పొందడంలో ఇబ్బందులు ఎదురైనట్టు చెప్పారు. ఈ సమస్యలను క్రమశిక్షణ కమిటీల ద్వారా విచారించి, కారణాలను అన్వేషించి బాధ్యులపై అధికారులు చర్యలు తీసుకున్నారు.



డబ్బు వసూళ్లకు పాల్పడ్డారా?

నెట్‌వర్క్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని డిశ్చార్జయిన రోగి చిరునామా ఆధారంగా సంబంధిత ఏఎన్ఎంకు యాప్ ద్వారా వివరాలు వెళతాయి. చికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితిపై ఏఎన్ఎం ఆరా తీసి.. యాప్‌లో రూపొందించిన పలు ప్రశ్నలపై సమాధానాలు రాబడతారు. చికిత్స కోసం నెట్‌వర్క్ ఆస్పత్రికి వెళ్లినప్పుడు డబ్బు డిమాండ్ చేశారా? వైద్య సేవలు, సదుపాయాలు ఏ విధంగా ఉన్నాయి? ఆరోగ్యమిత్ర సహకారం ఎలా ఉంది? మందులు ఉచితంగా ఇచ్చారా? లేదా? తదితర ప్రశ్నలకు సమాధానం రాబడతారు. ఇలా సేకరించిన అభిప్రాయాన్ని యాప్‌లో నమోదు చేస్తారు. రోగులు ఎవరైనా సమస్యలు తెలియజేసినట్లయితే.. సంబంధిత జిల్లా కో–ఆర్డినేటర్ల లాగిన్‌కు వెళతాయి. కో–ఆర్డినేటర్ విచారణ చేపట్టి కారణాలను అన్వేషించాల్సి ఉంటుంది. రోగుల నుంచి డబ్బు వసూళ్లకు పాల్పడిన సందర్భాల్లో రూ. 20 వేలలోపు డబ్బు వసూళ్ల ఆరోపణల్లో జిల్లా స్థాయిలో, ఆపైన వసూళ్ల కేసులను రాష్ట్ర స్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటున్నారు.

ప్రజారోగ్యానికి భరోసా

ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి కుటుంబాల ప్రజల ఆరోగ్యాలకు సీఎం జగన్ ప్రభుత్వం భరోసాగా ఉంటోంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో 1,059 ప్రొసీజర్లు ఈ పథకంలో అందుబాటులో ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య ఏకంగా 3,257కు పెంచారు. 2019 నుంచి ఈ ఏడాది ఆగస్టు నెలాఖరు నాటికి 46.12 లక్షల మందికి ఉచితంగా వైద్యం అందించారు. ఏకంగా రూ. 9,193.61 కోట్లు ఖర్చు చేశారు. చికిత్స అనంతరం విశ్రాంత సమయంలో వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కార్యక్రమం కింద ఆర్థికంగా చేయూత ఇస్తున్నారు. ఇలా రూ. వెయ్యి కోట్లకుపైగా ప్రభుత్వం రోగులకు సాయం చేసింది.

104కు ఫిర్యాదు చేయవచ్చు



ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు ఈ పథకం కింద పూర్తి ఉచితంగా అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఆ మేరకు చర్యలు చేపడుతున్నాం. రోగుల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టి అవకతవకలకు పాల్పడిన ఆస్పత్రులపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. ప్రజలు 104కు ఫిర్యాదు చేయవచ్చు.

– ఎం.ఎన్. హరేంధిరప్రసాద్,
సీఈవో, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ

జవాబుదారీతనం పెరుగుతుంది



చికిత్స అనంతరం రోగుల నుంచి అభిప్రాయ సేకరణ చేపడుతున్నారు. ఎక్కడైనా సమస్యలు ఎదురైతే ప్రజలు ఫిర్యాదు చేయడానికి వీలుంటుంది. ఇది మంచి పరిణామం. ఈ తరహా విధానాలతో నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాల్లో జవాబుదారీతనం పెరుగుతుంది. రోగులకు ఇబ్బందులు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకుంటారు.

– డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి,
ఏపీ ఆరోగ్యశ్రీ ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ అధ్యక్షుడు

కల్తీ మద్యానికి అవకాశం లేకుండా విశాఖలో ఎక్సైజ్ లేబొరేటరీ

ప్రారంభించిన డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కల్తీ మద్యం కారణంగా ఎవరైనా చనిపోయారని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం




లేబొరేటరీ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, చిత్రంలో మంత్రి అమర్‌నాథ్, మేయర్ హరివెంకటకుమారి, వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి తదితరులు

దొండపర్తి(విశాఖ దక్షిణ)/ఆనందపురం(భీమిలి) : కల్తీ మద్యాన్ని పరీక్షించేందుకు దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఆంధ్రా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన అత్యాధునిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ లేబరేటరీని గురువారం డిప్యూటీ సీఎం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కె.నారాయణస్వామి ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి హాని కలగకుండా, కల్తీ మద్యానికి అవకాశం లేకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ల్యాబ్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని చెప్పారు. ప్రజలకు మెరుగైన విద్య, ఆరోగ్యం, సంక్షేమం అందించడమే నిజమైన అభివృద్ధి అని, అదే సీఎం జగన్ సంకల్పమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఇటువంటి ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని ఎక్సైజ్ అధికారులు చంద్రబాబును కోరినప్పటికీ.. ఆయన పట్టించుకోలేదని విమర్శించారు. ఇదిలా ఉండగా ఆనందపురం మండలం గోరింటలో రూ.20 కోట్లతో నిర్మించనున్న ఎక్సైజ్ శాఖ కాంప్లెక్స్, ఏపీఎస్‌బీసీఎల్ డిపో నిర్మాణ పనులకు నారాయణస్వామి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ బొమ్మ పెట్టుకుని జగన్ రాష్ట్రమంతా తిరిగి సీఎం అయ్యారని, వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ఫొటో పట్టుకుని తిరిగి లోకేశ్ ఒక్క సీటైనా గెలవాలని సవాల్ విసిరారు. చంద్రబాబు ఒక అవినీతి చక్రవర్తి అని ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో రూ.1000 కోట్ల కుంభకోణానికి పాల్పడిందని, చంద్రబాబు అక్రమాలను రోడ్డు మీదకు లాగుతానని చెప్పిన దత్తపుత్రుడు పవన్.. ఇప్పుడు ఏం చేస్తున్నాడని ప్రశ్నించారు.

తండ్రి చావుకు కారకుడైన బాబుకు పురందేశ్వరి వత్తాసు పలకడం హాస్యాస్పదం

కల్తీ మద్యం తాగడం వల్లే విశాఖలో ఇద్దరు చనిపోయారని పురందేశ్వరి అన్న వ్యాఖ్యలపై మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన మండిపడ్డారు. కల్తీ మద్యం కారణంగానే ఎవరైనా చనిపోయారని నిరూపిస్తే తాను రాజీనామాకు సిద్ధమన్నారు. తండ్రి చావుకు కారణమైన బాబుకు పురందేశ్వరి వత్తాసు పలకడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మార్గదర్శి అక్రమాలపై విచారణ జరుపుతున్నందుకే ఈనాడులో రామోజీరావు తప్పుడు రాతలు రాస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమాల్లో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, ఏయూ వీసీ ప్రసాదరెడ్డి తదితరులున్నారు.


పేదలను బెదిరించారు.. 'అసైన్డ్' కాజేశారు


Ref- 1. Village Revenue Officers Venkatapalem, Mandadam & Others
2. Instructions of the Joint Collector, Guntur dated 03.05.2016.

&&&&

I submit that the Ryouths of Venkatapalem, Mandadam, Nekkallu, Nelapada, Pichikalapalem, Ananthavaram and Velagapudi villages of Thulluru Mandal have filed a representation before the Competent Authority's requested to sanction of annuity payments of their land. The Village and Mandal Level Officers verified with the Resettlement Register and found that the lands are classified as Assigned Lands. In Mandadam and Venkatapalem villages Classification of the land is Reserved Forest and Converted to AWD, assigned to eligible Persons. The Other Villages of the Land was Classified as Kunta ,Tank and Vagu Converted to AWD. As per the Resettlement Register of the Concerned Villages the Land was converted to Prior 1954. As per the Government order the Lands which was Assigned prior to 1954 be treated as Patta Land. Further I submit that the original file is not traced in this office. At the time of assignment which type of condition was imposed on these lands are not known. We are verified the record room at my office for tracing of the files but in vain.

The Joint Collector Guntur


In view of the above circumstances all the above mentioned cases were Assigned prior to 1954 and non availability of the connected record the cases may be treated as Non-IOT and further action may be taken in terms of G.O.Ms.No.41 MA&UD (CRDA-2) Dept., Dt. 17-2-2016 and also as per instructions of The Joint Collector, Guntur paper publication may be issued inviting objections before finalization.

Yours faithfully,
TAHSILDAR
MANGALAGIRI

Enclosures: Kurgallu list of 26 pages
Yellabalem H/o Nowluru list of 9 Pages
Krishnayapalem list of 3 Pages
Nidamarru list of 2 Pages

Submitted to the Collector, Guntur for favour of information
Submitted to the Joint Collector, Guntur for favour of information
Submitted to the Revenue Divisional Officer, Guntur for favour of information
Submitted to the Commissioner APCRDA, Vijayawada for favour of information
Submitted to the Director CRDA, Hyderabad for favour of information

TRUE COPY

1954 తరువాత భూపంపిణీ లేదని టీడీపీ ప్రభుత్వం న్యాయస్థానానికి ఇచ్చిన నివేదిక

▶ మొదటి పేజీ తరువాయి


దేశ చరిత్రలోనే అత్యంత భారీ అసైన్డ్ భూకుంభకోణానికి తెగబడ్డారు. అనంతరం.. అసైన్డ్ భూములకు ప్యాకేజీ ప్రకటించి వారి కుతంత్రాన్ని చాటుకున్నారు. ఈ భూములను అన్యాక్రాంతం చేయడానికిగానీ దాన్ని అధికారికంగా గుర్తించడానికిగానీ వీల్లేదన్న ఉన్నతాధికారుల లిఖిత పూర్వక అభ్యంతరాలను వారు బేఖాతరు చేశారు. పైగా.. రెవెన్యూ కార్యాలయాల్లో అసైన్డ్ భూముల రికార్డులను గల్లంతు చేసేసి.. అసలు 1954 నుంచి 2014 వరకు అమరావతి పరిధిలో పేదలకు భూ పంపిణీనే చేయలేదని ఏకంగా న్యాయస్థానాన్ని మోసంచేసిన తీరు వ్యవస్థలను మోసం చేయడంలో చంద్రబాబు తెగింపునకు అద్దం పడుతోంది. కానీ, ఇప్పుడు వీరి పాపం పండింది.. కథ అడ్డం తిరిగింది. చంద్రబాబు, నారాయణ, లోకేశ్‌ల కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో సాగిన ఈ అసైన్డ్ భూదోపిడీ ఆధారాలతో సహా బట్టబయలైంది. 1954 తరువాత పంపిణీ చేసిన అసైన్డ్ భూముల పంపిణీ రికార్డులు కూడా వెలుగులోకి రావడంతో పచ్చముఠా పన్నాగం బెడిసికొట్టినట్లయింది. అందుకు సంబంధించిన కీలక ఆధారాలు 'సాక్షి' సేకరించింది. పచ్చ గద్దల అసైన్డ్ భూదోపిడీపై 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనాల్లో మొదటి భాగం ఇది..

జీఓ–1తో భయపెట్టి.. జీఓ–41తో దోపిడీ

2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాజధాని పేరిట భారీ భూదోపిడీకి చంద్రబాబు స్కెచ్ వేశారు. అసైన్డ్ భూములను కొల్లగొట్టేందుకు దేశ చరిత్రలో ఏ పాలకుడు కూడా పాల్పడని దారుణానికి తెగించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద రైతులను బెదిరించి మరీ వారి అసైన్డ్ భూములను చేజిక్కించుకున్నారు. అందుకోసం పక్కా పన్నాగంతో రాజధాని కోసం భూసమీకరణ ప్యాకేజీని నిర్ణయిస్తూ 2015, జనవరి 1న జారీచేసిన జీఓ నంబరు 1ను జారీచేశారు. ఆ జీఓలో అమరావతిలోని ప్రైవేటు భూములకు మాత్రమే భూసమీకరణ ప్యాకేజీ ప్రకటించారు. అసైన్డ్ భూములకు ప్రకటించలేదు. అనంతరం.. చంద్రబాబు, నారాయణ తమ బినామీలు, ఏజెంట్లను అమరావతి గ్రామాల్లోకి పంపి ప్రభుత్వం అసైన్డ్ భూములను ఎలాంటి ప్యాకేజీ ఇవ్వకుండా ఉచితంగా తీసుకుంటుందని ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద రైతులను భయపెట్టారు. కాబట్టి తమకు ఆ భూములు విక్రయిస్తే ఎంతోకొంతైనా డబ్బులు వస్తాయని మభ్యపెట్టారు. అందుకోసం ఆర్కే హౌసింగ్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థతోపాటు తమ బినామీలైన రియల్ ఎస్టేట్ వ్యాపారులు, వారి ఏజెంట్లను గ్రామాల్లోకి పంపించి దుష్ప్రచారం చేయించారు. దీంతో తీవ్ర ఆందోళన చెందిన పేద రైతులు అత్యంత తక్కువ ధరకు అంటే ఎకరాకు కేవలం రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకే చంద్రబాబు, నారాయణ, ఇతర టీడీపీ పెద్దల బినామీలకు సేల్‌డీడ్ల ద్వారా తమ అసైన్డ్ భూములను విక్రయించారు. అలా.. ఆ ముఠా ఏడాదిపాటు తమ పన్నాగాన్ని పక్కగా అమలుచేసి అసైన్డ్ భూములన్నింటినీ తమ బినామీల పరం చేశారు. ఆ తరువాత చంద్రబాబు అసలు కుట్రను తెరపైకి తెచ్చారు. అసైన్డ్ భూములను కూడా ఆరు కేటగిరీల కింద విభజించి 2016, ఫిబ్రవరి 17న జీఓ నంబరు 41 ద్వారా భూసమీకరణ ప్యాకేజీ ప్రకటించారు. అంటే.. అప్పటికే అసైన్డ్ భూములు చంద్రబాబు, నారాయణ బినామీల పేరిట ఉండటంతో వారికే భూసమీకరణ ప్యాకేజీ దక్కేలా చూసుకున్నారు. ఎంతగా అంటే.. ఎకరాలోపు ఉన్న భూమికి కూడా ఎకరా భూసమీకరణ ప్యాకేజీ ప్రకటించారు. ఎందుకంటే అసైన్డ్ భూములను చిన్నచిన్న బిట్లుగానే తమ బినామీల పేరిట పచ్చ ముఠా చేజిక్కించుకుంది. తద్వారా ఎక్కువ ప్యాకేజీ వచ్చేలా కథ నడిపింది. ఆ మేరకు చంద్రబాబు, నారాయణ, టీడీపీ పెద్దల బినామీలకు అసైన్డ్ భూముల సమీకరణ ప్యాకేజీని సీఆర్‌డీఏ వర్తింపజేసింది. అలా చంద్రబాబు చట్ట ప్రకారం ఆ ప్యాకేజీకి అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద రైతులను దారుణంగా మోసగించారు.

కోర్టును సైతం మోసం చేసి మరీ..

అసైన్డ్ భూములను కొల్లగొట్టేందుకు చంద్రబాబు ఏకంగా న్యాయస్థానాన్నే మోసం చేయడం విస్మయపరుస్తోంది. చట్ట ప్రకారం 1954 తరువాత పంపిణీ చేసిన భూములను విక్రయించడం, కొనుగోలు చేయకూడదు. కానీ, తమ కుట్రను అమలుచేసేందుకు ఏకంగా అమరావతి పరిధిలోని రెవెన్యూ కార్యాలయాల్లో అసైన్డ్ భూముల రికార్డులను చంద్రబాబు, నారాయణ మాయం చేశారు. 1954 తరువాత భూపంపిణీ రికార్డులు ఏమీలేవని అమరావతి పరిధిలోని మంగళగిరి, తుళ్లూరు, తాడికొండ మండల రెవెన్యూ అధికారులతో ఓ నివేదిక ఇప్పించారు. ఆ నివేదికను న్యాయస్థానానికి సమర్పించారు. అంటే.. అమరావతి పరిధిలో ఉన్న అసైన్డ్ భూములన్నీ కూడా 1954కు ముందు పంపిణీ చేసినవే తప్ప.. ఆ తరువాత 2015లోగా అసలు భూపంపిణీయే చేయలేదని ఏకంగా న్యాయస్థానాన్నే పక్కదారి పట్టించారు. కానీ, 1954 తరువాత చాలాసార్లు పేదలకు అసైన్డ్ భూములు పంపిణీ చేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో కూడా 2004–05లో అసైన్డ్ భూములు పంపిణీ చేశారు. కానీ, ఆ రికార్డులన్నీ మాయం చేసేశారు. అమరావతిలో ఉన్న భూములన్నీ కూడా 1954కు ముందు పంపిణీ చేసినవే అని చెబుతూ, వాటిని విక్రయించేందుకు.. కొనుగోలు చేసేందుకు చట్టం అనుమతిస్తుందని వక్ర భాష్యం చెబుతూ న్యాయస్థానాన్ని మోసగించిన చరిత్ర చంద్రబాబుకే దక్కుతుంది.



ఉన్నతాధికారుల అభ్యంతరాలు బేఖాతరు..

నిజానికి.. అసైన్డ్ భూములను కొనుగోలు చేయడం చట్ట విరుద్ధం. అలా చట్ట విరుద్ధంగా కొనుగోలు చేసిన వారికి భూసమీకరణ ప్యాకేజీ ప్రకటించడానికే వీల్లేదు. చట్ట ప్రకారం దేశంలో 1954కు ముందు ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద రైతులకు పంపిణీ చేసిన భూములను ఇతరులకు విక్రయించుకునే అవకాశముంది. 1954 తరువాత పంపిణీ చేసిన అసైన్డ్ భూములను కొనుగోలు చేయడంగానీ విక్రయించడంగానీ చట్ట విరుద్ధం. అలాగే, ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు అసైన్డ్ భూముల అన్యాక్రాంత నిరోధక చట్టం తీసుకొచ్చింది. ఇదే విషయాన్ని స్పష్టంచేస్తూ రెవెన్యూ ఉన్నతాధికారులు అసైన్డ్ భూముల బదలాయింపును గుర్తిస్తూ వారికి కూడా భూసమీకరణ ప్యాకేజీ ప్రకటించడాన్ని వ్యతిరేకించారు. ఈ మేరకు అప్పటి ఉమ్మడి గుంటూరు జిల్లా కలెక్టర్‌తోపాటు సీఆర్‌డీఏ, సీసీఎల్ఏ అధికారులు తమ అభ్యంతరాలను లిఖితపూర్వకంగా వ్యక్తంచేశారు. కానీ, అప్పటి మున్సిపల్–సీఆర్‌డీఏ శాఖ మంత్రిగా ఉన్న పొంగూరు నారాయణ ఉన్నతాధికారులపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 'అది మీకు సంబంధంలేని వ్యవహారం. మేం చెప్పినట్లు చేయండి. పైస్థాయిలో నేను మాట్లాడతాను'.. అని వారికి హుకుం జారీచేశారు. అప్పటి అడ్వకేట్ జనరల్ కూడా అసైన్డ్ భూముల అన్యాక్రాంతాన్ని గుర్తించడానికి చట్టం అనుమతించదని స్పష్టంచేశారు. ఈ మేరకు అప్పటి కలెక్టర్, సీఆర్‌డీఏ, రెవెన్యూ, న్యాయ శాఖ ఉన్నతాధికారులు, అడ్వకేట్ జనరల్ తమ అభ్యంతరాలను జీఓ–41 నోట్ ఫైళ్లలో లిఖితపూర్వకంగా తెలిపారు. కానీ, వారి అభ్యంతరాలను చంద్రబాబు బేఖాతరు చేశారు.


1954 తరువాత కూడా భూపంపిణీ జరిగిందని తాజాగా రెవెన్యూ అధికారులు ఇచ్చిన నివేదిక

కేటగిరీలూ అనుకూలంగానే..

ఇక జీఓ–41 ప్రకారం ఆరు కేటగిరీల కింద నాటి ప్రభుత్వం ప్యాకేజీని ప్రకటించింది. వాటిలో నాలుగు కేటగిరీల కింద చంద్రబాబు, నారాయణ తమ బినామీల పేరిట అసైన్డ్ భూములను చేజిక్కించుకున్నారు. ఆ నాలుగు కేటగిరీలకు జరీబు భూములకు చంద్రబాబు ప్రభుత్వం ప్రకటించిన భూసమీకరణ ప్యాకేజీ ఇలా ఉంది..

కేటగిరీ	భూసమీకరణ ప్యాకేజీ
1	వేయి చ.గజాల నివాస స్థలం + 450 చ. గజాల వాణిజ్య స్థలం
2	వేయి చ.గజాల నివాస స్థలం + 450 చ. గజాల వాణిజ్య స్థలం
3	800 చ. గజాల నివాస స్థలం + 200 చ. గజాల వాణిజ్య స్థలం
4	500 చ. గజాల నివాస స్థలం + 100 చ. గజాల వాణిజ్య స్థలం

పత్రాలు వెలుగులోకి.. పచ్చ కుట్ర బట్టబయలు

ఎంత మసిపూసి మారేడుకాయ చేయాలని చూసినా చంద్రబాబు భూదోపిడీ కుట్ర బట్టబయలైంది. అమరావతిలోని అసైన్డ్ భూములలో 1954కు తరువాత పంపిణీ చేసిన భూములు ఉన్నాయన్న రికార్డులు వెలుగులోకి వచ్చాయి. వాటిలో 1987, 2004–05లలో పంపిణీ చేసిన అసైన్డ్ భూములు కూడా ఉన్నాయని తేలింది. దీనిపై సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సమగ్ర విచారణలో మొత్తం భూబాగోతం వెలుగుచూసింది. అమరావతి పరిధిలో 1954 తరువాత కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు అసైన్డ్ భూములు పంపిణీ చేశారని రెవెన్యూ అధికారులు వెల్లడించారు. 2014–19 మధ్య జరిగిన అసైన్డ్ భూముల అన్యాక్రాంతం కుంభకోణంపై సమగ్రంగా దర్యాప్తు చేయాలని కూడా లిఖితపూర్వకంగా నివేదించారు. సిట్ బృందాలు అమరావతి గ్రామాల్లో క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి సర్వే నిర్వహించడంతోపాటు సబ్ రిజిస్ట్రార్, తహశీల్దార్, కలెక్టర్ కార్యాలయాల్లో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాయి. దాంతో గణాంకాలతో సహా పూర్తి ఆధారాలతో అసైన్డ్ భూముల కుంభకోణం వెలుగులోకి వచ్చింది. అసైన్డ్ భూముల రికార్డుల్లో ఉన్న రైతుల పేర్లు, సీఆర్‌డీఏ ప్రకటించిన భూసమీకరణ ప్యాకేజీలోని అసైన్డ్ రైతుల పేర్లను సరిపోల్చి చూడగా అసలు బండారం బయటపడింది. రెవెన్యూ రికార్డుల్లోని అసైన్డ్ భూముల రైతులకు, సీఆర్‌డీఏ ప్రకటించిన ప్యాకేజీలోని అసైన్డ్ భూముల రైతుల పేర్లకు ఏమాత్రం పొంతన లేనేలేదు. దాంతో చట్ట విరుద్ధంగా చంద్రబాబు, నారాయణ కొల్లగొట్టిన అసైన్డ్ భూముల చిట్టా బయటపడింది. ఏకంగా 617.70 ఎకరాల అసైన్డ్ భూములను టీడీపీ ముఠా కొల్లగొట్టిందన్నది తేలిపోయింది.

రూ.3,737.30కోట్ల అసైన్డ్ భూదోపిడీ

నాలుగు కేటగిరీ కింద దోపిడీ చేసిన 617.70 ఎకరాల అసైన్డ్ భూములకు చంద్రబాబు, నారాయణ గ్యాంగ్ ప్యాకేజీ ద్వారా ఏకంగా రూ.3,737.30 కోట్లు దక్కించుకుంది. ఎందుకంటే భూసమీకరణ ప్యాకేజీ ప్రకటించిన తరువాత అమరావతిలో నివాస స్థలం చ.గజం మార్కెట్ ధర కనీసం రూ.30వేలు, వాణిజ్య స్థలం మార్కెట్ ధర చ.గజం కనీసం రూ.50వేలు చొప్పున విక్రయాలు సాగాయి. ఇక అమరావతి నిర్మించిన తరువాత వాటి విలువ మరింత భారీగా పెరుగుతుంది కూడా. ఇక భూసమీకరణ ప్యాకేజీలో కనీస విలువగా ఎకరా ప్యాకేజీ ప్రకటించారు. అంటే.. ఎకరా లోపు భూమిని తీసుకున్నా సరే ఎకరాకు ప్యాకేజీ ఇచ్చారు. ఎందుకంటే చంద్రబాబు, నారాయణ తమ బినామీలు ఎక్కువ మంది ద్వారా చిన్న చిన్న కమతాలను చేజిక్కించుకున్నారు. తద్వారా ప్రతీ బినామీకి కనీసం ఎకరా ప్యాకేజీ వచ్చేలా చేశారు.

సీఆర్‌డీఏ భూ సమీకరణ ప్యాకేజీ కేటగిరీల ప్రకారం చంద్రబాబు ముఠా కొల్లగొట్టిన అసైన్డ్ భూముల జాబితా, భూసమీకరణ ప్యాకేజీ ప్రకారం వాటి విలువ ఇలా..

కేటగిరీ	చంద్రబాబు, నారాయణ బినామీ రైతులు	కొల్లగొట్టిన అసైన్డ్ భూములు (ఎకరాల్లో)	భూసమీకరణ ప్యాకేజీ ప్రకారం విలువ (రూ.కోట్లలో)
1	23	17.35	120.75
2	567	493.10	2,976.75
3	137	69.91	465.80
4	87	37.34	174.00
మొత్తం	814	617.70	3,737.30



ఇండో పసిఫిక్ మహా సముద్రంలో మూడు నెలల విన్యాసాల అనంతరం ఐఎన్ఎస్ సహ్యాద్రి, ఐఎన్ఎస్ కోల్‌కతా తిరిగి స్వదేశానికి చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఓడ సిబ్బంది కుటుంబ సభ్యులు గురువారం ఘన స్వాగతం పలికారు. - సింథియా

జగనన్న ఆరోగ్య సురక్ష ఏర్పాట్లు పక్కాగా చేపట్టండి

- స్పెషలిస్ట్ వైద్యులు వస్తున్నారన్న విషయం ప్రజలకు తెలియజేయండి
- అధికారులకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ఆదేశం



సాక్షి, అమరావతి: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు రాష్ట్ర వ్యాప్తంగా శనివారం నుంచి ప్రారంభించేందుకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అధికారులను ఆదేశించారు. ఉన్నతాధికారులతో కలిసి గురువారం డీఎంహెచ్‌వోలతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదు దశల్లో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. శనివారం వైద్య శిబిరాలు ప్రారంభించే ప్రాంతాల్లో ఇప్పటికే గ్రామాల్లో తొలి దశ సర్వే పూర్తయిందన్నారు. రెండు, మూడో దశ సర్వేలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఇంటింటి సర్వేలను పక్కాగా నిర్వహించాలన్నారు. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకంపై ప్రజలకు సమగ్రంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రత్యేకంగా రూపొందించిన ఆరోగ్యశ్రీ కరపత్రాలను ప్రతి ఇంటికీ అందజేయాలని స్పష్టం చేశారు. అదే విధంగా ఆరోగ్యశ్రీ మొబైల్ యాప్‌ను స్మార్ట్ ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేయించి వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. వైద్య శిబిరాలు నిర్వహించే తేదీలకు సంబంధించి గ్రామాల్లో దండోరా వేయించాలని చెప్పారు. క్యాంపులకు స్పెషలిస్టు వైద్యులు వస్తున్నారనే విషయం ప్రజలకు తెలిసేలా చూడాలన్నారు. ఆర్థోపెడిక్ వైద్య నిపుణుడి అవసరం ఉందనే విజ్ఞప్తులు ప్రజల నుంచి ఎక్కువగా వస్తున్నాయని, క్యాంపులలో వీలైనంతవరకు ఆర్థోపెడిక్ వైద్యులు ఉండేలా చూడాలని సూచించారు. డీఎంహెచ్‌వోలు, ఇతర ఉన్నతాధికారులు వైద్య శిబిరాలను క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. సమీక్షలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ జె.నివాస్, ఆరోగ్యశ్రీ సీఈవో హరేందిరప్రసాద్, ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ రామిరెడ్డి పాల్గొన్నారు.

మారిన వైద్య రంగం ముఖచిత్రం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో రాష్ట్ర వైద్య, ఆరోగ్య రంగం ముఖచిత్రం మారిపోయిందని మంత్రి విడదల రజిని అన్నారు. వివిధ కార్యక్రమాల అమలులో జాతీయ స్థాయిలో రాష్ట్రం అగ్రస్థానంలో నిలుస్తోందన్నారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ హెల్త్ అకౌంట్‌లకు అత్యధిక రికార్డులను లింక్ చేసి రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచి అవార్డు కైవసం చేసుకోవడంపై ఆమె సంతోషం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో రాష్ట్రానికి వచ్చిన అవార్డులను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ నివాస్, ఆరోగ్యశ్రీ సీఈవో హరేందిరప్రసాద్ మంగళగిరిలోని క్యాంప్ కార్యాలయంలో గురువారం మంత్రి రజినికి అందజేశారు. ఈ సందర్భంగా అధికారులను ఆమె అభినందించారు.



ఎన్నారై కోటా ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ పరిధిలోని కళాశాలల్లో ఎన్నారై కోటాలో ప్రవేశాలకు 2023–24 విద్యాసంవత్సరానికిగానూ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు గురువారం తెలిపారు. అభ్యర్థులు ఎన్నారై కోటాలో మిగిలిన సీట్ల కోసం అక్టోబర్ 10లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి ఉన్నవారు www.angrau.ac.in గానీ, లేదా గుంటూరు శివారుల్లోని లాంఫాంలో ఉన్న వర్సిటీ నిగానీ సంప్రదించాలని సూచించారు.

రెండు రోజుల పాటు ఏపీఈఆర్‌సీ విచారణ

సాక్షి, విశాఖపట్నం: విద్యుత్ వినియోగదారుల అర్జీలపై ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) శని, ఆదివారాల్లో విచారణ జరపనుంది. గత ఆరు నెలల కాలంలో గృహ వినియోగదారులు, పరిశ్రమలు, వివిధ సంస్థల నుంచి వచ్చిన విజ్ఞప్తులపై ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి, సభ్యులు ఠాకూర్ రామ్‌సింగ్, పీవీఆర్‌రెడ్డి ఆధ్వర్యంలో విశాఖలోని ఏపీఈఆర్‌సీ క్యాంపు కార్యాలయంలో సెప్టెంబర్ 30, అక్టోబర్ 1తేదీల్లో విచారణ నిర్వహిస్తారు.

బాబు నిప్పయితే.. తోక ముడిచారెందుకు?

- చర్చిస్తే వాస్తవాలు బయట పడతాయనే అసెంబ్లీ నుంచి టీడీపీ సభ్యుల పలాయనం
- అధికారంలోకి రావాలి.. దోచుకోవాలన్నదే టీడీపీ ఉద్దేశం
- భర్త క్రూరత్వాన్ని, స్వార్థ రాజకీయాల్ని భువనేశ్వరి గుర్తు తెచ్చుకోవాలి
- టీడీపీ ఎమ్మెల్యేల తీరుపై గడికోట శ్రీకాంత్‌రెడ్డి మండిపాటు



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో అన్ని ఆధారాలతో దొరికేసిన చంద్రబాబు తాను నిప్పు అని చెప్పుకుంటూ బిల్డప్ ఇవ్వడం సిగ్గు చేటు అని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి విమర్శించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'మీ బాబు నిప్పు అయితే.. అసెంబ్లీలో చర్చకు తోక ముడిచారెందుకు' అని టీడీపీ ఎమ్మెల్యేలను నిలదీశారు. 'స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో రూ.371 కోట్లను షెల్ కంపెనీలకు విడుదల చేసిన చంద్రబాబు తిరిగి వాటిని తన ఖాతాలోకి ఎలా జమ చేసుకున్నాడనే వాస్తవాల్ని పత్రికల్లో చదివాం. కానీ.. అసలు ఇందులో నిజాల్ని పూర్తిగా అందరికీ కళ్లకు కట్టినవిధంగా అసెంబ్లీ సమావేశాల్లో అర్థవంతమైన చర్చ జరిగింది. ఆ చర్చలో పాల్గొంటే వాస్తవాలు బయట పడతాయనే భయంతో సభ నుంచి పలాయనం చిత్తగించారు. టీడీపీ సభ్యులు ఎందుకు పారిపోవాల్సి వచ్చిందో చెప్పాలి' అని కోరారు. చంద్రబాబు స్కామ్‌లను అధికారులు బయట పెడితే అదేదో రాజకీయ కక్ష సాధింపు అనడం సరికాదన్నారు. చంద్రబాబు తప్పు చేయకపోతే రూ.కోట్లు వెచ్చించి లాయర్లను ఎందుకు పెట్టుకుంటారని నిలదీశారు.

అసెంబ్లీ సాక్షిగా స్కామ్‌లను ఎండగట్టాం

అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబు అండ్ కో చేసిన స్కామ్‌లను ఎండగట్టామని గడికోట అన్నారు. అడ్డంగా బుక్కైన చంద్రబాబు, లోకేశ్ కుంభకోణాల ఆధారాలు తవ్వేకొద్దీ బయట పడుతున్నాయన్నారు. అన్ని కుంభకోణాలకు సూత్రధారులు, పాత్రధారులు తండ్రీ కొడుకులే అన్నారు. మళ్లీ అధికారంలోకి రావాలని.. అందిన కాడికి దోచుకోవాలన్నదే టీడీపీ ఉద్దేశమని పేర్కొన్నారు. పచ్చ మీడియా ఇష్టానుసారంగా వ్యవహరిస్తోందని.. ఎల్లో మీడియా చేస్తున్నది జర్నలిజమా? చంద్రబాబు ఇజమా? అని ప్రశ్నించారు. తన భర్త క్రూరత్వాన్ని, స్వార్థ రాజకీయాల్ని నారా భువనేశ్వరి గుర్తు తెచ్చుకోవాలని కోరారు. అసెంబ్లీలో వైఎస్సార్‌సీపీ నేతలెవరూ ఆమెను అవమానించలేదని, నిజానిజాలేంటో ఆమె చంద్రబాబునే నిలదీయాలని పేర్కొన్నారు. ఒక మహిళగా భువనేశ్వరిని ఎప్పుడూ వైఎస్సార్‌సీపీ గౌరవిస్తుందన్నారు.

టీడీపీ సభ్యుల తీరు జుగుప్సాకరం

అసెంబ్లీ సమావేశాలు ఐదు రోజుల పాటు జరిగితే.. మొదటి రెండ్రోజుల్లో టీడీపీ సభ్యుల జుగుప్సాకరమైన తీరును చూసి ప్రజలు అసహ్యించుకున్నారని శ్రీకాంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. చంద్రబాబు అరెస్ట్‌పై చర్చలో పాల్గొంటే అభాసు పాలవుతామనే భయంతో సమావేశాల మొదటి రోజు నుంచే గందరగోళం సృష్టించారన్నారు. స్పీకర్ పోడియం చుట్టుముట్టి.. కంప్యూటర్లను, ఇతర వస్తువుల్ని లాగిపడేశారని, పేపర్లు చించి స్పీకర్ మొహాన విసిరేశారని గుర్తు చేశారు. మీసాలు తిప్పడం, తొడలు కొట్టడం, విజిల్స్‌తో సభలో గందరగోళం సృష్టించిన దృశ్యాలనూ ప్రజలంతా చూశారన్నారు. కేవలం ముగ్గుర్ని మాత్రమే సస్పెండ్ చేస్తే.. మిగిలిన సభ్యులు సమావేశాలకు హాజరుకాకుండా ఎందుకు బాయ్‌కాట్ చేయాల్సి వచ్చిందో సమాధానమివ్వాలని డిమాండ్ చేశారు.

> బంధువులకు, పేదలకు, బాటసారులకు, వారి హక్కు (వారికి) ఇవ్వు.
>
> – ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 29 సెప్టెంబర్ 2023

పారాహుషార్!

అజ్ఞానం అనేక విధాల అపాయకరం. ఆరోగ్యం విషయంలో అది మరీ ప్రమాదకరం. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) తాజాగా విడుదల చేసిన ఓ నివేదిక ఆ సంగతి మన భారతీయులం దరికీ మరోసారి గుర్తుచేసింది. మన దేశ జనాభాలో 18.83 కోట్ల మంది దాకా అధిక రక్తపోటు (హై బీపీ)తో బాధపడుతున్నారనీ, అయితే వారిలో కేవలం 37 శాతం మందికే తమ ఆరోగ్య పరిస్థితి గురించి అవగాహన ఉందనీ వెల్లడించింది. అధిక రక్తపోటు ఉందని తేలినవారిలో నూటికి 30 మందే మందులు వాడుతున్నారనీ, వారిలోనూ 15 మందే దాన్ని నియంత్రణలో ఉంచుకుంటున్నారనీ పేర్కొంది. బీపీ ఉన్నవారిలో కనీసం సగం మంది దాన్ని నియంత్రణలో ఉంచుకోగలిగినా... వచ్చే 2040 నాటికి గుండెపోటు, పక్షవాతం వల్ల సంభవించే 46 లక్షల మరణాలను మన దేశంలో నివారించవచ్చు. డబ్ల్యూహెచ్ఓ చెబుతున్న ఈ మాటలు భారత్‌లో 'హై బీపీ' పట్ల పేరుకున్న అశ్రద్ధను గుర్తుచేస్తున్నాయి. ఆరోగ్య సంరక్షణలోని ఈ లోటుపాట్లపై ప్రజలు, వారితో పాటు ప్రభుత్వం కూడా తక్షణం అప్రమత్తం కావాల్సిన అవసరాన్ని చెబుతున్నాయి.

ప్రపంచవ్యాప్త హైపర్‌టెన్షన్ ప్రభావంపై డబ్ల్యూహెచ్ఓ విడుదల చేసిన తొట్టతొలి నివేదిక ఇదే! 2019 నాటి డేటా ఆధారంగా ఈ ప్రపంచ సంస్థ చేసిన నిర్ధారణలు ఆలోచింపజేస్తున్నాయి. ప్రపంచంలో ప్రతి ముగ్గురిలో ఒకరు అధిక బీపీతో బాధపడుతున్నారట! వారిలోనూ ప్రతి అయిదుగురిలో నలుగురు దాన్ని అదుపులో ఉంచుకోవట్లేదట! జీవనశైలిలో అనూహ్య మార్పుల వల్ల 1990 నుంచి 2019కి వచ్చేసరికల్లా బీపీ బాధితుల సంఖ్య 65 కోట్ల నుంచి రెట్టింపై, 130 కోట్లకు చేరింది. పైకి లక్షణాలేవీ ప్రత్యేకంగా కనిపించని 'సైలెంట్ కిల్లర్' ఇది. అందుకే, గుండె జబ్బు, కిడ్నీలు దెబ్బ తినడం లాంటి ఇతర సమస్యలు తలెత్తినప్పుడు గానీ ఈ అధిక బీపీని పలువురు గుర్తించడం లేదని వైద్యులు వాపోతున్నారు. బీపీ ఉన్నట్టు తెలిసినా సరిగ్గా మందులు వాడక అశ్రద్ధ చేసి తల మీదకు తెచ్చుకుంటున్నవారు అనేకులు. భారత్‌లో గుండెపోటు, స్ట్రోక్‌లతో మరణిస్తున్న వారిలో నూటికి 52 మంది అనియంత్రిత అధిక బీపీ (140/90కి పైన)కి బలి అవుతున్నవారే! చౌకగా మందులతో అదుపు చేయవచ్చని తెలిసినా, పలు దేశాల్లో ఈ పెను ప్రమాదకారిపై తగినంత శ్రద్ధ పెట్టడం లేదు.

అభివృద్ధి చెందిన దేశాల్లో కొన్ని తమ పౌరులందరికీ పరీక్షలు జరిపి, ఉచితంగా చికిత్స అందిస్తున్నాయి. అయితే, అల్పాదాయ దేశాల్లో అలాంటి పరిస్థితి లేదు. నిజానికి, మనదేశంలో ప్రజల్లో అధిక బీపీ దుష్ఫలితాల్ని నియంత్రించేందుకు 'ఇండియా హైపర్‌టెన్షన్ కంట్రోల్ ఇనీషియేటివ్' (ఐహెచ్‌సీఐ)ను 2017 నవంబర్‌లోనే కేంద్ర ఆరోగ్య శాఖ చేపట్టింది. ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ స్థాయిలోనే అసాంక్రమిక వ్యాధుల పరీక్షలు జరిపి, చికిత్స, మందులిచ్చి, 2025 నాటి కల్లా దేశంలో 7.5 కోట్ల మందికి బీపీ, షుగర్‌ల నుంచి సంరక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంది. మొదట 5 రాష్ట్రాల్లో ఎంపిక చేసిన కొద్ది జిల్లాల్లో మొదలైన ఈ ఆరోగ్య యజ్ఞం క్రమంగా 155 జిల్లాలకు విస్తరించింది. అయితే, ఈ ఏడాది జూన్ నాటికి 27 రాష్ట్రాల్లో దాదాపు 58 లక్షల మంది బీపీ రోగులకు మాత్రం చికిత్స అందించగలిగింది. నిరుడు ఇది ఐరాస అవార్డును అందుకున్న ప్రశంసనీయ ప్రయత్నం. కానీ, బీపీ బాధితుల సంఖ్య కోట్లలో ఉన్న దేశంలో చెరువు నీటిని చెంబుతో తోడితే సరిపోదు. డబ్ల్యూహెచ్ఓ తాజా నివేదిక సైతం ముందుగా ప్రజల్లో చైతన్యం పెంచాల్సిన అవసరాన్ని ఎత్తిచూపుతోంది.

సమాజంలోని పేదవర్గాల్లో పలువురు అధిక బీపీ బాధితులు కొంతకాలం పాటు మందులు వాడి, పరిస్థితి కొద్దిగా కుదుటపడగానే మానేస్తున్నారట! కొన్ని అధ్యయనాలు వెల్లడించిన ఈ చేదు నిజం ఆందోళన రేపుతోంది. బీపీకి చికిత్స, మందులు మధ్యలో ఆపడం ఆరోగ్యానికి ఏ మాత్రం మంచిది కాదని భారతీయ ఆరోగ్య సంరక్షణ మార్గదర్శకాలు ఎప్పటి నుంచో చెబుతున్నదే! అయినా మనం పెడచెవిన పెడుతున్నాం. ఈ ధోరణి మారాలి. 30 ఏళ్ళ వయసు నుంచే బీపీ చూపించుకోవాలనీ, 50వ పడిలో పడ్డాక తరచూ పరీక్ష చేయించుకోవడం తప్పనిసరనీ వైద్యులిస్తున్న సలహాను పాటించడం మంచిది. అలాగే, రోజుకు 5 గ్రాముల ఉప్పు మాత్రమే తీసుకోవాలని డబ్ల్యూహెచ్ఓ సిఫార్సున్నా, భారత్‌లో 8 గ్రాముల దాకా తీసుకుంటున్నట్లు భారత వైద్య పరిశోధనా మండలి తాజా నివేదిక సైతం హెచ్చరిస్తోంది. ఉప్పు తగ్గించడం, ధూమపానం, మద్యపానం మానేయడం, శారీరక శ్రమ, ఆరోగ్యకరమైన ఆహారం, కంటి నిండా నిద్ర లాంటి జీవనశైలి మార్పులతో, జీవితాంతం బీపీ మందులు మానకుండా వాడడం శ్రేయస్కరం.

గణాంకాలు గమనిస్తే, గత 15 ఏళ్ళలో దేశంలోని చిన్న పట్నాలు, గ్రామీణ ప్రాంతాలకు సైతం బీపీ సమస్య విస్తరించింది. ఆరోగ్య సంరక్షణ వసతుల్లోని లోటు సైతం అక్కడి సమస్యను పెంచుతోంది. మచ్చుకు, గ్రామీణ బిహార్ లాంటి చోట్ల ఆరోగ్య సేవకుల్లో మూడోవంతు మందికి మాత్రమే సరైన బీపీ చికిత్స తెలుసట! అంతర్జాతీయ పరిశోధకుల సర్వే నిరుడు తేల్చిన దిగ్భ్రాంతికరమైన నిజమిది. జిల్లా, గ్రామస్థాయుల్లో ప్రజారోగ్య సేవకుల నైపుణ్యం పెంచి, డాక్టర్ల, నర్సుల కొరతను అధిగమించడం ద్వారా ప్రభుత్వ బీపీ కార్యక్రమాన్ని మెరుగుపరచవచ్చని నిపుణుల సూచన. ఏమైనా, డబ్ల్యూహెచ్ఓ తాజా నివేదిక ఇస్తున్న సందేశాన్ని మన విధాన నిర్ణేతలు వెంటనే చెవికెక్కించుకోవాలి. ఎందుకంటే, ఎప్పటికప్పుడు పరిస్థితుల్ని బట్టి పంథా మార్చి, కొత్త వ్యూహాలను అనుసరించడమే ఏ సమస్యకైనా అసలైన ఔషధం.

శిఖర సమానుడైన శాస్త్రవేత్త

సందర్భం



డా॥ జి.వి. రామాంజనేయులు

భారతదేశ వ్యవసాయ రంగాన్ని తలుచుకోగానే స్ఫురించే మొదటిపేరు డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్. వ్యవసాయంలో ఆధునిక విధానాలను ప్రవేశ పెట్టడం ద్వారా ఆహార భద్రతను పెంచి దేశానికి ఆయన హరిత విప్లవ పితామహులయ్యారు. 'ఓడ నుంచి నోటికి' అన్నట్టుగా ఉన్న కరువు పరిస్థితుల నుంచి, దేశాన్ని అన్నపూర్ణగా తీర్చిదిద్దడంలో ఆయన కృషి వెలగట్టలేనిది. అందుకు అనుగుణంగా ఎన్నో సంస్థల ఏర్పాటులో ఆయన కీలకపాత్ర పోషించారు. రైతుల జీవితాలను మెరుగు పరచడానికి చివరిదాకా పనిచేస్తూనే ఉన్నారు. అదే సమయంలో హరిత విప్లవ అనంతర దుష్ఫలితాలకు కూడా ఆయన బాధ్యత వహించాలన్న విమర్శలూ వచ్చాయి. ఏమైనా ఆయన లేకుండా భారతదేశ వ్యవసాయ రంగ మంచిచెడ్డలు లేవు.

ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డా. ఎం.ఎస్. స్వామినాథన్ గారు 98 సంవత్సరాల సంపూర్ణ జీవితం గడిపిన తర్వాత ఈ రోజు (సెప్టెంబర్ 28) చనిపోయారు. భారత వ్యవసాయ రంగంలో అనేక కీలకమైన మలుపుల వెనుక అయన నిర్ణయాలు, ఆలోచనలు ఉన్నాయి. హరిత విప్లవం పేరుతో అధిక దిగుబడినిచ్చే వంగడాలు, రసాయనాలు, నీరు, మెషీన్లు వాడటం వంటివి తేవటంతో పాటు, వీటికి సహకారం అందించటానికి జాతీయ స్థాయిలో వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, విస్తరణ వ్యవస్థ, రుణాలు అందించటానికి బ్యాంకుల జాతీయీకరణ, మద్దతు ధరలు, సేకరణ కోసం భారతీయ ఆహార సంస్థ, ఆహార భద్రత కోసం జాతీయ పంపిణీ వ్యవస్థ లాంటివి ఏర్పాటు చేయటంలో కీలక పాత్ర పోషించారు. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి డైరెక్టర్ జనరల్, అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ డైరెక్టర్ వరకు అనేక కీలకమైన పదవులు కూడా అయన నిర్వహించారు.

రైతుల హక్కుల కోసం...

తర్వాతి కాలంలో జాతీయ రైతు కమిషన్ చైర్ పర్సన్‌గా – భారత వ్యవసాయ రంగం అభివృద్ధిని ఎంత దిగుబడులు పెంచాము అని కాకుండా, రైతుల ఆదాయం ఎంత పెంచాము అని ఆలోచించాలి అనీ, రైతులకు వచ్చే ధరలు ఉత్పత్తి ఖర్చులపై కనీసం యాభై శాతం ఉండాలి అనీ పేర్కొన్నారు. పార్లమెంట్ సభ్యులుగా ఉన్న సమయంలో వ్యవసాయ రంగంలో మహిళల ప్రాధాన్యం గుర్తించి, దానికి అనుగుణంగా విధానాలు ఉండాలి అని మహిళా రైతుల హక్కుల చట్టం ముసాయిదా తయారు చేసి పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టారు.

గ్రామాల్లోని ప్రజలు సొంతంగా నిర్ణయాలు తీసుకునే పరిస్థితులు వచ్చినప్పుడే వ్యవసాయంలో మార్పులు వస్తాయన్న ఆలోచనతో గ్రామాల్లో క్లైమేట్ స్కూల్స్ లాంటివి స్థాపించడం జరిగింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయుల్లో వాతావరణంలో వస్తున్న మార్పుల ప్రభావం వ్యవసాయ రంగం మీద ఎలా ఉంటుంది, ఆ మార్పులను ఎదుర్కోవడానికి రైతులు ఏం చేయాల్సి ఉంటుంది, ప్రభుత్వ విధానాలు ఎలా మారాల్సి ఉంటుంది అనే అంశాలపై పరిశోధన చేయడమే గాకుండా ఆ దిశగా ప్రభుత్వాలపై ఒత్తిడి తేగలిగారు.

అయితే, వ్యవసాయ రంగంలో ఉన్న విభిన్న పరిస్థితులు, విభిన్న అవసరాలు, విభిన్న దృక్కోణాల మధ్యలో నిర్ణయాలు తీసుకునే విషయంలో ఎదురయ్యే అనేక వివాదాలు కూడా అయన చుట్టూ ఉన్నాయి. హరిత విప్లవం ద్వారా వచ్చిన దుష్ఫలితాలకు ఆయనే బాధ్యులు అనీ, జాతీయ జీవ వైవిధ్యం కోల్పోవటం, విదేశాలకు తరలి పోవటంలో అయన పాత్ర ఉందనీ, అనేక ఆరోపణలు ఉన్నాయి. కానీ అయన జీవన ప్రయాణాన్ని దగ్గరగా చూసిన వాళ్ళు కాని, ఆయనతో ఒక్కసారి మాట్లాడిన వాళ్ళు కాని చెప్పే అనుభవాలు పూర్తిగా వేరుగా ఉంటాయి. తను కలిసిన ప్రతి వ్యక్తినీ పేరుతో గుర్తుపెట్టుకొని పలకరించే అలవాటు ఆయనకు ఉండేది. జాతీయ పరిశోధనా సంస్థలో ఆయన పని చేసినప్పుడు పొలంలో పనిచేసిన కూలీలను... ఆ తర్వాత ఆయన జాతీయ పరిశోధనా మండలి డైరెక్టర్ జనరల్ అయినప్పుడు కూడా పేరుతో పలకరించేవాడని చెప్పేవారు.



డా॥ ఎం. ఎస్. స్వామినాథన్
(7 ఆగస్ట్ 1925 – 28 సెప్టెంబర్ 2023)

నేను భారతీయ పరిశోధనా సంస్థలో పీహెచ్డీ చేస్తున్న సమయంలో ఒక విద్యార్థి తన పరిశోధనా పత్రం కోసం ఆయనని ఇంటర్వ్యూ చేస్తూ – 'నాయకత్వ లక్షణాలు ఎలా వుండాలి?' అని అడిగితే, 'ఎట్టి పరిస్థితులలో నైనా కోపం తెచ్చుకోకుండా ఉండటమే నాయకత్వ లక్షణం' అని చెప్పారు. 2005లో జాతీయ నాలెడ్జ్ కమిషన్ ఉప కమిటీలో సభ్యునిగా ఆయనని కలవటం, చర్చించటం... ఆ తర్వాతి కాలంలో మేము సుస్థిర వ్యవసాయంపై చేసిన ప్రయోగాలు, ఫలితాలు, రైతులకు ఆదాయ భద్రత కల్పించాలి అనే విషయం మీద చేసిన సూచనల విషయంలోనూ అయన స్పందించి, తన ఆలోచనలు పంచుకోవటమే కాకుండా, వాటి గురించి రాసి సహకరించారు.

విధానాలను మార్చేలా...

జీవవైవిధ్యాన్ని కాపాడటం కోసం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చేసిన ప్రయత్నాల వెనుక స్వామినాథన్ ప్రయత్నాలు ఉన్నాయి. జీవవైవిధ్య చట్టం, బయోడైవర్సిటీ ఇంటర్నేషనల్, నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ స్థాపనలో కూడా ఆయన కీలక పాత్ర పోషించారు. మన హైదరాబాద్‌లోని ఇక్రిశాట్ సంస్థ ఏర్పాటు కూడా ఆయన ప్రయత్నాలతో జరిగినదే.

భారత దేశంలో ప్రపంచ వాణిజ్య సంస్థ నిర్ణయాల మేరకు మేధా సంపత్తి హక్కుల గురించి చర్చలు జరిగి చట్టం చేసినప్పుడు, అందులో రైతులకు హక్కులు ఉండాలని పోరాడి, వాటిని కూడా చట్టంలోకి చేర్చేలా ప్రభుత్వాన్ని ఒప్పించారు. భారతదేశంలో అనేక ప్రాంతాల్లో రైతులు కాపాడుతూ వస్తున్న జీవ వైవిధ్యాన్ని డాక్యుమెంట్ చేసి, దానికి చట్టబద్ధమైన హక్కులు కల్పించే దిశగా తన స్వామినాథన్ ఫౌండేషన్ ద్వారా కృషి చేశారు.

వ్యవసాయ సమస్యలపై, పరిష్కారాలపై ఆయన మాట్లాడినంత, రాసినంత ఏ ఇతర వ్యవసాయ శాస్త్రవేత్త కూడా ఈ రోజు వరకు చేయలేదు. ప్రభుత్వాలు చెప్పిందే చేయటం కాకుండా, ప్రభుత్వాలు ఏమి చేయాలో చెప్పి వారి చేత ఒప్పించి అనేక మార్పులు చేయటం అయన చేయగలిగారు. 1972లో జాతీయ వ్యవసాయ పరిశోధనా మండలి డైరెక్టర్ జనరల్‌గా నియమించబడిన ఆయన, 1979లో ప్రిన్సిపాల్ సెక్రటరీగా కూడా నియమించబడ్డారు. బహుశా అలాంటి గుర్తింపు పొందిన ఏకైక శాస్త్రవేత్త డా॥ స్వామినాథన్.

ఇండియన్ పోలీస్ సర్వీస్‌కి ఎంపిక అయినా, వ్యవసాయ సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ రంగంలోకి రావటమే కాకుండా, జాతీయంగా, అంతర్జాతీయంగా అనేక సంస్థలను స్థాపించారు. సొంతంగా ఎం.ఎస్. స్వామినాథన్ ఫౌండేషన్ స్థాపించి అనేక కార్యక్రమాలు చేపట్టారు. తన సొంత ఆస్తిలో చాలా భాగం భూదాన ఉద్యమంలో ఇచ్చివేసిన మనిషి కూడా. ఆయన జీవితం ఎందరికో ప్రేరణ, స్ఫూర్తి. రైతుల తరఫున, వ్యవసాయ విద్యార్థులు, శాస్త్రవేత్తల తరఫునా ఆయనకు ఘన నివాళి.

> 1947 ఆగస్ట్ 16న అన్ని పత్రికల మొదటి పేజీలూ ప్రధాని నెహ్రూ 'ట్రిస్ట్ విత్ డెస్టినీ' ప్రసంగాన్ని కవర్ చేశాయి. రెండో పేజీలో రానున్న ఆహార సంక్షోభం గురించి ఎం.ఎస్. స్వామినాథన్ చేసిన హెచ్చరిక ఉంది. ఆహార భద్రత విషయంలో ఆయన దేశానికి మార్గదర్శనం చేశారు.
>
> – ప్రణవ్ ప్రతాప్ సింగ్, పొలిటికల్ కన్సల్టెంట్

వ్యాసకర్త వ్యవసాయ శాస్త్రవేత్త, కృష్ణ సుధా అకాడమీ ఫర్ అగ్రో ఎకాలజీ, సుస్థిర వ్యవసాయ కేంద్రం

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కార్య సాధకుడు



భారత హరిత విప్లవ పితామహుడు ఎం.ఎస్. స్వామినాథన్ మరణం నాకు తీవ్రమైన వ్యక్తిగత నష్టం. ఆహార హక్కు విషయంలో ఆయనతో దగ్గరగా పనిచేశాను. ఆయన 'ఎన్‌ఎఫ్‌ఐ' (నేషనల్ ఫౌండేషన్ ఫర్ ఇండియా)కి ఫౌండర్ ట్రస్టీ, మాజీ ఛైర్మన్. ఈ సంస్థ స్థాపనలో కీలక భూమిక పోషించారు. మహా మనీషి!

– బిరాజ్ పట్నాయక్,ఎన్‌ఎఫ్‌ఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

అసలైన బలం



'యూఎస్‌ను ఎప్పుడూ నమ్మవద్దు' అంటే ఒప్పుకొంటాను. కానీ ఆర్మేనియాలో జరిగినది చూశాక రష్యాను మాత్రం నమ్ముతారా? తమ స్నేహితులతో ఎలా ప్రవర్తిస్తారు అనేదాన్ని బట్టి మనుషులను అంచనా వేయాలి. స్నేహితుడికి జరిగినది ఒకరోజు మీకు కూడా జరగొచ్చు. అందుకే నేను మన అణ్వాయుధాలను మాత్రమే నమ్ముతాను.

– అభిజిత్ అయ్యర్ మిత్రా, పరిశోధకుడు

పని చేయదు!



సెప్టెంబర్ 25న జరిగిన భారత వ్యతిరేక ర్యాలీకి టొరంటోలో కేవలం 100 మంది, వాంకోవర్‌లో 200 మంది ఖలిస్తానీలు హాజరయ్యారు. ఇది కెనడాలోని 7.7 లక్షల సిక్కు జనాభాలో 0.038 శాతం. 2024 ఎన్నికల్లో లబ్ధి కోసం సిక్కుల మీద ద్వేషాన్ని రెచ్చగొట్టేవారు తమను తాము ఆత్మవిమర్శ చేసుకోవాలి.

– జె.ఎస్. సోఢీ, లెఫ్టినెంట్ కల్నల్ (రిటైర్డ్)

మేధా చౌర్యం



ఇక్కడ ఒక దొంగతనాన్ని రిపోర్టు చేస్తున్నాను. నా పుస్తకాలను రాయడానికి నా జీవితంలోని మూడు దశాబ్దాలు వెచ్చించాను. ఏఐ (కృత్రిమ మేధ) లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ 'డేటా'ను 'నమలడమో', 'గీరడమో' చేయలేదు. ఏఐ కంపెనీలు నా పనినీ, కాలాన్నీ, సృజననూ దొంగిలించాయి. వాళ్లు నా కథలను దొంగిలించారు. వాళ్లు నాలోని కొంత భాగాన్ని దోచుకున్నారు.

– మిన్ జిన్ లీ, రచయిత్రి

అమెరికా చదువు సంస్కృతులు

అమెరికా విద్యారంగంపై విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, రాజకీయులు ఆగ్రహం ప్రదర్శిస్తున్నారు. కొన్నేళ్ళ క్రితం వరకు పాఠశాలల నిర్వహణ అద్భుతంగా ఉండేది. యువ ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో చనువుగా ప్రవర్తించేవారు. పిల్లల విషయాలను చర్చించడానికి ఒక రోజయినా వారితో గడిపేవారు. నేటి విద్యార్థులు, యువత అతి తక్కువ సమయంలో ఊహించని, తీవ్రమయిన మార్పులకు గురవుతున్నారు. యుక్త వయసులోకి ప్రవేశిస్తున్న వీరు జ్ఞానాన్ని గ్రహించటానికి పెనుగులాడుతున్నారు.

పాఠశాలలకూ సమస్యలున్నాయి. విపరీతంగా సాగదీయబడిన ప్రతిష్ఠాత్మక పునర్నిర్మాణ పథకం, ఆశించిన స్థాయిని అందుకోలేని దూరవిద్య, కరోనా మహమ్మారి కాలపు అలవాట్ల నుండి బయటపడలేని దుఃస్థితి అందులో కొన్ని. విద్యాలయాల వద్ద మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాల అమ్మకాలు మరో తీవ్ర సమస్య. బాంబుల, తుపాకుల ఉపయోగ సంస్కృతి సకారాత్మక నిర్ణయాలకు అడ్డుతగులుతున్నాయి.

మహమ్మారి కాలంలో కోల్పోయిన పాఠ్యాంశాలను విద్యార్థులు ఇప్పుడిప్పుడు నేర్చుకుంటున్నట్లు అనిపిస్తుంది. రెండేళ్లలో తప్పిన సాంఘికీకరణ, పరిపక్వతలను సంపాదిస్తున్నారు. సామాజిక అభివృద్ధిలో విద్యార్థులు రెండేళ్ళు వెనుకబడ్డారని మానసికశాస్త్ర ఉపాధ్యాయుల అభిప్రాయం. అందుకే బళ్ళలో అంతా బాగుందనేవాళ్ళ సంఖ్య తగ్గింది. విద్యారంగం పిచ్చివాళ్ళ, తీవ్రవాదుల హస్తాల్లో చిక్కుకుందని కొన్ని పత్రికలు ప్రచారం కూడా చేస్తున్నాయి.


అమెరికాలో విడాకులు పెరిగాయి. పిల్లలకు ఇద్దరు తల్లిదండ్రుల పెంపక అవకాశం లేదు. తల్లిదండ్రులు ఇద్దరిలో ఎవరో ఒకరే పిల్లలను పెంచవలసి వస్తోంది. 25 శాతం పిల్లలు ఇలాంటి వారే. ఏ దేశంలోనూ ఈ స్థితి ఈ స్థాయిలో లేదు. ఈ చేదునిజం అమెరికాలో సింగిల్ పేరెంట్ సంరక్షణ శిశువులను ఇబ్బందులకు గురిచేస్తోంది. దీనితో సమాజం నష్టపోతోంది. ఈ పిల్లలు ప్రవర్తనా సమస్యలను ఎదుర్కొంటున్నారు. పాఠశాలల్లో వీరి సంఖ్య తక్కువ. వారిలో అవగాహన, బోధనాంశాలను అర్థం చేసుకోవడంలో తేడా ఉంటోంది. పిల్లల చదువు, భావిపౌరుల శ్రేయస్సుకు... అమెరికాలో పతనమయిన కుటుంబ, సామాజిక సంబంధాలను మెరుగుపర్చడమే మార్గం.

– సంగిరెడ్డి హనుమంత రెడ్డి,
వ్యాసకర్త ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి

సారాంశం

సరికొండ చలపతి

'ఆకాశం'లోకి నేల జారిపోతోంది



వడ్డీల్లో వేతన జీవులు..

హైదరాబాద్‌లో ఓ ఐటీ ఎంప్లాయ్.. ఉద్యోగంలో చేరి మూడేళ్లయ్యింది.

లక్ష దాకా శాలరీ వస్తోంది. ఓ అపార్ట్‌మెంట్ కొనుక్కున్నాడు. అదీ ఆఫీసుకు 20 కిలోమీటర్ల దూరంలో. ఇప్పుడాయన తన శాలరీలో 50 వేలు ఈఎమ్ఐ కడుతున్నాడు. అలా 20 ఏళ్ల కట్టాలి. ఇక మధ్య బ్యాంక్ వడ్డీ రేట్లు పెంచితే మరో ఐదేళ్లు.. అంటే ఈ కిస్తులు రిటైర్‌మెంట్ దాకా పోయినా ఆశ్చర్యం లేదు. అంటే జీతంలో సగం. అసలే ప్రైవేటు ఉద్యోగం.. ఎప్పుడు పింక్ స్లిప్ వస్తుందో తెలియదు. పప్పు, ఉప్పు లాంటి నిత్యావసర సరుకులు కాసింత పెరిగితేనే నెలాఖరుకు ఇబ్బంది పడే మధ్యతరగతి ఉద్యోగి జీతంలో సగం తలదాచుకోవడానికి పెట్టాల్సివస్తోంది. లైఫ్ క్వాలిటీని నిలువెల్లా తినేస్తోంది.

మధ్యతరగతి జీవితం నుంచి బయటపడాలి, ఐదంకెల జీతం రావాలి అని పాతికేళ్లు చదివి లక్ష రూపాయల ఉద్యోగం దాకా చేరిన వారు... అంతులేకుండా పెరిగిన ఇళ్ల ధరల కారణంగా బొటాబొటి ఆదాయంతోనే బతికే పరిస్థితి వచ్చింది. మళ్లీ అదే మధ్యతరగతి... అదే నెలాఖరు. లోన్లు, వడ్డీలు నడ్డి విరుస్తుంటే జీవితం ఎప్పుడూ చేబదుల్లోనే ఉంటోంది.

....

నిత్యావసరమైన నేల అంగడి సరుకయ్యింది. బంగారంలా పెట్టుబడి అయ్యింది. పేద మధ్య తరగతి కాళ్లకిందనుంచి నేల జారిపోయింది.

....

నేల.. ఓ సేల్ డీడ్

డబ్బు పెరిగి పిల్లలు పెట్టాలంటే ఆర్థిక నిపుణులు మూడు విధాలుగా పెట్టుబడి పెట్టడం మార్గంగా చెబుతున్నారు. ఒకటి రియల్ ఎస్టేట్, రెండవది బంగారం కొనడం, మూడవది షేర్ మార్కెట్‌లో మదుపు చెయ్యడం. ఈ మూడు విధాలుగా దాచే డబ్బు విలువ పెంచుతుంది. ఇప్పుడీ మూడింటిలో మనిషికి నీడనివ్వాల్సిన నేల ధనికుల పెట్టెల్లో షేర్ పత్రాల్లాగా సేల్ డీడ్స్ రూపంలో పడి ఉంటోంది. స్టాక్ మార్కెట్ తర్వాత ఎక్కువ రిటర్న్స్ ఇచ్చే రంగం ఇదే అయ్యింది . ట్యాక్స్ కట్టని నల్లడబ్బు పునాదుల మీద రియల్ ఎస్టేట్ 'హైరైజ్'లో ఉంది.

సర్కార్.. మార్కెటింగ్

రియల్ ఎస్టేట్ మదుపు చేసేవారంతా అవినీతిపరులు, రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలే అని నిర్ధారించడం కాదు... నేల వ్యాపారం అయితే దాని విలువ నిలువ నీడ లేకుండా చేస్తుంది. ఈ ధోరణిని మార్కెట్టే కాదు.. సర్కారు కూడా ఎంకరేజ్ చేస్తోంది.

కోకాపేటలో ఎకరం వందకోట్లు, నియో పోలీస్‌లలో వంద కోట్లు.. బుద్వేల్‌లో 46 కోట్లు.. ఇక్కడ ఎకరం అమ్మితే అక్కడ 10 ఎకరాలు కొనొచ్చు.. ఇవన్నీ నిజంగా గర్వ పడాల్సిన మాటలేనా..? ఈ చుట్టు పక్క ప్రాంతాల వైపు సాధారణ ప్రజలు కన్నెత్తి చూడ లేస్తారా...? పేద, మధ్యతరగతికి ఆరడుగుల నేల దూరం చేసే ధోరణి కాదా...? మెజారిటీ ప్రజలు తమ జీవిత కాలంలో ఒక ఇల్లు కొనుక్కోవటమే గగనం. ఎలాగోలా కష్టపడి కొనుగోలు చేసే వాళ్ళు కూడా ఎక్కువ మొత్తం బ్యాంకు లోన్ తీసుకుంటే తప్ప ఆ ఒక్క ఇల్లు కొనటం కూడా సాధ్యం కాదు. ఓ వంద గజాలు కొనుక్కోవాలంటే ఆ ఇంటి అప్పు తీర్చటానికి జీవిత కాలం పడుతుంది. ఇలాంటి వారికి ఎకరాలు, అవి సర్కారుకు అందిస్తున్న వందల కోట్లు ఆనందాన్నిస్తాయా...? రాష్ట్రం ప్రగతి పథంలో పడుతుందన్న సంబురాన్నిస్తుందా? తలదాచుకోవడానికి ఉపయోగపడాల్సిన నేల, ఇల్లు .. రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మారి దానిలోకి నేరుగా ప్రభుత్వాలే దిగడం మరింత ఆందోళనకరం. ఇది క్రమంగా రాజకీయాలకు అవసరంగా, ఎన్నికల ఇంధనంగా మారిపోయింది. క్రమంగా స్థిరాస్తి రంగం అన్ని రంగాలను శాసిస్తోంది. పెద్ద పెద్ద తలకాయలు అన్ని దీనిలో తలదూర్చాయి. మెజారిటీ ప్రజల మీద వీర విహారం చేస్తున్నాయి.

ఈ ధోరణి నగరాల నుంచి క్రమంగా పల్లెల మీద పడింది. వ్యవసాయ భూముల్లో కలుపు మొక్కల్లాగా పెరుగుతోంది. స్టీల్, సిమెంట్, ఇసుక, ఇటుక, టైల్స్, గ్రానైట్, ఒకటేమిటి... చాలా రంగాలు, వ్యాపారాలు రియల్ ఎస్టేట్‌తో ముడిపడి ఉన్నాయి. రియల్ ఎస్టేట్ అన్ని రంగాలను శాసిస్తోంది. ఇప్పుడివన్నీ రాజకీయ నాయకులు, పెద్దల చేతుల్లోకి వెళ్లి పోయాయి..

....

30 మంది.. 8,000 ఇళ్లు..

ఇది మన ఒక్కరి సమస్యే కాదు. ఉదాహరణగా, ఈ వార్త చూడండి..

దక్షిణ కొరియాకు సంబంధించినది.

30 మంది వ్యక్తులు ఐదున్నర సంవత్సరాల కాలంలో 8,000 ఇళ్ళు కొనుగోలు చేశారు. వీటి మొత్తం విలువ మన భారతీయ కరెన్సీలో 7,446 కోట్ల రూపాయలు. 2018 సంవత్సరం నుంచి 2023 జూన్ మధ్య కాలంలో ఈ ముప్పై మంది 8,000 ఇళ్ళు కొనుగోలు చేశారు.

చైనాలో 100 కోట్ల ఇళ్లు ఖాళీ..

మితి మీరిన వ్యాపారం ఎక్కడికి దారి తీస్తుందో చైనా వార్త చెబుతుంది.

ఇక్కడ దాదాపు 100 కోట్ల ఇళ్లు ఖాళీగా ఉన్నాయట. ఇప్పటికే దేశవ్యాప్తంగా నిర్మాణాల్లో ఉన్న నివాస గృహాలన్నీ అందుబాటులోకి వస్తే 300 కోట్ల మందికి సరిపోతాయట. చైనా దేశ స్టాటిస్టిక్స్ బ్యూరో మాజీ డిప్యూటీ హెడ్ హే కేంగ్ స్వయంగా చెప్పిన విషయం ఇది. చైనా జీడీపీలో 30 శాతం రియల్టీదే. ఇప్పుడా రంగమే చైనాకు పెను భారమైంది. వ్యాపార కాంక్షతో హైదరాబాద్ చుట్టూ ఆకాశం దాకా విస్తరిస్తున్న కాంక్రీట్ జంగిల్‌కు ఇదో హెచ్చరిక.

స్థలాలు, గృహాల ధరలు పరిమితికి మించి పెరిగిపోవడంతో హైదరాబాద్ నగరంలో ఇళ్ల, ఫ్లాట్ల కొనుగోళ్లు తగ్గిపోతున్నాయి. ఓ ప్రైవేటు రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సంస్థ అంచనా ప్రకారం.. 2022 ఏప్రిల్–సెప్టెంబర్ మధ్య ఆరు నెలల్లో 1,460 కొత్త ఇళ్ల అమ్ముడవగా.. 2023లో ఇదేకాలానికి 720 ఇళ్లే అమ్ముడయ్యాయి.

స్థలాలు, ఇళ్ల ధరలు పెరిగిపోవడమే దీనికి కారణమని రియల్ ఎస్టేట్ వర్గాలే చెప్తున్నాయి. నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో మూడు, నాలుగేళ్ల కింద వెయ్యి చదరపు అడుగుల ఫ్లాట్ సుమారు రూ. 50 లక్షల్లో వస్తే.. ఇప్పుడది రూ. 70 లక్షల నుంచి రూ. 90 లక్షల వరకు పెరిగిందని అంటున్నాయి.

వీధుల్లో పేదలు...

వేతన జీవుల పరిస్థితి ఇలా ఉంటే.. ఇక పేదల పరిస్థితి ఏమిటి..?

- 27 సభ్యదేశాలున్న ఆర్థిక సహకార, అభివృద్ధి సంస్థ గణాంకాల ప్రకారం.. ప్రతి లక్ష మందికి ఫ్రాన్స్‌లో 217 మంది, యూఎస్‌లో 177, చిలీలో 155, ఐర్లాండ్‌లో 78, స్పెయిన్ లో 49, పోర్చుగల్‌లో 20 మంది పూర్తిగా నిరాశ్రయులే.
- సొంత ఇల్లు, ఉపాధి లేక.. షెల్టర్లలో ఆశ్రయం పొందినవారూ ఈ దేశాల్లో ఉన్నారు. యూకేలో 7.7 శాతం, యూఎస్‌లో 6.2 శాతం, ఇటలీలో 4 శాతం, బెల్జియంలో 3.4 శాతం, జర్మనీలో 2.4 శాతం మంది తాము జీవితంలో ఒకసారైనా ఇలాంటి పరిస్థితిని అనుభవించామని ఒక సర్వేలో వెల్లడించారు.
- ప్రపంచవ్యాప్తంగా చూస్తే.. జపాన్‌లో నిరాశ్రయుల సంఖ్య అతి తక్కువ. ఉత్తమ గృహకల్పన విధానాలు, డ్రగ్స్ నియంత్రణ, మానసిక ఆరోగ్య పరిరక్షణ చర్యలు వంటివి దీనికి కారణం.
- ప్రపంచంలో నిరాశ్రయుల సంఖ్య అతిఎక్కువగా ఉన్న దేశం నైజీరియా. అక్కడి జనాభాలో 12 శాతం వరకు నిరాశ్రయులే.
- మనదేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల కోసం పలు పథకాలను అమలు చేస్తున్నా, యూఎన్ మిలీనియం డెవలప్‌మెంట్ గోల్స్ నివేదిక ప్రకారం... మన దేశ జనాభాలో 6.7 శాతం నిరుపేదలే. వీరిలో చాలా మంది నిలువ నీడ లేక ఇబ్బంది పడుతున్న వారే. దీనికి సంబంధించి 'కోల్డ్ అండ్ అన్ కేర్‌డ్ ఫర్ (సీఏయూఎఫ్) సొసైటీ' తమ నివేదికలో పలు కీలక అంశాలను వెల్లడించింది.
- దేశంలోని చాలా నగరాల్లో ఇళ్లు, స్థలాల ధరలు పేదలకు అందుబాటు ధరల్లో లేకపోవడం సమస్యగా మారింది. కనీసం అద్దెలను కూడా భరించలేని పరిస్థితి ఉంది. దీనికి తోడు ఆదాయ అసమానతలు, ఉద్యోగ–ఉపాధి అవకాశాల్లో వివక్ష వంటివి కూడా.. ఇళ్లు కొనలేకపోవడానికి కారణమవుతున్నాయి.
- దేశంలో ముంబై, ఢిల్లీ, కోల్‌కతా వంటి పెద్ద నగరాల్లో ఇళ్లులేని పేదల సంఖ్య ఎక్కువగా ఉంది.

....

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** పౌర్ణమి సా.4.10 వరకు, తదుపరి బ.పాడ్యమి, **నక్షత్రం:** ఉత్తరాభాద్ర రా.1.21 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** ఉ.11.50 నుండి 1.20 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.15 నుండి 9.04 వరకు, తదుపరి ప.12.14 నుండి 1.04 వరకు, **అమృతఘడియలు:** రా.8.48 నుండి 10.20 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.53, **సూర్యాస్తమయం:** 5.51.

క్లుప్తంగా...

గోవిందరాజస్వామి ఆలయంలో ఆర్జిత సేవలు

తిరుపతి కల్చరల్: తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో వేదాశీర్వచనం, కుంకుమార్చన ఆర్జిత సేవలను టీటీడీ ప్రవేశపెట్టింది. వేదాశీర్వచనం సేవ ప్రతి రోజూ ఉంటుంది. రూ.500 చెల్లించిన గృహస్థులకు వేదాశీర్వచనంతో పాటు ఉత్తరీయం, రవికె బహుమానంగా అందజేస్తారు. అలాగే, శ్రీగోవిందరాజస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీపుండరీకవల్లి అమ్మవారికి ప్రతి శుక్రవారం కుంకుమార్చన సేవ నిర్వహిస్తారు. రూ. 250 చెల్లిస్తే ఈ ఆర్జిత సేవలో పాల్గొనవచ్చని టీటీడీ తెలిపింది.

కోటి మందికి భగవద్గీత పుస్తకాలు

- తమిళం, కన్నడ, హిందీభాషల్లోనూ ముద్రణ
- టీటీడీ చైర్మన్ భూమన వెల్లడి



మాట్లాడుతున్న భూమన, ఏజే శేఖర్

సాక్షి, చెన్నై: సనాతన హిందూ ధర్మ ప్రచారాన్ని పెద్దఎత్తున నిర్వహించడంలో భాగంగా భగవద్గీతను విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో రాయించి పుస్తకాలుగా ముద్రించి తెలుగు రాష్ట్రాల్లో కోటి మందికి పంపిణీ చేస్తామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి ప్రకటించారు. తమిళం, కన్నడ, హిందీ భాషల్లోనూ భగవద్గీతను ముద్రించి ఆయా రాష్ట్రాల్లో విద్యార్థులకు అందిస్తామన్నారు. గురువారం చెన్నైలోని టీటీడీ స్థానిక సలహామండలి చైర్మన్ ఏజే శేఖర్ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఇందులో పాల్గొన్న భూమన మీడియాతో మాట్లాడుతూ..పీఠాధిపతులు, మఠాధిపతులు, ఆచార్య పురుషులు, హైందవ ధర్మపెద్దల సూచనలతో రాబోయే రోజుల్లో పెద్దఎత్తున హైందవ ధర్మ ప్రచారానికి కార్యాచరణకు దిగుతారని చెప్పారు. కళ్యాణమస్తు, శ్రీవారి కళ్యాణోత్సవాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుని వెళతామన్నారు. హిందూ ధర్మ ప్రచారానికి టీటీడీ నాయకత్వం వహిస్తే అందరూ అనుసరిస్తారనే నమ్మకం ఉందన్నారు. తిరుమల నడక దారిలో భక్తుల భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ అటవీ శాఖ నుంచి అనుమతి లభిస్తే తిరుమల నడక దారి వెంబడి ఫెన్సింగ్ నిర్మిస్తామని తెలిపారు.

తిరుమలలో ఘనంగా అనంత పద్మనాభ వ్రతం


తిరుమల: తిరుమలలో గురువారం అనంత పద్మనాభ వ్రతం ఘనంగా జరిగింది. ఉదయం శ్రీవారి సుదర్శన చక్రత్తాళ్వారును ఆలయం నుంచి ఊరేగింపుగా శ్రీ భూవరాహస్వామి ఆలయం వద్దనున్న స్వామివారి పుష్కరిణి చెంతకు వేంచేపు చేశారు. అక్కడ చక్రత్తాళ్వార్లకు అభిషేకాదులు నిర్వహించి శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. ప్రతి ఏడాది భాద్రపద మాస శుక్ల చతుర్దశి నాడు ఈ వ్రతం నిర్వహించడం ఆనవాయితీ. మహిళల సౌభాగ్యం కోసం వరలక్ష్మి వ్రతం ఎలా చేస్తారో, పురుషులకు సిరి సంపదల కోసం ఈ వ్రతాన్ని నిర్వహిస్తారు.

శ్రీవారిని దర్శించుకున్న గౌతమ్ గంభీర్



టీమిండియా మాజీ క్రికెటర్, బీజేపీ ఎంపీ గౌతమ్ గంభీర్ గురువారం శ్రీవారిని సుప్రభాత సేవలో దర్శించుకున్నారు. ఆయనకు ఆలయాధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ రంగనాయకులు మండపంలో పండితులు వేదాశీర్వచనాలను, అధికారులు ప్రసాదాలను అందజేశారు.

అమ్మవారికి శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ



పవిత్రాలతో అమ్మవారు

చంద్రగిరి (తిరుపతి జిల్లా): తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో జరుగుతోన్న పవిత్రోత్సవాల్లో భాగంగా గురువారం శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ జరిగింది. తెల్లవారుజామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అనంతరం సహస్రనామార్చన, నిత్యార్చన చేపట్టారు. తరువాత పవిత్ర సమర్పణ కార్యక్రమాన్ని పాంచరాత్ర ఆగమోక్తంగా వేద పండితులు నిర్వహించారు. అమ్మవారి మూల మూర్తికి, ఉత్సవర్లకు, ఉప ఆలయాలకు, పరివార దేవతలకు, విమాన ప్రాకారానికి, ధ్వజ స్తంభానికి పవిత్రాలు సమర్పించారు. సాయంత్రం వైదిక కార్యక్రమాలు నిర్వహించారు.

బెస్ట్ టూర్ ఆపరేటర్‌గా ఆర్‌వీ టూర్స్ అండ్ ట్రావెల్స్

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో ఆర్‌వీ టూర్స్ అండ్ ట్రావెల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ బెస్ట్ టూర్ ఆపరేటర్‌గా నిలిచింది. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా బుధవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి స్పెషల్ ట్రావెల్ ఏజెంట్ విభాగంలో ఈ అవార్డు అందుకుంది. పర్యాటక రంగాన్ని సామాన్యుడికి చేరువ చేసినందుకు ఆర్వీ సంస్థకు ఏపీ టూరిజం శాఖ మంత్రి ఆర్కే రోజా ఈ అవార్డు ప్రదానం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగంలో విశేష కృషి చేస్తున్న ఆపరేటర్లకు ఏటా ఇస్తున్న ఈ గుర్తింపును ఆర్‌వీ టూర్స్ అండ్ ట్రావెల్స్ సంస్థ మరోసారి కైవశం చేసుకుంది.

మహిళా మార్ట్..

లాభాల్లో బెస్ట్

తిరుపతి మార్ట్‌లో రూ.4.89 కోట్ల అమ్మకాలు

- ఏడాదిన్నరలో రూ.30 లక్షల లాభాలు
- నేడు విజయోత్సవ సంబరాలు
- సభ్యులకు డివిడెంట్ పంపిణీ





సాక్షి, అమరావతి : పట్టణాల్లోని పేద, మధ్య తరగతి మహిళలు సంఘటితమై విజయం సాధించారు. పట్టణ ప్రాంత పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అందించిన సాయంతో జగనన్న మహిళా మార్ట్‌లను నెలకొల్పి లాభాల బాటలో నడిపిస్తున్నారు. రాష్ట్రంలో 10 పట్టణాల్లో ఏర్పాటు చేసిన మార్ట్‌లు నెలకు సగటున రూ.79.40 లక్షల వ్యాపారం చేస్తూ ముందుకు సాగుతున్నాయి. పొదుపు సంఘాల్లోని మహిళలు కేవలం రూ.150 చొప్పున పెట్టుబడి పెట్టి.. తమ ఇంటికి అవసరమైన సరుకులను డిస్కౌంట్ ధరకు పొందుతూనే రోజువారీ అమ్మకాల ద్వారా ఏడాదికి రూ.19 లక్షల నికర లాభాలను ఆర్జిస్తున్నారు. తిరుపతి పట్టణానికి చెందిన స్వయం సహాయక సంఘాల్లోని 37,308 మంది మహిళలు మెప్మా ఎండీ విజయలక్ష్మి ప్రోత్సాహంతో మార్ట్ ఏర్పాటుకు ముందుకు వచ్చారు. ఒక్కో సభ్యురాలు కేవలం రూ.150 చొప్పున రూ.55,96,200 పెట్టుబడిగా పెట్టి గత ఏడాది మే నెలలో జగనన్న మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేశారు. ఈ మార్ట్ ఏడాదిన్నరలో రూ.4.89 కోట్ల అమ్మకాలు చేసి, రూ.30 లక్షల లాభాన్ని ఆర్జించింది. ఈ సందర్భంగా శుక్రవారం ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తున్నారు. వాటాదారులకు రూ.20 లక్షల మొత్తాన్ని డివిడెంట్‌గా పంచి.. మిగిలిన రూ.10 లక్షలను సభ్యుల అంగీకారంతో మరో వ్యాపారంలో పెట్టుబడి పెట్టేందుకు నిర్ణయించారు.

ఆర్థిక స్వావలంబన దిశగా..

రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా మహిళా సమాఖ్యలు ఉన్నా వీరు ప్రభుత్వం ఇచ్చే సాయాన్ని ఇన్నేళ్లు ఇంటి అవసరాలకే వినియోగించుకునేవారు. వారికి మెరుగైన ఆర్థిక స్వావలంబన ఉండాలని, సుస్థిర జీవనోపాధికి మార్గం చూపాలన్న లక్ష్యంతో 'మెప్మా' ఎండీ విజయలక్ష్మి సమాఖ్య సభ్యులను సూపర్ మార్కెట్ల ఏర్పాటు దిశగా ప్రోత్సహించారు. ఆసక్తి గల సభ్యులతో రూ.150 చొప్పున పెట్టుబడి పెట్టించి 'జగనన్న మహిళా మార్ట్'లను ఏర్పాటు చేశారు. 2021 జనవరిలో పులివెందులలో తొలి మార్ట్‌ను ఏర్పాటు చేశారు. గత ఏడాది ఈ స్టోర్ రూ.2.50 కోట్ల వ్యాపారం చేయడంతో పాటు సుమారు రూ.18 లక్షల లాభాన్ని ఆర్జించింది. దాంతో వాటాదారులకు డివిడెండ్ చెల్లించారు. ఇప్పుడు తిరుపతి పట్టణంలోని మహిళా మార్ట్ వాటాదారులు డివిడెంట్ అందుకోనున్నారు. కాగా.. ఈ రెండేళ్ల కాలంలో పులివెందుల, రాయచోటి, అద్దంకి, పుంగనూరు, తిరుపతి, చిత్తూరు, శ్రీకాకుళం, కర్నూలు, మార్కాపురం, ఒంగోలు పట్టణాల్లో 10 జగనన్న మహిళా మార్ట్‌లను అందుబాటులోకి తెచ్చారు.

ఇది సమైక్య విజయం



పెట్టుబడిదారులు, అమ్మకందారులు, కొనుగోలుదారులు మహిళలే. మార్ట్‌ల నిర్వహణ కోసం మెప్మా ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చాం. మార్ట్ ఏర్పాటు, నిర్వహణ ప్రతి దశను ఎస్‌హెచ్‌జీ సభ్యులే స్వయంగా చూసుకుంటున్నారు. తిరుపతిలో జగనన్న మహిళా మార్ట్ ఏడాదిన్నలో రూ.30 లక్షల లాభాన్ని ఆర్జించింది. ఇందులోని సభ్యులకు రూ.20 లక్షల డివిడెండ్ చెల్లించి.. మిగతా మొత్తంతో సభ్యుల అంగీకారంతో కొత్త వ్యాపారంలో ప్రారంభిస్తాం. ఇందులోనూ మహిళలే సభ్యులుగా ఉండి వచ్చిన లాభాలను పంచుకుంటారు. మహిళా స్వయం సహాయక సంఘాల్లోని ప్రతి మహిళ ఆర్థికంగా ఎదిగేలా చేయడమే మెప్మా లక్ష్యం. – వి.విజయలక్ష్మి, మెప్మా మిషన్ డైరెక్టర్

దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం

హోం మంత్రి తానేటి వనిత



ఆలయ మర్యాదలతో మంత్రికి స్వాగతం పలుకుతున్న చైర్మన్, ఈవోలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ) : ఈ ఏడాది దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత చెప్పారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను గురువారం మంత్రి దర్శించుకున్నారు. మంత్రికి దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబలు సాదర స్వాగతం పలికారు. అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. అమ్మవారి దర్శనానంతరం మంత్రి.. మల్లేశ్వరస్వామిని బాలాలయంలో దర్శించుకుని పూజలు చేశారు. వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా.. చైర్మన్, ఈవోలు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టు వస్త్రాలను అందచేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలందరూ సంతోషంగా ఉండాలని, అమ్మవారి ఆశీస్సులు సీఎం జగనన్నకు ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్టు తెలిపారు. ఉత్సవాల ఏర్పాట్లపై చైర్మన్, ఈవో, ఇతర శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్టు తెలిపారు. మంత్రి వెంట నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్లు అవుతు శైలజారెడ్డి, బెల్లం దుర్గ తదితరులున్నారు.

బాబు అండ్‌కో అవినీతి పరులకు శిక్ష పడాల్సిందే..

1,096వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: అధికారాన్ని అడ్డుపెట్టుకుని తమ పాలనలో రాష్ట్రాన్ని నిలువు దోపిడీ చేసిన బాబు అండ్‌కో అవినీతి పరులకు కఠినమైన శిక్షలు పడినపుడే ప్రజాస్వామ్యానికి మంచి రోజులొస్తాయని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,096వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో గురువారం పలువురు మాట్లాడారు. రెండెకరాల భూమి ఉన్న చంద్రబాబు రూ.లక్షల కోట్లకు అధిపతి ఎలా అయ్యాడో మంత్రం చెబితే తాము కూడా ఆచరిస్తామని చెప్పారు. పేదోడికి గూడు కల్పించాలనే సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జానెడు జాగా ఇస్తుంటే.. సీఆర్డీఏ చట్టాన్ని మార్చేందుకు వీలు లేదని కోర్టులకెక్కి రచ్చ రచ్చ చేస్తున్న బాబు అండ్ కో.. మరి నాడు ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఎందుకు మార్చారని ప్రశ్నించారు. బాబు అవినీతి చేశాడా, లేదా అనే అంశం న్యాయస్థానాలు తేలుస్తాయని, కానీ ఎల్లో మీడియానే బాబు ఏ తప్పు చేయలేదని తప్పుడు రాతలు రాస్తుండటం సిగ్గుచేటన్నారు. న్యాయస్థానాలను కూడా వక్రీకరించేలా ఎల్లో మీడియాలో రాతలు, ప్రసారాలున్నాయని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు మాదిగాని గురునాథం, పులి దాసు, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

వీర జవాన్‌కు సైనిక లాంఛనాలతో వీడ్కోలు

పల్లెకోనకు తరలి వచ్చిన మిలటరీ అధికారులు , మంత్రి నాగార్జున, ఎంపీ సురేష్ తదితరులు



వీర జవానుకు నివాళులర్పిస్తున్న మంత్రి నాగార్జున, ఎంపీ సురేష్

భట్టిప్రోలు: రాజస్తాన్‌లోని పాకిస్తాన్ బోర్డర్ జస్సల్‌మీర్ వద్ద విధి నిర్వహణలో మృతి చెందిన బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం పల్లెకోనకు చెందిన జవాన్ పురమా గోపరాజు (26)కు గురువారం సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు ఘనంగా నిర్వహించారు. సోమవారం జస్సల్‌మీర్ వద్ద ప్రత్యేక కవాతు నిర్వహణలో భాగంగా రైఫ్లింగ్‌లో అకస్మాత్తుగా గోపరాజు గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. పార్థివదేహాన్ని బుధవారం సాయంత్రం స్వగ్రామమైన పల్లెకోనకు తీసుకొచ్చారు. మృతదేహాన్ని ప్రత్యేక వాహనంపై ఉంచి మిలటరీ అధికారులు, గ్రామస్తులు సైనిక లాంఛనాలతో భట్టిప్రోలు స్మశానవాటికకు తరలించారు. రెండు సెంట్లస్థలాన్ని రెవెన్యూ అధికారులు అమరజవాన్‌కు స్థూపం కట్టేందుకు కేటాయించారు. రాష్ట్ర సాంఘిక శాఖా మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున, బాపట్ల ఎంపీ నందిగం సురేష్‌తో పాటు రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ శేరు శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ బొల్లెద్దు రాజమ్మ ప్రతాప్ తదితరులు ఘనంగా నివాళులర్పించారు. వీరి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి నాగార్జున, ఎంపీ నందిగం సురేష్ చెప్పారు. ఆర్మీ జవాన్లు అమర జవాన్‌కు గౌరవ వందనం నిర్వహించిన అనంతరం 21 రౌండ్లు గాలిలో కాల్పులు జరిపి అంత్యక్రియలు నిర్వహించారు.


జెర్రి బిర్యానీ!

ప్రకాశం జిల్లా బేస్తవారిపేట జంక్షన్‌లోని ఓ రెస్టారెంట్‌లో బిర్యానీ తినేందుకు ఓ కుటుంబం వెళ్లింది. వారు చికెన్ బిర్యానీ తింటుండగా అందులో కాళ్ల జెర్రి కనిపించింది. దీంతో వంట మాస్టర్ వద్దకు వెళ్లి జెర్రితో కలిపి చికెన్ కర్రీ చేస్తున్నారా? అని వారు నిలదీశారు. వంట రూమ్‌లో కనీస జాగ్రత్త చర్యలు తీసుకోకుండా వంటకాలు చేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. – బేస్తవారిపేట



ట్రిబ్యునల్ తీర్పు అమలయ్యే వరకూ పాత వాటాలే

- కృష్ణా జలాల పంపిణీపై రెండు రాష్ట్రాలకు కేంద్ర జల్‌శక్తి శాఖ స్పష్టీకరణ
- లభ్యత ఆధారంగా దామాషా పద్ధతిలో కృష్ణాబోర్డు నీటిని పంపిణీ
- కేడబ్ల్యూడీటీ–1 అవార్డు ఆధారంగా ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీలు కేటాయింపు
- ఆ మేరకు పంపిణీ చేసుకునేలా 2015–16లో రెండు రాష్ట్రాల మధ్య కేంద్రం తాత్కాలిక సర్దుబాటు
- 2017–18లో ఉమ్మడి ప్రాజెక్టుల్లో ఏపీ 66 శాతం, తెలంగాణ 34 శాతం నీటిని వాడుకునేలా ఏర్పాటు



సాక్షి, అమరావతి : కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ–2) తీర్పు అమల్లోకి వచ్చే వరకూ పాత వాటాల ప్రకారమే రెండు రాష్ట్రాలకు కృష్ణా జలాలను పంపిణీ చేయాలని కృష్ణా బోర్డుకు కేంద్రం దిశానిర్దేశం చేసింది. దీంతో ప్రస్తుత నీటి సంవత్సరంలోనూ ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో లభ్యతగా ఉన్న నీటిలో గతంలో మాదిరిగానే 66 శాతం ఏపీకి, 34 శాతం తెలంగాణకు కృష్ణా బోర్డు పంపిణీ చేయనుంది. కేడబ్ల్యూడీటీ–1 ప్రాజెక్టుల వారీగా చేసిన కేటాయింపుల ఆధారంగా.. ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీలు పంపిణీ చేస్తూ 2015, జూలై 18–19న కేంద్రం తాత్కాలిక సర్దుబాటు చేసింది. ఈ ఒప్పందంపై రెండు రాష్ట్రాలు సంతకం చేశాయి. దీని ప్రకారం 2015–16, 2016–17లో కృష్ణా బోర్డు రెండు రాష్ట్రాలకు జలాలను పంపిణీ చేసింది. ఆ తర్వాత కృష్ణాబోర్డు సమావేశాల్లో.. చిన్న నీటిపారుదలలో వినియోగం, కృష్ణా బేసిన్‌కు మళ్లించే గోదావరి జలాలను మినహాయించి, ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, సాగర్‌లలో లభ్యతగా ఉన్న నీటిలో 66 శాతం ఏపీ, 34 శాతం తెలంగాణ వాడుకునేలా రెండు రాష్ట్రాలు అంగీకారానికి వచ్చాయి. దీంతో 2017–18 నుంచి అదే విధానం ప్రకారం రెండు రాష్ట్రాలకు కృష్ణా బోర్డు నీటిని పంపిణీ చేస్తూ వస్తోంది.

అడ్డం తిరిగిన తెలంగాణ..

ప్రస్తుత నీటి సంవత్సరం ఆరంభంలో జరిగిన కృష్ణా బోర్డు సర్వసభ్య సమావేశంలోనూ అదే విధానం ప్రకారం నీటిని పంపిణీ చేసుకోవడానికి తొలుత అంగీకరించిన తెలంగాణ.. ఆ తర్వాత అడ్డం తిరిగింది. కృష్ణా జలాల్లో సగం వాటా కావాలని పట్టుబట్టడంతో ఈ అంశాన్ని కృష్ణాబోర్డు కేంద్ర జల్‌శక్తి శాఖ దృష్టికి తీసుకెళ్లింది. ఉమ్మడి రాష్ట్రానికి కేడబ్ల్యూడీటీ–2 కేటాయించిన జలాలను.. 2రాష్ట్రాలకు పంపిణీ చేయడంపై ఆ ట్రిబ్యునల్ విచారిస్తుండటాన్ని గుర్తుచేసిన కేంద్ర జల్‌శక్తి శాఖ.. ఆ ట్రిబ్యునల్ అవార్డు అమల్లోకి వచ్చే వరకూ పాత వాటాల ప్రకారమే నీటిని పంపిణీ చేయాలని తేల్చిచెప్పింది.

బాలిక హత్య.. బాబాయే హంతకుడు?

- 3 రోజులుగా కనపడని బాలిక
- పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు
- ఇంటి వెనుక తుప్పల్లో మృతదేహం
- బాలిక బాబాయిపైనే అనుమానం
- ఘటన ప్రాంతాన్ని పరిశీలించిన ఎస్పీ



రత్నకుమారి(ఫైల్)



భీమవరంలో సంఘటన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం : పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణంలో బాలిక హత్య కలకలం రేపింది. సొంత బాబాయే బాలికను హత్య చేసి ఉంటాడని స్థానికులు, పోలీసులు అనుమానిస్తున్నారు. తమ కుమార్తె కనబడటం లేదని పోలీసులను ఆశ్రయించి.. అల్లాడిపోతున్న తల్లిదండ్రులకు వారి ఇంటి వెనుక ఉన్న తుప్పల్లోనే శవమై కనిపించింది. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. భీమవరానికి చెందిన ములుపు అంజి, దుర్గ దంపతులకు ఒక్కగానొక్క కుమార్తె రత్నకుమారి(14). పట్టణంలోని ఓ పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. కూలి పనులు చేసుకునే వారు తమ బిడ్డను చదివించుకుంటున్నారు. వీరి ఇంటివద్దనే బాలిక బాబాయి ములుపు మావుళ్లు నివసిస్తున్నాడు. కొన్ని రోజులుగా రత్నకుమారికి ఆరోగ్యం బాగోకపోవడంతో పాఠశాలకు వెళ్లకుండా ఇంటివద్దనే ఉంటోంది. ఈ నెల 26న రత్నకుమారి తల్లిదండ్రులు యథావిధిగా పనులకు వెళ్లారు. సాయంత్రం ఇంటికొచ్చే సరికి కుమార్తె లేదు. చుట్టుపక్కల వారిని ఆరా తీసినా ఆమె జాడ తెలియలేదు. దీంతో కంగారుపడిన తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలిక తండ్రితో పాటు మావుళ్లు కూడా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. దిశ పోలీసులకు తన ఫోన్ నుంచి ఫిర్యాదు కూడా చేశాడు. మావుళ్లు సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తుండగా అతని భార్య కువైట్‌లో ఉంది. అతని ఇద్దరు పిల్లలు నరసాపురంలోని హాస్టల్లో ఉంటున్నారు. రెండు రోజులుగా అతని ప్రవర్తన పట్ల అనుమానం రావడంతో కొంతమంది యువకులు ప్రత్యేక నిఘా వేశారు. మావుళ్లు వేరొకరి ఇంటి నుంచి పార తేవడంతో అనుమానం మరింత బలపడింది. మూడు రోజులుగా బాలిక ఆచూకీ తెలియకపోవడంతో బాలిక తండ్రి అంజి మరికొంత మందితో కలసి గురువారం ఉదయం ఇంటి వెనుక తుప్పలు, జమ్ముతో ఉన్న ప్రాంతంలో వెతికేందుకు వెళుతుండగా.. అక్కడ ఉండదు.. అటు వెళ్లొద్దంటూ మావుళ్లు అడ్డుకునే ప్రయత్నం చేశాడు. అయినప్పటికీ వారు వెళ్లి చూడగా బాలిక మృతదేహం కనిపించింది. బాలికను బాబాయే ఇంట్లో చంపేసి ఆ తర్వాత మృతదేహాన్ని తుప్పల్లో పడేసి ఉంటాడని భావిస్తున్నారు. పోలీసుల విచారణలో నిజానిజాలు తేలాల్సి ఉంది. పోస్టుమార్టం అనంతరం మరిన్ని వివరాలు తెలిసే అవకాశముందని స్థానికులు భావిస్తున్నారు. కాగా, బాలిక మృతదేహం లభించిన ప్రాంతాన్ని ఎస్పీ రవిప్రకాష్ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపి సమగ్రంగా విచారించాలని ఆదేశించారు. అనుమానితుడు మావుళ్లును అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు.

ఏపీఎన్‌ఆర్‌టీఎస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

అబుదాబిలో సదస్సులో వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్



అబుదాబిలోని పాస్టర్ల సమావేశంలో ఏపీఎన్‌ఆర్‌టీఎస్ బీమా పత్రాలను చూపుతున్న నాయకులు

కడప కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్గనిర్దేశం ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రవాసాంధ్రుల కోసం ఏపీఎన్‌ఆర్‌టీఎస్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్ అన్నారు. అబుదాబిలో గురువారం ప్రముఖ పారిశ్రామికవేత్త మైనర్ బాబు ఆధ్వర్యంలో అబుదాబి ఐక్య తెలుగు క్రైస్తవ సంఘాల పాస్టర్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇలియాస్ మాట్లాడుతూ కరోనా సమయంలో వివిధ దేశాల్లో ఉన్న వేలాది మంది తెలుగువారిని స్వదేశానికి తీసుకువచ్చేందుకు ఏపీఎన్‌ఆర్‌టీఎస్ ద్వారా కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి, అధికారులతో మాట్లాడి వెసులుబాటు కల్పించినట్లు గుర్తుచేశారు. ఉక్రెయిన్, రష్యా యుద్ధ సమయంలో 918మంది, సుడాన్‌లో అంతర్యుద్ధం సమయంలో 99 మంది తెలుగు విద్యార్థులను సురక్షితంగా స్వదేశానికి చేర్చామని వివరించారు. ఏపీ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు వినీత మాట్లాడుతూ దివంగత వైఎస్సార్ ఆశయ సాధనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, అన్ని రంగాల్లో మహిళలకు 50% రిజర్వేషన్ కల్పించారన్నారు. ఏపీఎన్‌ఆర్‌టీఎస్ యూఏఈ రీజనల్ కోఆర్డినేటర్ ప్రసన్న సోమిరెడ్డి, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సయ్యద్ అక్రం మాట్లాడుతూ ఏపీఎన్‌ఆర్‌టీఎస్ ప్రవాసాంధ్ర భరోసా బీమాను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల అధ్యక్షుడు ఫాదర్ శిశిర కుమార్, ఉపాధ్యక్షులు ఫాదర్ అగ్రిపా రాజుతో పాటు నాయకులు జాఫర్ వలీ, రెడ్డెయ్యరెడ్డి, మోహన్, సయ్యద్ నాసర్, ఆనంద్, అబ్దుల్లా, అరుణ్, ఆశీర్వాదం, సంపత్ పాల్గొన్నారు.

రేపు విశాఖకు స్వరూపానందేంద్ర రాక



స్వరూపానందేంద్రకు పూజ చేస్తున్న స్వాత్మానందేంద్ర


సింహాచలం: చాతుర్మాస్య దీక్ష కోసం ఉత్తరాఖండ్ రాష్ట్రం రుషికేష్ వెళ్లిన విశాఖ శ్రీ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి తిరిగి శనివారం విశాఖకు రానున్నారు. చాతుర్మాస్య దీక్ష శుక్రవారంతో ముగియనుండటంతో రుషికేష్ నుంచి ఢిల్లీ వెళ్లి అక్కడి నుంచి విశాఖ చేరుకుంటారు. 30వతేదీ సాయంత్రం 4 గంటలకు స్వామీజీ విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా చినముషిడివాడలోని శారదాపీఠానికి చేరుకుంటారు. కాగా, స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర సరస్వతి చాతుర్మాస్య దీక్ష కోసం జూన్ 21న రుషికేష్ వెళ్లారు. జూలై 3 నుంచి దీక్ష ప్రారంభించారు. దీక్షా కాలంలో ఉపనిషత్తులపై శిష్యులకు పాఠాలను బోధించారు. ఆది శంకరాచార్యుల వారి శంకరభాష్యంపై అధ్యయనం చేస్తూ వేదాంత చింతనతో కాలం గడిపారు. హిమాలయ పాదప్రక్షంతంలో సంచరిస్తూ రుషులు, సాధు పుంగవులతో ఆధ్యాత్మిక అంశాలపై చర్చించారు. స్వరూపానందేంద్ర స్వామికి స్వాత్మానందేంద్రతో పాటు శిష్యులు పాదపూజ చేశారు. రుషికేష్, హరిద్వార్ పుణ్యధామాల్లో సాధువులు, వేద, సంస్కృత విద్యార్థులకు భండారా(అన్నప్రసాద వితరణ)నిర్వహించారు. గంగా తీరంలో హైందవ ధర్మప్రచారం సాగిస్తోన్న అనేక ఆశ్రమాలను సందర్శించి నిర్వాహకులను అభినందించారు.

ఆకలి లేని సమాజమే ఆయన కల

దేశంలో హరిత విప్లవానికి బాటలు వేసిన ఎం.ఎస్.స్వామినాథన్

గోధుమ, వరి వంగడాల అభివృద్ధితో వ్యవసాయ రంగానికి ఎనలేని మేలు

సుస్థిర ఆహార భద్రతలో ప్రపంచ నాయకుడిగా గుర్తింపు



దేశానికి స్వాతంత్య్రం వచ్చిన(1947) తర్వాత దేశంలో వ్యవసాయ రంగం నిస్తేజంగా మారింది. బ్రిటిష్ వలస పాలనలో ఈ రంగంలో అభివృద్ధి నిలిచిపోయింది. వనరులు లేవు, ఆధునిక విధానాలు లేవు. తిండి గింజలకు కటకటలాడే పరిస్థితి. గోధుమలు, బియ్యం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటే తప్ప ప్రజలకు నాలుగు మెతుకులు అందించలేని దురవస్థ ఉండేది. ఇలాంటి తరుణంలో స్వామినాథన్ రంగ ప్రవేశం చేశారు. హరిత విప్లవానికి బీజం చేశారు. మొదట పంజాబ్, హరియాణా, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో ఆహార ధాన్యాల ఉత్పత్తిని పెంచడంపై దృష్టి పెట్టారు. రైతులకు నాణ్యమైన, అధిక దిగుబడినిచ్చే వంగడాలు సరఫరా చేశారు. ప్రభుత్వ సాయంతో తగిన సాగునీటి వసతులు కల్పించారు. ఎరువులు అందించారు. కొద్ది కాలంలోనే సత్ఫలితాలు రావడం మొదలైంది. 1947లో దేశంలో గోధుమల ఉత్పత్తి ఏటా 60 లక్షల టన్నులు ఉండేది. 1962 నాటికి అది కోటి టన్నులకు చేరింది. 1964 నుంచి 1968 దాకా వార్షిక గోధుమల ఉత్పత్తి కోటి టన్నుల నుంచి 1.70 కోట్ల టన్నులకు ఎగబాకింది. దాంతో దేశ ప్రజల్లో ఆత్మవిశ్వాసం ఇనుమడించింది. మనకు అవసరమైన ఆహారాన్ని మనమే పండించుకోగలమన్న నమ్మకం పెరిగింది. గోధుమల తర్వాత స్వామినాథన్ నూతన వరి వంగడాలపై తన పరిశోధనలను కేంద్రీకరించారు. అమెరికాతోపాటు ఐరోపా దేశాల్లో విద్యాసంస్థలతో కలిసి పనిచేశారు. 1954లో కటక్‌లోని సెంట్రల్ రైస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరారు. నూతన వరి వంగడాలను సృష్టించారు. దేశీయ రకాలను సంకరీకరించి, కొత్త వంగడాలను అభివృద్ధి చేశారు. స్వామినాథన్ పలువురు మాజీ ప్రధానమంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కలిసి పనిచేశారు. హరిత విప్లవాన్ని విజయవంతం చేయడానికి శ్రమించారు. గోధుమ వంగడాల అభివృద్ధి కోసం ప్రముఖ అమెరికా శాస్త్రవేత్త నార్మన్ బోర్లాగ్‌తోనూ స్వామినాథన్ కలిసి పనిచేశారు. సుస్థిర ఆహార భద్రత విషయంలో ప్రపంచ నాయకుడిగా గుర్తింపు పొందారు.

సివిల్ సర్వీసు వదులుకొని వ్యవసాయం వైపు..

మాన్‌కోంబు సాంబశివన్ స్వామినాథ్ 1925 ఆగస్టు 7న తమిళనాడు రాష్ట్రంలో కావేరి డెల్టా ప్రాంతంలోని కుంభకోణం పట్టణంలో జన్మించారు. ఆయన తండ్రి డాక్టర్ ఎం.కె.సాంబశివన్ వైద్యుడు. తల్లి పార్వతీ తంగమ్మల్ గృహిణి. 11వ ఏట తండ్రిని కోల్పోయారు. తన మామయ్య సంరక్షణలో పెరిగిన స్వామినాథన్ కుంభకోణంలో మెట్రిక్యులేషన్, త్రివేండ్రంలో జంతుశాస్త్రంలో డిగ్రీ చేశారు. తర్వాత కోయంబత్తూరు అగ్రికల్చరల్ కాలేజీ నుంచి అండర్‌గ్రాడ్యుయేట్ డిగ్రీ సాధించారు. ఢిల్లీలోని భారత వ్యవసాయ పరిశోధన సంస్థలో పీజీ పూర్తి చేశారు. యునెస్కో ఫెలోషిప్‌తో నెదర్లాండ్స్‌లోని అగ్రికల్చరల్ యూనివర్సిటీలో చేరి, బంగాళదుంప జన్యు పరిణామంపై అధ్యయనం చేశారు. వ్యవసాయ శాస్త్రవేత్తగా, జన్యు శాస్త్రవేత్తగా ఎదిగి, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో చేరారు. స్వామినాథన్ తొలుత సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. కానీ, తండ్రి బాటలో వైద్య వృత్తిలో అడుగుపెట్టాలని భావించారు. అయితే, అప్పట్లో ఆకలి చావులను చలించిపోయారు. వ్యవసాయ పరిశోధనా రంగంలో అడుగుపెట్టారు. ఆకలి లేని సమాజాన్ని కలగన్నారు. ప్రజల ఆకలి తీర్చడమే కాదు, పౌష్టికాహారం అందించాలని సంకల్పించారు.

కరువు పరిస్థితులు చూసి..

వ్యవసాయ రంగాన్ని ఎంచుకోవడానికి కారణాలను స్వామినాథన్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. '1942–43లో బెంగాల్‌లో భయంకరమైన కరువు సంభవించింది. తిండి లేక దాదాపు 30 లక్షల మంది చనిపోయారు. దేశం కోసం నేనేమీ చేయలేనా? అని ఆలోచించా. ప్రజల ఆకలి బాధలు తీర్చాలంటే వ్యవసాయ రంగమే సరైందని నిర్ణయానికొచ్చా. మెడికల్ కాలేజీకి వెళ్లడానికి బదులు కోయంబత్తూరులో వ్యవసాయ కళాశాలలకు చేరిపోయా. వ్యవసాయ పరిశోధనలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టా. ఎక్కువ మందికి ఆహారం అందించాలంటే అధిక దిగుబడినిచ్చే వంగడాలు కావాలి. అందుకే జెనెటిక్స్, బ్రీడింగ్‌పై పరిశోధనలు చేశా. కరువు పరిస్థితులను తట్టుకొని అధిక దిగుబడినిచ్చే గోధుమ, వరి వంగడాలను సృష్టించా. వీటితో రైతులు లాభం పొందారు. ప్రజలకు తగినంత ఆహారం దొరికింది' అని స్వామినాథన్ పేర్కొన్నారు.

కనీస మద్దతు ధరపై కీలక సిఫార్సు

స్వామినాథన్ 2004 నుంచి 2006 దాకా 'నేషనల్ కమిషన్ ఆన్ ఫార్మర్స్' అధినేతగా వ్యవహరించారు. పంటలకు కనీస మద్దతు ధరపై ప్రభుత్వానికి విలువైన ప్రతిపాదనలు చేశారు. పంటల ఉత్పత్తి వ్యయం కంటే కనీసం 50 శాతాన్ని కనీస మద్దతు ధరగా నిర్ణయించాలని సూచించారు.

ఎన్నో పదవులు

కొంతకాలం కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో పనిచేసిన స్వామినాథన్ 1954లో మళ్లీ భారత్‌లో అడుగు పెట్టారు. ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో శాస్త్రవేత్తగా పరిశోధనలపై దృష్టి పెట్టారు. 1972–79లో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్‌గా వ్యవహరించారు. 1979లో కేంద్ర ప్రభుత్వం ఆయనను వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శిగా నియమించింది. 2007 నుంచి 2013 దాకా రాజ్యసభలో నామినేటెడ్ ఎంపీగా సేవలను అందించారు. స్వామినాథన్ దేశ విదేశాల్లో ఎన్నో ప్రఖ్యాత సంస్థలకు నాయకత్వం వహించారు.

- 1981 నుంచి 1985 దాకా ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ ఆర్గనైజేషన్ కౌన్సిల్ స్వతంత్ర చైర్మన్
- 1984 నుంచి 1990 దాకా ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ ద కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ అండ్ నేచురల్ రిసోర్సెస్ అధ్యక్షుడు
- 1982 నుంచి 1988 దాకా ఫిలిప్పీన్స్‌లోని ఇంటర్నేషనల్ రైస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ జనరల్
- 1989 నుంచి 1996 దాకా వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్(ఇండియా) అధ్యక్షుడు
- ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్) డైరెక్టర్ జనరల్



వరించిన అవార్డులు

- 1967లో పద్మశ్రీ
- 1971లో రామన్ మెగసెసే
- 1972లో పద్మభూషణ్
- 1987లో వరల్డ్ ఫుడ్ ప్రైజ్
- 1989లో పద్మవిభూషణ్
- ప్రపంచవ్యాప్తంగా వివిధ యూనివర్సిటీల నుంచి 84 గౌరవ డాక్టరేట్లు

నేల సారాన్ని కాపాడుకోకపోతే ఎడారే

హరిత విప్లవం వల్ల లాభాలే కాదు, నష్టాలూ ఉన్నాయన్న విమర్శలు వెల్లువెత్తాయి. నూతన వంగడాలతో సంపన్న రైతులకే లబ్ధి చేకూరుతోందన్న వాదనలు వినిపించాయి. వీటితో నేల సారం దెబ్బతింటోందని, సంప్రదాయ దేశీయ వంగడాలు కనుమరుగైపోతున్నాయని నిపుణులు హెచ్చరించారు. పురుగు మందులు, ఎరువుల వాడకం మితిమీరుతుండడంపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి. హరిత విప్లవం ప్రతికూలతలను స్వామినాథన్ 1968లోనే గుర్తించారు. ఆధునిక వంగడాలతోపాటు సంప్రదాయ వంగడాల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని రైతులకు సూచించారు. నేల సారాన్ని కాపాడుకోకుండా విచ్చలవిడిగా పంటలు సాగుచేస్తే పొలాలు ఎడారులవుతాయని చెప్పారు. రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకంపై నియంత్రణ ఉండాలన్నారు. అంతేకాకుండా భూగర్భ జలాల పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

70 శాతానికిపైగా భూభాగంలో కరువు పరిస్థితులు

భారత్‌లో వాతావరణ పరిస్థితిపై 'డౌన్ టు ఎర్త్' సంస్థ విశ్లేషణ



న్యూఢిల్లీ: భారత్‌లోని 718 జిల్లాలకుగాను 500కుపైగా జిల్లాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయని డౌన్ టు ఎర్త్ అనే సంస్థ అంచనావేసింది. భారత్‌లో పర్యావరణ సంబంధ రాజకీయాలు, అభివృద్ధిపై ఈ సంస్థ పరిశోధన చేస్తోంది. భారత్‌లో ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై డౌన్ టు ఎర్త్ సంస్థ ఒక నివేదిక విడుదలచేసింది. నివేదిక ప్రకారం..

- 718 జిల్లాలకుగాను 500 జిల్లాల్లో అంటే 70శాతానికిపైగా భూభాగంలో కరువు పరిస్థితులు తాండవిస్తున్నాయి.
- ఈశాన్య భారతం, తూర్పుభారతంలో కొన్ని ప్రాంతాలు, జమ్మూ కశ్మీర్‌తోపాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ కోస్తాతీరం సహా దక్షిణ భారతంలోని చాలా ప్రాంతాల్లో మధ్యస్థ/తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయి.
- 'ఈసారి రుతుపవనకాలంలో ఆగస్టులో ప్రతి రోజూ కురవాల్సిన వర్షాలు ఆగి ఆగి కొద్దిరోజులు విరామాలు ఇస్తూ పడ్డాయి. ఇలా 'బ్రేక్'లు ఇస్తూ పడిన వర్షాలే భారత్‌లో కరువుకు 70 శాతం కారణం' అని కేంద్ర భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి మాధవన్ రాజీవన్ చెప్పారు.
- 53 శాతం జిల్లాల్లో మధ్యస్థ కరువు పరిస్థితులు ఉన్నాయి.
- ఈ ఏడాది ఆగస్టులో ఎక్కువ రోజులు వర్షాలు పడనేలేదు. ఏడో తేదీ నుంచి 18వ తేదీ వరకు పొడి వాతావరణం నెలకొంది. ఈనెలలో ఇన్ని రోజులపాటు వర్షాలు లేకపోవడం అనేది 21వ శతాబ్దిలో మూడో అతిపెద్ద విరామంగా రికార్డులకెక్కింది. గత 123 సంవత్సరాల చరిత్రలో ఆగస్టులో ఇంతటి పొడివాతావరణం నెలకొనడమూ ఇదే తొలిసారి.
- '2022 ఏడాదిలో పోలిస్తే 2023లో సాగు విస్తీర్ణం 33 శాతం పెరిగినా.. తగ్గిన వర్షాల కారణంగా దిగుబడి పెరుగుతుందో, తగ్గుతుందో చెప్పలేని పరిస్థితి' అని క్రాప్ వెదర్ వాచ్ గ్రూప్ పేర్కొంది.
- ప్రతిఏటా 'సాధారణ వర్షపాతం' కేటగిరీ కింద ఉండే దాదాపు 20 రాష్ట్రాల్లో ఈసారి సగటు కంటే తక్కువ వర్షపాతం నమోదవడం గమనార్హం.
- 1971–2020 సుదీర్ఘకాలం నుంచి చూస్తే ఈసారి వర్షపాతంలో లోటు ఐదు శాతం కనిపిస్తోంది.

భారతీయులకు 10 లక్షల వీసాల జారీ

- ఈ ఏడాది లక్ష్యాన్ని ఇప్పటికే సాధించామన్న అమెరికా ఎంబసీ
- రంజు సింగ్‌కు 10 లక్షలవ వీసా అందజేసిన రాయబారి గార్సెట్టి
- అమెరికా వీసా దరఖాస్తుల్లో 10% భారతీయులవేనని వెల్లడి



రంజు సింగ్

న్యూఢిల్లీ: భారత్‌లో 2023లో 10 లక్షల నాన్ ఇమిగ్రంట్ వీసాలను జారీ చేయాలన్న లక్ష్యాన్ని అధిగమించినట్లు అమెరికా ఎంబసీ తెలిపింది. ఇదే ఒరవడిని ఇకపైనా కొనసాగిస్తామని ప్రకటించింది. మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ)లో తమ కుమారుడి స్నాతకోత్సవానికి హాజరవుతున్న పునీత్ దర్గన్, డాక్టర్ రంజుసింగ్ దంపతులకు 10 లక్షలవ వీసాను గురువారం భారత్‌లో తమ రాయబారి గార్సెట్టి అందజేశారని వెల్లడించింది. లేడీ హార్డింజ్ కాలేజీలో సీనియర్ కన్సల్టెంట్ అయిన డాక్టర్ రంజు సింగ్‌కు 10 లక్షలవ వీసా, ఆమె భర్త పునీత్ దర్గన్‌కు ఆ తర్వాతి వీసా జారీ అయ్యాయని వివరించింది. ప్రపంచదేశాల నుంచి అమెరికాకు అందే మొత్తం వీసా దరఖాస్తుల్లో 10 శాతం భారత్ నుంచే అని ఎంబసీ ప్రకటించింది. మొత్తం విద్యార్థి వీసాల్లో 20 శాతం, హెచ్ అండ్ ఎల్ కేటగిరీ(ఉద్యోగాలు)లో 65 శాతం భారతీయులవేనని కూడా తెలిపింది. 2019 కోవిడ్‌కి ముందు కంటే ఈసారి 20 శాతం ఎక్కువగా వీసాలను జారీ చేసినట్లు పేర్కొంది. గత ఏడాది 12 లక్షల మంది భారతీయులు అమెరికాను సందర్శించారని పేర్కొంది. కోవిడ్ కారణంగా వీసాల జారీ ప్రక్రియ నిలిచిపోవడంతో తలెత్తిన డిమాండ్‌ను అధిగమించేందుకు చెన్నై కాన్సులేట్‌లో అదనపు సిబ్బంది నియామకం, హైదరాబాద్‌లో విశాలమైన భవనంలో నూతన కాన్సులేట్‌ను ఏర్పాటు చేయడం వంటి చర్యల ద్వారా వీసాల జారీ ప్రక్రియను వేగవంతం చేయగలిగామని వివరించింది.

క్లుప్తంగా...

కమి రితా షెర్పా రికార్డు



కఠ్మాండు: నేపాలీ పర్వతారోహకుడు కమి రితా షెర్పా(53) సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పారు. ఎనిమిది వేల మీటర్లపైబడి ఎత్తయిన పర్వత శిఖరాలను 42సార్లు అధిరోహించిన ఘనతను ఆయన సాధించారు. 8 వేల మీటర్లకంటే మించి ఎత్తయిన శిఖరాలను 41 పర్యాయాలు అధిరోహించిన మరో ప్రముఖ నేపాలీ పర్వతారోహకుడు నిమ్స్ పుర్జా పేరిట ఉన్న రికార్డును తాజాగా కమి రితా బద్దలు కొట్టారు. ప్రపంచంలోని ఎనిమిదో ఎత్తయిన మౌంట్ మనస్లును మంగళవారం ఉదయం కమి రితా షెర్పా అధిరోహించారని సెవెన్ సమిట్ ట్రెక్స్ అనే పర్వతారోహక సంస్థ తెలిపింది. ప్రపంచంలోనే ఎత్తయిన ఎవరెస్ట్ శిఖరాన్ని కమి రితా 1994లో మొదటిసారి అధిరోహించారు. అది మొదలు ఇప్పటిదాకా 28 సార్లు ఎక్కారు.

కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య

కోటా(రాజస్తాన్): పోటీ పరీక్షల శిక్షణకు నిలయమైన రాజస్తాన్‌లోని కోటాలో మరో యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. యూపీలోని మహరాజ్‌గంజ్‌కు చెందిన తన్వీర్ ఖాన్(20) తాముంటున్న ఇంట్లో బుధవారం ఉరేసుకుని తనువు చాలించాడని పోలీసులు తెలిపారు. మృతికి కారణంపై దర్యాప్తు చేపట్టామని, ఎటువంటి సూసైడ్ లేఖ దొరకలేదన్నారు. తన్వీర్ తండ్రి, సోదరితోపాటు కృష్ణ విహార్ కాలనీలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. ఇంటర్ పూర్తి చేసిన తన్వీర్‌కు ఇటీవల ఓ ప్రైవేట్ కంపెనీ నుంచి జాబ్ ఆఫర్ కూడా వచ్చింది. ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రిపేర్ కావాలన్న తండ్రి సూచన మేరకు ఇంట్లో ఉండే చదువుకుంటున్నాడు. అతడి తండ్రి ఓ కోచింగ్ సెంటర్‌లో కెమిస్ట్రీ బోధిస్తుంటారు. తాజాగా, తన్వీర్ మరణంతో కోటాలో ఈ ఏడాదిలో ఇప్పటి వరకు ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థుల సంఖ్య 27కు చేరుకుంది.

బిధూరి వివాదం కమిటీకి

న్యూఢిల్లీ: బీఎస్పీ లోక్‌సభ సభ్యుడు డానిష్ అలీపై బీజేపీ ఎంపీ రమేశ్ బిధూరి వివాదాస్పద వ్యాఖ్యల వ్యవహారాన్ని పార్లమెంట్ హక్కుల కమిటీకి అప్పగించినట్లు స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. డానిష్ అలీని అవమానించిన బీజేపీ ఎంపీ బిధూరిపై చర్యలు తీసుకోవాలంటూ కాంగ్రెస్, డీఎంకే తదితర ప్రతిపక్షాలతోపాటు బీజేపీకి చెందిన నిశికాంత్ దుబే వంటి వారు సైతం స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. స్పీకర్ ఓం బిర్లా ఈ ఫిర్యాదులన్నిటినీ బీజేపీ ఎంపీ సునిల్ కుమార్ సింగ్ సారథ్యంలోని హక్కుల కమిటీకి పంపినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

ఎం.ఎస్. స్వామినాథన్ కన్నుమూత

మొదటి పేజీ తరువాయి

మృతిచెందారు. భారత్‌లో 1960వ దశకం నుంచి హరిత విప్లవానికి బాటలు వేసి, ఆహారం, పౌష్టికాహార భద్రత కోసం అలుపెరుగని కృషి చేసిన స్వామినాథన్‌ను ప్రతిష్టాత్మక పద్మవిభూషణ్, రామన్ మెగసెసే, మొట్టమొదటి వరల్డ్ ఫుడ్ ప్రైజ్ సహా ఎన్నెన్నో జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు వరించాయి. స్వామినాథన్ పార్థివదేహాన్ని చెన్నై తేనాంపేట రత్నానగర్‌లో ఉన్న నివాసం నుంచి గురువారం రాత్రి తరమణిలోని ఎం.ఎస్.స్వామినాథన్ ఫౌండేషన్‌కు తరలించారు. శుక్రవారం అప్తులు, ప్రముఖుల సందర్శనార్థం పార్థివ దేహాన్ని ఇక్కడే ఉంచుతారు. విదేశాల్లో ఉన్న కుమార్తె చెన్నైకి రావాల్సి ఉండడంతో శనివారం స్వామినాథన్ అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు సన్నిహితులు చెప్పారు.

ప్రధాని మోదీ దిగ్భ్రాంతి

ఎం.ఎస్.స్వామినాథన్ మృతిపట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహా పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. దేశానికి ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. మానవాళి కోసం భద్రమైన, ఆకలికి తావులేని భవిష్యత్తును అందించే దిశగా ప్రపంచాన్ని నడిపించడానికి మార్గదర్శిగా పనిచేశారని స్వామినాథన్‌పై రాష్ట్రపతి ముర్ము ప్రశంసల వర్షం కురిపించారు. స్వామినాథన్ మరణం తనకు తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. మన దేశం సంక్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఆయన హరిత విప్లవానికి నాంది పలికారని, కోట్లాది మంది ఆకలి తీర్చారని, దేశంలో ఆహార భద్రతకు పునాది వేశారని కొనియాడారు. వ్యవసాయ రంగంలో స్వామినాథన్ కృషితో కోట్లాది మంది జీవితాలు మారాయని మోదీ గుర్తుచేశారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు గురువారం స్వామినాథన్ పార్థివదేహానికి అంజలి ఘటించారు. ఆయన మరణం దేశానికి, రైతు ప్రపంచానికి తీరని లోటు అని పేర్కొన్నారు. స్వామినాథన్ మరణం పట్ల తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి, ముఖ్యమంత్రి స్టాలిన్, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మాజీ ప్రధానమంత్రి హెచ్.డి.దేవెగౌడ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్, భారతీయ కిసాన్ యూనియన్ నాయకుడు రాకేశ్ తికాయత్ తదితరులు సంతాపం ప్రకటించారు.



ఢిల్లీలోని కీర్తినగర్ ఫర్నీచర్ మార్కెట్‌లో వడ్రంగి పని చేస్తున్న రాహుల్

వడ్రంగులతో రాహుల్ భేటీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఎంపీ రాహుల్ గాంధీ గురువారం ఢిల్లీలోని కీర్తినగర్ ఫర్నీచర్ మార్కెట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వడ్రంగులతో సమావేశమయ్యారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారితో కలిసి కొన్ని రకాల కలప సామాగ్రిని తయారు చేసేందుకు ప్రయత్నించారు. వడ్రంగులు కుటుంబ పోషణ కోసం కష్టపడి పని చేస్తున్నారని, వారిలో గొప్ప కళా నైపుణ్యం ఉందని రాహుల్ ప్రశంసించారు. అందమైన కలప సామాగ్రి తయారు చేస్తున్నారని తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు. వారి నుంచి నైపుణ్యాలు నేర్చుకొనేందుకు తాను ప్రయత్నించానని, కొంతవరకు సఫలమయ్యానని పేర్కొన్నారు. భారత్ జోడో యాత్ర కొనసాగుతూనే ఉందని స్పష్టం చేశారు.

కోలుకుంటున్న 'ఉజ్జయిని' బాలిక

ఉజ్జయిని: మధ్యప్రదేశ్‌లో అత్యాచారానికి గురై అర్ధనగ్నంగా, రక్తమోడుతూ ఉజ్జయిని వీధుల్లో సాయం కోరుతూ తిరుగాడిన బాలిక కోలుకుంటోంది. ఇండోర్‌లోని మహారాజా టుకోజీరావ్ హోల్కార్ మహిళా ఆస్పత్రిలో వైద్య నిపుణుల బృందం ఆమెకు వైద్య చికిత్సలు అందిస్తోంది. పేరు, వయస్సు, చిరునామా వంటి వివరాలను చెప్పలేకపోతోందని, అయితే ఆమెది సత్నా జిల్లా అని తెలుస్తోందని కౌన్సిలింగ్ నిపుణులు గురువారం తెలిపారు. బాధిత బాలిక పరిస్థితి కొద్దికొద్దిగా మెరుగవుతోందని బాలల హక్కుల పరిరక్షణ జాతీయ కమిషన్ సభ్యురాలు డాక్టర్ దివ్యా గుప్తా తెలిపారు. ఈ అంశంపై రాజకీయ పార్టీల నేతలు సున్నితత్వం ప్రదర్శించాలని, బాధిత బాలిక చికిత్స పొందే ఆస్పత్రి వద్ద గుమికూడడం వంటివి చేయరాదని బాలల హక్కుల పరిరక్షణ జాతీయ కమిషన్ చైర్‌పర్సన్ ప్రియాంక్ కనూంగో కోరారు. కాగా, ఈ ఘటనకు సంబంధించి భరత్ సోని అనే రిక్షావాలాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. క్రైమ్ సీన్ రిక్రియేషన్ కోసం జీవన్ ఖేది ప్రాంతానికి గురువారం పోలీసులు తీసుకెళ్లగా పారిపోయే ప్రయత్నంలో గాయపడ్డాడు. పన్నెండేళ్ల బాలిక అర్ధనగ్నంగా, రక్తమోడుతూ ఉజ్జయిని వీధుల్లో రెండున్నర గంటలపాటు సాయం కోరుతూ ఇల్లిల్లూ తిరిగినా పట్టించుకోకపోవడం అమానవీయమని ఎస్పీ సచిన్ శర్మ అన్నారు. 'నా వెనుక ఎవరో వస్తున్నారు. నేను ప్రమాదంలో ఉన్నాను'అని ప్రాధేయపడిందే తప్ప ఆమె డబ్బులు అడగలేదన్నారు. 'కొందరు ఛీత్కరించినా, కొందరు రూ.50, రూ.100 వరకు ఇచ్చారు. అదేదారిలో ఉన్న టోల్‌ప్లాజా సిబ్బంది కొంత డబ్బు, బట్టలు ఇచ్చారు. చివరికి ఆశ్రమంలో ఆశ్రయం పొందింది. వారామెను దగ్గరకు తీసి, మాకు సమాచారం అందించారు'అని ఎస్పీ వివరించారు..

నిరసనలతో దద్దరిల్లిన ఇంఫాల్

- డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో విధ్వంసం
- రెండు వాహనాలకు ఆందోళనకారులు నిప్పు

ఇంఫాల్: మణిపూర్‌లో యువ జంట హత్యతో మొదలైన నిరసనలు గురువారం సైతం కొనసాగాయి. ఆందోళనకారులు ఇంఫాల్ వెస్ట్‌లోని డిప్యూటీ కమిషనర్ కార్యాలయంపై దాడికి దిగారు. అక్కడున్న రెండు కార్లకు నిప్పుపెట్టారు. సీఆర్‌పీఎఫ్ బలగాలు పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. బుధవారం రాత్రి పలు చోట్ల నిరసనకారులు భద్రతా బలగాలపై దాడులకు దిగారు. దీంతో, బలగాలు టియర్ గ్యాస్‌ను ప్రయోగించాల్సి వచ్చిందని అధికారులు చెప్పారు. పోలీసు వాహనానికి నిప్పుపెట్టడంతోపాటు పోలీసు వద్ద ఉన్న ఆయుధాన్ని లాక్కెళ్లారు. థౌబల్ జిల్లా ఖొంగ్‌జమ్‌లో బీజేపీ కార్యాలయానికి దుండగులు నిప్పుపెట్టారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో అధికారులు ఇంఫాల్ ఈస్ట్, వెస్ట్ ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించారు. గురువారం రాత్రి సీఎం బిరేన్ సింగ్ పూర్వీకుల ఇంటిపై దాడికి జరిగిన ప్రయత్నాన్ని పోలీసులు వమ్ము చేశారు.

మా వాళ్ల మృతదేహాలు ఎక్కడున్నాయో గుర్తించండి

దుండగుల చేతుల్లో దారుణ హత్యకు గురైన తమ పిల్లల మృతదేహాల జాడ చెబితే అంత్యక్రియలు జరుపుకుంటామని వారి తల్లిదండ్రులు పోలీసులను కోరారు. మెయితీ వర్గానికి చెందిన యువతి, యువకుడు జూన్‌లో గుర్తు తెలియని దుండగుల చేతుల్లో హత్యకు గురి కావడం, వారి ఫొటోలు ఇటీవల సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షం కావడం తెలిసిందే. ఈ హత్య ఘటన మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్తతలకు కారణమైంది. మెయితీల ఆచారం ప్రకారం..అంతిమ సంస్కారాలు జరపడానికి మృతులు ధరించిన దుస్తులకు సంబంధించిన చిన్న గుడ్డ ముక్కయినా ఉండాలి. అంత్యక్రియలు జరిపేవరకు వారి ఫొటోల వద్ద మృతుల తల్లులు అగరొత్తులు, క్యాండిల్ వెలిగిస్తూ రోజూ ఆహారం నివేదన చేస్తూ ఉండాలి. వారి లేని లోటు ఎవ్వరూ పూడ్చలేరు. కనీసం వారికి తగు గౌరవంతో అంత్యక్రియలు జరపాలనుకుంటున్నామని యువతి తండ్రి హిజామ్ కులజిత్ చెప్పారు. తాజాగా, సీబీఐ దర్యాప్తుతోనయినా తమ కోరిక నెరవేరుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

మణిపూర్‌కు శ్రీనగర్ ఎస్ఎస్‌పీ బల్వాల్ బదిలీ

న్యూఢిల్లీ: ఉగ్ర సంబంధ కేసులను డీల్ చేయడంలో సమర్థుడిగా పేరున్న శ్రీనగర్ సీనియర్ ఎస్పీ రాకేశ్ బల్వాల్‌ను కేంద్రం మణిపూర్‌కు బదిలీ చేసింది. మణిపూర్‌లో మరోసారి హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడం, శాంతిభద్రతలు దారుణంగా దెబ్బతినడంతో కేంద్రం ఈ చర్య తీసుకుంది. 2012 ఐపీఎస్ అధికారి అయిన రాకేశ్ బల్వాల్‌ను డిసెంబర్ 2021లో అరుణాచల్‌ప్రదేశ్, గోవా, మిజోరం, కేంద్రపాలిత ప్రాంతాల కేడర్‌కు మార్చారు. తాజాగా ఆయన్ను మణిపూర్ కేడర్‌కు మారుస్తూ కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన హోం వ్యవహారాల శాఖ ప్రతిపాదనకు నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది. మణిపూర్‌లో ఆయన కొత్త బాధ్యతలను చేపడతారని తెలిపింది. జమ్మూలోని ఉధంపూర్‌కు చెందిన బల్వాల్ మణిపూర్‌లోని చురాచంద్‌పూర్‌కు 2017లో సీనియర్ ఎస్పీగా పనిచేసిన అనుభవం ఉంది.

రూ.18 లక్షల నగదును చెద పురుగులు తినేశాయి



లక్నో: బ్యాంకు లాకర్‌లో దాచిన రూ.18 లక్షల నగదును చెద పురుగులు తినేసిన సంఘటన ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లో జరిగింది. మొరాదాబాద్‌కు చెందిన మహిళ అల్కా పాఠక్ తన కుమార్తె పెళ్లి కోసం పొదుపు చేసిన రూ.18 లక్షల నగదును గత ఏడాది అక్టోబర్‌లో బ్యాంకు ఆఫ్ బరోడా శాఖలోని లాకర్‌లో భద్రపర్చింది. లాకర్ అగ్రిమెంట్‌ను నవీకరించుకోవాలని, కేవైసీ వివరాలు ఇవ్వాలని ఇటీవల బ్యాంకు సిబ్బంది ఆమెకు ఫోన్ చేసి చెప్పారు. అల్కా పాఠక్ బ్యాంకుకు వెళ్లి తన లాకర్‌ను తెరిచి చూసుకోగా, చెత్తాచెదారమే కనిపించింది. నగదును చెదపురుగులు కొరికేసి ముక్క లు ముక్కలు చేశాయి. మొత్తం సొమ్మంతా పనికి రాకుండా పోయింది. ఈ ఘటనపై బ్యాంకు సిబ్బంది స్పందించారు. ఉన్నతాధికారులకు ఈ విషయం తెలియజేశామని అన్నారు. అల్కా పాఠక్‌కు న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. ఆర్‌బీఐ తాజా నిబంధనల ప్రకారం.. బ్యాంకు లాకర్లలో నగదు భద్రపర్చడానికి వీల్లేదు. నగలు, డాక్యుమెంట్లు మాత్రమే భద్రపర్చుకోవాలి.

స్వదేశీ జలాంతర్గామిని తయారుచేసిన తైవాన్



కవోసియంగ్(తైవాన్): తరచూ నావికాదళాలతో తమ వైపు దూసుకొస్తూ కవ్వింపు చర్యలకు పాల్పడే చైనాను అడ్డుకునేందుకు తైవాన్ తొలిసారిగా జలాంతర్గామిని తయారుచేసుకుంది. ప్రస్తుతం ఈ సబ్‌మెరైన్ పరీక్ష దశలో ఉంది. పరీక్షల్లో విజయవంతమై తైవాన్ అమ్ములపొదిలో చేరితే ఆ దేశ సైనిక స్థైర్యం మరింత ఇనుమడించనుంది. 'గతంలో దేశీయంగా జలాంతర్గాముల తయారీ అనేది అసాధ్యం. కానీ ఈరోజు స్వదేశీ జలాంతర్గామి మీ కళ్ల ముందు ఉంది' అని నౌకాతయారీకేంద్రంలో నూతన జలాంతర్గామి ఆవిష్కరణ కార్యక్రమంలో తైవాన్ అధ్యక్షురాలు త్సాయి ఇంగ్–వెన్ వ్యాఖ్యానించారు. 'దేశ పరిరక్షణకు ప్రతినబూనిన మా సంకల్పానికి నిలువెత్తు నిదర్శనం ఈ సబ్‌మెరైన్. వ్యూహాలు, యుద్ధతంత్రాల్లో నావికాదళం సన్నద్ధతలో ఇది ముఖ్య పాత్ర పోషిస్తుంది' అని ఆమె అన్నారు. కొత్త జలాంతర్గామికి హైకున్ అని పేరుపెట్టారు. చైనా ప్రాచీనగాథల్లో హైకు అంటే అద్వితీయమైన శక్తులు గలది అని అర్థం. హార్బర్, సముద్ర పరీక్షలు విజయవంతంగా పూర్తయ్యాక నావికాదళానికి అప్పగిస్తారు. 2027 ఏడాదికల్లా రెండు సబ్‌మెరైన్‌లను నిర్మించి దళాలకు ఇవ్వాలని తైవాన్ యోచిస్తోంది. తైవాన్ సమీప సముద్ర జలాల్లో తరచూ నేవీ, ఎయిర్‌ఫోర్స్ యుద్ధవిన్యాసాలు చేస్తూ ఉద్రిక్త పరిస్థితులను కల్పిస్తున్న చైనాకు ఈ పరిణామం మింగుడుపడనిదే.

ట్రాఫిక్‌లో కదిలేలోపే పిజ్జా డెలివరీ వచ్చేసింది

బెంగళూరు: ఉద్యానవనాల నగరంగా, ఐటీకి తలమానికంలా పేరు తెచ్చుకున్న బెంగళూరు తరచూ భారీ ట్రాఫిక్ జామ్‌లతో పరువుమాస్తున్న సంగతి తెల్సిందే. ట్రాఫిక్‌లో కారులో చిక్కుకున్న వారు వెంటనే ఎటూ కదల్లేని పరిస్థితి ఉందని తెలిపే మరో ఘటన తాజాగా బెంగళూరులో వెలుగుచూసింది. దీనికి సంబంధించిన వివరాలను రిషి అనే డిజైన్ ఇంజనీర్ తన 'ఎక్స్' ఖాతాలో షేర్‌చేశారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్ అవుతోంది. బుధవారం రిషి బెంగళూరు అవుటర్ రింగ్ రోడ్డుపై భారీ ట్రాఫిక్‌లో కారులో స్నేహితులతో చిక్కుకుపోయాడు. ఎలాగూ ముందుకు కదిలే అవకాశం లేదనుకుని తినడానికి ఆన్‌లైన్‌లో పిజ్జా ఆర్డర్‌చేశారు. 'నిర్ణీత 30 నిమిషాల డెలివరీ సమయంలోపే మా పిజ్జా మాకు వచ్చేసింది. అద్భుతం. డెలివరీ బాయ్ బైక్ మీద చకచకా ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని ఛేదించుకుంటూ మమ్మల్ని చేరుకున్నాడు' అంటూ రిషి ఆ వీడియోలో ఆనందం వ్యక్తంచేశారు. ఈ వీడియోను ఆన్‌లైన్‌లో ఇప్పటికే లక్షలాది మంది చూసి షేర్‌చేశారు.



దుర్గమ్మ సన్నిధిలో హోం మంత్రి
ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రాష్ట్ర హోం మంత్రి, ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తానేటి వనిత గురువారం ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను దర్శించుకున్నారు.



సుబ్బారాయుడి హుండీ ఆదాయం..
మోపిదేవిలో శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో హుండీ కానుకలను గురువారం లెక్కించారు. రూ.89.52 లక్షల ఆదాయం సమకూరింది. -8లో▸

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


పెడన: బుడగ జంగాలను ఎస్సీలుగా పరిగణిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గురువారం పెడన పట్టణంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

న్యూస్‌రీల్

దుర్గగుడికి విరాళాలు


ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో జరిగే పలు సేవలకు హైదరాబాద్‌కు చెందిన భక్తులు గురువారం విరాళాలు సమర్పించారు. హైదరాబాద్ ఉస్మాన్‌నగర్‌కు చెందిన పెమ్మసాని శ్రీరామ్, శ్రీలత కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ ఈఓ భ్రమరాంబను కలిసి నిత్యాన్నదానానికి రూ.1,01,116, శాశ్వత పూజలకు రూ.80 వేలు, గోసేవకు రూ.9 వేల విరాళాలు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

ఉమ్మడి కృష్ణాజిల్లా రగ్బీ జూనియర్ జట్ల ఎంపిక


మొగల్రాజపురం(విజయవాడతూర్పు): కర్నూలులో అక్టోబర్ ఒకటి రెండు తేదీల్లో జరగనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అంతర్ జిల్లాల జూనియర్ రగ్బీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి కృష్ణాజిల్లా జట్లను ఎంపిక చేశామని కృష్ణాజిల్లా రగ్బీ అసోసియేషన్ కార్యదర్శి ఎన్.చంద్రకళ తెలిపారు. విజయవాడ రూరల్ మండలం నున్న జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జట్ల ఎంపిక గురువారం జరిగింది. ఎంపిక పోటీలకు 55 మంది క్రీడాకారులు ఈ ఎంపికలకు హాజరవగా, ప్రతిభచాటిన వారిని జిల్లా జట్లకు ఎంపిక చేశారు. బాలుర జట్టుకు కె.రాహుల్, ఎల్.మురళి, యు.వెంకటరమణ, పి.యశ్వంత్ కుమార్, బి.హరి సాయిబాబు, ఎం.లక్ష్మీనారాయణ, వై.జిక్రిరెడ్డి, అభిషేక్, టి.రాజమౌళి, జి.అమర్ సుభాష్, ఎం.హర్షిత్ కుమార్, ఎం.దుర్గాప్రసాద్, బాలికల జట్టుకు డి.చిన్ని, జి.గంగాభవాని, ఎస్.కీర్తన, ఓ.సుధారాణి, వై.నందిని, టి.హారిక, వి.గీతాశ్రీ, జి.రమ్య, కె.దివ్య, డి.శరణ్య, ఎ.విద్యారాణి, ఎస్.లిఖిత, టి.శ్రీలత ఎంపికయ్యారని చంద్రకళ తెలిపారు.

నేటి నుంచి ఫార్మకాలజీ జాతీయ సదస్సు
గన్నవరంరూరల్: మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ఏపీ ఫార్మకాలజిస్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 29, 30వ తేదీల్లో జాతీయ సదస్సు జరుగుతుందని మెడికల్ కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ సి.నాగేశ్వరరావు గురువారం తెలిపారు. సెలబ్రేటింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఫార్మకాలజీ అండ్ రీసెర్చ్ అంశంపై ఈ సదస్సు జరుగుతుందని పేర్కొన్నారు. ఫార్మకాలజీలో పురోగతిని చర్చించడానికి, సహకరించడానికి, అభిప్రాయాలను పంచుకోవడానికి ఈ సదస్సు శక్తివంతమైన వేదిక అని తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఫార్మకాలజీ నిపుణులు పాల్గొని ఔషధ భద్రత, కచ్చితమైన ఔషధం, పరిశోధనలో నైతిక పరిగణన వంటి కీలక విషయాలను చర్చిస్తారని వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రంగారావు, హెచ్‌ఓడీ డాక్టర్ సుప్రియ ప్రియంవద పాల్గొన్నారు.


విజయవాడ చేరిన సైకిల్ యాత్ర


గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మత సామరస్యాన్ని చాటడంతో పాటు సైకిల్ తొక్కడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ యువకులు చేపట్టిన సైకిల్ యాత్ర గురువారం విజయవాడకు చేరుకుంది. నగరానికి చెందిన రజక సంఘం అధ్యక్షుడు కందగట్ల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లుట్ల వంశీ, ముదిగొండ గోపాలకృష్ణ, శ్రీనివాసరావు తదితరులు సైకిల్ యాత్రికులకు స్వాగతం పలికారు. తమిళనాడు రాష్ట్రం తంజావూరుకు చెందిన ముగ్గురు యువకులు సైకిల్ యాత్రకు శ్రీకారం చుట్టారు. తంజావూరు నుంచి నేపాల్ వరకు దాదాపు 2500 కిలోమీటర్ల దూరం సైకిల్ యాత్ర చేపట్టాలని మహమ్మద్ ఫయాజ్, సదాం, అబ్దుల్లా ఈనెల 22న యాత్రను ప్రారంభించారు. 45 రోజుల పాటు యాత్ర సాగనుందని పేర్కొన్నారు. సైకిల్ యాత్రికులకు రజక సంఘం ప్రతినిధులు వసతి ఏర్పాటు చేశారు.

మీ హృదయం పదిలమేనా..!

- నంద్యాలలో కొద్ది రోజుల క్రితం తరగతి గదిలో పాఠాలు చెబుతూ 30 ఏళ్ల ఉపాధ్యాయుడు ఆకస్మికంగా గుండెపోటుకు గురయ్యాడు. ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేస్తుండగానే ప్రాణాలు విడిచాడు.
- విజయవాడ చిట్టినగర్‌కు చెందిన పదకొండేళ్ల బాలుడు ఆదివారం వినాయకుడి ఊరేగింపులో ఉత్సాహంగా నృత్యాలు చేశాడు. తిరిగి ఇంటికి చేరుకున్నాక ఆకస్మిక గుండెపోటుతో మృత్యువాత పడ్డాడు. ఇలా వీరిద్దరే కాదు నిత్యం ఏదొక ప్రాంతంలో వయసుతో సంబంధం లేకుండా ఆకస్మిక గుండెపోటు మరణాలు ఇటీవల కాలంలో తరచూ చోటు చేసుకుంటున్నాయి. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. సెప్టెంబర్ 29వ తేదీన వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ప్రత్యేక కథనం..

- యువతలో పెరిగిన ఆకస్మిక గుండెపోటు మరణాలు
- జీవనశైలి, పోస్టు కోవిడ్ కారణం
- రెగ్యులర్‌గా వ్యాయామం తప్పనిసరి
- కొవ్వు పదార్థాలు అధికంగా ఉండే ఆహారానికి దూరంగా ఉండాలి
- మధుమేహం, రక్తపోటులను అదుపులో ఉంచుకోవాలంటున్న వైద్యులు
- నేడు వరల్డ్ హార్ట్ డే



లబ్బీపేట (విజయవాడ తూర్పు): ప్రపంచవ్యాప్తంగా 1972 నుంచి సెప్టెంబర్ 29న వరల్డ్ హార్ట్ డేను నిర్వహిస్తున్నారు. ఏటా ఒక నినాదంతో గుండె జబ్బులపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ ఏడాది హృదయాన్ని ఉపయోగించి గుండె గురించి తెలుసుకుందాం (యూజ్ హార్ట్.. నో హార్ట్) అనే నినాదంతో అవగాహన కల్పించాలని నిర్ణయించారు. గుండె జబ్బులను మనం మార్చుకోగలిగే రిస్క్ ఫ్యాక్టర్స్, మార్చుకోలేని రిస్క్‌ఫ్యాక్టర్స్‌గా వైద్యులు పేర్కొంటున్నారు.

- **మార్చుకోగలిగే రిస్క్‌ఫ్యాక్టర్స్:** ఆహార అలవాట్లు, వ్యాయామం, నిద్ర, ధూమపానం, ఒత్తిళ్లు (స్ట్రెస్),
- **మార్చుకోలేని రిస్క్‌ఫ్యాక్టర్స్:** మధు మేహం, జన్యుపరంగా వచ్చే గుండె జబ్బులు.

ఆకస్మిక గుండెపోటుకు కారణాలు..
- కొవ్వు పదార్థాలు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం
- శారీరక శ్రమ లేని జీవన విధానం, ధూమపానం
- పోస్టు కోవిడ్ రోగుల్లో వయసుతో సంబంధం లేకుండా దాని దుష్ప్రభావాలు
- కోవిడ్ మైల్డ్‌గా సోకిన వారిలోనూ రక్తనాళాల్లో గడ్డలు ఏర్పడటం
- గుండె కండరాలు బలహీనపడటం (మయోకార్డిటీస్)
- నిద్రలేమి

పాటించాల్సిన ఆహార, వ్యాయామ నియమాలు..
- కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉండే ఆహారానికి దూరంగా ఉండాలి.
- పిజ్జా, బర్గర్ వంటి ఫాస్ట్‌ఫుడ్స్‌ను మితంగా తీసుకోవాలి.
- కూరగాయలు, తాజా పండ్లను తినాలి.
- ఆహారంలో రెడ్ మీట్ చాలా తక్కువ ఉండేలా చూసుకోవాలి.
- వారంలో కనీసం 150 నిమిషాలు తప్పనిసరిగా వ్యాయామం చేయాలి.
- సైక్లింగ్, వాకింగ్, స్విమ్మింగ్ తదితరాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- వారంలో 75 నిమిషాలు ఏరోబిక్స్ చేసినా ప్రయోజనకరంగా ఉంటుంది.
- రోజుకు కనీసం 6 నుచి 8 గంటలు ప్రశాంతమైన నిద్ర అవసరం.
- మధుమేహం, రక్తపోటు ఉన్నవారు తరచూ పరీక్షలు చేయించుకుంటూ వాటిని అదుపులో ఉంచుకోవాలి.

అవగాహన పెంచుకోవాలి


గుండె జబ్బులు, గుండెపోటు రాకుండా ఏం చేయాలనే అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఆహారంలో కూరగాయలు, తాజా పండ్లను తీసుకోవడం ద్వారా గుండె జబ్బులను చాలా వరకు నివారించవచ్చు. పోస్టు కోవిడ్‌తో పాటు కొవ్వు పదార్థాలు ఎక్కువ ఉండే ఆహారం తీసుకోవడం, చిన్నప్పటి నుంచి వ్యాయామం లేకపోవడం వల్ల కూడా గుండెపోట్లు సంభవిస్తున్నాయి.

– డాక్టర్ బి.విజయ్ చైతన్య, హృద్రోగ నిపుణులు, విజయవాడ

సేవలు విస్తృతం చేశాం


ప్రభుత్వాస్పత్రికి గుండె జబ్బులతో వచ్చే రోగులు 40 శాతం పెరిగారు. దీంతో వారంలో ఆరు రోజులు ఓపీ సేవలు అందిస్తున్నాం. గుండెపోటు వంటి అత్యవసర సేవలను 24 గంటలు అందిస్తున్నాం. నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉన్నారు. యాంజియోగ్రామ్‌లు, యాంజియోప్లాస్టీలు వంద శాతం సక్సెస్ రేటుతో నిర్వహిస్తున్నాం. అత్యాధునిక పరికరాలు, అన్ని సౌకర్యాలతో వార్డులు అందుబాటులో ఉన్నాయి. ప్రతి రోగికీ మెరుగైన సేవలే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

– డాక్టర్ డి.వెంకటేష్, సూపరింటెండెంట్, జీజీహెచ్, విజయవాడ

అరుదైన చికిత్సలు


జీజీహెచ్‌లో ఎంతో క్లిష్టతరమైన కేసులకు విజయవంతంగా చికిత్సలు అందించాం. గుండె రక్తనాళాల్లో పూడికలు తొలగించి స్టెంట్‌లు వేస్తున్నాం. గుండెనుంచి చేతులకు, కాళ్లకు వెళ్లే రక్తనాళాల్లో బ్లాక్స్‌తో రోగులు వస్తున్నారు. వారికి క్యాథ్‌ల్యాబ్ ప్రొసీజర్స్‌పై స్టెంట్‌లు వేస్తున్నాం. రక్తనాళాల్లో కాల్షియం బ్లాక్స్ ఉన్న వారికి స్టెంట్‌లు వేస్తున్నాం. జీజీహెచ్‌కు వస్తున్న రోగుల సంఖ్య బాగా పెరిగింది.

– డాక్టర్ శ్రీహరి, కార్డియాలజిస్టు, విజయవాడ ప్రభుత్వాస్పత్రి (జీజీహెచ్)

జాషువా సామాజిక చైతన్య ఉద్యమకారుడు
ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



జాషువా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): మహాకవి జాషువా సామాజిక చైతన్య ఉద్యమకారుడిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకుని గురువారం తుమ్మల పల్లి కళాక్షేత్రం వద్దగల జాషువా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం పిరదౌసి, గబ్బిలం వంటి రచనలతో ప్రజల ఆలోచనల్లో మార్పులు తీసుకువచ్చారని గుర్తుచేశారు. మహాకవి జాషువా జయంతిని ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించాలని ఉత్తర్వులు వెలువడ్డాయని చెప్పారు. చిన్నతనం నుంచి జాషువాలో సృజనాత్మక శక్తి ఉండేదని, బొమ్మలు గీయడం, పాటలు పాడటం చేసేవారని, 36 గ్రంథాలు, మరెన్నో కవితా ఖండికలు రాశారని తెలిపారు. కవితా విశారద, కవికోకిల, విశ్వకవి సామ్రాట్, నవయుగ చక్రవర్తి వంటి అనేక బిరుదులు పొందారని వివరించారు. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో యుద్ధ ప్రచారకుడిగా పని చేశారని పేర్కొన్నారు. అతి పేద కుటుంబం నుంచి వచ్చి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన మహనీయుల్లో జాషువా అగ్రగణ్యులన్నారు. ఆయన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్–ఉన్–నబీ


మొహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం మిలాద్–ఉన్–నబీ పర్వదినాన్ని ముస్లింలు ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని అన్ని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విశ్వశాంతిని కాంక్షించేదే నిజమైన ఇస్లాం అని మత గురువులు సూచించారు. మిలాద్–ఉన్–నబీని పురస్కరించుకుని వన్‌టౌన్‌లో శాంతి ర్యాలీ నిర్వహించారు. – వన్‌టౌన్(విజయవాడపశ్చిమ)

దుర్గమ్మ సేవలో అడ్వకేట్ జనరల్
ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను రాష్ట్ర అడ్వకేట్ జనరల్ సుబ్రహ్మణ్యం శ్రీరామ్ గురువారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన కుటుంబ సమేతంగా విచ్చేసిన సుబ్రహ్మణ్యం శ్రీరామ్‌కు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ ఈవో భ్రమరాంబ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టువస్త్రాలను బహూకరించారు.



సుబ్రహ్మణ్యం శ్రీరామ్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ భ్రమరాంబ

ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

- విజయవాడ విద్యాధరపురం మినీ స్టేడియంలో ఏర్పాట్లు
- సీఎం చేతుల మీదుగా వైఎస్సార్ వాహన మిత్ర ఐదో విడత నిధులు విడుదల
- ఏర్పాట్లను పరిశీలించిన హోంమంత్రి, సీఎం ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్
- సభకు హాజరయ్యే లబ్ధిదారులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు



ఏర్పాట్లపై సమీక్షిస్తున్న హోం మంత్రి తానేటి వనిత. వేదికపై ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురామ్, ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, కలెక్టర్ ఢిల్లీరావు తదితరులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. విజయవాడ విద్యాధరపురం స్టేడియం గ్రౌండ్‌లో వైఎస్సార్ వాహన మిత్ర పథకం ఐదో విడత నిధులను ముఖ్యమంత్రి శుక్రవారం విడుదల చేస్తారు. ఈ పర్యటన ఏర్పాట్లను రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సమీక్షించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హాజరు కానున్న నేపథ్యంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎమ్మెల్సీ రుహుల్లా, ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, ఫైబర్ నెట్ చైర్మన్ గౌతమ్‌రెడ్డి, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, పోలీస్ కమిషనర్ టి.కె.రాణా, డీసీపీలు విశాల్‌గున్ని, అజిత, జాయింట్ కలెక్టర్ డాక్టర్ సంపత్‌కుమార్, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీటీసీ పురేంద్రతో కలిసి జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రొటోకాల్ ప్రకారం ప్రధాన వేదికపై సీటింగ్ ఏర్పాట్లలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి సభాస్థలికి చేరుకొనే మార్గంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు సంబంధించి వివరాలతో రూట్ మ్యాపు సిద్ధం చేయాలని, ఎటువంటి ఇబ్బందీ తలెత్తకుండా అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. జిల్లా నలుమూలల నుంచి లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని తెలిపారు. వారందరూ సభాప్రాంగణానికి ముందుగానే చేరుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. సీఎం సభకు సంబంధించి చేసిన ఏర్పాట్లను కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ సంపత్‌కుమార్ వివరించారు. జిల్లా స్థాయి అధికారులకు అప్పగించిన బాధ్యతలు సక్రమంగా నిర్వహించి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ

రాష్ట్ర ప్రభుత్వం 2019 నుంచి ఏటా వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా అర్హులైన ట్యాక్సీ, ఆటో డ్రైవర్లు, యజమానులకు ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా రూ.275 కోట్ల నగదును లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో ముఖ్యమంత్రి జమ చేస్తారు. ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి 15,065 మంది లబ్ధిదారులకు రూ.15.06 కోట్లు, కృష్ణా జిల్లాలో 10,609 మంది లబ్ధిదారులకు రూ.10.60 కోట్లను నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తారు. ప్రకాశం బ్యారేజీ నుంచి విద్యాధరపురం ఆర్టీసీ డిపో స్టేడియం వరకు రోడ్లకు ఇరు వైపులా ఆహ్లాదకరమైన వాతావరణం కనిపించేలా చర్యలు తీసుకున్నారు. స్టేడియం ప్రాంగణాన్ని అందంగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ రమణమూర్తి, ఏసీపీలు హనుమంతరావు, రవికిరణ్, శ్రీనివాస్, పలువురు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలుగా కాలువలు
పటమట(విజయవాడతూర్పు): నగరంలోని కాలువలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. ప్రపంచ మెరైన్ దినోత్సవం సందర్భంగా విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఇండియన్ స్వచ్ఛత లీగ్ 2.0లో భాగంగా బందరు, ఏలూరు, రైవస్ కాలువలు, కాలువగట్లను శుభ్రం చేశారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లా, ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, డిప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శ్రీశైలజతో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. నగరంలోని కాలువలను చూస్తుంటే కేరళ, ఇటలీ, ప్యారిస్ గుర్తుకొస్తున్నాయన్నారు. పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించేందుకు వీఎంసీ చేస్తున్న కృషి అభినందించారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. నగర పరిశుభ్రత గురించి తెలుసుకోవాలంటే కాలువలను చూస్తే చాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో నగరపాలక సంస్థ కృషి బాగుందన్నారు. ప్రజలు వీఎంసీకి సహకరించాలని సూచించారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. కృష్ణా నదిని, కాలువలు కలుషితం కాకుండా వీఎంసీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. విజయవాడ స్వచ్ఛంగా మారిందని, స్వచ్ఛ భారత్‌లో తొలి స్థానంలో నిలిపేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఇటీవల ఆరువేల టన్నుల చెత్తను తీసి కాలువలను పరిశుభ్రంగా చేసిన వీఎంసీ కమిషనర్‌ను ప్రశంసించారు. వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. నగరం నుంచి ప్రవహించే పంట కాలువలు కాలుష్యం బారిన పడకుండా చూడటమే తమ ఉద్దేశమన్నారు. బోట్ల సాయంతో కాలువలను శుభ్రం చేస్తున్నామని పేర్కొన్నారు. త్వరలో ఈ బోట్లను కమర్షియల్‌గా పర్యాటక హితంగా ఉపయోగించేందుకు ప్రభుత్వ అనుమతి కోసం దరఖాస్తు చేశామని తెలిపారు. అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు వీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న కెనాల్ బండ్ వద్ద వ్యర్థాలు, పిచ్చిమొక్కలు తొలగించారు. నేతాజీ బ్రిడ్జి వరకు కాలువల్లో బోట్ల సహాయంతో వ్యర్థాలను తొలగించారు. వీఎంసీ అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, అదనపు కమిషనర్ (జనరల్) శకుంతల, కార్పొరేషన్ ఉద్యోగులు పాల్గొన్నారు.



కాలువ గట్ల వెంట వ్యర్థాలు తొలగిస్తున్న ఎమ్మెల్యేలు వెల్లంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, కలెక్టర్ ఢిల్లీరావు



బోటులో కాలువను పరిశీలిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లా, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్

మిస్సింగ్ కాదు మోసం

ఆదినారాయణ అదృశ్యం కేసులో బిగ్ ట్విస్ట్

- అప్పులు ఎగ్గొట్టేందుకు సూసైడ్ నాటకం
- కృష్ణానదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు నమ్మించే ప్రయత్నం
- బైక్‌ను వారధిపై ఉంచి, ఆటోలో వేరే ప్రాంతానికి పరారీ
- సీసీ టీవీ ఆధారంగా వ్యవహారాన్ని బయటకు తీసిన పోలీసులు



కోడూరు వంతెన సెంటర్‌లో నడుచుకుంటూ వెళ్తున్న ఆదినారాయణ



ఆదినారాయణ (ఫైల్)

కోడూరు(అవనిగడ్డ): కృష్ణానదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు సూసైడ్ నోట్ ద్వారా నమ్మించే ప్రయత్నం చేసిన ఆదినారాయణ మిస్సింగ్ కేసులో కొత్త కోణం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. పెడన మండలంలోని కాకర్లపూడి శివారు ముత్రాస్‌పాలెం గ్రామానికి చెందిన యరగాని ఆదినారాయణ ఈ నెల 25వ తేదీన ఇంటి వద్ద నుంచి తన ద్విచక్రవాహనంపై ఉల్లిపాలెం–భవానీపురం వారధి వద్దకు చేరాడు. రాత్రి 7గంటల సమయంలో ఆదినారాయణ తన బైక్‌ను వారధిపై ఉంచి, అందులో తాను చనిపోతున్నట్లుగా సూసైడ్ నోట్ రాసి బైక్ ట్యాంక్ కవర్‌లో పెట్టాడు. ఇదే సూసైడ్ నోట్‌ను తన భార్య నవ్యశ్రీ ఫోన్‌కు కూడా పంపాడు. అప్పుల బాధలు ఎక్కువ కావడంతోనే తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నానని, తన కోసం ఎవరూ గాలించవద్దని, గాలించినా కూడా తన మృతదేహం దొరకదంటూ ఆదినారాయణ సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు.

రెండు రోజుల పాటు ముమ్మర గాలింపు..

ఆదినారాయణ బైక్‌తో పాటు సూసైడ్ నోట్ కూడా వారధిపై ఉండడంతో పోలీసులు ఆదినారాయణ వారధిపై నుంచి కృష్ణానదిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు భావించారు. ఇందులో భాగంగా రెండు రోజుల పాటు కోడూరు, పెడన పోలీసులు, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, స్థానిక మత్స్యకారుల సహాయంతో కృష్ణా నదిని జల్లెడ పట్టారు. బందరు, కోడూరు మండలాల్లో ప్రవహించే నది ప్రాంతమంతా వెతికినా కూడా ఆదినారాయణ ఆచూకీ లభించలేదు. సహజంగా ఓ వ్యక్తి నదిలో దూకితే 36గంటల లోపు నీటిలో పైకి తేలతాడని, అయితే ఆదినారాయణ ఆచూకీ లభించకపోవడంతో పోలీసులు మరో కోణంలో తమ దర్యాప్తును ప్రారంభించారు.

సీసీ టీవీ పుటేజీల్లో ఆచూకీ..

ఆదినారాయణ నదిలో దూకలేదని పోలీసులకు అనుమానం రావడంతో పెడన దగ్గర నుంచి కోడూరు వరకు ఉన్న అన్ని సీసీ టీవీ పుటేజీలను పోలీసులు నిశితంగా పరిశీలించారు. ఇంటి వద్ద నుంచి బయలుదేరినప్పుడు ఆదినారాయణ వద్ద బ్యాగ్ లేదని, బందరులోని ఓ దుకాణంలో బ్యాగ్‌ను కొనుగోలు చేసినట్లు గుర్తించారు. అక్కడ నుంచి బైక్‌పై చిన్నాపురం మీదగా ఉల్లిపాలెం వస్తున్నట్లు సీసీ టీవీల్లో రికార్డు అయింది. ఉల్లిపాలెం వారధి వద్ద ఆదినారాయణ తాను ఇంటి వద్ద వేసుకున్న దుస్తులను మార్చుకొని, ముఖానికి మాస్క్ ధరించి ఆటోలో కోడూరు వెళ్లడాన్ని గుర్తించారు. కోడూరు వంతెన సెంటర్‌లోని గంగాభవానీ అమ్మవారి దేవాలయం వద్ద ఆదినారాయణ ఆటో దిగడంతో పాటు చేతిలో బ్యాగు పట్టుకొని, మరో బ్యాగు తగిలించుకొని నవ్వుతూ సెల్‌ఫోన్‌ల్లో మాట్లాడుకుంటూ అక్కడ తిరగడం సీసీ టీవీల్లో రికార్డు అయ్యింది. కోడూరు నుంచి అవనిగడ్డకు బైక్‌ను లిఫ్ట్ అడిగి వెళ్లడాన్ని పోలీసులు గుర్తించారు.

తప్పుదోవ పట్టించేందుకు..

విషయాన్ని తప్పుదోవ పట్టించేందుకు వారధి వద్ద బైక్, సూసైడ్ నోట్ పెట్టి ఆదినారాయణ బయట ప్రాంతాలకు పరారయ్యాడని పోలీసులు చెప్పారు. చేసిన అప్పులు కట్టకుండా తప్పించుకొనేందుకు ఈ తరహాలో మోసానికి పాల్పడినట్లు తమ విచారణలో తేలిందన్నారు. ఆదినారాయణ ఆచూకీ కోసం పోలీసులు గాలింపు కొనసాగుతుందని, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ కూడా కొనసాగుతుందని ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. పెడన పోలీసులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించారని ఎస్‌ఐ చెప్పారు.



చిన్నాపురం వద్ద బైక్‌పై వస్తున్న ఆదినారాయణ

అజరామరం విశ్వనరుడి సాహిత్యం

- ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు
- జాషువాకు ఎమ్మెల్యేలు వెలంపల్లి, మల్లాది, మేయర్ భాగ్యలక్ష్మి నివాళులు



జాషువా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న విజయబాబు, వెలంపల్లి, మల్లాది, భాగ్యలక్ష్మి, బొప్పన, కనకారావు తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): మహాకవి గుర్రం జాషువా సాహిత్యం అజరామరమని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి. విజయబాబు అన్నారు. 'సుకవి జీవించె ప్రజల నాలుకలయందు' అన్న జాషువా కవితాక్షరాలకు నిదర్శనంగా నిలిచారని అన్నారు. మహాకవి, కేంద్ర, రాష్ట్ర సాహిత్య అకాడమీల పురస్కార గ్రహీత పద్మభూషణ్ గుర్రం జాషువా జయంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు బూదాల శ్రీను ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం ప్రాంగణంలోని జాషువా విగ్రహానికి ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ పి. గౌతంరెడ్డిలతో కలిసి ఆయన పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం విజయబాబు మాట్లాడుతూ విశ్వనరుడు జాషువా అవమానాలు ఎదురైన చోటే సన్మానాలను అందుకున్నారని గుర్తు చేశారు. ఎన్ని ఛీత్కారాలకు గురైనా అక్షరాస్త్రాలతోనే ధర్మాగ్రహాన్ని ప్రదర్శించి తనకు సాటి వేరొకరు లేరని నిరూపించుకున్నారని చెప్పారు.

సమాజ స్థితిగతులను సూటిగా..

విజయవాడ పశ్చిమ, సెంట్రల్ ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణులు మాట్లాడుతూ జాషువా తన 'గబ్బిలం'లో తన వంటివారి అవస్థలనే కాకుండా సమాజ స్థితిగతులను సూటిగా చెప్పారని అన్నారు. తిరుపతి వెంకట కవుల్లో ఒకరైన చెళ్లపిళ్ల వెంకట కవి జాషువా కాలికి గండపెండేరం తొడిగి విజయవాడలో ఏనుగు అంబారీపై ఊరేగించారని గుర్తు చేశారు. మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ జాషువా వంటి ఆదర్శమూర్తిని నేటి యువతరం స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ పి. గౌతంరెడ్డి మాట్లాడుతూ కవిత్వాన్నే ఆయుధంగా మార్చుకుని వర్ణ వివక్షపై, సంకుచిత భావాలపైన సవ్యసాచిలా అక్షరాస్త్రాలను సంధించిన కవి జాషువా అన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు అవుతు శైలజ, బెల్లం దుర్గ, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్, అధికార భాషా సంఘం సభ్యుడు ఆచార్య గాజుల రామచంద్రారెడ్డి, మాదిగ, రెల్లి కార్పొరేషన్ల చైర్మన్లు కొమ్మూరి కనకారావు, వడ్డాది మధుసూదనరావు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు బొప్పన భవకుమార్, ఎస్సీ సెల్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు పోలిమెట్ల శరత్ బాబు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, పార్టీ ఎస్సీ నాయకులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో..

జాషువా జయంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ నాయకుడు గుడిసె శ్యామ్ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద ఏర్పాటు చేసిన నివాళి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి బెజ్జం రవికుమార్ పాల్గొన్నారు. ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షులు షేక్ నాగుల మీరా, ఎస్సీ సెల్ నాయకులు బత్తుల సుబ్బారావు, బెనర్జీ, సువర్ణ రాజు, కాంచనమాల కనకాంబ ట్రస్ట్ డైరెక్టర్ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వాస్తవికతకు అద్దం పట్టిన నాటికలు

విజయవాడ కల్చరల్: బందరురోడ్డులోని చుక్కపల్లి పిచ్చియ్య ఆడిటోరియంలో నిర్వహిస్తున్న యువ నాటికల పోటీలు గురువారం ముగిశాయి. సుమధుర కళానికేతన్, ఆంధ్రనాటక కళాసమితి, సిద్ధార్థ అకాడమీ, జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో వివిధ సంస్థలు ప్రదర్శించిన నాటికలు వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టాయి. తొలి నాటికగా న్యూస్టార్ మోడరన్ థియేటర్స్ విజయవాడ వారు కపిరాజు నాటికను ప్రదర్శించారు. రెండో నాటికగా నవరస థియేటర్ ఆర్ట్స్ విశాఖపట్నం వారు ముళ్ల తీగలు నాటికను ప్రదర్శించారు. చివరిగా మంగళగిరి డాన్స్ బాస్కో స్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన శకుంతలోపాఖ్యానం ఆకట్టుకుంది. నాటక రంగ ప్రముఖులు హెచ్‌వీఆర్ ఎస్. ప్రసాద్, శాంతారాం, కృష్ణారావు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు.



కపిరాజు నాటికలోని సన్నివేశం

వేడుకగా జాషువా జయంతి..

కార్యక్రమంలో భాగంగా నిర్వాహకులు గుర్రం జాషువా జయంతి వేడుకలను నిర్వహించారు. భాషావేత్త డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో జాషువా స్థానం వెలకట్టలేనదన్నారు. సంరక్ష సొసైటీ జనరల్ సెక్రటరీ డాక్టర్ బీఆర్ సునీల్ కుమార్, జాషువా సాంస్కృతిక వేదిక నిర్వాహకుడు నిమ్మగడ్డ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సుబ్బారాయుడి హుండీ ఆదాయం రూ. 89.52లక్షలు

మోపిదేవి(అవనిగడ్డ): స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానంలో భక్తులు సమర్పించిన హుండీ కానుకల ఆదాయం రూ. 89,52,409 వచ్చినట్లు ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు తెలిపారు. మచిలీపట్నం ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు సమక్షంలో గురువారం కానుకలు లెక్కించారు. నగదుతో పాటు బంగారం 48 గ్రాములు, వెండి ఒక కిలో 950 గ్రాములు, అమెరికన్ డాలర్లు 237, ఆస్ట్రేలియా డాలర్స్ 110, కెనడా డాలర్లు 10, బంగ్లాదేశ్ తుకస్ 76,195 కానుకల రూపంలో వచ్చినట్లు వివరించారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, ఎస్ఐ సీహెచ్ పద్మ, చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.



మోపిదేవిలో స్వామివారి కానుకల లెక్కింపును పరిశీలిస్తున్న ఆలయ ఏసీ చక్రధరరావు

నరసింహునికి రూ. 30 లక్షల ఆదాయం

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారికి బహిరంగ వేలం పాట ద్వారా రూ. 30.25లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో జయప్రకాష్‌బాబు పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో గురువారం కొబ్బరికాయలు, కిరాణా సామగ్రి అమ్ముకునేందుకు వేలం పాట నిర్వహించగా పై ఆదాయం వచ్చిందని తెలిపారు. ఏడాది పాటు హక్కులు అమలులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానమే పెనుభూతమై..

భార్యను గొడ్డలితో నరికి చంపిన భర్త



నళిని (ఫైల్)



రక్తపు మడుగులో నళిని

జుజ్జూరు(వీరులపాడు): భార్యపై అనుమానంతో భర్త గొడ్డలితో నరికి హతమార్చిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు చందర్లపాడు మండలం తుర్లపాడు గ్రామానికి చెందిన మేడి వేంకటేశ్వరరావు, వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామానికి చెందిన నళిని(35)తో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. జుజ్జూరు గ్రామంలో నివాసముంటున్న వెంకటేశ్వరరావు స్థానికంగా ఉన్న విశాఖ రేకుల ఫ్యాక్టరీలో కూలీగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా భార్య నళిని టైలరింగ్ చేస్తుంది. కొంత కాలంగా భార్యను అనుమానిస్తుండటంతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి సమయంలో ఇంటికి వచ్చిన వెంకటేశ్వరరావు పిల్లలతో కలిసి నిద్రిస్తున్న భార్యను మెడ భాగంలో గొడ్డలితో నరకటంతో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న నందిగామ రూరల్ సీఐ నాగేంద్రకుమార్, ఎస్ఐ మహాలక్ష్మణుడు సంఘటనా స్థలానికి చేరుకుని హత్యకు ఉపయోగించిన గొడ్డలిని స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడున్నారు. తల్లి మృతితో పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. కాగా నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది.

కార్తికేయుని సేవలో డాక్టర్ ఉమ్మారెడ్డి

మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని శాసనమండలి ఫ్లోర్ లీడర్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు గురువారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి విచ్చేసిన ఆయన నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. అర్చకులు బుద్దు నతీష్ శర్మ, ఫణిదీప్ శర్మ స్వామివారికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందచేశారు. ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు. వేద పండితులు ఆశీర్వచనం అందించారు.



ఉమ్మారెడ్డికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఏసీ చక్రధరరావు

ఎంపీపీ పాలడుగు జ్యోత్స్నకు అరుదైన గౌరవం

ఇబ్రహీంపట్నం(మైలవరం): ఎంపీపీ పాలడుగు జ్యోత్స్నకు అరుదైన గౌరవం దక్కింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఢిల్లీలోని ప్రగతి మైదాన్ నుంచి ఈనెల 30న దేశ వ్యాప్తంగా వర్చువల్‌గా ప్రారంభించనున్న అభిలషణీయ బ్లాక్ పథకం చింతన్ సివిర్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆహ్వానం అందింది. ఈ మేరకు శుక్రవారం ఆమె ఢిల్లీ వెళ్లనున్నారు. చింతన్ సివిర్ ప్రోగ్రాంలో ఇబ్రహీంపట్నం ఎంపిక్తె నందున స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీని మండలం తరఫున కలిసే అవకాశం రావడంపై ఆమె ఆనందం వ్యక్తం చేశారు. 30న వర్చువల్‌గా కార్యక్రమం ప్రారంభించిన అనంతరం అక్టోబర్ 3వ తేదీ నుంచి 9 వరకు వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు చెప్పారు.



పాలడుగు జ్యోత్స్న

ఏం కష్టమొచ్చింది తల్లీ..!

- బిడ్డను చంపి తల్లి ఆత్మహత్య
- మానసికస్థితి సరిగా లేకే ఘాతుకం!

రామవరప్పాడు(గన్నవరం): ఆమెకు ఏ కష్టం వచ్చిందో ఏ తల్లి చేయని దుశ్చర్యకు పాల్పడింది. అల్లారు ముద్దుగా సాకిన చేతులతోనే కన్నబిడ్డను గొంతు బిగించి హతమార్చింది. ఆ తర్వాత కత్తితో తానూ పీక కోసుకుని ప్రాణాలొదిలింది. ఈ ఘటన విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులో విషాదం నింపింది. పటమట ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామంలోని ఎస్సీ కాలనీలో తగరం అరుణ్‌కుమార్, జోజి రాణి(32) దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి 2015లో వివాహం కాగా మూడేళ్ల కూతురు మేరి జెస్సీ ఉంది. అరుణ్‌కుమార్ తాడేపల్లిలోని రియల్ ఎస్టేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. జోజి రాణి తల్లిదండ్రులు కూడా ఇదే కాలనీలో నివాసం ఉంటున్నారు. పెళ్లయిన ఐదేళ్ల తర్వాత జెస్సీ పుట్టడంతో అల్లారు ముద్దుగా పెంచుకుంటున్నారు. దగ్గరలో ఉన్న పుట్టింటికి పాపతో కలిసి జోజిరాణి తరచూ వెళ్తొస్తుండేది. రోజూ మాదిరిగానే గురువారం అరుణ్‌కుమార్‌కు భోజనం బాక్సు కట్టి ఆఫీసుకు పంపించింది. ఆఫీసు వెళ్లిన తర్వాత అరుణ్‌కుమార్ ఇంటికి ఫోన్ చేశాడు. ఎన్ని సార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో తన బావమరిది రాకేష్‌కు ఫోన్ చేసి ఇంటికి వెళ్లాలని చెప్పాడు. దీంతో జోజి రాణి తండ్రి, సోదరుడు ఇంటికి వెళ్లి చూడగా తలుపులు, కిటికీలు మూసివేసి ఉన్నాయి. ఎంతసేపటికి తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చి తలుపులు పగులకొట్టి చూడగా ఇరువురు విగతజీవులుగా పడి ఉండటం చూసి తండ్రి, సోదరుడు కుప్పకూలిపోయారు.



జెస్సీతో జోజి రాణి (ఫైల్)

మానసికస్థితి సరిగా లేకేనా..

కొంత కాలంగా జోజి రాణి మానసిక పరిస్థితి సరిగ్గా ఉండటం లేదు. రాత్రిళ్లు నిద్ర లేకుండా గడపటం, పలు అనారోగ్య కారణాలతో బాధపడుతోంది. వివాహానికి ముందు కూడా రెండుసార్లు ఆత్మహత్యా ప్రయత్నం చేసింది. వివాహమైన తర్వాత కూడా ఆత్మహత్య ఆలోచనలు వస్తుండటంతో కుటుంబ సభ్యులు రెండు సార్లు భూత వైద్యుడు దగ్గరికి తీసుకెళ్లి తాయత్తులు కట్టించారు. ఆరోగ్యం బాగుండటం లేదని తనకు ఎమైనా జరిగితే కూతురి పరిస్థితి ఏమిటని తరచూ కుటుంబ సభ్యులతో అంటూ బాధపడేది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో తొలుత తన కూతురిని ఫోన్ చార్జింగ్ వైర్‌ను గొంతుకు బిగించి హతమార్చింది. చనిపోయిందని నిర్ధారించుకున్న తర్వాత కూరగాయలు కోసే కత్తితో తన గొంతు, చేతిపై కోసుకుంది. దీంతో తీవ్ర రక్తస్రావమై మరణించింది. సమాచారం అందుకున్న పటమట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో వృద్ధురాలి మృతదేహం లభ్యం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం పెరికీడు వద్ద ఏలూరు కాలువలో ఓ వృద్ధురాలి మృతదేహాన్ని హనుమాన్‌జంక్షన్ పోలీసులు గురువారం గుర్తించారు. ఎస్ఐ–2 టి.తిరుమలరావు సమక్షంలో వృద్ధురాలి మృతదేహాన్ని కాలువ నుంచి ఒడ్డుకు తీసుకువచ్చి వివరాలు సేకరించారు. మృతురాలు గన్నవరం మండలం చిన్నవుటపల్లికి చెందిన పరిమి రామలక్ష్మి(67)గా పోలీసులు గుర్తించారు. పెరికీడుకు చెందిన రామలక్ష్మి ఉపాధి నిమిత్తం కొన్నేళ్ల క్రితం చిన్నవుటపల్లికి తరలివెళ్లారు. ఈ నేపథ్యంలో రామలక్ష్మి గ్రామంలోని కాలువలో విగతజీవిగా తేలటంపై పోలీసులు విచారణ చేపట్టారు. ఈ ఘటనపై ఎస్ఐ తిరుమలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● **సాక్షి, అమరావతి:** గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఉదయం ఓపెన్‌మైండ్స్ (ఫర్ బెటర్ సొసైటీ) ఆధ్వర్యంలో సంక్షేమం – అభివృద్ధి అనే అంశంపై సదస్సు జరగనుంది. ఈ సదస్సులో ప్రముఖ ఆర్థికవేత్త, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ (న్యూపా) మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జంధ్యాల బీజీ తిలక్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్. వెంకటరావు తదితరులు ప్రసంగించనున్నారు.



క్లుప్తంగా

పేదలకు ఇస్త్రీ బండ్లు అందజేత



గుణదల (విజయవాడ తూర్పు): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకుని నగరంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. మూడో డివిజన్ పరిధి ఈఎస్ఐ ఆసుపత్రి రోడ్డులో గురువారం జరిగిన కార్యక్రమంలో పేదలకు ఇస్త్రీబండ్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేదలకు అండగా నిలవడానికి దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారన్నారు. నియోజకవర్గం పరిధిలోని అన్ని డివిజన్లలో తోపుడు బండ్లు, బడ్డీ కొట్లు, ఇస్త్రీ బండ్లను పంపిణీ చేశామన్నారు. ఇటీవల డివిజన్‌లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా స్థానికులు వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వీరి జీవనోపాధికి రూ. 50వేలు ఖరీదు చేసే రెండు ఇస్త్రీ బండ్లను అందజేశామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, కో ఆప్షన్ సభ్యులు ముసునూరి సుబ్బారావు, స్థానిక నాయకులు నాగేశ్వరరావు, డేవిడ్, భీమిశెట్టి నాని, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నవయుగ కవితా చక్రవర్తికి స్వర నీరాజనం



విజయవాడ కల్చరల్: ప్రణవి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నవయుగ కవితా చక్రవర్తి గుర్రం జాషువా 128వ జయంతి, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని గురువారం గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహించారు. కారుమంచి రాజు మాట్లాడుతూ కవిగా, నాటక రచయితగా జాషువా తెలుగు సాహిత్యానికి చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. నాటి యువకులను ఎందరినో ప్రభావితం చేసినట్లు తెలిపారు. సినీ సంగీత విభావరిలో భాగంగా ఆదిరాల జయప్రభ, రమాశంకర్, కొమ్మినేని రత్నకుమారి, పావని, శ్రావణి, శ్రీనివాసరావు తెలుగు చిత్రగీతాలను ఆలపించారు. నిర్వాహకులు జాషువా చిత్రపటానికి నివాళులర్పించారు.

15 నుంచి విజయదుర్గ ఆలయంలో దసరా ఉత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమనవారి పేటలోని శ్రీ విజయదుర్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో వచ్చే నెల 15 నుంచి 23వ తేదీ వరకు దసరా మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 15వ తేదీ ఉదయం 8.01 గంటలకు గణపతి పూజ, కలశస్థాపన జరుగుతుందని, ఉదయం 11 గంటలకు విశేష కుంకుమార్చన జరుగుతుందని పేర్కొన్నారు. 15వ తేదీ అమ్మవారు శ్రీ బాలాత్రిపుర సుందరిదేవిగా, 16న శ్రీ గాయత్రిదేవి, 17న శ్రీ అన్నపూర్ణాదేవి, 18న శ్రీమహాలక్ష్మీదేవి, 19న శ్రీ లలితా త్రిపుర సుందరీదేవి, 20న మూలా నక్షత్రం శ్రీ సరస్వతిదేవిగా, 21వ తేదీ శ్రీ దుర్గాదేవి, 22న శ్రీమహిషాసురమర్దినిదేవి, 23న రాజరాజేశ్వరిదేవి అలంకారంలో దర్శనమివ్వనున్నారు.

ఘనంగా అనంత పద్మనాభ స్వామి వ్రతం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం అనంతపద్మనాభస్వామిస్వామి వ్రతాన్ని ఆచరించారు. వ్రతంలో పలువురు భక్తులు, ఉభయదాతలు పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు వినుకొండ రామరత్నమాచార్యులు భక్తులతో వ్రతాన్ని చేయించారు. వ్రతం ఆచరిస్తే సకల కార్యాల్లో విజయం సిద్ధిస్తుందని పేర్కొంటూ వ్రత మహాత్మ్యాన్ని భక్తులకు వివరించారు. స్వామి వారికి 14 రకాల పుష్పాలతో విశేష అర్చన, 14 రకాల నైవేద్యాలను నివేదించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యవర్గ సభ్యులతో పాటు దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

అందివస్తున్న సాంకేతికతపై అవగాహన అవసరం

పెనమలూరు: సివిల్ ఇంజినీరింగ్‌లో అందివస్తున్న సాంకేతికతపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు అన్నారు. కాలేజీలో 28వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరగనున్న రివిట్ వర్కుషాపు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. అనంతరం మాట్లాడుతూ భవనాలు, రహదారుల నిర్మాణంలో సాంకేతికత దేశ అభివృద్ధికి దోహదపడతాయన్నారు.

మారుతున్న టెక్నాలజీని విద్యార్థులు అవగాహన చేసుకోవాలని సూచించారు. సివిల్ విభాగాధిపతి డాక్టర్ కె.రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించటానికి రివిట్ సాఫ్ట్‌వేర్‌పై శిక్షణ ఇస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో విజయవాడ కాంటర్ క్యాడ్ డైరెక్టర్ కె.నాగు, డాక్టర్ కోగంటి శ్యామ్‌ప్రకాష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రగతి బాటలో..

- మోడల్ డివిజన్ దిశగా '22'
- సుమారు రూ.4కోట్లతో అభివృద్ధి పనులు
- డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న యూపీహెచ్‌సీ

కృష్ణలంక(విజయవాడతూర్పు): స్థానిక 22వ డివిజన్‌లో అభివృద్ధి పనులు చకచకా జరుగుతున్నాయి. ప్రగతి బాటలో మోడల్ డివిజన్ దిశగా అడుగులు వేస్తోంది. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో డివిజన్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. అరకొర చేపట్టిన పనులను కూడా మధ్యలో నిలిపివేయడంతో డివిజన్‌లో సమస్యలు తిష్ట వేశాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ చొరవతో కార్పొరేటర్ కొండారెడ్డి అటు రాష్ట్ర ప్రభుత్వం, ఇటు నగరపాలక సంస్థ నుంచి సుమారు రూ.4 కోట్ల నిధులు మంజూరు చేయించుకున్నారు. వీటితో అభివృద్ధి పనులు చేపట్టి మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దుతున్నారు.

అభివృద్ధి పనులు ఇవే

కార్పొరేటర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత కొండారెడ్డి డివిజన్ అభివృద్ధిపై దృష్టి సారించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. డివిజన్‌లో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం లేకపోవడంతో చిన్న చిన్న రోగాలకు ఇతర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను అవినాష్ దృష్టికి తీసుకెళ్లి పీహెచ్‌సీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. దోబీఖానా పక్కన పద్మావతి ఘాట్ వెంట రూ.80 లక్షల నిధులతో ఆరోగ్య కేంద్రం నిర్మాణం పూర్తవడంతో ప్రారంభానికి సిద్ధంగా ఉంది. జాతీయ రహదారి పక్కన పోలీస్‌స్టేషన్ సమీపంలో రూ.90 లక్షల మార్కెటింగ్ శాఖ నిధులతో రైతుబజార్ నిర్మాణానికి కృషి చేశారు. బ్లేడ్‌బ్యాచ్, ఆకతాయిల బెడదను నిలువరిస్తూ దోబీఖానా రక్షణ వలయంగా ప్రహరీని రూ.15 లక్షల వ్యయ అంచనాతో నిర్మించారు. రూ.20 లక్షలతో స్వర్గపురి ఎలక్ట్రికల్ విభాగంలో టాయిలెట్స్, ఆఫీస్ రూమ్ ఆధునీకరించారు. పరికరాలు లేక వెలవెలబోతున్న జిమ్‌పై ప్రత్యేక దృష్టి సారించి రూ.15 లక్షలతో నూతన జిమ్ పరికరాలు ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు. అప్పల నరసమ్మ వీధిలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డును ఏర్పాటు చేశారు. రూ.15 లక్షల వ్యయ అంచనాతో కృష్ణానదిలో నూతన డ్రైనేజీ వ్యవస్థ, పెండింగ్ గేట్స్ ఏర్పాటు చేశారు. నాడు–నేడు పథకంలో రూ. 60 లక్షల నిధులతో ఎస్.వి.రెడ్డి పాఠశాలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేశారు. ఉర్దూ స్కూల్‌ను సైతం ఆధునీకీకరించి పూర్తి స్థాయిలో పిల్లలకు చక్కని విద్య అందిస్తున్నారు. రూ.30 లక్షల వ్యయ అంచనాతో నూతన వాటర్ పైప్‌లైన్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించారు. రూ.26 లక్షల వ్యయ అంచనాతో దోబీఖానాలో రేకుల షెడ్‌ను ఏర్పాటు చేశారు. ఇవే కాకుండా మరో ఆరోగ్య కేంద్రం ప్రహరీ నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు మంజూరయ్యాయి. త్వరలో నిర్మాణాన్ని ప్రారంభించి పూర్తి చేయనున్నారు.

మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దుతా



ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి మోడల్ డివిజన్‌గా తీర్చదిద్దుతా. డివిజన్‌లో సుమారు రూ.4 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పూర్తి చేశాం. దేవినేని అవినాష్ సహకారంతోనే డివిజన్‌లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం సాధ్యమైంది. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటా, ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తా.


–తాటిపర్తి కొండారెడ్డి, కార్పొరేటర్



దోభీఖానాకు ప్రహరీ



అప్పలనరసమ్మ వీధిలో నిర్మించిన సీసీ రోడ్డు



జిమ్‌లో ఏర్పాటు చేసిన నూతన పరికరాలు

1నుంచి కమిషనరేట్ పరిధిలో నిషేధాజ్ఞలు

సీపీ టీకే రాణా

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు సెక్షన్ 30 పోలీస్‌యాక్ట్ 1861 ప్రకారం నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్, మెట్రోపొలిటన్ ప్రాంత అదనపు జిల్లా మేజిస్ట్రేట్ టీకే రాణా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు రాకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా 92 రోజుల పాటు నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని వివరించారు. ఆ సమయంలో కమిషనరేట్ పరిధిలో సభలు, సమావేశాలు, ఊరేగింపులు, నిరసనలు, ధర్నాలను పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా నిర్వహించరాదని, ఎవరైనా అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

పటమట(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మత్స్యకారులకు అండగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, మత్యకారులు శ్రమించి వేటాడిన మత్స్య సంపద మార్కెటింగ్‌కు అనేక అవకాశాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పిస్తున్నారని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ అన్నారు. గురువారం 9వ డివిజన్‌లో రూ. 20 లక్షల వ్యయ అంచనాతో మత్స్యకారుల వ్యాపారానికి అనువుగా చేపట్టిన షెడ్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అవినాష్ మాట్లాడుతూ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి మత్స్యకారులు వ్యాపారం కోసం ఇక్కడికి వస్తారని వారికి సరైన వసతులు లేవని గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే దృష్టికి పలుమార్లు విన్నవించుకున్నా ఫలితం శూన్యమని విమర్శించారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా వైఎస్సార్ సీపీ నాయకులు ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు సమస్యను తమ దృష్టికి సమస్య ను తీసుకురాగా కేవలం నెల రోజుల వ్యవధిలోనే అధికారులు, మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి రూ.20లక్షల నిధులు మంజూరు చేయించామని పేర్కొన్నారు. శంకుస్థాపన మాత్రమే కాకుండా వీలైనంత త్వరగా షెడ్ నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, డివిజన్ ఇన్‌చార్జ్ వల్లూరు ఈశ్వర ప్రసాద్, డివిజన్ అధ్యక్షలు గద్దె కళ్యాణ్, కార్పొరేటర్ చింతల సాంబయ్య, 13వ డివిజన్ ఇన్‌చార్జ్ రామాయణపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విఘ్నాధిపతి నిమజ్జనం



కృష్ణలంక(విజయవాడతూర్పు): స్థానిక 21వ డివిజన్‌లోని పచ్చిమేడబజార్ సెంటర్‌లో జై గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 11 రోజులుగా జరుగుతున్న గణపతి నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ముగిశాయి. కమిటీ సభ్యులు గణపతికి విశేష పూజలు నిర్వహించారు. లడ్డూలకు, కరెన్సీ నోట్ల దండలకు లక్కీ డిప్ తీసి విజేతలకు అందజేశారు. అనంతరం డీజే, డప్పు వాయిద్యాలతో డివిజన్‌లోని పలు వీధుల్లో గణపతిని ఊరేగించారు. కార్యక్రమంలో 21వ డివిజన్ కార్పొరేటర్ పుప్పాల కుమారి, కృష్ణలంక శివాలయం చైర్మన్ ఎం.సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు టీపీ రెడ్డి , కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో పేదలకు మేలు



సురక్ష టోకెన్‌ను అందజేస్తున్న దేవినేని అవినాష్

వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్

గుణదల (విజయవాడ తూర్పు): జగనన్న సురక్షతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ తెలిపారు. నాలుగో డివిజన్ వరలక్ష్మీనగర్‌లో గురువారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష సర్వేలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. ప్రజాభీష్టం ప్రకారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో సంక్షేమ పాలన మొదలైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న జగనన్న సురక్షలో వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజారోగ్యంపై సర్వే చేస్తారన్నారు. అర్బన్ క్లినిక్స్‌లో మెరుగైన వైద్య సేవలు అందించి మందులు ఇస్తున్నారన్నారు. సురక్ష ద్వారా పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధివిధానాలు జనరంజకంగా ఉన్నాయని తెలిపారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ఆరోగ్య సర్వే చేశారు. వైద్యం అవసరమైన ప్రజలకు కూపన్లను అందజేశారు. వచ్చే నెల మొదటి వారంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, నాలుగో డివిజన్ ఇన్‌చార్జి గల్లా పద్మావతి, వైఎస్సార్ సీపీ నాయకులు రవికుమార్, జయరాజు, ప్రకాష్, ఉస్మాన్, తదితరులు పాల్గొన్నారు.

భూ హక్కు పత్రాల పంపిణీ వేగవంతం

కలెక్టర్ ఢిల్లీరావు



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో రెండో దశ రీ సర్వే ప్రక్రియలో భూహక్కు పత్రాలను పెండింగ్ లేకుండా పంపిణీ చేస్తున్నామని, జగనన్నకు చెబుదాం– 1902లో నమోదవుతున్న అర్జీలకు గడువులోగా పరిష్కారం చూపుతున్నామని కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్. జవహర్ రెడ్డికి వివరించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.ఎస్. జవహర్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ జిల్లాలో మొదటి దశలో 14 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశామన్నారు. ఆయా గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్, భూ హక్కు పత్రాల పంపిణీ పూర్తి చేస్తున్నామన్నారు. రెండవ దశలో 15 గ్రామాల్లో రీ సర్వేలో స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియలో భాగంగా 12,968 సరిహద్దు రాళ్లు పాతడం లక్ష్యమని ఇప్పటికే ఏడు గ్రామాల్లో 8,638 సరిహద్దు రాళ్లను నాటే ప్రక్రియ పూర్తి చేశామన్నారు. మూడో దశ రీ సర్వేలో భాగంగా జిల్లాలోని 100 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ వ్యాలిడేషన్ ప్రక్రియను పూర్తి చేసి నిర్దేశించిన ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీ నాటికి పూర్తి చేసేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. జగనన్నకు చెబుదాంలో పరిష్కరించిన అర్జీల వివరాలు తెలియజేశారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 15వ తేది నుంచి అక్టోబర్ 2వ తేది వరకు చెత్త రహిత భారత్‌లో భాగంగా వ్యర్థాల నిర్వహణను చేపట్టామన్నారు. వీసీలో జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్, డ్వామా పీడీ జె. సునీత, పంచాయతీరాజ్ ఈఈ కె. వెంకటేశ్వరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్ నాగమణిమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు భగత్‌సింగ్

కలెక్టర్ ఢిల్లీరావు



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్వాతంత్ర్య కోసం అలుపెరగని పోరాటం చేసిన యోధుడు భగత్‌సింగ్ అని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో భగత్‌సింగ్ జయంతి ఘనంగా నిర్వహించారు. తొలుత భగత్ సింగ్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్రిటీష్ పాలననుంచి దేశ విముక్తి కోసం ప్రాణాలను తృణప్రాయంగా ఎంచి ఉరికంబమెక్కిన ఆయన త్యాగరీతి మరువలేనిదన్నారు. నేటి యువత భగత్‌సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

పలుచోట్ల నివాళి

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): భగత్‌సింగ్‌లోని ధైర్య సాహసాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) నగర కార్యదర్శి లంకా గోవిందరాజులు అన్నారు.

భగత్‌సింగ్ వేడుకలు ఆరో డివిజన్ పరిధిలోని రావిచెట్టు సెంటర్ వద్ద, ఏడో డివిజన్ పరిధిలోని బోయపాటి మాధవరావు గ్రంథాలయం వద్ద గురువారం వేర్వేరుగా జరిగాయి. ఏఐవైఎఫ్ నాయకులతో పాటుగా సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొని భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సీపీఐ నగర కార్యవర్గ సభ్యుడు అప్పరబోతు రాము, ప్రవీణ్ కుమార్, క్రాంతికుమార్, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.



మాధవరావు గ్రంథాలయం వద్ద భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నేతలు

సీఎం పర్యటనకు విస్తృత బందోబస్తు ఏర్పాట్లు

డీసీపీ విశాల్‌గున్ని



పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశమైన డీసీపీ విశాల్‌గున్ని

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): విద్యాధరపురం ఆర్టీసీ డిపో సమీపంలోని మినీ స్టేడియంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న ఐదో విడత వైఎస్సార్ వాహన మిత్ర పథకం విడుదల కార్యక్రమాన్ని ప్రారంభించడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రానుండటంతో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. గురువారం సభా ప్రాంతంలో పోలీసు అధికారులు, సిబ్బందితో డీసీపీ సమావేశమై బందోబస్తు విధులపై మార్గదర్శకాలు, సూచనలు చేశారు.

ఆయన మాట్లాడుతూ సీఎం హాజరయ్యే కార్యక్రమానికి సభా ప్రదేశం, పరిసర ప్రాంతాల్లో 1200 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రత, బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రముఖులకు, ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, అప్రమత్తతతో విధులు నిర్వహించాలని, సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎస్‌బీ ఏడీసీపీ జీవీ రమణమూర్తి, ట్రాఫిక్ ఏడీసీపీ డి.ప్రసాద్, పశ్చిమ ఏసీపీ కె.హనుమంతరావు, ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా గణపతి నగరోత్సవాలు



బాలగణపతి నగరోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని ఆలయాల్లో కొలువై ఉన్న గణనాథుల నగరోత్సవాలు గురువారం నేత్రపర్వంగా కొనసాగాయి. ఆలయాల్లో జరుగుతున్న స్వామి వారి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉత్సవమూర్తులను అంగరంగ వైభవంగా అలంకరించిన వాహనాలపై పాతబస్తీలో ఊరేగించారు. కెనాల్‌రోడ్డులోని శ్రీ వినాయక స్వామి దేవస్థానంలో స్వామి వారి ఉత్సవమూర్తికి నగరోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అందులో భాగంగా భేతాళ నృత్యాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు పొట్టి శ్రీహరి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పూజారి వారి వీధిలోని శ్రీ బాలగణపతి ఆలయం స్వామి వారిని గురువారం నగరోత్సవంలో ఊరేగించారు. నగరోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ జానపద కళారూపాలతో కళాకారులు అలరించారు. కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గ్రంధి శ్రీనివాసరావు, మామిడి వెంకటకృష్ణారావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్యను వేధిస్తున్న భర్తపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. జక్కంపూడి కాలనీ బ్లాక్ నెం 53లో కటారి రాజేశ్వరి, గోపి నివసిస్తున్నారు. వీరిది ప్రేమ వివాహం. గోపి సీలింగ్ పనులు చేస్తుంటాడు. కొంత కాలంగా గోపి మద్యానికి బానిసై భార్యను వేధిస్తున్నాడు. 27వ తేదీ రాత్రి ఇంటికి వచ్చిన గోపి భార్యను కొట్టసాగాడు. దీంతో రాజేశ్వరి తల్లి అడ్డురాగా ఆమెను కొట్టాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

తండ్రి అదృశ్యంపై...

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తండ్రి అదృశ్యం కావడంతో కుమారుడు కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా గురువారం కేసు నమోదు చేశారు. బ్రహ్మంగారి మఠంకు చెందిన బైరెడ్డి విద్యాసాగర్ చేపల మార్కెట్ వద్ద మెడికల్ షాపు నిర్వహిస్తుంటాడు. అతని తండ్రి సింహాచలం(70), తల్లి పద్మావతి కొడుకు వద్దే ఉంటారు. ఈ నెల 23వ తేదీ సింహాచలానికి భార్యతో చిన్న గొడవ జరగడంతో బయటకు వెళ్లి వస్తానని చెప్పాడు. సాయంత్రమైనా తండ్రి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన విద్యాసాగర్ తన తమ్ముడు, చెల్లెలను ఆరా తీసినా ఫలితం లేదు. తండ్రి కనిపించడం లేదంటూ అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



జోరుగా వర్షం

పటమట/ఆటోనగర్(విజయవాడతూర్పు): పగలంతా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన నగర వాసులకు సాయంత్రమయ్యే సరికి కురిసిన వర్షం ఉపశమనం కలిగింది. గురువారం నగరంలోని బందరు, ఏలూరు రోడ్డు, సాంబమూర్తి రోడ్డు, అజిత్‌సింగ్‌నగర్, కృష్ణలంక, పటమట ప్రాంతాల్లో రోడ్లు నీట మునిగాయి. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.

హరిత విప్లవ పితామహుడు స్వామినాథన్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ మరణం తీరని లోటని రాకేష్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఎన్వీ రావు తెలిపారు. కేఎల్‌రావునగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో గురువారం స్వామినాథన్ చిత్రపటం వద్ద ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. ఎన్వీరావు మాట్లాడుతూ వరి, గోధుమ వంగడాలపై స్వామినాథన్ పరిశోధనలు చేశారని, వాటి కారణంగా నేడు ఎన్నో మేలు జాతి వంగడాలు లభిస్తున్నాయని తెలిపారు. పర్యావరణానికి హాని కలిగించని ఉత్పత్తిని సాధించి ఎన్నో అవార్డులు, రివార్డులను అందుకున్నారని వివరించారు. అనంతరం ఆయన జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయిని రేణుకాదేవి, ఉపాధ్యాయులు మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేతన్నకు నగదు పరపతి

చేనేత కార్మికుల సంక్షేమం కోసం రూ.3,706 కోట్ల వ్యయం

- ఐదు విడతల్లో రూ.969.77 కోట్లు నేతన్న నేస్తం
- జిల్లా సహకార సంఘాల ద్వారా రూ.209 కోట్ల రుణాలు
- ముద్ర పథకం కింద మరో రూ.128 కోట్ల రుణాలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో చేనేత కుటుంబాలకు నేతన్న నేస్తంతోపాటు అనేక సంక్షేమ ఫలాలను అందిస్తున్న ప్రభుత్వం నగదు పరపతి కూడా సమకూరుస్తోంది. మగ్గాల ఆధునికీకరణతోపాటు చేనేత సామగ్రి కొనుగోలు, మార్కెటింగ్‌కు అనేక రూపాల్లో ఊతమిస్తోంది. చేనేత కుటుంబాలకు భరోసా ఇచ్చేలా వరుసగా ఐదు విడతల్లో నేతన్న నేస్తం ద్వారా రూ.969.77 కోట్లు అందించిన సంగతి తెలిసిందే. సొంత మగ్గం కలిగిన ప్రతి నేతన్నకూ ఏడాదికి రూ.24 వేలు చొప్పున ఐదు విడతల్లో రూ.1.20 లక్షలు అందించింది. ఈ పథకం అమలు తర్వాత చేనేత కార్మికులు తమ మగ్గాలను డబుల్ జాకార్డ్, జాకార్డ్ లిఫ్టింగ్ మెషిన్ తదితర ఆధునిక పరికరాలతో అప్‌గ్రేడ్ చేసి కొత్త డిజైన్లతో నాణ్యమైన వస్త్రాలను ఉత్పత్తి చేస్తూ జీవితాలను మెరుగుపర్చుకున్నారు. దీంతోపాటు నేతన్నల పెన్షన్ కోసం రూ.1,396.45 కోట్లు ఇచ్చింది. చేనేత రంగానికి ఊతమిచ్చేలా ఆప్కోకు రూ.468.84 కోట్లు (గత ప్రభుత్వ బకాయిలు రూ.103 కోట్లతో కలిపి) చెల్లించింది. నేతన్న నేస్తం, నేతన్న పెన్షన్, ఆప్కోకు సాయం వంటి మూడు పథకాల ద్వారానే నేతన్నల సంక్షేమం కోసం ప్రభుత్వం రూ.2,835.06 కోట్లను వెచ్చించింది. గత ప్రభుత్వం నేతన్నల కోసం ఐదేళ్లలో కేవలం రూ.442 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేవలం నాలుగేళ్లలోనే నవరత్నాలు తదితర సంక్షేమ పథకాల ద్వారా మొత్తం రూ.3,706 కోట్లు ఖర్చు చేయడం విశేషం. ఇవి కాకుండా బ్యాంకుల ద్వారా రుణాలు సైతం అందిస్తోంది.

సహకార బ్యాంకుల ద్వారా రుణాలు

వస్త్రాల ఉత్పత్తి, మార్కెటింగ్ కోసం ప్రాథమిక చేనేత కారుల సహకార సంఘా(పీహెచ్‌డబ్ల్యూసీఎస్)లకు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల ద్వారా ఆర్థిక సహకారం అందిస్తోంది. రాష్ట్రంలో 681 చేనేత సొసైటీలకు రూ.209.29 కోట్లు నగదు పరపతి (రుణాలు) అందించింది.

సహకార రుణాలు ఇలా..

సంవత్సరం	పీహెచ్‌డబ్ల్యూసీఎస్ సంఖ్య	రుణాలు (రూ.కోట్లలో)
2019-20	198	52.66
2020-21	164	52.52
2021-22	163	53.32
2022-23	156	50.79

బ్యాంకుల ద్వారా ముద్ర రుణాలు ఇలా..

ఏడాది	లబ్ధిదారుల సంఖ్య	రుణాలు (రూ.కోట్లలో)
2019-20	3,931	25.16
2020-21	5,115	29.92
2021-22	3,553	25.04
2022-23	4,854	40.53
2023-24 (ఆగస్టు వరకు)	952	7.87

క్లుప్తంగా...

స్వామినాథన్ మృతిపట్ల గవర్నర్ సంతాపం

సాక్షి, అమరావతి : ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, హరిత విప్లవ సృష్టికర్త ఎం.ఎస్.స్వామినాథన్ మృతి పట్ల గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ విచారం వ్యక్తం చేశారు. దేశంలో వరి, గోధుమల ఉత్పత్తి భారీగా పెరిగేలా హరిత విప్లవాన్ని తీసుకువచ్చి దేశానికి ఆయన నిరుపమాన సేవలు అందించారని కొనియాడారు. ఎం.ఎస్.స్వామినాథన్ కుటుంబ సభ్యులకు గవర్నర్ తన ప్రగాఢ సానుభూతి తెలిపారని రాజ్‌భవన్ వర్గాలు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నాయి.

బాబు ఎస్‌ఎల్‌పీలో మా వాదనలూ వినాలి

సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం కేవియట్



సాక్షి, న్యూఢిల్లీ : స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో అరెస్టయి, రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న టీడీపీ అధినేత, మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు సుప్రీం కోర్టులో దాఖలు చేసిన క్రిమినల్ ఎస్‌ఎల్‌పీలో ఏపీ ప్రభుత్వం కేవియట్ దాఖలు చేసింది. ఈ వ్యాజ్యంలో తమ వాదనలు కూడా వినాలని సుప్రీం కోర్టును కోరింది. చంద్రబాబు దాఖలు చేసిన ఎస్‌ఎల్‌పీ బుధవారం విచారణకు వచ్చినప్పటికీ ధర్మాసనంలో సభ్యుడిగా ఉండడానికి న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి నిరాకరించిన విషయం విదితమే. దీంతో ఈ వ్యాజ్యాన్ని అక్టోబరు 3న తగిన ధర్మాసనం ముందు జాబితా చేస్తామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ చెప్పడంతో ఏపీ ప్రభుత్వం తమ వాదనలు కూడా వినాలని కోరుతూ కేవియట్ దాఖలు చేసింది. కుంభకోణానికి సంబంధించి పూర్తి ఆధారాలతో వాదనలు వినిపిస్తామని, తమ వాదన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని కేవియట్ దాఖలు చేసింది.

చంద్రబాబు వెంట్రుక కూడా పీకలేరు

టీడీపీ ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి

సాక్షి, రాజమహేంద్రవరం: చంద్రబాబుపై పెట్టిన కేసులతో ఆయన వెంట్రుకలు కూడా పీకలేరని టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. 'డీజీపీ, అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి ప్రెస్‌మీట్‌లు పెట్టి చంద్రబాబుపై బురదజల్లుతున్నారు. కేసు విచారణలో ఉండగా ఇలా చేస్తారా?.. మీ మీద పరువునష్టం దావా వేస్తాం. మేం అధికారంలోకి వచ్చాక మీ అందరి ఆటలు కట్టిస్తాం...' అని ఆయన హెచ్చరించారు. రాజమండ్రిలోని లోకేశ్ శిబిరం వద్ద గురువారం బుచ్చయ్య చౌదరి విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ అరాచక పాలనపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకుల మీద తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా నిత్యం ప్రజల కోసం పరితపించే వ్యక్తిని జైల్లో పెట్టి మానసికంగా హింసిస్తున్నారని పేర్కొన్నారు. కాగా, స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైల్లో జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న చంద్రబాబు జైలు జీవితం గురువారం 19వ రోజుకు చేరింది. ఎప్పటిలాగే ఆయన దినచర్య కొనసాగింది. మరోవైపు రాజమండ్రి విద్యానగర్‌లోని లోకేశ్ శిబిరంలోనే నారా భువనేశ్వరి ఉన్నారు. ఆమెను పలువురు టీడీపీ నాయకులు కలిసి సంఘీభావం తెలిపారు.

లోకేశ్ ఢిల్లీకి పరారవడం సిగ్గుచేటు

ఏపీ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్

సాక్షి, అమరావతి: తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జరిగిన అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు కుంభకోణంలో పాత్రధారి అయిన లోకేశ్ విచారణ నుంచి తప్పించుకునేందుకు ఢిల్లీకి పరారవడం సిగ్గుచేటని ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. టీడీపీ హయాంలో ఇష్టారాజ్యంగా స్కాములకు పాల్పడిన తండ్రీకొడుకుల బాగోతాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయన్నారు. స్కిల్ స్కామ్‌లో పక్కా ఆధారాలతో సీఐడీ అరెస్టు చేయడంతో చంద్రబాబుకు కోర్టు రిమాండ్ విధించిందని పేర్కొన్నారు. ఇదే కుంభకోణంలో ఉన్న చంద్రబాబు ఆప్తులైన కొంత మంది విదేశాలకు పరారవ్వడం చూస్తే అక్రమాలు ఏ స్థాయిలో జరిగాయో అర్థమవుతోందని పేర్కొన్నారు.

ఎస్‌ఐ మెయిన్ పరీక్షలకు గడువు పెంచాలి: సీపీఎం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎస్‌ఐ మెయిన్ పరీక్షల నిర్వహణకు మరో రెండు నెలలు గడువు ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన గురువారం సీఎం జగన్‌కు బహిరంగ లేఖ రాశారు. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన ఎస్‌ఐ అభ్యర్థులకు ఈ నెల మొదటి వారం నుంచి 25వ తేదీ వరకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారని పేర్కొన్నారు. అక్టోబర్ 14, 15 తేదీల్లో మెయిన్ పరీక్షలు నిర్వహించను న్నారని తెలిపారు. ఫిజికల్ ఈవెంట్స్‌కు, మెయిన్ పరీక్షలకు మధ్య కేవలం 20 రోజుల మాత్రమే గడువు ఉండటంతో ప్రిపరేషన్‌కు ఇబ్బందిగా ఉంటుందని, సిలబస్ విస్తృతి దృష్ట్యా కనీసం రెండు నెలలైనా గడువు ఇవ్వాలని సీఎం జగన్‌కు విజ్ఞప్తి చేశారు.

న్యాయాధికారిపై తప్పుడు ప్రచారం చేసిన ఇద్దరి అరెస్టు

నెల్లూరు(క్రైమ్)/తాడేపల్లి రూరల్: ఏసీబీ కోర్టు న్యాయాధికారి హిమబిందుపై అవాస్తవాలు ప్రచారం చేసిన ఇద్దరిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. తిరుపతి జిల్లా వెంకటగిరికి చెందిన టీడీపీ కార్యకర్త కె.బాలాజీరావు.. వైఎస్సార్‌సీపీ నాయకురాలు హిమబిందురెడ్డి సోషల్ మీడియాలో పోస్టు చేసిన ఓ వీడియోను జడ్జి హిమబిందు పేరుతో వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేశాడు. న్యాయాధికారి పోస్టు చేసిన ఈ వీడియో న్యాయవ్యవస్థను కించపరచేలా ఉందని, ఇది హైకోర్టు, సుప్రీంకోర్టు వరకు చేరేలా షేర్ చేయాలని వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేశాడు. ఇది చూసిన నెల్లూరు జిల్లా వెంగళరావ్‌నగర్‌కు చెందిన కారు డ్రైవర్ వి.చంద్రశేఖర్ ఆ వీడియోలో మాట్లాడిన మహిళ జడ్జి కాదని, తప్పుడు ప్రచారం చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వాట్సాప్‌లో వీడియో పోస్టు చేసిన వ్యక్తి బాలాజీరావుగా గుర్తించిన పోలీసులు అరెస్టు చేశారు. కాగా, గుంటూరు జిల్లా వడ్డేశ్వరానికి చెందిన చావలి విజయకుమార్ కూడా చంద్రబాబు అరెస్టు, విచారణ నేపథ్యంలో ఏసీబీ కోర్టు న్యాయాధికారి హిమబిందుపై సోషల్ మీడియాలో అవాస్తవాలు ప్రచారం చేశాడు. తాడేపల్లి పోలీసులు గురువారం అతడ్ని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. విజయ్‌కుమార్ ఓ యూట్యూబ్ చానల్‌లో విలేకరిగా పనిచేస్తున్నట్లు ఎస్‌ఐ గిరిబాబు తెలిపారు.

అపాయింట్‌మెంట్ ప్లీజ్!

ఢిల్లీలో లోకేశ్ ఎదురుచూపులు



సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి: చంద్రబాబు అరెస్టుపై జాతీయ స్థాయిలో మద్దతు కూడగట్టేందుకంటూ ఢిల్లీకి వచ్చిన టీడీపీ నేత లోకేశ్ అక్టోబర్ 3న సుప్రీంకోర్టులో ఎస్‌ఎల్‌పీ పై విచారణ జరిగే వరకూ ఇక్కడే ఉండాలని నిర్ణయించినట్లు సమాచారం. ఓ పక్క న్యాయ నిపుణులతో చర్చలు, మరో పక్క జాతీయ నేతల అపాయింట్‌మెంట్ల కోసం ఎదురుచూపులతో లోకేశ్‌కు రోజులు గడిచిపోతున్నాయి. తనని ఎక్కడైనా ఎప్పుడైనా అరెస్టు చేసుకోవచ్చంటూ ఇటీవల లోకేశ్ చేసిన వ్యాఖ్యలు మేకపోతు గాంభీర్యమేనని రాజకీయవర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏసీబీ కోర్టు, హైకోర్టు, సుప్రీంకోర్టులో విచారణకు వచ్చాక కూడా న్యాయనిపుణులు సూచనలు చేయడానికి ఇంకా ఏముంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. చంద్రబాబు అరెస్టుపై ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో ఏపీలో ఉండి చోద్యం చూసే కన్నా ఢిల్లీలో ఏదో హడావుడి నటిస్తుంటే సరిపోతుందని భావిస్తున్నట్లు సమాచారం. లోకేశ్ ఢిల్లీలోనే ఉన్నారని తెలిసినా జాతీయ నేతలెవరూ స్పందించడం లేదు. మరోవైపు టీడీపీ వర్గాలు మాత్రం పలువురు జాతీయ నేతల అపాయింట్‌మెంట్‌ల కోసం ఎక్కేమెట్టు దిగేమెట్టు అన్నట్లుగా తిరుగుతూనే ఉన్నాయి.

లోకేశ్ పాదయాత్ర మళ్లీ వాయిదా

టీడీపీ నాయకుడు లోకేశ్ తన పాదయాత్రను మళ్లీ వాయిదా వేసుకున్నారు. తన తండ్రి చంద్రబాబు అరెస్టుతో ఈ నెల 9వ తేదీన ఆయన పాదయాత్రను నిలిపివేశారు. రెండు రోజులు రాజమండ్రిలో ఉండి ఆ తర్వాత హుటాహుటిన ఢిల్లీ వెళ్లిన ఆయన ప్రస్తుతం అక్కడే ఉంటున్నారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలో అరెస్టు భయంతోనే ఆయన ఢిల్లీ వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఈ నెల 29 నుంచి పాదయాత్ర పునఃప్రారంభిస్తానని ప్రకటించారు. కానీ దాన్ని మళ్లీ వాయిదా వేస్తున్నట్లు గురువారం టీడీపీ వర్గాలు ప్రకటించాయి. అక్టోబర్ 3న స్కిల్ డెవలప్‌మెంట్ కేసుపై సుప్రీంకోర్టులో వాదనలు ఉన్నందున ఆయన పాదయాత్రను వాయిదా వేసుకున్నట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

అక్రమాల డ్రెడ్జింగ్!

- వివాదాల మయంగా డ్రెడ్జింగ్ కార్పొరేషన్
- నకిలీ ధ్రువీకరణ పత్రాలతో డీసీఐలో ఉన్నతాధికారి పోస్టు
- ఇదే ఆరోపణలపై సస్పెండైన గత ఎండీ
- పోర్టుల మంత్రిత్వ శాఖకు ఫిర్యాదుల వెల్లువ
- డీసీఐని దెబ్బకొట్టేలా ఓ సంస్థకు లబ్ధి చేకూర్చినట్టు ఆరోపణలు



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డీసీఐ) నిత్యం వివాదాల మయంగా మారుతోంది. ఎప్పటికప్పుడు తప్పులు చేస్తూ.. సంస్థ పరువును బంగాళాఖాతంలో కలిపేసేలా వ్యవహారాలు జరుగుతున్నాయి. కీలకమైన పోస్టు ఎంపిక విషయంలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నకిలీ సర్టిఫికెట్లతో సంస్థ ఎండీ, సీఈవోగా బాధ్యతలు చేపట్టిన జీవైవీ విక్టర్ అదే సంస్థను కోట్లాది రూపాయల నష్టాల ఊబిలో కూరుకుపోయేలా చేశారు. నిండా మునిగిన తర్వాత తేరుకున్న ఉన్నతాధికారులు విక్టర్‌ని విధుల నుంచి తప్పించారు. తాజాగా ఓ ఉన్నతాధికారి పోస్టును కూడా అదేమాదిరిగా కట్టబెట్టారు. ఇప్పుడు ఆయన నియామకంపైనా వివాదం ముదురుతోంది.

షిప్పులో డెక్ కేడెట్‌గా చేరి..

సదరు వ్యక్తి 1987లో ఎస్సీ కోటా స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా షిప్పులో డెక్ కేడెట్‌గా డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌లో చేరారు. 2009లో డీజీఎంగా పదోన్నతి పొంది.. పట్టుమని పది నెలలైనా పని చెయ్యకుండా డీసీఐకు రాజీనామా చేసేశారు. డీసీఐ ప్రత్యర్థి సంస్థగా చెప్పుకునే మెర్కటర్ సంస్థలో డీజీఎం ఆపరేషన్స్‌గా జాయిన్ అయ్యారు. రెండున్నర సంవత్సరాలు పనిచేసి.. తిరిగి 2012లో డీసీఐకి వచ్చేశారు. ఈ సమయంలో డీసీఐలో తిరిగి చేరినప్పుడు విద్యార్హతలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాల్ని సమర్పించారు. ఇక్కడే ఆయన బండారం బట్టబయలయ్యింది.

బీకామ్‌గా అబద్ధాలు

2020 ఆగస్టులో ఉన్నతాధికారి పోస్టుకు డ్రెడ్జింగ్ కార్పొరేషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. సదరు అధికారి ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన హిందు రిలీజియన్‌గా దరఖాస్తులో పేర్కొన్నారు. అయితే.. సదరు అధికారి ఆ సమయంలో విశాఖలోని యూనియన్ చాపెల్ బాప్టిస్ట్ చర్చ్‌కి వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. క్రిస్టియన్‌గా ఉంటూ ఉద్యోగం కోసం చేసిన దరఖాస్తులో మాత్రం హిందూగా పేర్కొన్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా.. 2012లోనే బీకామ్ పాసైనట్టు అప్లికేషన్‌తో పాటు సర్టిఫికెట్ సమర్పించారు. దీనిపైనా విమర్శలు వచ్చిన నేపథ్యంలో బీకామ్ సర్టిఫికెట్ కూడా నకిలీదని తేలినట్టు తెలిసింది. డిగ్రీ కూడా చేయని వ్యక్తిని.. కేవలం ఇంటర్ విద్యార్హత ఉన్న వ్యక్తికి ఉన్నతాధికారి హోదాను కట్టబెట్టేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతోపాటు తాను పనిచేసిన మెర్కటర్ సంస్థ డీసీఐకి అనుబంధ సంస్థగా దరఖాస్తులో పేర్కొన్నారు. కానీ.. సదరు సంస్థ డీసీఐకు పూర్తి ప్రత్యర్థి సంస్థ. ఇలా.. విద్యార్హత నుంచి ప్రతి అంశాన్ని తప్పుగా చూపిస్తూ.. కీలక బాధ్యతల్ని దక్కించుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

డీసీఐకి నష్టం చేకూర్చారంటూ ఫిర్యాదుల వెల్లువ

సదరు ఉన్నతాధికారి డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌కి రాజీనామా చేసి మెర్కటర్ సంస్థలో చేరిన తర్వాత డీసీఐకి నష్టం వాటిల్లేలా వ్యవహరించినట్టు కొందరు ఉద్యోగులు ఆధారాలు సేకరించారు. డీసీఐలో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో పోటీ సంస్థ అయిన మెర్కటర్ సుమారుగా రూ.800 కోట్ల విలువైన పనులను డీసీఐ కంటే 5 శాతం వరకు అధికంగా కోట్ చేసి దక్కించుకుంది. దీనివెనుక సదరు అధికారి హస్తం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా.. ఓవైపు జీఎంగా పనిచేస్తూనే మరోవైపు లీగల్ సెల్ బాధ్యతల్ని కూడా పర్యవేక్షించిన సదరు అధికారి రూ.50 కోట్ల విలువైన ఆర్బిట్రేషన్‌ను మెర్కటర్‌కు దక్కేలా చేశారనీ.. ఈ విధంగా లబ్ధి చేకూర్చడం వల్లే.. మెర్కటర్ సంస్థ సదరు ఉన్నతాధికారికి డీజీఎం బాధ్యతలు అప్పగించిందని తెలుస్తోంది. ఇలా ప్రతి విషయంలోనూ సదరు అధికారికి సంబంధించిన నియామకం వెనుక అక్రమాల జాబితాలను జత చేస్తూ కేంద్ర పోర్టుల మంత్రిత్వ శాఖతో పాటు సీబీఐకి కూడా కొందరు ఉద్యోగులు ఫిర్యాదు చేసినట్టు తెలుస్తోంది.

కలవరపెడుతున్న కాంతి

- శబ్ద, వాయు కాలుష్యాలతోపాటు లైట్ పొల్యూషన్
- ఎలక్ట్రానిక్ వస్తువులు, కారు హెడ్‌లైట్, హోర్డింగ్‌ల వెలుగులతో అనారోగ్యం
- ఎక్కువసేపు కృత్రిమ కాంతిలో ఉండేవారికి అజీర్తి సమస్యలు
- పొంచిఉన్న మధుమేహం ముప్పు
- తాజా అధ్యయనంలో వెల్లడి



సాక్షి, అమరావతి: ప్రపంచంలో ఇప్పుడు హాట్ టాపిక్.. వాయు కాలుష్యం. అలాగే శబ్ద కాలుష్యం గురించి కూడా మనకు తెలుసు. వీటితో తలెత్తే అనర్థాలపైన కూడా అవగాహన ఉంది. అయితే కాంతి కాలుష్యం (లైట్ పొల్యూషన్) గురించి మాత్రం అంతగా తెలియదు. అయితే దీనితో కూడా ప్రమాదమేనని తాజా అధ్యయనంలో వెల్లడైంది. కాంతి కాలుష్యంపై తమ దేశంలో నిర్వహించిన పరిశోధనను చైనా తాజాగా వెల్లడించింది. కొన్ని లక్షల మందిపై పరిశోధన చేసి అధ్యయన ఫలితాలను విడుదల చేసింది. ఇందులో షాకింగ్ విషయాలు వెల్లడయ్యాయి. కాంతి కాలుష్యం కారణంగా చైనాలో 90 లక్షల మంది మధుమేహ బాధితులుగా మారారని ఆ అధ్యయనం బాంబుపేల్చింది. వీరంతా చైనాలోని 162 నగరాల్లో నివసిస్తున్నారు.

కాంతి కాలుష్యంతో ఏం జరుగుతుంది?

అధిక కాంతి వల్ల కాంతి కాలుష్యం ఏర్పడుతుంది. ఉదాహరణకు పండుగల సమయంలో రంగు రంగుల్లో మెరిసే దీపాలు మిరుమిట్లు గొలిపే కాంతులు విరజిమ్ముతుంటాయి. ఇవి కాంతి కాలుష్యానికి కారణమవుతున్నాయి. అలాగే అన్ని రకాల కృత్రిమ కాంతి, మొబైల్ ఫోన్, ల్యాప్‌టాప్, ఎల్‌ఈడీ, కారు హెడ్‌లైట్, హోర్డింగ్‌ల నుంచి వచ్చే ప్రకాశవంతమైన కాంతి కూడా కాలుష్యాన్ని వెదజల్లుతోంది. ముఖ్యంగా ఈ కాంతి కాలుష్యం వ్యక్తి శరీరాన్ని క్రమంగా ప్రభావితం చేస్తోందని అధ్యయనం తెలిపింది. అంతేకాకుండా మధుమేహ బాధితులుగా మారుస్తోందని పరిశోధకులు వెల్లడించారు. వీధి దీపాలు, స్మార్ట్ ఫోన్‌లు వంటి అన్ని కృత్రిమ లైట్లు మధుమేహం వచ్చే ప్రమాదాన్ని 25 శాతం పెంచుతాయని స్పష్టమైంది. రాత్రిపూట కూడా మనకు పగటి అనుభూతిని కలిగించే ఈ లైట్లు మానవుల శరీర చక్రాన్ని మారుస్తాయని.. అంతేకాకుండా క్రమంగా ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయని పరిశోధకులు పేర్కొంటున్నారు. దీని కారణంగా రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించే మన శరీర సామర్థ్యం తగ్గుతుందని చెబుతున్నారు. ప్రపంచ జనాభాలో 80% మంది రాత్రిపూట చీకటిలో కాంతి కాలుష్యం బారిన పడుతున్నారని కూడా తెలిపారు. పరిశోధన ప్రకారం.. చీకటిలో కన్నా ఎక్కువసేపు కృత్రిమ కాంతిలో ఉండేవారిలో 28 శాతం మందికి అజీర్తి సమస్యలు ఉన్నాయని తేలింది. శరీరంలో మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తి తగ్గడమే దీనికి కారణం. వాస్తవానికి ఈ హార్మోన్ మన జీవక్రియ వ్యవస్థను చక్కగా ఉంచుతుంది. ఎక్కువసేపు వెలుతురులో ఉండడం వల్ల ఏమీ తినకుండానే శరీరంలో గ్లూకోజ్ స్థాయి పెరుగుతోందని పరిశోధకులు వెల్లడించారు.

మన దేశంలో తలసరి ఉద్గారాలు తక్కువే..

ప్రపంచంలో చైనా, అమెరికా, ఈయూల తర్వాత అధిక కర్బన ఉద్గారాలు వెదజల్లుతున్న దేశాల్లో భారత్ నాలుగో స్థానంలో ఉంది. అయితే మనదేశంలో అధిక జనాభా ఉండడం వల్ల తలసరి ఉద్గారాలు మిగతా ప్రధాన దేశాలతో పోలిస్తే తక్కువ. 2030 నాటికల్లా దేశ ఇంధన శక్తిలో 50 శాతాన్ని పునరుత్పాదక వనరుల నుంచే పొందాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే అదే సంవత్సరానికి కర్బన ఉద్గారాలను వంద కోట్ల టన్నులు తగ్గించాలని నిర్దేశించుకుంది. దీనికి అనుగుణంగా మన రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి, వినియోగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వ్యవసాయానికి తొమ్మిది గంటల ఉచిత విద్యుత్ ఇవ్వడానికి సౌర విద్యుత్‌పై దృష్టి సారిస్తోంది. దాదాపు 43,250 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో కాంతి కాలుష్యంపైనా భవిష్యత్తులో దృష్టి సారించాల్సిన అవసరం ఉందని తాజా అధ్యయనం హెచ్చరిస్తోంది.

వ్యవసాయరంగ గతిని మార్చిన మహనీయుడు స్వామినాథన్

ఆయన మరణ వార్త విని చాలా బాధపడ్డాను
ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి : భారతదేశ హరిత విప్లవ పితామహుడు డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ మృతి భారతీయ వ్యవసాయ రంగానికి తీరని లోటు. స్వామినాథన్ మరణ వార్త విని నేను చాలా బాధపడ్డాను. నా హృదయాన్ని తీవ్రంగా కలిచివేసింది. దేశానికి ఆహారం అందించడంలో ఆయన అంకితభావం, నిబద్ధత భారత దేశంలో వ్యవసాయాన్నే మార్చాయి. ప్రస్తుత కాలంలో పెరుగుతున్న వినియోగానికి అనుగుణంగా ఉత్పత్తిని పెంచడంపై దృష్టి పెట్టాల్సిన అవసరం వచ్చినప్పుడు డాక్టర్ స్వామినాథన్ కృషి, వారసత్వం మనందరికీ మార్గనిర్దేశం, స్ఫూర్తిని అందిస్తాయి. పద్మవిభూషణ్, మెగసెసె అవార్డు గ్రహీత ఎం.ఎస్. స్వామినాథన్ వ్యవసాయ రంగానికి చేసిన కృషి అనిర్వచనీయం. ఆయన కృషే దేశాన్ని ఆహారోత్పత్తిలో బలోపేతం చేసింది.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను సుసంపన్నం చేసింది. భారతీయ వ్యవసాయ రంగంలో స్వామినాథన్ చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచి ఉంటాయి.

– వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ముఖ్యమంత్రి
(ఈ మేరకు సీఎం ఎక్స్(ట్విట్టర్)లో పోస్ట్ చేశారు)

వరి వంగడాల సృష్టికర్త స్వామినాథన్

హరిత విప్లవ పితామహుడు, వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్. స్వామినాథన్ మృతి వ్యవసాయ రంగానికి తీరని లోటు. ఆహార వృద్ధిలో భారత్ స్వయం సమృద్ధి సాధించేందుకు స్వామినాథన్ ఎంతో కృషిచేశారు. తన పరిశోధనలతో వరి వంగడాలు సృష్టించారు. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్, రామన్ మెగసెసె లాంటి ఎన్నో పురస్కారాలను అందుకున్న మహోన్నత వ్యక్తి ఆయన.

– వైవీ సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త
(స్వామినాథన్ కుమార్తె సౌమ్య స్వామినాథన్‌ను ఫోన్లో పరామర్శించారు)

హరితవిప్లవ పితామహుడిని దేశం ఎప్పటికీ మరువదు

దేశంలో హరిత విప్లవానికి నాంది పలికిన ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ మృతి బాధాకరం. పంటల దిగుబడిని పెంచడమే లక్ష్యంగా వ్యవసాయ రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి దేశం ఇవాళ పచ్చగా ఉండడం వెనుక డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ చేసిన ఉత్కృష్ట కృషిని ప్రజలు ఎప్పటికీ మరువరు. 1960 దశకంలో కరువు కోరల్లో చిక్కుకున్న భారత వ్యవసాయరంగాన్ని ఒంటి చేత్తో స్వయం సమృద్ధివైపునకు మరల్చడంలో ఈ హరితవిప్లవ పితామహుడు అందించిన సేవలు అమోఘం.

–బుగ్గన రాజేంద్రనాథ్, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి

స్వామినాథన్ స్ఫూర్తితోనే ఏపీలో సంస్కరణలు

భారతీయ జన్యుశాస్త్ర నిపుణుడు, హరిత విప్లవ పితామహుడు డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ మృతి భారతీయ వ్యవసాయ రంగానికి తీరని లోటు. రైతుల ఆత్మహత్యల నివారణకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆచరణలో పెట్టి అన్నదాతల కుటుంబాలను ఆదుకున్నారు. స్వామినాథన్ స్ఫూర్తితోనే సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో ఎన్నో విప్లవాత్మక సంస్కరణలకు నాంది పలికారు. స్వామినాథన్ ఫౌండేషన్ అమలుచేస్తున్న హబ్ అండ్ స్పోక్ మోడల్ స్ఫూర్తితోనే ఏపీలో టోల్ ఫ్రీ నంబర్‌తో ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ ఏర్పాటుచేశాం. రైతు క్షేత్రానికి పరిశోధన ఫలాలు (ల్యాబ్ టూ ల్యాండ్) అందించాలన్న స్వామినాథన్ స్ఫూర్తితోనే ఆర్బీకే వ్యవస్థను ఏర్పాటుచేశాం. ఆర్బీకేల ద్వారా విత్తు నుంచి విక్రయం వరకు రైతులకు అండగా నిలవడమే కాదు.. వాటిని గ్రామ విజ్ఞాన కేంద్రాలుగా తీర్చిదిద్దాం. – కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వ్యవసాయ మంత్రి

వ్యవసాయ రంగానికి విశేష సేవలు

భారతీయ వ్యవసాయ రంగానికి డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ విశేష సేవలందించారు. తన పరిశోధనలతో ఎన్నో వరి వంగడాలను సృష్టించారు. ఆహార వృద్ధిలో దేశం స్వయం సమృద్ధి సాధించేందుకు స్వామినాథన్ చేసిన కృషి అనిర్వచనీయం. ఆయన మరణం వ్యవసాయ రంగానికి తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా. – ఎంవీఎస్ నాగిరెడ్డి, ఏపీ వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్

స్వామినాథన్ జీవితం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకం

హరిత విప్లవ పితామహుడు ఎం.ఎస్.స్వామినాథన్ మృతి వ్యవసాయ రంగానికి, వ్యవసాయ విశ్వవిద్యాలయాలకు తీరని లోటు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు బీజం వేసిన మహనీయుడు. వ్యవసాయ రంగానికి ఆధునిక సాంకేతికతను జోడించి ఉత్పాదకతను పెంచేందుకు ఆయన చేసిన పరిశోధనలు ఎంతగానో తోడ్పాటునందించాయి. స్వామినాథన్ సిఫార్సు మేరకు దేశవ్యాప్తంగా గ్రామ విజ్ఞాన కేంద్రాలు నిర్వహిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం ఆర్బీకే వ్యవస్థకు నాంది పలికింది. ఆయన స్ఫూర్తితోనే ఏపీ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బోధన, పరిశోధనల్లో ఎన్నో మార్పులు, సంస్కరణలు తీసుకొచ్చాం

– డాక్టర్ ఆర్.శారదాజయలక్ష్మి, వీసీ, ఏపీ ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ

ప్రపంచానికి తీరని లోటు

ప్రపంచ ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ మృతి పర్యావరణ ప్రపంచానికి తీరనిలోటు. వ్యవసాయ రంగానికి ఆయన ఎనలేని సేవలు అందించారు. ఇటీవలే నేను మద్రాస్ ఈస్ట్ రోటరీ క్లబ్ వారిచే డాక్టర్ ఎం.ఎస్ స్వామినాథన్ అవార్డు అందుకున్నా. అదేరోజు స్వామినాథన్‌ను కలుసుకుని ఆయన ఆశీర్వాదాలు తీసుకోవడం అదృష్టంగా భావిస్తున్నా.

– టి.విజయకుమార్, ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్, రైతు సాధికార సంస్థ

నిత్యకృషీవలుడు స్వామినాథన్

హరితవిప్లవ పితామహుడు ఎం.ఎస్.స్వామినాథన్ మృతి తీరనిలోటు. రైతుకు అధిక దిగుబడినిచ్చే మేలైన గోధుమ, వరి వంగడాల సృష్టికర్త ఆయన. ఆయన పరిశోధనలు తక్కువ ఆదాయ రైతులు ఎక్కువ దిగుబడిని ఉత్పత్తి చేయడానికి ఎంతో సహాయపడ్డాయి. సాగు పెట్టుబడికి కనీసం 50 శాతం కలిపి మద్దతు ధర ప్రకటించాలని చేసిన సిఫార్సు ద్వారా ఆయన ప్రసిద్ధిగాంచారు.

– డీపీ వేణుమాధవరావు, కేవీ సత్యనారాయణ,
అధ్యక్ష, కార్యదర్శులు, ఏపీ వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం

ఆహార భద్రత చేకూర్చిన మహా మేధావి

ఫిలిప్పీన్స్‌లో ఐఆర్‌ఆర్‌ఐ డైరెక్టర్‌గా అనేక అధిక దిగుబడి వరి వంగడాలు రూపొందించి వివిధ దేశాల్లో ఆహార భద్రత చేకూర్చిన మహా మేధావి ఎం.ఎస్.స్వామినాథన్. రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వాలకు ఎంతో విలువైన సూచనలందించిన మహోన్నత మానవతావాది ఆయన. వ్యవసాయ రంగం సంక్షోభాన్ని గట్టెక్కాలన్నా, గ్రామీణ ప్రజానీకం ఆత్మగౌరవంతో బతకగలగాలన్నా స్వామినాథన్ సిఫార్సులతోనే సాధ్యం.

– వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబు, అధ్యక్ష, కార్యదర్శులు, ఏపీ కౌలు రైతు సంఘం

రైతుల క్షేమం కోసం పరితపించిన మహనీయుడు

స్వామినాథన్ మృతి పట్ల ఏపీ ప్రభుత్వం ఘన నివాళి

సాక్షి, అమరావతి: రైతుల క్షేమం కోసం పరితపించిన మహనీయుడు.. దేశంలో వ్యవసాయ ఉత్పత్తిని గణనీయంగా పెంచాలని నిత్యం తపించిన హరిత విప్లవ పితామహుడు ఎం.ఎస్.స్వామినాథన్ అని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొనియాడింది. ఆయన మృతి దేశంలోని రైతులకు తీరని లోటు అని సంతాపం తెలుపుతూ గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. రైతుల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించిన సందర్భంగా ఎం.ఎస్.స్వామినాథన్ చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర ప్రభుత్వం ఈ సందర్భంగా గుర్తు చేసుకుంది. 'రైతుల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చక్కటి కార్యక్రమాలు చేపడుతున్నారు. దేశానికి వెన్నెముక లాంటి రైతుల బాగు కోసం ఆలోచిస్తున్న ముఖ్యమంత్రికి నా కృతజ్ఞతలు. ప్రతి రైతుకూ వ్యవసాయ పరిజ్ఞానం అందించాలనే ఆలోచనకు రూపం అందించే విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగడం నిజంగా సంతోషకరం' అంటూ స్వామినాథన్ ఇచ్చిన ప్రశంసను గుర్తు చేసుకుంటూ ఆ మహనీయుడి మృతికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నివాళులర్పించింది.

ఎన్‌ఈపీ సారథులు ఏపీ విద్యార్థులు

జాతీయ విద్యా విధానం లక్ష్యాల సాధనలో భాగస్వామ్యం

- రాష్ట్రంలో 8 కాలేజీల నుంచి 23 మంది విద్యార్థులకు అవకాశం
- ఈ విద్యార్థులకు ఎన్‌ఈపీ అంబాసిడర్లుగా గుర్తింపు
- సంస్కరణలపై విద్యార్థులను చైతన్య పరచనున్న అంబాసిడర్లు
- ఈవెంట్‌లు, డిబేట్లు, పోటీలు, క్విజ్‌లు తదితరాల నిర్వహణ
- సోషల్ మీడియా ద్వారా కూడా ప్రచారాలు
- కాలేజీల్లో ఎన్‌ఈపీ హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు



ప్రతిభగల విద్యార్థుల ఎంపిక

సాక్షి, అమరావతి: నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్‌ఈపీ)–2020 అమలులో విద్యార్థులను భాగస్వామ్యం చేసే లక్ష్యంతో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఇటీవల 'ఎన్‌ఈపీ సారథి' అనే కొత్త కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఈ కార్యక్రమం అమలు కోసం ఉన్నత విద్యా సంస్థల విద్యార్థులను ఎంపిక చేసింది. తాజాగా వారి జాబితాను ప్రకటించింది. ఎన్‌ఈపీ సారథులుగా ఎంపికైన వీరిని ఎన్‌ఈపీ అంబాసిడర్లుగా వ్యవహరించనున్నారు. జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ) అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, యూనివర్సిటీలు, వివిధ ఉన్నత విద్యాసంస్థలకు చెందిన వైస్‌చాన్స్‌లర్‌లు, డైరెక్టర్లు ప్రిన్సిపాళ్లు క్రియాశీల పాత్ర పోషిస్తున్నారు. ఇప్పుడు ఆయా విద్యాసంస్థల్లో విద్యార్థులను కూడా ఇందులో భాగస్వామ్యం చేయడం ద్వారా ఎన్‌ఈపీ లక్ష్యాలను మరింత సులభంగా సాధించగలుగుతామని యూజీసీ భావిస్తోంది. మన రాష్ట్రం నుంచి 8 కాలేజీలకు చెందిన 23 మంది విద్యార్థులకు ఈ అవకాశం దక్కింది. సర్టిఫికెట్, డిప్లొమో, యూజీ, పీజీ విద్యార్థులను ఈ కార్యక్రమానికి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమం ద్వారా ఎన్‌ఈపీ లక్ష్యాల సాధనలో విద్యార్థులను నిమగ్నం చేయడం, ఉన్నత విద్యారంగంలో సంస్కరణలపై విద్యార్థుల్లో అవగాహన పెంచడం లక్ష్యంగా యూజీసీ దీనికి శ్రీకారం చుట్టింది. విద్యా సంస్కరణలు విజయవంతంగా అమలు కావడానికి విద్యార్థుల ప్రమేయం, వారిలో నిబద్ధత చాలా ముఖ్యమైనవని, అప్పుడే ఇది విజయవంతం అవుతుందని యూజీసీ అభిప్రాయపడుతోంది. ఈవెంట్లు, డిబేట్లు, పోటీలు, క్విజ్‌లు వంటి కార్యక్రమాలను కాలేజీల్లో నిర్వహించేలా కార్యక్రమాలు రూపొందించింది. అలాగే సోషల్ మీడియా ద్వారా ఎన్‌ఈపీపై ప్రచారం చేయడం, కాలేజీల్లో ఎన్‌ఈపీ హెల్ప్ డెస్కుల ఏర్పాటు తదితర కార్యక్రమాలు చేపట్టనున్నారు.

ఎన్‌ఈపీ అంబాసిడర్‌గా యూనివర్సిటీలు, విద్యాసంస్థలు తమ సంస్థల్లో అత్యుత్తమ వ్యక్తిత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సామర్థ్యాలు, సృజనాత్మకత, బాధ్యతాయుత ప్రవర్తన, నాయకత్వ పటిమ ఉన్న ముగ్గురు విద్యార్థులను నామినేట్ చేశాయి. వారి నుంచి యూజీసీ అర్హులైన వారిని ఎంపిక చేసి ఎన్‌ఈపీ అంబాసిడర్లుగా ప్రకటించింది. వీరి విధుల్లో ఎన్‌ఈపీ– 2020 కార్యక్రమాలపై ఇతర విద్యార్థులకు అవగాహన పెంచడం, క్రియాశీల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, విద్యార్థుల సమస్యలను పరిష్కరించడం ప్రధానమైనవి. అంతేగాక ఈ కార్యక్రమం అమలుపై యూజీసీకి ఫీడ్‌బ్యాక్‌ను అందించాలి. అంబాసిడర్‌గా ఎంపికైన వారికి యూజీసీ గుర్తింపు సర్టిఫికెట్ ఇస్తుంది. ఈ సర్టిఫికెట్‌తో వారికి ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. సర్టిఫికెట్‌తో పాటు యూజీసీ ఆన్‌లైన్ ప్రోగ్రామ్‌లు, ఇతర అవకాశాలను కూడా వారు పొందుతారు. అలాగే ఈ అనుభవం వారికి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విద్యాకోర్సుల అభ్యాసానికి సహకరిస్తుంది.

ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికైన విద్యార్థులు

కాలేజీ	విద్యార్థులు
గాయత్రి విద్యాపరిషత్ కాలేజీ	కె.శ్రీరామ్ కౌశిక్
--	ఎస్. సూర్య దీపక్
--	షేక్ బషీర్ మహ్మద్
ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కాలేజీ	ఆదిరెడ్డి జాహ్నవి వాగ్దేవి
--	సాహితీ పల్లవీ రెడ్డి
--	నక్కా శశాంక్
సిద్దార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ	వి. జాహ్నవి
--	జ్ఞాన దీపిక
--	జీఎస్ ఆకాశ్
సెవెన్‌హిల్స్ కాలేజీ ఆఫ్ ఫార్మసీ	బి. జాహ్నవి
--	కొప్పెర్ల అనూష
--	పులి తిరుమల
క్రియా యూనివర్సిటీ	ప్రణీత్ మండలిక
--	హరిణి భాటియా
రామచంద్ర కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్	పి.జయప్రకాశ్‌నారాయణ్
--	ఎస్.గౌతమి సాయి
--	ఎన్.ప్రభాస్
వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ	మామిళ్ల మాధురి
--	రాజీవ్ చౌదరి రావుల
--	సంగు వెంకట ప్రశాంత్‌రెడ్డి
ఎస్ఆర్ఎం యూనివర్సిటీ	సాయిచరిత రంగిశెట్టి
--	నిశాంత్ తివారీ
--	నివేదా శ్రీరామ్

రైతుల కోసం కనీస మద్దతు ధరల చట్టం

- ఎమ్మెస్పీ చట్టం తెస్తున్న తొలి రాష్ట్రం ఏపీ
- ప్రతి పంటకూ గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యం
- రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి
- జాతీయ సదస్సులో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



జాతీయ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా త్వరలో కనీస మద్దతు ధరల చట్టం తీసుకొస్తున్నట్టు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వెల్లడించారు. ఇలాంటి చట్టం తెస్తున్న తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలవబోతోందన్నారు. 'భారతదేశం అభివృద్ధి చెందుతున్న గ్లోబల్ ఫుడ్ హబ్–స్థిరమైన పంట రక్షణ పరిష్కారాల పాత్ర' అనే అంశంపై ఢిల్లీలో గురువారం జరిగిన జాతీయ సదస్సులో మంత్రి కాకాణి మాట్లాడారు. నాలుగేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిందన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి సాధించేలా రైతులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఎన్నో చర్యలు చేపట్టామన్నారు. రైతును చేయిపట్టి నడిపించేందుకు గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన ఆర్బీకే వ్యవస్థ అనతి కాలంలోనే అంతర్జాతీయ ఖ్యాతి గడిచిందన్నారు. సర్టిఫై చేసిన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను ఆర్బీకేల ద్వారా రైతుల ముంగిట చేరుస్తున్నామన్నారు. పంట ఉత్పత్తులను సైతం ఆర్బీకేల ద్వారా నేరుగా వ్యవసాయ భూముల్లోనే కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తూ రైతులకు అండగా నిలుస్తున్నామన్నారు.

ఎక్కడా లేనివిధంగా ధరల స్థిరీకరణ నిధి

దేశంలో ఎక్కడా లేనివిధంగా రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేశామని మంత్రి కాకాణి వెల్లడించారు. సీఎం యాప్ ద్వారా మార్కెట్ ధరలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ధర పతనమైన ప్రతిసారి మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్ కింద జోక్యం చేసుకుని వ్యాపారులతో పోటీ పడి మరీ కొనుగోలు చేస్తూ రైతులకు ఎమ్మెస్పీ దక్కేలా చేస్తున్నామన్నారు. ఈ–క్రాపింగ్, యూనివర్సల్ కవరేజి కింద ఉచిత పంటల బీమా దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. బేయర్ క్రాప్ సైన్స్ లీడ్ శ్రీనివాస్ కరవాడి, ఫార్మింగ్టన్ చీఫ్ ఫౌండర్ సంగీతా బోజప్ప, సింజెంటా ఇండియా చీఫ్ సస్టైనబులిటీ ఆఫీసర్ కైసీ రవి తదితరులు మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో ఏపీలో తీసుకొచ్చిన సంస్కరణలు, అనుసరిస్తున్న విధానాలు అద్భుతంగా ఉన్నాయన్నారు.

రూ.1,712.21 కోట్ల ప్రాధాన్యత పనులు మంజూరు

ఇప్పటికే రూ.537.77 కోట్ల విలువైన పనులు పూర్తి

- ప్రాధాన్యత పనులను వేగవంతం చేయండి
- జిల్లా కలెక్టర్లకు సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో మంత్రులు, ఎమ్మెల్యేలు గుర్తించిన ప్రాధాన్యత పనుల్లో ఇప్పటికే రూ.537.77 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లోని 15,004 సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మౌలిక సదుపాయాల అంతరాలను గుర్తించి ప్రాధాన్య పనులుగా చేపడుతున్నారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు తమ తమ నియోజకవర్గ పరిధిలోని సచివాలయాలను సందర్శిస్తున్న సందర్భంగా ఒక్కో సచివాలయ పరిధిలో అత్యంత ప్రాధాన్యత గల పనుల కోసం రూ.20 లక్షల చొప్పున రూ.3000 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. పూర్తయిన పనులకు బిల్లులూ చెల్లిస్తోంది. ఇప్పటి వరకు 9,381 సచివాలయాల పరిధిలో గుర్తించిన రూ.1,876.20 కోట్ల విలువైన 50,117 పనులను పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు. ఇందులో ఇప్పటికే 8,562 సచివాలయాల పరిధిలో రూ.1,712.21 కోట్ల విలువైన 43,685 ప్రాధాన్యత పనులు మంజూరు చేయగా.. 7,702 సచివాలయాల పరిధిలో 39,089 పనులను ప్రారంభించారు. పనులను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడం, వాటిని వెంటనే మంజూరు చేయడం, అనంతరం వాటిని ప్రారంభించడం నిరంతర ప్రక్రియగా కొనసాగుతోంది. ఈ విషయంలో వెనుకబడిన జిల్లాల్లో కలెక్టర్లు సమీక్షించి త్వరగా పనులు మంజూరు చేయించి, ప్రారంభింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. అత్యంత ప్రాధాన్యత పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఎంపీడీవోలను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.

గిరిజన మహిళా రైతుకు 'ఫ్లేవర్ ఆఫ్ ఇండియా ది ఫైన్ కప్'

సాక్షి, పాడేరు: బెంగళూరులో మూడు రోజుల పాటు జరిగిన ప్రపంచ కాఫీ సదస్సు–2023లో నాణ్యమైన కాఫీ గింజల ఉత్పత్తిలో అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన ఆదివాసీ మహిళా రైతు కిల్లో అశ్విని అవార్డు పొందారు. అరాబిక్ పార్చ్‌మెంట్ కాఫీ గింజల విభాగంలోని అన్ని ఫార్మెట్లలో నాణ్యమైన కాఫీ గింజలుగా అశ్విని పండించిన కాఫీ గింజలను జ్యూరీలోని అధికారుల బృందం గుర్తించింది. దేశంలోని 10 రాష్ట్రాల పరిధిలో సాగైన కాఫీ గింజలను ప్రదర్శించారు. మన రాష్ట్రానికి సంబంధించి 124 మంది గిరిజన రైతులు పార్చ్‌మెంట్ కాఫీ గింజల శాంపిళ్లను ప్రదర్శించారు. వీటిలో పెదబయలు మండలం కప్పాడ గ్రామానికి చెందిన ఆదివాసీ రైతు అశ్విని పండించిన కాఫీ గింజలు నాణ్యతలో భారత్‌లోనే నంబర్ వన్‌గా నిలిచాయని కాఫీ ప్రాజెక్ట్ అధికార వర్గాలు తెలిపాయి. దీంతో 'ఫ్లేవర్ ఆఫ్ ఇండియా ది ఫైన్ కప్ అవార్డు–2023' అశ్వినిని వరించింది. పలు దేశాలకు చెందిన ప్రతినిధులు, కేంద్ర కాఫీ బోర్డు ఉన్నతాధికారుల చేతుల మీదుగా ఆమె భర్త గాసన్న ఈ అవార్డును అందుకున్నారు. కాఫీ గింజల ఉత్తమ నాణ్యత అవార్డు రావడంపై కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్, కేంద్ర కాఫీ బోర్డు డీడీ రమేష్, ఐటీడీఏ కాఫీ ఏడీ అశోక్ హర్షం వ్యక్తం చేశారు.



బెస్ట్ కాఫీ గింజల అవార్డు పొందిన ఆదివాసీ మహిళా కాఫీ రైతు కిల్లో అశ్విని



బెంగళూరు వేదికపై ఫ్లేవర్ ఆఫ్ ఇండియా ది ఫైన్ కప్ అవార్డు అందుకుంటున్న అశ్విని భర్త గాసన్న

జిల్లా వార్తలు

మునివేళ్ల మాయావి

మునివేళ్ల మాయావి ఆయన.. చేతి వేళ్లనే కుంచెగా మార్చుకున్న కళా'కృష్ణుడు' ఆయన.. ఒకపక్క పిల్లలకు చిత్రకళలో పాఠాలు బోధిస్తూనే.. కొత్త కళలో అద్భుతాలు ఆవిష్కరించిన సృష్టికర్త. బ్రష్ లేకుండా చేతివేళ్లతో 13.26 గంటల్లో 100 చిత్రాలు పూర్తిచేసి ప్రపంచ రికార్డు నెలకొల్పిన నేర్పరి. 'నేను నా చేతులను నమ్ముకున్నాను.. అవి నన్ను నిలబెట్టాయి' అని గర్వంగా చెప్పుకునే ఫింగర్ పెయింటింగ్ కళాకారుడు ఆత్మకూరు రామకృష్ణపై స్పెషల్ స్టోరీ.. – కృష్ణాడెస్క్



రామకృష్ణ రూపొందించిన వివిధ రకాల చిత్రాలు

ఐదు వేళ్లనే అస్త్రాలుగా మార్చుకున్న కళాకారుడు | ఉపాధ్యాయుడిగా పాఠాలు బోధిస్తూనే అద్భుతాలు | ఫింగర్ పెయింటింగ్‌లో ప్రపంచస్థాయి గుర్తింపు



చేతివేళ్లతో చిత్రాలు గీస్తున్న కేంద్రియ విద్యాలయం ఉపాధ్యాయుడు ఆత్మకూరు రామకృష్ణ

'ఆర్ట్'టచింగ్ స్టోరీ..

గుంటుపల్లి కేంద్రియ విద్యాలయంలో డ్రాయింగ్ టీచర్‌గా పని చేస్తున్న ఆత్మకూరు రామకృష్ణ చేతివేళ్లను కుంచెగా చేసుకుని, జీవం ఉట్టిపడే అద్భుత చిత్రాలు గీస్తున్నారు. తన చిత్రాలు సమాజానికి సైతం పరిచయం చేస్తూ ఎందరో విద్యార్థులకు నేర్పుతున్నారు. సుమారు 15 ఏళ్లుగా ఎటువంటి సాధనాలు లేకుండా ఫింగర్స్(చేతివేళ్లు)తో ఆయిల్ కలర్స్ ఉపయోగించి రసమయ హృదయాలు హత్తుకునేలా సృజనతో కూడిన కళాకృతులకు జీవం పోశారు. అంతటితో ఆగకుండా తాను వేసిన చిత్రాలను వీడియోలుగా మార్చుచేసి యూట్యూబ్ ద్వారా ప్రదర్శనలు ఇచ్చారు. పెయింటింగ్‌తో పాటు అనేక గ్రంథాలు రచించారు.



రాత్రి వేళ ప్రకృతి అందాలు

సమాజానికి సందేశం..

ఆత్మకూరు రామకృష్ణ జేఎన్టీయూ లలితకళల కళాశాల నుంచి బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో డిగ్రీ పొందారు. అప్పటి రాష్ట్ర గవర్నర్ కృష్ణకాంత్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నారు. జాతీయ సమగ్రత, సమాజంలో రుగ్మతలు రూపుమాపే ఆవశ్యకతను తెలియజేసే చిత్రాలు వేశారు. వీటితో పాటు మేరా భారత్ మహాన్ సంగీత విద్వాంసులు, ట్రైబల్ ఆఫ్ ఇండియా, దేశ నాయకులు, ఇండియన్ నోబెల్ ప్రైజెస్, ప్రకృతి అందాలు తన చేతివేళ్లను బ్రష్‌గా చేసుకుని కళాత్మక దృశ్యాలు కళ్లకు కట్టినట్లు తీర్చిదిద్దారు.



సంగీత విద్వాంసుడు పండిట్ శివకుమార్ శర్మ చిత్రం

అవార్డులు.. రివార్డులు..


బెంగళూరు కేంద్రియ విద్యాలయంలో 2010లో నిర్వహించిన ఫింగర్ పెయింటింగ్ మారథాన్‌లో పాల్గొని అరుదైన రికార్డు నెలకొల్పారు. 24గంటల్లో 100చిత్రాలు బ్రష్ లేకుండా చేతివేళ్లతో వేసే ప్రయత్నం చేయగా.. 13.26గంటల్లో 100 చిత్రాలు పూర్తిచేశారు. నాటి సాహసాన్ని మెచ్చి పలు సంస్థలు ప్రశంసా పత్రాన్ని అందజేసి సత్కరించాయి. తదనంతరం లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌తో పాటు 14 జాతీయ అంతర్జాతీయ అవార్డులు సాధించాడు. కేంద్రియ విద్యాలయం ద్వారా రీజనల్ అవార్డు, జైహో భారతీయం, తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా సంస్థ తెలుగురత్నం బిరుదు ప్రదానం చేసింది.

వీడియోల్లోకి రూపాంతరం..

దృశ్య కళల్లో ఒకటైన చిత్రలేఖనాన్ని నాలుగు గోడల మధ్య కాకుండా ప్రపంచానికి పరిచయం చేయాలని భావించారు. తాను గీసిన చిత్రాలను వీడియో రూపంలోకి మార్పు చేశారు. కమ్యూనికేషన్ రంగాలైన మీడియా, సోషల్ మీడియాను అందిపుచ్చుకుని ఫింగర్ పెయింటింగ్‌ను మరింత ప్రాచుర్యంలోకి తీసుకువచ్చారు. 2021లో రోజుకొక్క ఎపిసోడ్ చొప్పున 100 ఎపిసోడ్‌లు మీడియా ద్వారా ప్రేక్షకులకు పరిచయం చేశారు.

రచయిత కూడా..

పెయింటింగ్‌తో కళారూపాలు తయారుచేసే రామకృష్ణ సమాజాన్ని జాగృతం చేసే అనేక గ్రంథాలు రచించారు. తాను గీసిన చిత్రకళకు స్ఫూర్తిగా 'ఫింగర్ పెయింటింగ్ మారథాన్' పేరుతో గ్రంథం రచించారు. ఈ పుస్తకం ప్రపంచ రికార్డు సృష్టించింది. దీర్ఘ కావ్యాలు, చేతిరాతపై 'హస్తలేఖనం ఓ కళ' అనే శాస్త్ర గ్రంథాన్ని రచించి డాక్టర్ కేఎల్ రావు జాతీయ పురస్కారం అందుకున్నారు. 'నేను నా చేతులు నమ్ముకున్నాను.. అవి నన్ను నిలబెట్టాయి' అని గర్వంగా చెప్పుకుంటారు.



ప్రకృతి అందాల మధ్య గౌతమ బుద్ధుడు కళారూపం

'వాహన మిత్ర'ల ఆప్తమిత్రుడు సీఎం వైఎస్ జగన్

రాష్ట్ర మంత్రి జోగి రమేష్



ఆటో నడుపుతున్న మంత్రి జోగి రమేష్ (ఫైల్)

పెడన: బతుకు బండి లాగుతూ కుటుంబాలను పోషించుకుంటున్న డ్రైవర్ అన్నదమ్ములకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆప్తమిత్రుడిగా ఉంటున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. సొంత వాహనం కలిగిన ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు ఇన్సూరెన్స్, ఫిట్నెస్ సర్టిఫికెట్, వాహన మరమ్మతులు, ఇతర అవసరాల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.10 వేలు ఆర్థిక సహాయంగా అందిస్తున్న మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. విజయవాడలో శుక్రవారం నిర్వహించే కార్యక్రమంలో వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా అర్హులైన డ్రైవర్ల బ్యాంకు ఖాతాల్లో ముఖ్యమంత్రి కంప్యూటర్ బటన్ నొక్కి వరుసగా ఐదో విడత నగదు జమ చేయనున్నారని పేర్కొన్నారు. అర్హత కలిగి ఏదైనా సాంకేతిక కారణాలతో ఈ పథకం లబ్ధి చేకూరని వాహన యజమానులు ఎవరైనా మిగిలి ఉంటే వారు దగ్గరలోని సచివాలయంలో సంప్రదించి మరల తిరిగి దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించినట్టు గురువారం మంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

నగరాన.. జడివాన



గురువారం కురిసిన వర్షం బెజవాడ నగరవాసులకు కాస్త ఉపశమనం కలిగించింది. సాయంత్రం నగరమంతా ఆహ్లాద వాతావరణం చోటుచేసుకుంది. జోరున కురిసిన వానకు ప్రధాన రహదారులపై నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. దీంతో వీఎంసీ ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం సిబ్బంది ఎయిర్‌టెక్ యంత్రాలతో నీటిని తోడేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

'వాహనమిత్ర'లకు ఆర్థిక భరోసా



వైఎస్సార్ వాహనమిత్ర చెక్కు అందుకుంటున్న లబ్ధిదారులు(ఫైల్)

- వాహనమిత్ర లబ్ధిదారులకు నేడు నిధుల విడుదల
- కృష్ణా జిల్లాలో 10,609 మందికి రూ.10.60 కోట్ల లబ్ధి
- ఎన్టీఆర్ జిల్లాలో 15,065 మందికి రూ.15.06 కోట్ల లబ్ధి
- నేడు లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో 5వ విడత ఆర్థికసాయం జమ

చిలకలపూడి(మచిలీపట్నం): 'మీ కష్టాలు చూశాను.. బాధలు విన్నాను.. మీకు అండగా నేను ఉన్నాను..' అంటూ ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆటోలు, టాక్సీలు నడుపుతున్న ఓనర్లు, డ్రైవర్లకు ఏటా ఆర్థిక సాయం అందజేసి ఆదుకుంటున్నారు. వైఎస్సార్ వాహనమిత్ర పథకం కింద ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం చేస్తున్నారు. పాదయాత్ర సమయంలో వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, ఇన్సూరెన్స్‌లు భారంగా మారాయన్న ఆటో, క్యాబ్ ఓనర్లు, డ్రైవర్ల ఆవేదనకు స్పందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాను అధికారంలోకి వచ్చిన వెంటనే సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ హామీని నెరవేర్చేందుకు వైఎస్సార్ వాహన మిత్ర పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇన్సూరెన్స్ ప్రీమియం, ఫిట్‌నెస్ ఫీజు మొదలైన ఖర్చులు వాహన యజమానులు, డ్రైవర్లకు భారం కాకుండా ఉండేందుకు వాహన మిత్ర పథకం కింద వారి బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారు. 2019 అక్టోబర్ నాలుగో తేదీన ప్రారంభించిన ఈ పథకం నిరాటంకంగా అమలవుతోంది. ఇప్పటికీ నాలుగు విడతలుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమయైంది. విజయవాడ విద్యాధరపురం మినీ స్టేడియంలో శుక్రవారం జరిగే వాహనమిత్ర కార్యక్రమంలో లబ్ధి దారుల బ్యాంక్ ఖాతాల్లో ఐదో విడత నగదును సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జమచేయనున్నారు.

నాలుగు విడతలు వాహనమిత్ర పంపిణీ

వైఎస్సార్ వాహనమిత్ర పథకం 2019వ సంవత్సరంలో ప్రారంభించిన నాటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రమం తప్పకుండా లబ్ధిదారులకు నగదును అందజేస్తున్నారు. 2019 – 20 సంవత్సరంలో ఉమ్మడి కృష్ణాజిల్లాలో 26,702 మందికి రూ.26.70 కోట్లు, 2020–21 సంవత్సరంలో 29,965 మందికి రూ.29.96 కోట్లు నగదు జమ చేశారు. 2021–22 సంవత్సరంలో 27,165 మందికి రూ.27.16 కోట్లు, 2022–23 సంవత్సరంలో నూతనంగా ఏర్పడిన కృష్ణాజిల్లాలో 10,597 మందికి రూ.10.59 కోట్లు అందజేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 10,609 మంది బ్యాంక్ ఖాతాల్లో శుక్రవారం రూ.10.60 కోట్లు జమకానున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో 15,065 మంది లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో రూ.15.6 కోట్లు జమకానున్నాయి.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక



వైఎస్సార్ వాహనమిత్ర పథకం కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేశాం. ఐదో విడత నగదు పంపిణీ జిల్లా స్థాయి కార్యక్రమం కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ హాలులో జరుగుతుంది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ పి.రాజాబాబు, పలువురు అధికారులు హాజరవుతారు.

– ఎం.సీతాపతిరావు, కృష్ణా జిల్లా రవాణాధికారి

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి



రామవరప్పాడు: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందిన ఘటన గురువారం ఎనికేపాడులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని మహేశ్వరి లాడ్జి ఎదురుగా సుమారు 60 సంవత్సరాలు కలిగిన మహిళను గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తలకు తీవ్రగాయాలై మృతి చెందింది. గులాబీ రంగు రవిక, బ్లూ కలర్ చీర ధరించి ఉంది. సమాచారం అందుకున్న పటమట పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతి చెందిన మహిళ ఆచూకీ తెలిసిన వారు పటమట పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

యువర్స్

● మ్యూజిక్ వరల్డ్

గీతాంజలి



తన యూనిక్ స్టైల్‌తో నటిగా మంచి పేరు తెచ్చుకున్న అంజలి శివరామన్ చక్కని గాయని కూడా. 'నా నటనకు గానం అనేది ఎంతో ఉపయోగపడింది. క్రమశిక్షణతో ఉండడానికి కారణం అయింది. నన్ను నేను వ్యక్తీకరించుకునే సాధనం అయింది' అంటుంది అంజలి. సింగర్ చిత్ర అయ్యర్ కూతురైన అంజలికి చిన్నప్పటి నుంచే స్వరాలతో స్నేహం ఏర్పడింది. స్కూల్ ఫంక్షన్‌ల నుంచి ఫ్యామిలీ ఫంక్షన్‌ల వరకు అంజలి పాట వినిపించాల్సిందే. పాటలు అంటే ఇష్టం ఉన్నప్పటికీ మ్యూజిక్ క్లాస్‌కు తరచుగా బంక్ కొట్టేది. ఆ తరువాత మాత్రం సంగీత శిక్షణ ప్రాముఖ్యత తెలుసుకొని ప్రతిరోజూ క్లాస్‌కు తప్పకుండా హాజరయ్యేది.
'సంగీతం నా రక్తంలోనే ఉంది' అంటుంది అంజలి, అంజలి నోట పాట విన్న వారు...'అమేజింగ్ వాయిస్' అనకుండా ఉండలేరు.
'జాజ్ బ్లూస్ తన స్టైల్ ఆఫ్ మ్యూజిక్'గా చెబుతుంది అంజలి. ముంబైలోని ఒక మ్యూజిక్ స్టూడియోలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న అంజలి యాదృచ్ఛికంగా నటనరంగంలోకి వచ్చింది. మోడలింగ్, టీవీ కమర్షియల్స్ ద్వారా గుర్తింపు పొందిన అంజలి క్రైమ్ డ్రామా థ్రిల్లర్ 'క్లాస్'లో లీడ్‌రోల్ పోషించింది. సుహాని అహుజా పాత్రతో మంచి మార్కులు కొట్టేసింది.

అవును...ఇది నిజమే!



● 1987లో స్పైడర్-మ్యాన్, మేరీ జేన్‌ల వివాహాన్ని ప్రచురణ సంస్థ మార్వెల్ కామిక్స్ ఘనంగా జరిపించింది. కాల్పనిక క్యారెక్టర్‌లకు పెళ్లి ఏమిటి? అనుకుంటున్నారా! మరి అదే ఈ పెళ్లి ప్రత్యేకత. ఫిక్షన్, రియాలిటీకి మధ్య హద్దులను చెరిపేయడానికి ఇట్టి వివాహాన్ని తలపెట్టారు. న్యూయార్క్‌లో జరిపిన ఈ మాక్ సెర్మనీకి హీరోల నుంచి మొదలు స్పైడర్-మ్యాన్ ఫ్యాన్స్ వరకు ఎందరో హాజరయ్యారు.
● సింగర్ టేలర్ స్విఫ్ట్‌పై స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీ(యూఎస్) ఇంగ్లీష్ డిపార్టుమెంట్ ఒక కోర్సును రూపొందించింది. ఈ కోర్సులో భాగంగా విద్యార్థులు టేలర్ ఆల్బమ్స్, లిరిక్స్‌కు క్లాసిక్ లిటరేచర్‌కు మధ్య ఉండే సారూప్యతను విశ్లేషించాల్సి ఉంటుంది.

● ఇంగ్లీష్ ఇడియమ్స్

ది రియల్ మెకాయ్



చెప్పిన విషయం వాస్తవమే అబద్ధం కాదు, ఈ వస్తువు ఒరిజినలే...ఇలాంటి సందర్భంలో ఉపయోగించే మాట...ది రియల్ మెకాయ్. ఉదా: వుయ్ హ్యావ్ సీన్ సో మెనీ రీప్రొడక్షన్స్ ఆఫ్ ది మోనాలీసా, బట్ వెన్ వుయ్ వర్ ఇన్ ప్యారిస్ వుయ్ సా ది రియల్ మెకాయ్.

● సక్సెస్ స్టోరీ



నంబర్‌వన్ కుర్రాళ్లు

బెంగళూరుకు చెందిన కైవల్య వోహ్రా, ముంబైకి చెందిన అదిత్ పలీచా స్టాన్‌ఫర్డ్ యూనివర్శిటీ(యూఎస్)లో కంప్యూటర్ సైన్స్ డిగ్రీని మధ్యలోనే వదిలేసి 'ఏదైనా సాధించాలి' అనే లక్ష్యంతో స్వదేశానికి వచ్చారు. 'జెప్టో' స్టార్టప్‌తో తిరుగులేని విజయాన్ని సాధించారు.
తాజాగా లింక్డిన్ 'టాప్ 25 స్టార్టప్'ల జాబితాలో ఇ-కామర్స్ గ్రాసరీ ప్లాట్‌ఫామ్ 'జెప్టో' మొదటి స్థానంలో నిలిచింది. చిన్న వయసులోనే తమ స్టార్టప్ 'జెప్టో'ను యూనికార్న్ స్టేటస్‌కు తీసుకెళ్లిన కైవల్య వోహ్రా, అదిత్ పలీచాలు యువతకు స్ఫూర్తిని ఇస్తున్నారు...

లాక్‌డౌన్ సమయంలో తమకు అవసరమైన వస్తువులు అందుబాటులో ఉంటే బహుశా 'జెప్టో' స్టార్టప్ పుట్టేది కాదేమో. ఆ సమయంలో ముంబైలోని అద్దె ఇంట్లో ఉంటున్న కైవల్య వోహ్రా, అదిత్ పలీచాలు నిత్యావసర వస్తువులకు బాగా ఇబ్బంది పడ్డారు. ఆ ఇబ్బందుల్లో నుంచే 'కిరాణామార్ట్' స్టార్టప్ పుట్టింది. ఇదే ఆ తరువాత 'జెప్టో' రూపంలో విశ్వరూపాన్ని చూపించింది.

తిరుగు లేని విజయాలు సాధించడానికి వయసు అడ్డు కాదని, అనుభవం అత్యవసరం కానక్కర్లేదని, కృషి పట్టుదల ఉంటే సరిపోతుందని 'జెప్టో' అసాధారణ విజయం నిరూపించింది. ఆరోజుల్లోకి వెళితే...

'మాకు సవాలు విసిరిన టైమ్ అది. నిజానికి కిరాణాషాప్‌ల గురించి మాకు అంతగా తెలియదు. క్రాష్ కోర్సులు కాలేజీల్లోనే కాదు వాటికి అవతల కూడా ఉంటాయి! రోజూ పొద్దున్నే పది నుంచి ఇరవై కిరాణాషాప్‌లకు వెళ్లి యజమానులతో వివరంగా మాట్లాడి మా కాన్సెప్ట్ చెప్పేవాళ్లం. పిల్లలేదో చెబుతున్నారు...విందాం...అన్నట్లుగా వినేవారు తప్ప మాపై వారికి అంతగా నమ్మకం ఉన్నట్లుగా అనిపించేది కాదు. మా యాప్‌ను కొద్దిమంది మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవడానికి అంగీకరించేవారు' అని గతాన్ని గుర్తు తెచ్చుకుంటాడు కైవల్య వోహ్రా.

పరిస్థితులను చూస్తుంటే...

'అబ్బే ఇదేదో మనకు వర్కవుట్ అయ్యేట్లు లేదు. మిత్రమా...రథం వెనుక్కు మళ్లించు' అనుకునే పరిస్థితి. కానీ వారు వెనక్కి తగ్గలేదు. ఎందుకంటే 'సక్సెస్ మంత్రా'లో ఒక రూల్....యుద్ధం చేయకుండానే ఓటమిని అంగీకరించకు. రణస్థలి వరకు మాత్రమే వెళ్లారు. ఇంకా యుద్ధం మొదలే కాలేదు.

వారి కృషి ఫలితంగా మెల్లగా యాప్ ఊపందుకుంది.

'ఇక సాధించినట్లే' అనే సంతృప్తితో తబ్బిబ్బై ఉంటే ఆ సంతోషం ఆ సమయానికే పరిమితమై ఉండేదేమో! కాని వారు ' ఇది చాలు' అనుకోలేదు. ' ఇంకా కావాలి' అనుకున్నారు. మళ్లీ కిరాణాదుకాణాల బాట పట్టారు. సలహాలు, సూచనలకు సంబంధించి యజమానుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. వస్తువులను డెలివరీ చేసిన ప్రతిసారీ కస్టమర్‌తో మాట్లాడేవారు. వారికి నచ్చింది ఏమిటి? నచ్చంది ఏమిటి? అడిగే తెలుసుకునేవారు.

వారి 'అనుభవ జ్ఞానం' అనే పుస్తకంలో ఒకప్పుడు అన్నీ తెల్ల పేజీలే! ఇప్పుడు అవి విలువైన అనుభవాలతో కూడిన అక్షరాలు, పాఠాలు అయ్యాయి.

'ఇక సాధించినట్లే' అనే సంతృప్తితో తబ్బిబ్బై ఉంటే ఆ సంతోషం ఆ సమయానికే పరిమితమై ఉండేదేమో! కాని వారు 'ఇది చాలు' అనుకోలేదు. ' ఇంకా కావాలి' అనుకున్నారు. మళ్లీ కిరాణదుకాణాల బాట పట్టారు. సలహాలు, సూచనలకు సంబంధించి యజమానుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. వస్తువులను డెలివరి చేసిన ప్రతిసారీ కస్టమర్‌తో మాట్లాడేవారు. వారికి నచ్చింది ఏమిటి? నచ్చంది ఏమిటి? అడిగే తెలుసుకునేవారు. వారి 'అనుభవ జ్ఞానం' అనే పుస్తకంలో ఒకప్పుడు అన్నీ తెల్ల పేజీలే! ఇప్పుడు అవి విలువైన అనుభవాలతో కూడిన అక్షరాలు, పాఠాలు అయ్యాయి.

ఇప్పుడు...

'జెప్టో' మన దేశంలోని ప్రధాన నగరాలలో మూడు వేలకు పైగా గ్రాసరీ ప్రాడక్ట్స్‌ను డెలివరీ చేస్తుంది. గంటలు దాటని, కస్టమర్ ఓపికను పరీక్షించని అతి తక్కువ సమయ డెలివరీ టైమ్‌ను నిర్దేశించుకుంది. ఇద్దరితో మొదలైన 'జెప్టో'లో ఇప్పుడు వెయ్యిమంది ఉద్యోగులు ఉన్నారు.

'జెప్టో' సక్సెస్‌లో 'యూజర్ ఎక్స్‌పీరియెన్స్' కీలక భూమిక పోషించింది,

'విజయానికి త్యాగానికి సంబంధం ఉందా?' అని అడిగితే 'కచ్చితంగా ఉంది' అంటాడు కైవల్య వోహ్రా.

'ఏ వయసు ముచ్చట ఆ వయసులో' అంటారు. ఆడిపాడాల్సిన రోజుల్లో, సినిమాలు, షికార్లు, స్నేహితులే ప్రధాన మనిపించే రోజుల్లో అన్నీ విడిచిపెట్టి 'మా స్టార్టపే మా ప్రపంచం' అన్నట్లుగా పగలు,రాత్రి కష్టపడ్డారు.

'మనం ఒక రంగంలో విజయం సాధించాలంటే మన ఇష్టాలకు దూరంగా ఉండక తప్పదు. దీన్ని త్యాగం అనుకోవచ్చు' అంటాడు కైవల్య వోహ్రా.

మన దేశ గ్రాసరీ సెగ్మెంట్‌లో తమదైన ముద్ర వేసిన కైవల్య వోహ్రా, అదిత్ పలీచాలు 'యంగెస్ట్ సెల్ఫ్-మేడ్ మిలీయనీర్స్'గా యువతకు స్ఫూర్తిని ఇస్తున్నారు.

● టెక్.. టాక్

లావా బ్లేజ్ ప్రో 5జీ



డిస్‌ప్లే: 6.78 అంగుళాలు ఫ్రంట్ కెమెరా: 8-మెగా పిక్సెల్స్ ర్యామ్: 8జీబి స్టోరేజీ: 128జీబి బ్యాటరీ: 5000 ఎంఏహెచ్ వోఎస్: ఆండ్రాయిడ్ 13 రిజల్యూషన్: 1080×2460 పిక్సెల్స్ రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్

మైక్రోసాఫ్ట్ స్విఫ్ట్‌కీలో కొత్త ఏఐ ఫీచర్‌లు



మైక్రోసాఫ్ట్ తమ పాపులర్ కీబోర్డ్ యాప్ స్విఫ్ట్‌కీలో కొత్త ఏఐ ఆధారిత ఫీచర్‌లను(ఐవోఎస్, ఆండ్రాయిడ్) యాడ్ చేసింది. కొత్త ఏఐ-పవర్డ్ కెమెరా లెన్సెస్‌తో వీడియోలు, ఫొటోలు, జీఐఎఫ్‌లను యూజర్‌లు క్రియేట్ చేయవచ్చు. వీటిలో 250కి పైగా టూల్స్, ఫిల్టర్స్ ఉన్నాయి. 'లెన్సెస్'ను ఉపయోగించడానికి బింగ్ టూల్‌బార్ ఎడమ వైపున ఉన్న త్రీ డాట్స్‌ను ట్యాప్ చేసి 'కెమెరా'ను సెలెక్ట్ చేయాలి.

బింగ్ ఇమేజ్ జనరేటర్(పవర్డ్ బై డాల్-ఇ)కు షార్ట్‌కట్ కూడా యాడ్ చేసింది స్విఫ్ట్‌కీ. డిస్క్రిప్షన్‌లో టైప్ చేయడం ద్వారా బింగ్ ఇమేజ్ క్రియేటర్‌తో ఇమేజ్‌లను జనరేట్ చేయవచ్చు. పర్సనలైజ్‌డ్ స్టిక్కర్‌లను క్రియేట్ చేసి, సెండ్ చేయడానికి న్యూ స్టిక్కర్ జెనరేషన్ టూల్‌ను యాడ్ చేసింది మైక్రోసాఫ్ట్.

గోప్రో హీరో 12 బ్లాక్ కెమెరా



వీడియో రిజల్యూషన్: 5.3కె60, 4కె120 మరియు 2.7కె240
● వాటర్‌ప్రూఫ్ ● బ్లూటూత్ ● ప్రో-లెవెల్ ఫీచర్స్
● న్యూ హెచ్‌డీఆర్ (హై డైనమిక్ రేంజ్) 5.3కె అండ్ 4కె వీడియో ● వాటర్-రిపెలెంట్ లెన్స్ కవర్ ● బిల్ట్-ఇన్ హరైజన్ లాక్ ● లార్జర్ ఇమేజ్ సెన్సర్

యూట్యూబ్ క్రియేట్



క్రియేటర్‌ల కోసం యూట్యూబ్ 'యూట్యూబ్ క్రియేట్' అనే కొత్త యాప్‌ను తీసుకువచ్చింది. షార్ట్, లాంగ్ వీడియోలను రూపొందించడానికి అనువైన ఉచిత టూల్స్ దీనిలో ఉంటాయి. ఎడిటింగ్ ప్రాసెస్‌లో క్రియేటర్‌లకు ఇది సహాయపడుతుంది. మూడు వేల మంది క్రియేటర్‌లతో మాట్లాడి ఆ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ఈ యాప్‌ను రూపొందించారు. ఈ యాప్‌లో వేలాది స్టిక్కర్లు, జీఐఎఫ్, రకరకాల ఎఫెక్ట్‌లు అందుబాటులో ఉంటాయి. యూట్యూబ్ లైబ్రరీ రాయల్టీ-ఫ్రీ ట్రాక్స్‌తో 'క్రియేట్' యాప్ యాక్సెస్ కలిగిస్తుంది. దీని ద్వారా క్రియేటర్‌లు వేలాది పాటలను ఉపయోగించుకోవడానికి వీలవుతుంది. ఆడియో క్లీనప్‌కు కూడా ఈ యాప్‌ను ఉపయోగించుకోవచ్చు. అవసరం లేని బ్యాక్‌గ్రౌండ్ సౌండ్స్‌ను తొలగించవచ్చు. వీడియోకు ఆటోమేటిక్‌గా కాప్షన్‌ను జెనరేట్ చేయవచ్చు.

స్వాప్‌కార్ట్ యుఎస్‌బీ రీడింగ్ ల్యాంప్



బ్రాండ్: స్వాప్‌కార్ట్ స్టైల్: మోడ్రన్
ప్రొడక్ట్ డైమెన్షన్స్: 5డీ×5 డబ్ల్యూ× 5 హెచ్ సెంటీమీటర్స్
కలర్: సిల్వర్ మెటీరియల్: మెటల్ లైట్‌సోర్స్: ఎల్ఈడీ

సినిమా



● రణ్‌బీర్ కపూర్

నాకన్నా చెడ్డవాడు లేడు!

తండ్రీకొడుకుల అనుబంధం నేపథ్యంలో రూపొందిన హిందీ చిత్రం 'యానిమల్'. రణ్‌బీర్ కపూర్ హీరోగా నటించిన ఈ సినిమాలో రష్మికా మందన్నా హీరోయిన్. అనిల్ కపూర్, బాబీ డియోల్, త్రిప్తి దిమ్రీ ముఖ్య పాత్రలు చేశారు. భూషణ్‌కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా, క్రిషణ్ కుమార్, మురాద్ ఖేతని నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 1న విడుదల కానుంది. గురువారం రణ్‌బీర్ బర్త్ డే సందర్భంగా 'యానిమల్' టీజర్‌ను రిలీజ్ చేశారు. 'జ్యోతి... క్రిమినల్‌ను కన్నాం మనం.. (అనిల్ కపూర్), 'మై ఫాదర్ ఈజ్ ది బెస్ట్ ఫాదర్ ఇన్ ది వరల్డ్.. డోన్ట్ ఎవర్ గో దేర్, నేను చెడును వెంటాడుతూ వెళ్లాను. నాకెక్కడా కనపడలేదు. నాలో నేను చూసుకున్నాను. నాకన్నా చెడ్డవాడు లేడు' (రణ్‌బీర్) అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. తెలుగులోనూ ఈ చిత్రం రిలీజ్ కానుంది.

ఓ సవాల్‌గా ఈ సినిమా చేశాం

- శ్రీకాంత్ అడ్డాల

"కొత్త బంగారు లోకం', 'ముకుందా' ఇలా కొత్తవాళ్లతో సినిమాలు చేసిన అనుభవం నాకుంది. కొత్తవారితో పని చేయడం ఫ్రెష్‌గా బాగుంటుంది. అలా ఇప్పుడు 'పెదకాపు 1' చేశాను. అయితే కొత్తవాళ్లతో రెండు భాగాలుగా 'పెదకాపు' వంటి భారీ బడ్జెట్ సినిమా తీయడం దర్శకుడిగా నాకో సవాల్. ఇంత ఖర్చు చేస్తున్నారు కాబట్టి సినిమాలో బాగా నటించడం అనేది విరాట్ ముందున్న సవాల్. సినిమా నిర్మాణం సజావుగా సాగేలా చేయడం రవీందర్ రెడ్డిగారి ముందున్న చాలెంజ్. 'పెదకాపు 1'లో భాగస్వామ్యులైన ప్రతి ఒక్కరూ సవాల్‌గా తీసుకుని బాధ్యతతో పని చేశారు" అన్నారు దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల. విరాట్ కర్ణ హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'పెదకాపు 1'. శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం విలేకర్ల సమావేశంలో శ్రీకాంత్ అడ్డాల చెప్పిన విశేషాలు.

● 1982, 83 సమయాల్లో చోటు చేసుకున్న కొన్ని రాజకీయ సమీకరణాలకు కొంత ఫిక్షన్‌ను జత చేసి ఈ సినిమాను తెరకెక్కించాం. ఆ సమయంలో మా ఊర్లోని రాజకీయాల్లో మా నాన్నగారు క్రియాశీలకంగా ఉండేవారు. ఓ రకంగా ఈ సినిమాకు మా నాన్నగారు కూడా ఓ స్ఫూర్తి. ఇది ప్రత్యేకంగా ఏ కులానికీ సంబంధించిన చిత్రం కాదు. ఓ సారి ఓ ఊరికి వెళ్లినప్పుడు బోర్డుపై ఓ వ్యక్తి పేరు పక్కన 'పెదకాపు' అని ఉంది. అలా ఎందుకు అని అక్కడివారిని అడిగితే... పది మందిని కాపాడుతూ, పది మందికి సాయం చేసే వారిని పెదకాపుగా పిలుస్తామని చెప్పారు. మనం చెబుతున్న కథ కూడా ఈ తరహాలోనే ఉంటుంది కాబట్టి 'పెదకాపు' టైటిల్ పెడదామని నిర్మాత రవీందర్‌గారితో చెప్పినప్పుడు బాగుంది.. సరే అన్నారు.

● ఓ సామాన్యుడి పోరాటమే ఈ సినిమా కథ. అందరికీ కనెక్ట్ అవుతుంది. సాధారణంగా కొత్తవారి కోసం కథలు రాసుకుంటుంటాం. ఇలా నేను రాసుకున్న కథల్లో 'పెదకాపు' ఒకటి. కథగా ఉన్నప్పుడే రెండు భాగాలుగా తీయాలనుకున్నాం. విరాట్ కర్ణకు ఇది తొలి సినిమా. మొదటి చిత్రానికి ప్రతి హీరోకు కొన్ని కష్టాలుంటాయి. అయితే విరాట్‌తో నటింపజేసే బాధ్యత ఓ దర్శకుడిగా నాది. తన నుంచి మంచి నటన రాబట్టుకున్నా. ఈ చిత్రానికి మిక్కీ సంగీతం ఓ ప్రధాన ఆకర్షణ. చోటాగారు మంచి విజువల్స్ ఇచ్చారు

● 'పెదకాపు'లో నేను చేసిన పాత్రకు ముందు ఓ మలయాళ నటుడిని అనుకున్నాం. కొన్ని కారణాల వల్ల ఆయన సెట్స్‌కు రాలేదు. నాగబాబు, రావు రమేష్‌గార్లు ఇలా చాలామందితో కాంబినేషన్ సీన్స్ ఉన్నాయి. ప్రొడక్షన్ ఖర్చు కనిపిస్తోంది. దీంతో ఆ పాత్రను నేనే చేశాను. ఈ సినిమాకి నేను రాసిన డైలాగ్స్‌కు మంచి స్పందన వస్తుండటం హ్యాపీగా ఉంది. 'నీకే అంత ఉంటే మాకు ఎంత ఉండాలి' అనే డైలాగ్ అందరికీ చాలా కనెక్ట్ అయ్యింది. ఆల్రెడీ వేసిన కొన్ని ప్రీమియర్స్‌లో మంచి స్పందన వచ్చింది. ఆ డైలాగ్ కొన్నేళ్లు నిలిచిపోతుంది. ఇక 'అన్నాయ్' అనే మల్టీస్టారర్ కథ నా దగ్గర ఉంది. నా తర్వాతి ప్రాజెక్ట్ గీతా ఆర్ట్స్‌లో ఉంటుంది.





● రకుల్ ప్రీత్‌సింగ్



● నీనా గుప్తా

నవ్వించడానికి రెడీ

రకుల్ ప్రీత్ సింగ్ నవ్వించడానికి, థ్రిల్ చేయడానికి రెడీ అయ్యారు. ఆమెతో పాటు నీనా గుప్తా కూడా చేతులు కలిపారు. ఈ ఇద్దరూ కలిసి చేసే కామెడీ, థ్రిల్‌ని వచ్చే ఏడాది వెండితెరపై చూడొచ్చు. రకుల్, నీనా గుప్తా లీడ్ రోల్స్‌లో ఓ చిత్రం రూపొందనుంది. కామెడీ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని దర్శకుడు ఆశిష్ ఆర్. శుక్లా తెరకెక్కించనున్నారు. ఈ చిత్రాన్ని సునీల్ కేతర్‌పాల్ నిర్మించనున్నారు. రకుల్ ఓ లీడ్ రోల్‌లో నటించిన 'ఐ లవ్ యు'కి కూడా కేతర్‌పాల్‌నే నిర్మాత. ఈ ఏడాది జూన్‌లో ఈ చిత్రం ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో విడుదలైంది. అయితే తాజా చిత్రాన్ని మాత్రం థియేటర్స్‌లోనే విడుదల చేయాలనుకుంటున్నారు. ఈ చిత్రం షూటింగ్‌ని అక్టోబర్‌లో ఆరంభించి, డిసెంబర్‌కల్లా పూర్తి చేయాలనుకుంటున్నారు. వచ్చే ఏడాది ఆరంభంలో ఈ చిత్రం విడుదలయ్యే చాన్స్ ఉంది.

ఇస్మార్ట్ యాక్షన్

హీరో రామ్, దర్శకుడు పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో రూపొందిన తొలి చిత్రం 'ఇస్మార్ట్ శంకర్'. 2019లో విడుదలైన ఈ చిత్రం సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా రామ్, పూరీల కాంబినేషన్‌లోనే 'డబుల్ ఇస్మార్ట్' చిత్రం రూపొందుతోంది. హై బడ్జెట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. కాగా గురువారం పూరి జగన్నాథ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా హీరో రామ్, కీలక పాత్ర చేస్తున్న సంజయ్ దత్‌తో పూరి జగన్నాథ్ ఉన్న వర్కింగ్ స్టిల్‌ను రిలీజ్ చేశారు. పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది మార్చి 18న రిలీజ్ కానుంది.



● సంజయ్ దత్, పూరి జగన్నాథ్, రామ్



● హర్షవర్ధన్, సుధీర్ బాబు

మనం లాంటి అనుభూతి కలుగుతుంది - సుధీర్ బాబు

''మామా మశ్చీంద్ర'లో త్రిపాత్రాభినయం చేశాను. ఏయన్నార్ ఫ్యామిలీ నటించిన 'మనం' చూసినప్పుడు అరుదైన సినిమాగా ఎలా అనుభూతి చెందారో, 'మామా మశ్చీంద్ర' చూశాక అలాంటి అనుభూతే కలుగుతుంది. ఈ సినిమాతో హర్షవర్ధన్ టాప్ డైరెక్టర్ అవుతారు'' అన్నారు సుధీర్ బాబు. హర్షవర్ధన్ దర్శకత్వంలో సుధీర్ బాబు హీరోగా నటించిన చిత్రం 'మామా మశ్చీంద్ర'. ఇషా రెబ్బా, మృణాలినీ రవి హీరోయిన్లు. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించిన ఈ సినిమా అక్టోబర్ 6న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను హీరో మహేశ్ బాబు షేర్ చేశారు. ''మనం' రచయితగా మీ అందరి ప్రేమాభిమానాలు పొందాను. ఇంతకాలం విరామం తీసుకొని 'మామా మశ్చీంద్ర' చేయడానికి కారణం.. ప్రేక్షకుల నమ్మకాన్ని వమ్ము చేయకూడదని'' అన్నారు హర్షవర్ధన్. ''ఈ చిత్రంలో ప్రతి పదిహేను నిమిషాలకు ఒక మలుపు, సర్‌ప్రైజ్ వస్తుంది'' అన్నారు పుస్కూర్ రామ్మోహన్ రావు.

కోడిబాయె లచ్చమ్మది

దినేష్ తేజ్, హెబ్బా పటేల్ జంటగా నటించిన చిత్రం 'అలా నిన్ను చేరి'. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో మారేష్ శివన్ దర్శకత్వంలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సినిమాలోని మాస్ సాంగ్ 'కోడిబాయె లచ్చమ్మది..'ని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విడుదల చేసి, మాట్లాడుతూ - ''యంగ్ టాలెంట్ తీసే చిత్రాలను ప్రేక్షకులు ఆదరిస్తుంటారు. ఈ చిత్రాన్ని కూడా ఆదరించాలి. సినిమా పెద్ద హిట్టవ్వాలి'' అన్నారు. సుభాష్ ఆనంద్ స్వరపరచిన 'కోడిబాయె..' పాటను మంగ్లీ పాడగా, భాను నృత్యరీతులు సమకూర్చారు. ''ఈ పాటలో దినేష్ తేజ్, హెబ్బా పటేల్‌ల మాస్ స్టెప్స్ ఆకట్టుకునే విధంగా ఉంటాయి. తెలంగాణ నుంచి మరో జానపదం చార్ట్ బస్టర్‌గా నిలవనుంది. సినిమాలోని అన్ని పాటలనూ చంద్రబోస్ గారు రాశారు '' అని యూనిట్ పేర్కొంది.



● తలసాని శ్రీనివాస్, దినేష్ తేజ్

యూత్‌ఫుల్ మ్యాడ్ - నాగవంశీ

''మ్యాడ్' యూత్‌ఫుల్ సినిమా అయినప్పటికీ కుటుంబమంతా చూసేలా ఉంటుంది. లాజిక్‌లు, ట్విస్ట్‌లు ఉండవు. సినిమా ప్రారంభం నుంచి చివరి వరకు నవ్వుతూనే ఉంటారు. 'జాతి రత్నాలు' చిత్రం కంటే ఒక్కసారైనా తక్కువ నవ్వానని ఎవరైనా చెబితే.. టిక్కెట్ డబ్బులు వెనక్కి ఇచ్చేస్తాం'' అని నిర్మాత నాగవంశీ అన్నారు. రామ్ నితిన్, సంగీత్ శోభన్, నార్నే నితిన్, శ్రీ గౌరీప్రియా రెడ్డి, అనంతిక సనీల్ కుమార్, గోపికా ఉద్యన్ కీలక పాత్రల్లో కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మ్యాడ్'. సూర్యదేవర నాగవంశీ సమర్పణలో హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా అక్టోబర్ 6న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో దర్శకుడు అనుదీప్ మాట్లాడుతూ-''నా 'జాతిరత్నాలు' కంటే 'మ్యాడ్' బాగా నచ్చింది'' అన్నారు. ''ఈ సినిమాలో వినోదం మాత్రమే ఉంటుంది'' అన్నారు కల్యాణ్ శంకర్.



థ్రిల్ చేసే విధి



● రోహిత్ నందా, ఆనంది

రోహిత్ నందా, ఆనంది జంటగా శ్రీకాంత్ రంగనాథన్, శ్రీనాథ్ రంగనాథన్ రచన, దర్శకత్వంలో ఎస్. రంజిత్ నిర్మించిన చిత్రం 'విధి'. ఈ సినిమా ఫస్ట్ లుక్ లాంచ్ ఈవెంట్‌లో హీరో రోహిత్ నందా మాట్లాడుతూ- ''విధి' మాకెంతో స్పెషల్ మూవీ. ఆడియో డిస్క్రిప్టివ్ టెక్నాలజీతో ఈ సినిమాను చేశాం. దీంతో కంటి చూపు లేనివాళ్లు కూడా మా సినిమాను అనుభూతి చెందగలరు. ఈ చిత్రానికి శ్రీ చరణ్ పాకాలగారు అద్భుతమైన ఆర్ఆర్, సంగీతం ఇచ్చారు'' అన్నారు. ''ఓ డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రూపొందిన మూవీ 'విధి'' అన్నారు నిర్మాత రంజిత్. ''మాకు ఇది తొలి సినిమా. ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు శ్రీకాంత్, శ్రీనాథ్. ''వినోదం మాత్రమే కాదు.. థ్రిల్లింగ్ అంశాలు కూడా ఈ సినిమాలో ఉన్నాయి'' అన్నారు హీరోయిన్ ఆనంది. ''ఈ సినిమాలో ట్విస్ట్‌లు బాగుంటాయి'' అన్నారు శ్రీ చరణ్ పాకాల. నటుడు 'రంగస్థలం' మహేశ్ మాట్లాడారు.

విలేజ్ పంచాయితీ

గ్రామీణ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'ఏందిరా ఈ పంచాయితీ'. భరత్, విషికా లక్ష్మణ్ జంటగా టి. గంగాధర దర్శకత్వంలో రూపొందిన చిత్రం ఇది. ఎం. ప్రదీప్‌కుమార్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 6న విడుదల కానుంది. ''ఇటీవల విడుదలైన టీజర్‌కు, తండ్రీకూతుళ్ల సెంటిమెంట్‌తో వచ్చిన పాటకు మంచి స్పందన లభిస్తోంది. సినిమా కూడా అందర్నీ ఆకట్టుకుంటుంది'' అని చిత్ర యూనిట్ వెల్లడించింది. కాశీ విశ్వనాథ్, తోటపల్లి మధు, రవి వర్మ కీలక పాత్రలు చేసిన ఈ చిత్రానికి పెద్దపల్లి రోహిత్ స్వరకర్త.



● భరత్, విషికా లక్ష్మణ్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	610	65,508
నిఫ్టీ ▽	193	19,524

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	13,199	△ 106
డోజోన్స్	33,611	△ 60
ఎఫ్‌టీఎస్ఈ 100	7,602	△ 9
డాక్స్	15,323	△ 106
షాంఘై	3,110	△ 3
నికాయ్	31,873	▽ 499

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	57,998 ▽ 456
బంగారం (99.5 స్వచ్ఛత)	57,766 ▽ 454
వెండి (కేజీ)	70,432 ▽ 498

ఫారెక్స్ రేట్లు రూ.లలో			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.48	84.15
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	99.46	102.77
€	యూరో	ఒకటి	85.97	89.05
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.91	56.62
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	52.00	54.29
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.76	61.69
SAR	సౌదీ రియాల్	[illegible]	21.23	22.85
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.75	23.54
¥	చైనా యువాన్	[illegible]	10.27	12.34

8 నెలల్లో కోటి...

ఎన్ఎస్ఈలో కొత్త రిజిస్ట్రేషన్లు

న్యూఢిల్లీ: గడిచిన ఎనిమిది నెలల్లో తమ ప్లాట్‌ఫామ్‌పై కొత్త ఇన్వెస్టర్ల రిజిస్ట్రేషన్ల సంఖ్య కోటి మార్కును దాటినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీ ఎన్ఎస్ఈ వెల్లడించింది. దీనితో మొత్తం ఇన్వెస్టర్ల సంఖ్య 8 కోట్లకు చేరినట్లు తెలిపింది. ఈ కోటి కొత్త ఖాతాల్లో ఉత్తరాది ఇన్వెస్టర్ల వాటా 43 శాతంగా ఉండగా, పశ్చిమం (27 శాతం), దక్షిణాది (17 శాతం), తూర్పు రాష్ట్రాలు (13 శాతం) తర్వాత వరుసలో ఉన్నాయి. నగరాలవారీగా చూస్తే ఢిల్లీ (7 శాతం), ముంబై (4.6 శాతం), పుణె (1.7 శాతం) తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. డేటా ప్రకారం దేశీయంగా 17 శాతం కుటుంబాలు తమ ట్రేడింగ్ సభ్యుల నెట్‌వర్క్ ద్వారా స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేస్తున్నట్లు వివరించింది. క్లయింట్లు పలు బ్రోకరేజీల ద్వారా రిజిస్టర్ చేసుకునే వెసు



లుబాటు ఉన్న నేపథ్యంలో ఎన్ఎస్ఈలో క్లయింట్ల ఖాతాల సంఖ్య 14.9 కోట్లుగా ఉన్నట్లు తెలిపింది. ఆకర్షణీయ పనితీరు కనపరుస్తున్న నేపథ్యంలో క్యాపిటల్ మార్కెట్లపై ఇన్వెస్టర్లలో ఆసక్తి పెరుగుతోందని ఎన్ఎస్ఈ వివరించింది. 2022-23లో కొత్త ఇన్వెస్టర్ల రిజిస్ట్రేషన్ సంఖ్య 1.3 కోట్లుగా ఉండగా, 2021-22లో 1.9 కోట్లుగాను, 2020-21లో 0.90 కోట్లుగాను నమోదైంది.

గూగుల్‌తో హెచ్‌పీ జట్టు

భారత్‌లో అక్టోబర్ 2 నుంచి క్రోమ్‌బుక్స్ తయారీ

న్యూఢిల్లీ: భారత్‌లోనే క్రోమ్‌బుక్స్‌ను ఉత్పత్తి చేసే దిశగా టెక్ దిగ్గజం గూగుల్‌తో కంప్యూటర్ల తయారీ సంస్థ హెచ్‌పీ చేతులు కలిపింది. అక్టోబర్ 2 నుంచి వీటిని చెన్నైకి దగ్గర్లోని తమ ఫ్లెక్స్ ఫెసిలిటీలో వీటి ఉత్పత్తి ప్రారంభించనున్నట్లు హెచ్‌పీ ఇండియా సీనియర్ డైరెక్టర్ విక్రమ్ బేడి తెలిపారు. 2020 ఆగస్టు నుంచి హెచ్‌పీ ఈ ప్లాంటులోనే ల్యాప్‌టాప్‌లు, డెస్క్‌టాప్‌ల శ్రేణిని ఉత్పత్తి చేస్తోంది. భారత్‌లో విద్యారంగం డిజిటల్ పరివర్తనకు తమ వంతు తోడ్పాటు అందించే క్రమంలో ఇదొక కీలక మైలురాయి కాగలదని గూగుల్ ఎడ్యుకేషన్ విభాగం హెడ్ (దక్షిణాసియా) బాణీ ధవన్ ఒక ప్రకటనలో తెలిపారు. దీని ప్రకారం గూగుల్ క్రోమ్ ఆపరేటింగ్ సిస్టంతో లభించే క్రోమ్‌బుక్స్‌ను ప్రపం



చవ్యాప్తంగా 5 కోట్ల మంది పైచిలుకు విద్యార్థులు, టీచర్లు వినియోగిస్తున్నారు. కేజీ నుంచి పన్నెండో తరగతి వరకు విద్యాభ్యాసానికి ఉపయోగిస్తున్న డివైజ్‌లలో ఇవి అగ్రస్థానంలో ఉన్నాయి. నోట్‌బుక్స్‌తో పోలిస్తే క్రోమ్‌బుక్స్ ధరలు కొంత తక్కువగా ఉంటాయి. భారత్‌లో ఐటీ హార్డ్‌వేర్ తయారీని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రకటించిన రూ. 17,000 కోట్ల ఉత్పాదకత ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం కోసం దరఖాస్తు చేసుకున్న సంస్థల్లో హెచ్‌పీ కూడా ఉంది.

పారిశ్రామిక దిగ్గజం అశ్విన్ డానీ కన్నుమూత

న్యూఢిల్లీ: భారత్ పారిశ్రామిక రంగ ప్రముఖులు, ఏషియన్ పెయింట్స్ నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, మాజీ చైర్మన్ అశ్విన్ డానీ (81) తుది శ్వాస విడిచారు. 1968 నుండి ఏషియన్ పెయింట్స్‌తో డానీకి అనుబంధం ఉంది. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. కంపెనీలో వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, నాన్-ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్, నాన్-ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌తో సహా కంపెనీ బోర్డ్‌లో వివిధ హోదాల్లో ఆయన పనిచేశారు. 2018 నుండి 2021 మధ్య డానీ ఏషియన్ పెయింట్స్ సంస్థకు, బోర్డ్‌కు చైర్మన్‌గా ఉన్నారు. డానీ తండ్రి సూర్యకాంత్ ఏషియన్ పెయింట్స్ సహ వ్యవస్థాపకుల్లో ఒకరు. వివిధ ప్రభుత్వ- వాణిజ్య సంస్థల్లో డానీ కీలక బాధ్యతలు నిర్వహించారు. పలు అవార్డులు అందుకున్నారు. సీఎన్‌బీసీ-టీవీ 18 లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు, బిజినెస్ ఇండియా మ్యాగజైన్ బిజినెస్‌మెన్ ఆఫ్ ది ఇయర్



(2015), ఇండియన్ పెయింట్ అసోసియేషన్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు, 2002లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటీరియల్స్ మేనేజ్‌మెంట్ నుండి కెమినార్ అవార్డు ఇందులో ఉన్నాయి. తాజా ఫోర్బ్స్ నివేదిక ప్రకారం, అశ్విన్ డానీ, ఆయన కుటుంబం 7.7 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 64,000 కోట్లు) నికర విలువను కలిగి ఉంది. తద్వారా ప్రపంచవ్యాప్తంగా 293వ స్థానంలో నిలిచారు.

ఇక అమర రాజా ఎనర్జీ, మొబిలిటీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన, పారిశ్రామిక బ్యాటరీల తయారీలో ఉన్న అమర రాజా బ్యాటరీస్ పేరు మారింది. అమర రాజా ఎనర్జీ, మొబిలిటీగా నామకరణం చేసినట్టు కంపెనీ గురువారం ప్రకటించింది. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సొల్యూషన్స్, లిథియం అయాన్ సెల్ తయారీ, ఈవీ చార్జర్స్, లిథియం అయాన్ బ్యాటరీ ప్యాక్ అసెంబ్లీ, రెన్యువేబుల్ ఎనర్జీ స్టోరేజ్ సొల్యూషన్స్, బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, లూబ్రికెంట్స్ విభాగాల్లో సైతం సంస్థ నిమగ్నమైంది. కాగా, బీఎస్ఈలో కంపెనీ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే గురువారం 0.15 శాతం క్షీణించి రూ.637.75 వద్ద స్థిరపడింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
29-9-2023	
విశాఖ	533-00
చిత్తూరు	533-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	533-00
విజయవాడ	533-00
రిటైల్ ధర (డజను)	72.00
28-9-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	500-00
వరంగల్	502-00
రిటైల్ ధర	5.75

బుల్ మరోసారి కుదేల్

- జాతీయ, అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావం
- సెన్సెక్స్ 610 పాయింట్ల పతనం
- 19,550 దిగువకు నిఫ్టీ
- అన్ని రంగాల షేర్లకు నష్టాలే
- ఒక్కరోజులో రూ.2.95 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి

ముంబై: దేశీయ స్టాక్ సూచీలకు లాభాలు ఒక్క రోజుకే పరిమితమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాలకు తోడు విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలతో గురువారం దాదాపు ఒక శాతం నష్టపోయాయి. ఉదయం లాభాల్లో మొదలైన సూచీలు.., కాసేపటికే నష్టాల్లోకి జారుకున్నాయి. సెప్టెంబర్ డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ముగింపు నేపథ్యంలో రోజంతా సూచీలు తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. అన్ని రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ముఖ్యంగా ఐటీ, ఫైనాన్స్, మెటల్, బ్యాంకింగ్ రంగాల షేర్లు భారీగా నష్టపోయాయి. ఫలితంగా సెన్సెక్స్ 610 పాయింట్లు నష్టపోయి 65,508 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 695 పాయింట్లు క్షీణించి 65,423 వద్ద నిలిచింది. ఈ సూచీ దాదాపు పతనంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.2.95 లక్షల కోట్లు హరించుకుపోయి రూ.316 లక్షల కోట్లకు దిగివచ్చింది. ఈ సూచీలో 30 షేర్లకు గానూ అయిదు షేర్లు మాత్రమే లాభపడ్డాయి. నిఫ్టీ 193 పాయింట్లు పతనమై 19,524 వద్ద నిలిచింది. ట్రేడింగ్‌లో 224 పాయింట్లు నష్టపోయి 19,492 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.3,364 కోట్లు అమ్మేయగా.., సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,711 కోట్ల ఈక్విటీలు కొన్నారు. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి విలువ స్వల్పంగా మూడు పైసలు పెరిగి 83.19 వద్ద స్థిరపడింది. అధిక వడ్డీరేట్ల పెంపు అంచనాలకు తోడు తాజాగా బ్యారెల్ చమురు ధర 100 డాలర్లకు చేరువవడం, చైనాలో ప్రాపర్టీ మార్కెట్ సంక్షోభ ఆందోళనలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నష్టాల పరంపర కొనసాగుతోంది. ''అధిక వెయిటేజీ రంగాల షేర్ల అమ్మకాల ఒత్తిడికి తోడు ప్రతికూల ప్రపంచ సంకేతాలు సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. ఎన్ఎస్ఈ సూచీల్లో స్టాక్స్ వెయిటేజీకి సంబంధించిన



మార్పులు అమల్లోకి వస్తుండటంతో దీని అనుగుణంగా ట్రేడర్లు తమ పొజిషన్లను సవరించుకున్నారు. అంతర్జాతీయంగా బ్యారెల్ క్రూడాయిల్ ధర ఈ ఏడాది(2023) గరిష్ట స్థాయి వద్ద ట్రేడవుతున్నాయి. మార్కెట్లో అస్థిరతలను సూచించే వీఐఎక్స్ ఇండెక్స్ 4 నెలల గరిష్టానికి చేరుకోవడం ప్రతికూలంగా మారింది. ఒకవేళ నిఫ్టీ 19,500 స్థాయిని కోల్పోతే ఆగస్టు కనిష్టం 19,220 స్థాయికి దిగిరావచ్చు'' అని రెలిగేర్ బ్రోకరింగ్ సాంకేతిక నిపుణుడు అజిత్ మిశ్రా తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- యాత్రా ఆన్‌లైన్ లిస్టింగ్ నిరాశపరిచింది. బీఎస్ఈలో ఇష్యూ ధర (రూ.142)తో పోలిస్తే 8% డిస్కౌంట్‌తో రూ.130 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో పదిశాతానికి పైగా నష్టపోయి రూ.127 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. చివర్లో కొంత కొనుగోళ్ల మద్దతు లభించడంతో 4% నష్టంతో రూ.136 వద్ద నిలిచింది. కంపెనీ విలువ రూ.2,133 కోట్లుగా నమోదైంది. ఎక్స్ఛేంజీలో 7.43 లక్షల ఈక్విటీలు చేతులు మారాయి.
- ఐటీ రంగ షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. టెక్ మహీంద్రా 4%, ఎంఫసిస్ 3%, ఎల్‌టీఐఎం 2.50%, విప్రో 2% పర్‌సిస్టెంట్, ఇన్ఫోసిస్ టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, కోఫోర్జ్ షేర్లు ఒకశాతం చొప్పున నష్టపోయాయి. బీఎస్ఈలో ఈ రంగ షేర్లకు ప్రాతినిధ్యం వహించే ఐటీ సూచీ అత్యధికంగా రెండుశాతం క్షీణించింది
- అధిక వెయిటేజీ రిలయన్స్(1.50%), ఐటీసీ(2%), ఇన్ఫోసిస్ (2%), టీసీఎస్(1.50%) మారుతీ సుజుకీ, కోటక్ బ్యాంక్ షేర్లు ఒకశాతం నష్టపోయి సూచీల భారీ పతనానికి కారణమయ్యాయి.
- నష్టాల మార్కెట్లోనూ ఎల్అండ్‌టీ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఇంట్రాడేలో మూడుశాతం ర్యాలీ చేసి రూ.3051 వద్ద కొత్త గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి ఒకటిన్నర శాతం లాభపడి రూ.3012 వద్ద నిలిచింది. సెన్సెక్స్, నిఫ్టీలో అత్యధికంగా లాభపడిన సూచీ ఇదే.

యాక్సిస్ ఎనర్జీతో బ్రూక్‌ఫీల్డ్ జేవీ



నవాల్ సైనీ, రవి కుమార్ రెడ్డి (కుడి)

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల ఏర్పాటుకై తాజాగా బ్రూక్‌ఫీల్డ్, యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ జాయింట్ వెంచర్ ఏర్పాటు చేశాయి. ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉన్న బ్రూక్‌ఫీల్డ్‌కు చెందిన పవన, సౌర విద్యుత్ ప్రాజెక్టులకు యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ సహకరిస్తుంది. బ్రూక్‌ఫీల్డ్ గ్లోబల్ ట్రాన్సిషన్ ఫండ్-2 ద్వారా విద్యుత్ ప్రాజెక్టుల అభివృద్ధి, నిర్మాణం కోసం రూ.7,026 కోట్ల వరకు ఈక్విటీ మూలధనాన్ని అందించడానికి కట్టుబడి ఉన్నట్టు బ్రూక్‌ఫీల్డ్ ఎండీ నవాల్ సైనీ వెల్లడించారు. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం కింద ప్రభుత్వ సంస్థలు, కార్పొరేట్ కస్టమర్లు, గ్రీన్ హైడ్రోజన్ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలతో సహా వివిధ పరిశ్రమలో పాల్గొనేవారికి ఇంధన పరిష్కారాలను అందించడానికి ఇరు సంస్థలు తమ నైపుణ్యం, వనరులను ఉపయోగించుకుంటాయని యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ సీఎండీ కటారు రవి కుమార్ రెడ్డి తెలిపారు. బ్రూక్‌ఫీల్డ్ ఖాతాలో భారత్‌లో 16 గిగావాట్ల పవన, సౌర విద్యుత్ ప్రాజెక్టుల్లో కొన్ని పూర్తి కాగా మరికొన్ని నిర్మాణంలో ఉన్నాయి. ఇందులో యాక్సిస్ ఎనర్జీతో కలిసి చేపట్టిన ప్రాజెక్టులు 1.8 గిగావాట్లకు పైమాటే.

సాక్షి స్పోర్ట్స్



శ్రీజ-దియా జంట గెలుపు

ఆసియా క్రీడల టేబుల్ టెన్నిస్ (టీటీ) మహిళల డబుల్స్‌లో ఆకుల శ్రీజ-దియా చిటాలె (భారత్) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది. తొలి రౌండ్‌లో శ్రీజ-దియా 11-8, 15-13, 11-6తో ట్రాన్ మాయ్ ఎన్గాక్-థి ఎన్గా ఎన్గుయెన్ (వియత్నాం)లపై గెలిచారు. భారత్‌కే చెందిన సుతీర్థ-ఐహిక ముఖర్జీ జోడీ కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. పురుషుల సింగిల్స్‌లో ఆచంట శరత్ కమల్, సత్యన్... మహిళల సింగిల్స్‌లో మనిక బత్రా ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు.

భారత ఫుట్‌బాల్ జట్టుకు నిరాశ

ఆసియా క్రీడల్లో భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టు కథ ముగిసింది. హాంగ్జౌలో గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో సునీల్ ఛెత్రి నాయకత్వంలోని భారత జట్టు 0-2 గోల్స్ తేడాతో సౌదీ అరేబియా జట్టు చేతిలో ఓడిపోయింది. సౌదీ అరేబియా తరఫున ఖలీల్ (51వ, 57వ ని.లో) రెండు గోల్స్ సాధించాడు.

అక్షర్ స్థానంలో అశ్విన్



అశ్విన్

వన్డే ప్రపంచకప్
భారత జట్టులో ఒక మార్పు


- ఆస్ట్రేలియా జట్టులో లబుషేన్‌కు చోటు
- నేటి నుంచి వామప్ మ్యాచ్‌లు

న్యూఢిల్లీ: తొడ కండరాల గాయం నుంచి ఇంకా కోలుకోకపోవడంతో భారత ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ వన్డే ప్రపంచకప్ టోర్నీకి దూరమయ్యాడు. వన్డే వరల్డ్‌కప్ కోసం ఈనెల 5న బీసీసీఐ ప్రకటించిన 15 మంది సభ్యుల జట్టులో అక్షర్ పటేల్ ఉన్నాడు. అయితే ఆసియా కప్ టోర్నీలో భాగంగా బంగ్లాదేశ్‌తో జరిగిన సూపర్-4 మ్యాచ్‌లో గాయపడ్డ అక్షర్ పటేల్ ఆ టోర్నీ ఫైనల్ మ్యాచ్‌కు కూడా దూరమయ్యాడు. అక్షర్ పటేల్ కోలుకునేందుకు కనీసం నాలుగు వారాలు పట్టే అవకాశం ఉండటంతో వన్డే ప్రపంచకప్ కోసం అతని స్థానంలో సీనియర్ స్పిన్నర్, తమిళనాడుకు చెందిన 37 ఏళ్ల రవిచంద్రన్ అశ్విన్‌ను ఎంపిక చేస్తున్నట్లు బీసీసీఐ తెలిపింది. ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌లో తొలి రెండు వన్డేలు ఆడిన అశ్విన్ తన వైవిధ్యభరిత బౌలింగ్‌తో ఆకట్టుకొని నాలుగు వికెట్లు తీశాడు. శనివారం ఇంగ్లండ్‌తో జరిగే వామప్ మ్యాచ్ కోసం గువాహటి బయలుదేరిన భారత జట్టుతో అశ్విన్ కూడా ఉన్నాడు. అశ్విన్‌కిది మూడో వన్డే ప్రపంచకప్ కానుంది. స్వదేశంలో ధోని సారథ్యంలో 2011 వన్డే వరల్డ్‌కప్ టైటిల్ నెగ్గిన భారత జట్టులో అశ్విన్ సభ్యుడిగా ఉన్నాడు. 2015 ప్రపంచకప్‌లోనూ అశ్విన్ భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఇప్పటి వరకు అశ్విన్ 115 వన్డేలు ఆడి 155 వికెట్లు తీయడంతోపాటు 707 పరుగులు సాధించాడు. అక్టోబర్ 5 నుంచి మొదలయ్యే ప్రపంచకప్ కోసం తుది జట్లలో మార్పులు చేర్పులకు గురువారంతో గడువు ముగిసింది. మరోవైపు ఆస్ట్రేలియా వరల్డ్ కప్ జట్టులోనూ ఒక మార్పు చోటు చేసుకుంది. పిక్క కండరాల గాయం నుంచి ఆల్‌రౌండర్ ఆస్టన్ అగర్ ఇంకా కోలుకోకపోవడంతో అతడి స్థానంలో మార్నస్ లబుషేన్‌ను ఎంపిక చేశారు. ఇటీవల దక్షిణాఫ్రికాతో ఐదు వన్డేల సిరీస్‌లో లబుషేన్ 283 పరుగులు... భారత్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో 138 పరుగులు సాధించాడు. చేతి వేలి గాయంతో బాధపడుతున్నప్పటికీ ట్రావిస్ హెడ్‌ను వరల్డ్ కప్ జట్టులో కొనసాగించాలని క్రికెట్ ఆస్ట్రేలియా నిర్ణయం తీసుకుంది.

అసలు పోరుకు ముందు...


ప్రపంచకప్ మరో 6 రోజుల్లో

అక్టోబర్ 5 నుంచి మొదలయ్యే వన్డే ప్రపంచకప్ కోసం నేటి నుంచి అన్ని జట్లు వామప్ మ్యాచ్‌లు ఆడనున్నాయి. మొత్తం 10 జట్లు ఇప్పటికే భారత్‌కు చేరుకున్నాయి. శుక్రవారం హైదరాబాద్‌లో పాకిస్తాన్-న్యూజిలాండ్... గువాహటిలో శ్రీలంక-బంగ్లాదేశ్... తిరువనంతపురంలో దక్షిణాఫ్రికా-అఫ్గానిస్తాన్ జట్లు వామప్ మ్యాచ్‌ల్లో తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లన్నీ మధ్యాహ్నం 2 గంటలకు మొదలవుతాయి. పూర్తిస్థాయిలో పోలీసుల బందోబస్తు లేని కారణంగా పాకిస్తాన్, న్యూజిలాండ్ మ్యాచ్‌ను ప్రేక్షకుల్లేకుండా నిర్వహిస్తారు. **ఈ మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్-1 చానెల్‌లో, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.**





ఫఖర్ జమాన్



బాబర్ ఆజమ్

పాకిస్తాన్ జట్టు క్రికెటర్లు కెప్టెన్ బాబర్ ఆజమ్, ఫఖర్ జమాన్, షాహిన్ అఫ్రిది, హసన్ అలీ తదితరులు గురువారం ఉప్పల్ స్టేడియంలో రెండున్నర గంటలపాటు ప్రాక్టీస్ చేశారు.

మన గురి అదిరె...

ఆసియా క్రీడల్లో ఐదో రోజూ భారత్ పతకాల వేట కొనసాగింది. ఒక స్వర్ణం, ఒక రజతం, ఒక కాంస్యంతో కలిపి గురువారం భారత్ ఖాతాలో మూడు పతకాలు చేరాయి. అంచనాలకు అనుగుణంగా రాణిస్తూ భారత షూటర్లు నాలుగో స్వర్ణం సాధించగా... వుషులో రోషిబినా దేవి రజతం, ఈక్వెస్ట్రియన్‌లో అనూష్ కాంస్యం గెలిచారు. ఫలితంగా భారత్ పతకాల పట్టికలో ఐదో స్థానానికి ఎగబాకింది. నేటి నుంచి అథ్లెటిక్స్ ఈవెంట్ కూడా మొదలుకానుండటం... టెన్నిస్, షూటింగ్, స్క్వాష్‌లలో కూడా మెడల్ ఈవెంట్స్ ఉండటంతో పతకాల పట్టికలో నేడు భారత్ నాలుగో స్థానానికి చేరుకునే అవకాశముంది.

- షూటింగ్‌లో భారత్‌కు నాలుగో స్వర్ణం
- పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో అగ్రస్థానం
- పతకాల పట్టికలో ఐదో స్థానానికి భారత్



స్వర్ణ పతకాలతో భారత ఎయిర్ పిస్టల్ షూటర్లు శివ నర్వాల్, అర్జున్ సింగ్, సరబ్‌జోత్ సింగ్

హాంగ్జౌ: భారీ అంచనాలతో ఆసియా క్రీడల్లో అడుగుపెట్టిన భారత షూటర్లు నిలకడైన ప్రదర్శనతో రాణిస్తున్నారు. పోటీల ఐదో రోజు గురువారం పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు స్వర్ణ పతకం లభించింది. శివ నర్వాల్, అర్జున్ సింగ్ చీమా, సరబ్‌జోత్ సింగ్‌లతో కూడిన భారత బృందం క్వాలిఫయింగ్‌లో అగ్రస్థానం సంపాదించి పసిడి పతకం గెల్చుకుంది. క్వాలిఫయింగ్‌లో భారత జట్టు మొత్తం 1734 పాయింట్లు స్కోరు చేసి టాప్ ర్యాంక్‌ను దక్కించుకుంది. సరబ్‌జోత్ సింగ్ 580 పాయింట్లు, అర్జున్ సింగ్ 578 పాయింట్లు, శివ నర్వాల్ 576 పాయింట్లు స్కోరు చేశారు. సరబ్‌జోత్ ఐదో స్థానంలో, అర్జున్ సింగ్ ఎనిమిదో స్థానంలో నిలిచి వ్యక్తిగత విభాగం ఫైనల్స్‌కు అర్హత సాధించారు. అయితే వ్యక్తిగత విభాగంలో సరబ్‌జోత్, అర్జున్ సింగ్‌లకు నిరాశ ఎదురైంది. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో అర్జున్ 113.3 పాయింట్లు స్కోరు చేసి చివరిదైన ఎనిమిదో స్థానంలో నిలువగా... సరబ్‌జోత్ 199 పాయింట్లు సాధించి నాలుగో స్థానం దక్కించుకొని కాంస్య పతకానికి దూరమయ్యాడు. మరోవైపు స్కీట్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో అనంత్ జీత్ సింగ్, గనీమత్ సెఖోన్‌లతో కూడిన భారత జట్టు ఏడో స్థానంలో నిలిచింది. నేడు షూటింగ్‌లో నాలుగు మెడల్ ఈవెంట్స్ (పురుషుల 50 మీటర్ల త్రీ పొజిషన్ టీమ్, వ్యక్తిగత విభాగం; మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్, వ్యక్తిగత విభాగం) ఉన్నాయి. ప్రస్తుత ఆసియా క్రీడల్లో భారత షూటర్లు నాలుగు స్వర్ణాలు, నాలుగు రజతాలు, ఐదు కాంస్య పతకాలు గెలిచారు.

అనూష్ ఘనత...

ఈక్వెస్ట్రియన్ (అశ్వ క్రీడలు)లో భారత్‌కు మరో పతకం దక్కింది. డ్రెసాజ్ వ్యక్తిగత విభాగంలో అనూష్ అగర్వల్లా కాంస్య పతకం సాధించాడు. 14 మంది పోటీపడిన ఫైనల్లో అనూష్, అతని అశ్వం 73.030 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచారు. ఆసియా క్రీడల చరిత్రలో డ్రెసాజ్ వ్యక్తిగత విభాగంలో భారత్‌కు పతకం రావడం ఇదే తొలిసారి. మరోవైపు వుషు క్రీడాంశంలో స్వర్ణ పతకం సాధించాలని ఆశించిన భారత క్రీడాకారిణి రోషిబినా దేవికి నిరాశ ఎదురైంది. వు జియోవె (చైనా)తో జరిగిన 60 కేజీల సాండా ఈవెంట్ ఫైనల్లో రోషిబినా దేవి 0-2తో ఓడిపోయి రజత పతకం కైవసం చేసుకుంది.



అనూష్



రోషిబినా

భారత్ 'హ్యాట్రిక్' విజయం

భారత పురుషుల హాకీ జట్టు వరుసగా మూడో విజయం నమోదు చేసింది. డిఫెండింగ్ చాంపియన్ జపాన్‌తో గురువారం జరిగిన పూల్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో భారత్ 4-2 గోల్స్ తేడాతో నెగ్గింది. భారత్ తరఫున అభిషేక్ (13వ, 48వ ని.లో) రెండు గోల్స్ చేయగా... మన్‌దీప్ (24వ ని.లో), అమిత్ రోహిదాస్ (34వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు.

క్వార్టర్ ఫైనల్లో సింధు బృందం

మహిళల బ్యాడ్మింటన్ టీమ్ ఈవెంట్‌లో భారత జట్టు క్వార్టర్ ఫైనల్ చేరింది. మంగోలియాతో జరిగిన తొలి రౌండ్‌లో భారత్ 3-0తో గెలిచింది. పీవీ సింధు, అష్మిత, అనుపమ తమ సింగిల్స్ మ్యాచ్‌ల్లో విజయం సాధించారు.

స్క్వాష్ జట్లకు పతకాలు ఖాయం

వరుసగా నాలుగోసారి ఆసియా క్రీడల్లో భారత పురుషుల, మహిళల స్క్వాష్ జట్లు సెమీఫైనల్లోకి ప్రవేశించి కనీసం కాంస్య పతకాలను ఖాయం చేసుకున్నాయి. చివరి లీగ్ మ్యాచ్‌ల్లో భారత మహిళల జట్టు 0-3తో మలేసియా చేతిలో ఓడిపోగా... భారత పురుషుల జట్టు 3-0తో నేపాల్‌పై నెగ్గింది. తమ గ్రూపుల్లో రెండో స్థానంలో నిలవడం ద్వారా భారత జట్లు సెమీఫైనల్ బెర్త్‌లు పొందాయి.

నిశాంత్ పంచ్ అదుర్స్...

భారత బాక్సర్లు నిశాంత్ దేవ్ (71 కేజీలు), జాస్మిన్ లంబోరియా (60 కేజీలు) క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లి పతకానికి విజయం దూరంలో నిలువగా... దీపక్ (51 కేజీలు) పోరాటం ప్రిక్వార్టర్ ఫైనల్లో ముగిసింది. నిశాంత్ పంచ్‌లకు అతని ప్రత్యర్థి ఖుయ్ తుంగ్ (వియత్నాం) తొలి రౌండ్‌లోనే చిత్తయ్యాడు. జాస్మిన్ పంచ్‌లకు హదీల్ గజ్వాన్ (సౌదీ అరేబియా) తట్టుకోలేకపోవడంతో రిఫరీ రెండో రౌండ్‌లో బౌట్‌ను ముగించాడు. దీపక్ 1-4తో ప్రపంచ మాజీ చాంపియన్ టొమోయా సుబోయ్ (జపాన్) చేతిలో ఓడిపోయాడు.

పసిడి పోరుకు సాకేత్-రామ్ జోడీ



రామ్ సాకేత్

ఆసియా క్రీడల టెన్నిస్ ఈవెంట్‌లో భారత్‌కు రెండు పతకాలు ఖాయమయ్యాయి. పురుషుల డబుల్స్ విభాగంలో సాకేత్ మైనేని-రామ్‌కుమార్ రామనాథన్ జోడీ ఫైనల్‌కు దూసుకెళ్లి స్వర్ణ పతకానికి విజయం దూరంలో నిలిచింది. సెమీఫైనల్లో సాకేత్-రామ్‌కుమార్ ద్వయం 6-1, 6-7 (6/8), 10-0తో 'సూపర్ టైబ్రేక్'లో సెంగ్‌చన్ హాంగ్-సూన్వూ క్వాన్ (దక్షిణ కొరియా)పై గెలిచింది. ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన సాకేత్ 2014 ఇంచియోన్ ఆసియా క్రీడల్లో పురుషుల డబుల్స్‌లో సనమ్ సింగ్‌తో కలిసి రజత పతకం, మిక్స్‌డ్ డబుల్స్‌లో సానియా మీర్జాతో కలిసి స్వర్ణ పతకం సాధించాడు. నేడు ఉదయం గం. 7:30 నుంచి జరిగే ఫైనల్లో జేసన్ జంగ్-యు సియో సు (చైనీస్ తైపీ) జంటతో సాకేత్-రామ్ జోడీ తలపడుతుంది. మరోవైపు మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ బోపన్న-రుతుజా భోస్లే (భారత్) ద్వయం సెమీఫైనల్ చేరి కనీసం కాంస్య పతకం ఖాయం చేసుకుంది. క్వార్టర్ ఫైనల్లో బోపన్న-రుతుజా 7-5, 6-3తో జిబెక్ కులామ్‌బయేవా-గ్రిగోరి లొమాకిన్ (కజకిస్తాన్)లపై గెలిచారు. నేడు జరిగే సెమీఫైనల్లో యు సియో సు-చాన్ హావో చింగ్ (చైనీస్ తైపీ)లతో బోపన్న-రుతుజా తలపడతారు.

పతకాల పట్టిక (టాప్-10)

దేశం	స్వ	ర	కాం	మొ
చైనా	90	51	26	167
దక్షిణ కొరియా	24	23	39	86
జపాన్	18	30	30	78
ఉజ్బెకిస్తాన్	6	10	15	31
భారత్	6	8	11	25
థాయ్‌లాండ్	6	3	9	18
హాంకాంగ్	5	12	15	32
చైనీస్ తైపీ	4	4	6	14
ఇరాన్	3	9	10	22
ఉత్తర కొరియా	3	5	4	12

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం.

జగనన్న ఆరోగ్య సురక్ష


అనకాపల్లి జిల్లా మాడుగుల మండలం పెంటయ్యపాలెంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది


కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం బింగిదొడ్డి గ్రామంలో మహిళకు బీపీ పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది


అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం గంగవరం మండలం ఏటిపల్లి గ్రామంలో జగనన్న సురక్ష సర్వే నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది


నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం గువ్వలకుంట్ల గ్రామంలో మహిళలకు రక్తపరీక్ష చేస్తున్న ఆరోగ్య సిబ్బంది


పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని ఓ ఇంట్లో వృద్ధురాలికి షుగర్ పరీక్ష చేస్తున్న ఆరోగ్య సిబ్బంది


ఏలూరు జిల్లా దెందులూరు మండలం పోతునూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఒక వృద్ధురాలికి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

క్లుప్తంగా...

అవయవదానంతో ఇద్దరికి పునర్జన్మ

అమెరికన్ కిడ్నీ ఇన్‌స్టిట్యూట్‌లో ఒకే రోజు రెండు కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు


మీడియాతో డాక్టర్ విట్టల్, పక్కన డాక్టర్ స్వప్న, డాక్టర్ ప్రశాంత్‌కుమార్ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు) : ఎన్టీఆర్ జిల్లా వెల్వడం గ్రామానికి చెందిన లక్ష్మమ్మ బ్రెయిన్ డెడ్‌కు గురికాగా.. ఆమె కుటుంబ సభ్యులు అవయవదానం చేసి ఇద్దరికి పునర్జన్మనిచ్చినట్టు అమెరికన్ కిడ్నీ ఇన్‌స్టిట్యూట్ వైద్యులు తెలిపారు. ఈ నెల 11న అవయవదానం చేయగా.. మూడేళ్లు, నాలుగేళ్లుగా డయాలసిస్ చేయించుకుంటూ జీవనం సాగిస్తున్న ఇద్దరికి, దాత నుంచి సేకరించిన కిడ్నీలను ట్రాన్స్‌ప్లాంట్ చేసినట్లు డాక్టర్ విట్టల్, డాక్టర్ స్వప్న తెలిపారు. ఆస్పత్రి ప్రాంగణంలో గురువారం వారు మీడియాతో మాట్లాడుతూ ఒకే రోజు ఏకకాలంలో రెండు కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌లు చేయడం అరుదైన ఘటనగా చెప్పారు. యూరాలజిస్టులు డాక్టర్ ప్రశాంత్‌కుమార్, డాక్టర్ ధీరజ్, డాక్టర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

'సహిత' పోస్టుల మెరిట్ జాబితా విడుదల

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష సొసైటీ నిర్వహిస్తున్న భవిత కేంద్రాల్లో 360 సహిత విద్యా రిసోర్స్ పర్సన్ పోస్టులకు ఎంపికైనవారి మెరిట్ జాబితాను జిల్లాల వారీగా ఆన్‌లైన్‌లో ఉంచారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు apie.apcfss.in వెబ్‌సైట్‌లో చూడవచ్చని సమగ్ర శిక్ష ఏఎస్పీడీ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైనవారి మొబైల్ నంబర్‌కు డీఈవో నుంచి సమాచారం పంపినట్లు శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

టీటీడీ బస్సు చోరీ నిందితుడిని పట్టిస్తే రివార్డు

రూ.10 వేలు ఇవ్వనున్నట్లు పోలీసులు వెల్లడి



తిరుమల: టీటీడీ ఎలక్ట్రిక్ ధర్మరథం బస్సును చోరీ చేసిన నిందితుడు విష్ణు (19)ను పోలీసులకు పట్టించినా, అతడి జాడ సమాచారమిచ్చినా రూ.10 వేలు రివార్డును అందజేస్తామని తిరుమల క్రైమ్ పోలీసులు తెలిపారు. చోరీ ఘటనకు సంబంధించి నిందితుడి ఫొటోను పోలీసులు గురువారం మీడియాకు విడుదల చేశారు. నిందితుడు ఈ నెల 24న ఉదయం 3.30 గంటలకు తిరుమల నుంచి టీటీడీ ఎలక్ట్రిక్ బస్సును చోరీ చేసి నాయుడుపేట హైవేలో చెన్నై వైపు వెళుతూ పోలీసులను చూసి బస్సును అక్కడే వదలి పరారయ్యాడు. నిందితుడి ఆచూకీ తెలిస్తే 9491086022, 9440796770 నంబర్లకు సమాచారమివ్వాలని కోరారు.

ఘాట్ రోడ్‌లో ఆర్టీసీ బస్సుకు ప్రమాదం

తిరుమల రెండో ఘాట్ రోడ్డులో గురువారం . అలిపిరి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు తిరుమలకు 4 కి.మీ ముందు మలుపు వద్ద అదుపు తప్పి కొండను ఢీకొంది. ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి.

వన్యప్రాణిని వేటాడిన కేసులో ముగ్గురి అరెస్టు

అనంతగిరి (అల్లూరి సీతారామరాజు జిల్లా): వన్యప్రాణి ఉడుమును వేటాడి వంటకం తయారు చేసి యూట్యూబ్ చానల్‌లో అప్‌లోడ్ చేసిన ఇద్దరు యువకులు, బాలుడిపై అటవీశాఖ అధికారులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతగిరి ఫారెస్ట్ రేంజర్ దుర్గాప్రసాద్ గురువారం వివరాలు వెల్లడించారు. అనంతగిరి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన నందుల అప్పలరాజు, నందుల సింహాద్రిబాల అదే గ్రామానికి చెందిన మరో బాలుడితో కలిసి అరకు ఏజెన్సీకి సంబంధించి ఏ టూ జెడ్ పేరుతో యూట్యూబ్ చానల్ నిర్వహిస్తున్నారు. ఇటీవల వన్యప్రాణి ఉడుము వంటకం తయారీపై వీడియోను అప్లోడ్ చేశారు. దీనిని అటవీశాఖ అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 కింద ముగ్గురిపై కేసు నమోదు చేసి ముగ్గురిని కోర్టులో హాజరు పరచగా 15 రోజులు రిమాండ్ విధించారు. అప్పలరాజు, సింహాద్రిబాలను విశాఖ కేంద్ర కారాగారానికి తరలించగా, బాలుడును చినగదిలిలోని జువైనల్ హోమ్‌కు తరలించారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణా ఆటకట్టు



బ్లాక్ మార్కెట్ దందాపై కఠిన చర్యలు • పటిష్ట నిఘా.. అక్రమార్కులపై పీడీ యాక్టు

- 6ఏ కేసుల సత్వర పరిష్కారం
- ప్రత్యేక యాప్‌తో రియల్ టైం మానిటరింగ్
- గడిచిన నాలుగేళ్లలో 8,696 కేసులు నమోదు

6ఏ కింద నమోదైన కేసుల వివరాలు

సంవత్సరం	నమోదు	పరిష్కరించినవి	శాతం
2020	1,089	629	57.76
2021	2,092	1,288	61.57
2022	2,974	1,794	60.32
2023	2,541	854	33.61
మొత్తం	8,696	4,565	52.50

6ఏ కింద సీజ్ చేసిన నిల్వల వివరాలు (క్వింటాళ్లు)

సంవత్సవం	సీజ్ చేసిన స్టాక్	విడుదల చేసిన స్టాక్	శాతం
2020	97,561.53	69,134.51	70.86
2021	96,555.86	59,566.17	61.69
2022	1,56,359.44	1,02,967.38	65.85
2023	1,20,210.80	50,926.28	42.36
మొత్తం	4,70,687.63	2,82,594.34	60.04

సాక్షి, అమరావతి: పేదల బియ్యాన్ని బొక్కే అక్రమార్కులపై వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతోంది. పటిష్ట చర్యలతో బియ్యం అక్రమ రవాణాకు చెక్ పెడుతోంది. ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తోంది. చౌక ధరల దుకాణాల ద్వారా పేదలకు పంపిణీ చేసే నిత్యావసరాలను దారిమళ్లించడం, దుర్వినియోగానికి పాల్పడిన వారిపై 6ఏ కేసులతో పాటు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తోంది. ఇప్పుడు దీర్ఘకాలికంగా బియ్యాన్ని బ్లాక్ మార్కెటింగ్ చేస్తూ, తరచూ పట్టుబడిన వ్యక్తులపై పీడీ యాక్టును ప్రయోగిస్తోంది.

ప్రత్యేక కార్యాచరణతో సత్ఫలితాలు

గతంలో రేషన్ బియ్యం విచ్చలవిడిగా అక్రమ రవాణా జరిగేది. వందల టన్నుల బియ్యం సరిహద్దులు దాటేసేది. మరోపక్క పేదలు తినే బియ్యంపై కొందరు అసత్య ప్రచారం చేసి, వాటిని తక్కువ రేటుకు కొని, తిరిగి పాలిష్ పట్టి మార్కెట్‌లోకి తెచ్చి అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకునేవారు. లారీలతో లోడ్లు తరలిపోతున్నా కేసులే నమోదయ్యేవి కావు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇటువంటి అక్రమార్కుల ఆట కట్టిస్తోంది. రేషన్ బియ్యం రవాణాపై నిఘాను పటిష్టం చేసింది. అంతర్రాష్ట్ర సరిహద్దులు, మండల నిల్వ పాయింట్లు, చౌక దుకాణాలు, ఎండీయూ వాహనాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిరంతర నిఘా పెట్టడంతో చాలా వరకు అక్రమ రవాణా తగ్గింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది ఏప్రిల్ వరకు 743 మందిని అరెస్టు చేసింది. నిత్యావసర వస్తువుల చట్టం – 1955 సెక్షన్ 6ఏ ప్రకారం అక్రమ రవాణాలో పట్టుబడిన సరకులు, వాహనాలను స్వాధీనం చేసుకొని, కేసులు నమోదు చేస్తోంది. ఈ కేసులు సత్వరం పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకొని, అక్రమార్కులకు త్వరితగతిన శిక్షలు పడేలా చేస్తోంది. పట్టుబడిన బియ్యాన్ని వెంటనే తిరిగి పీడీఎస్, మార్కెట్‌లోకి తెస్తోంది. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. జిల్లాల్లో బియ్యం అక్రమరవాణాలో పట్టుబడ్డ సరుకు నిల్వల విలువ రూ.50 లక్షల లోపు ఉంటే జేసీలు, అంతకు పైబడి ఉంటే కలెక్టర్లకు కేసుల పరిష్కార బాధ్యతలను అప్పగించింది. ఫలితంగా ఏళ్ల తరబడి సీజ్ చేసిన సరుకు ముక్కిపోయి, పురుగులు పట్టి పాడవకుండా బహిరంగ వేలం ద్వారా వెంటనే తిరిగి మార్కెట్లోకి తెస్తోంది. ఇలా గడిచిన నాలుగేళ్లలో 6ఏ కేసులు 8,696 నమోదు చేస్తే, వాటిల్లో 4,565 కేసులను పరిష్కరించింది. మొత్తం 4.70లక్షల క్వింటాళ్ల స్టాక్‌ను స్వాధీనం చేసుకోగా, 2.82 లక్షల క్వింటాళ్ల బియ్యాన్ని తిరిగి పీడీఎస్, మార్కెట్‌లోకి తీసుకొచ్చింది.

రియల్ టైం మానిటరింగ్

6ఏ కేసుల స్థితిగతులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పర్యవేక్షించేందుకు పౌర సరఫరాల శాఖ ప్రత్యేక యాప్‌ను అభివృద్ధి చేసింది. కేసు నమోదు చేసిన వెంటనే సీజ్ చేసిన స్టాక్ వివరాలను ఇందులో అప్‌లోడ్ చేస్తారు. జిల్లాలు, తేదీలు, నెలలవారీగా నమోదైన కేసులు, పరిష్కరించినవి, సీజ్ చేసిన స్టాకు, బయటకు విడుదల చేసిన స్టాక్ వివరాలను రియల్ టైమ్ మానిటరింగ్ చేసేలా ప్రత్యేక వ్యవస్థను రూపొందించారు. పీడీఎస్ బియ్యాన్ని దారి మళ్లించి, వాటిని రీసైక్లింగ్ చేసి కస్టమ్ మిల్లింగ్ రైస్ కింద చూపించడం, పాలిష్ పట్టి కొత్త ప్యాకింగ్‌లో మార్కెట్‌లో విక్రయించడాన్ని సంపూర్ణంగా నిరోధించే ప్రయత్నం చేస్తోంది.

పటిష్ట నిఘాతో అక్రమ రవాణా కట్టడి

ఇప్పటి వరకు అక్రమ రవాణా చేస్తూ పట్టుబడ్డ బియ్యాన్ని సీజ్ చేసి పక్కన పెట్టేవారు. వాటిని పట్టించుకోకపోవడంతో తినడానికి పనికి రాకుండా పాడయ్యేవి. ఈ క్రమంలోనే మేము 6ఏ కేసుల పరిష్కారంపై దృష్టి పెట్టాం. కేసులు వేగంగా పరిష్కారమయ్యేలా పర్యవేక్షిస్తున్నాం. దీనికి తోడు బ్లాక్ మార్కెట్ దందాకు పాల్పడే వారిని పీడీ యాక్టులో పెడుతున్నాం. పటిష్ట నిఘా ఉంది కాబట్టే కేసులు నమోదవుతున్నాయి. అంతేగానీ అక్రమ రవాణా జరిగిపోతున్నట్టు కాదు.

– హెచ్.అరుణ్ కుమార్, కమిషనర్, పౌరసరఫరాల శాఖ

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో వైద్యరంగ అనుబంధ కోర్సులు

- మెడికల్ కాలేజీ ఏర్పాటుపైనా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం
- వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి


ప్రదర్శనను తిలకిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి, డాక్టర్ అబ్రహం తదితరులు

ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో వైద్య రంగానికి అనుబంధంగా కొత్త కోర్సులు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించనున్నట్లు ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తెలిపారు. ఏయూ న్యూక్లియర్ ఫిజిక్స్ విభాగం, నేషనల్ అసోసియేషన్ ఫర్ అప్లికేషన్ ఆఫ్ రేడియో ఐసోటోప్స్ అండ్ రేడియేషన్ ఇన్ ఇండస్ట్రీ(నారీ) సంయుక్త ఆధ్వర్యాన గురువారం బీచ్‌రోడ్డులోని ఏయూ సాగరిక కన్వెన్షన్‌లో 'రీసెంట్ ట్రెండ్స్ ఆన్ అప్లికేషన్స్ ఆఫ్ రేడియో ఐసోటోప్స్ అండ్ రేడియేషన్ టెక్నాలజీస్' అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి మాట్లాడుతూ నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా ఉన్నత విద్యాసంస్థలు అన్ని అంశాల్లోనూ భాగస్వాములుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో 98 ఏళ్ల ప్రస్థానం కలిగిన ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఏయూ ఫార్మసీ, మైక్రో బయాలజీ, బయోకెమిస్ట్రీ, సైకాలజీ వంటి మెడికల్ సంబంధిత కోర్సులను అందిస్తోందని చెప్పారు. ప్రస్తుతం అనేక రంగాల్లో రేడియేషన్ టెక్నాలజీ పాత్ర పెరుగుతోందని, ఈ రంగంలో ఉన్న అద్భుత అవకాశాలను వినియోగించుకునేందుకు యువ పరిశోధకులు కృషి చేయాలన్నారు. డాక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ రేడియేషన్ టెక్నాలజీలో విస్తృత అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అన్ని రంగాలు, పరిశ్రమల్లో పెద్ద ఎత్తున ఈ సాంకేతికతను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు యువ పరిశోధకులు, ఆచార్యులు నూతన ఆవిష్కరణలకు కృషి చేయాలని సూచించారు. అనంతరం వీసీ ప్రసాదరెడ్డి, 'నారీ' ప్రధాన కార్యదర్శి పీజే చాండీ, డాక్టర్ అబ్రహాం తదితరులు సదస్సు ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. రేడియేషన్ టెక్నాలజీకి సంబంధించిన పరికరాలతో కూడిన ఎగ్జిబిషన్‌ను అతిథులు, విద్యార్థులు తిలకించారు. బ్రిట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ప్రదీప్ ముఖర్జి, ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె.శ్రీని, సదస్సు చైర్మన్ ఆచార్య దుర్గాప్రసాద్, న్యూక్లియర్ ఫిజిక్స్ విభాగాధిపతి ఆచార్య లక్ష్మీనారాయణ, జాతీయ స్థాయిలో వివిధ విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు.

రైతు ఉద్యమ నేత 'యెర్నేని' మృతి


యెర్నేని నాగేంద్రనాథ్ (ఫైల్)

కైకలూరు (కలిదిండి)/ సాక్షి,అమరావతి : ఆంధ్రప్రదేశ్ రైతాంగ సమాఖ్య, కొల్లేరు పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు, కృష్ణా, గోదావరి, పెన్నార్ డెల్టా డ్రెయినేజీ బోర్డు మాజీ సభ్యుడు యెర్నేని నాగేంద్రనాథ్ (చిట్టిబాబు) (78) తన స్వగ్రామమైన ఏలూరు జిల్లా కలిదిండి మండలం కొండూరులో కన్నుమూశారు. కొద్ది రోజుల క్రితం మెదడుకు శస్త్రచికిత్స జరిగి విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఇంటికి తీసుకొచ్చిన తర్వాత గురువారం తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు భార్య యెర్నేని సీతాదేవి మాజీ మంత్రిగా పనిచేశారు. సోదరుడు దివంగత యెర్నేని రాజారామచందర్ రెండు పర్యాయాలు కైకలూరు ఎమ్మెల్యేగా గెలిచారు. కొల్లేరు ముంపు సమస్యలపై పూర్తి అధ్యయనం చేశారు. ప్రముఖ రైతు ఉద్యమకారులతో కలసి అనేక ఉద్యమాలు చేశారు. ఇరిగేషన్ ప్రాజెక్టులపై పూర్తి పట్టు కలిగిన వ్యక్తిగా పేరుంది. కైకలూరులో వీరి తండ్రి యెర్నేని వెంకట నాగేశ్వరరావు (వైవీఎన్నార్) పేరుతో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఉంది. ఆయన మరణం పట్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి, కౌలు రైతు సంఘం రాష్ట్ర శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఉమ్మడి కృష్ణా, ఏలూరు జిల్లాలకు చెందిన పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. చిన్న కుమారుడు అమెరికాలో ఉండడంతో శుక్రవారం అంత్యక్రియలకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

బొగ్గు కొరతపై దృష్టి పెట్టండి

- రాష్ట్రాల విద్యుత్ సంస్థలకు కేంద్రం అలర్ట్
- థర్మల్ పవర్‌లో 38శాతం పెరగనున్న బొగ్గు వినియోగం
- ఇప్పటికే కోటా ప్రకారం రాష్ట్రాలకు బొగ్గు సరఫరా
- ప్రస్తుతానికి ఇబ్బంది లేకుండా ఏపీలో బొగ్గు నిల్వలు



సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా బొగ్గు డిమాండ్ భారీగా పెరగనుందని, దానివల్ల రాష్ట్రాలకు బొగ్గు తీవ్ర కొరత రానుందని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. ఈ మేరకు రాష్ట్రాల విద్యుత్ సంస్థలకు హెచ్చరికలు జారీ చేసింది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా దేశవ్యాప్తంగా 49 గిగావాట్ల బొగ్గు ఆధారిత యూనిట్లు నిర్మాణంలో ఉన్నాయి. వాటికి అదనంగా 25 నుంచి 30 గిగావాట్ల థర్మల్ పవర్ కెపాసిటీని అదనంగా పెంచుకోవాలని కేంద్రం తెలిపింది. సాధారణంగా 65 శాతం నుంచి75 శాతం వరకు ఉండే ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్) వద్ద 1000 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి 3.5 నుంచి 4 మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం. ప్రస్తుతం బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 212 గిగావాట్లుగా ఉంది. ఇది 2030 నాటికి 260 గిగావాట్లకు చేరుకుంటుందని అంచనా. అదనంగా 30 గిగావాట్ల ప్రాజెక్టులు రావడంతో ఆ మేరకు సామర్థ్యం 290 గిగావాట్లకు పెరుగుతుంది. అదేక్రమంలో దేశ వార్షిక బొగ్గు వినియోగం 292 మిలియన్ టన్నులకు చేరుకోనుంది. అంటే ప్రస్తుత వినియోగంలో 38 శాతం పెరుగుదల ఉంటుందని కేంద్రం వివరించింది. ఈ మేరకు బొగ్గు నిల్వలు పెంచుకోవాలని విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు సూచించింది.

ఏపీలో ఇబ్బంది లేదు..

దేశవ్యాప్తంగా రెండేళ్లుగా బొగ్గు కొరత వేధిస్తున్న క్రమంలో కేంద్ర విద్యుత్, రైల్వే, బొగ్గు మంత్రిత్వ శాఖల నేతృత్వంలో ఏర్పడ్డ కమిటీ అన్ని రాష్ట్రాలకూ బొగ్గును కోటా పద్ధతిలో అందిస్తున్నది. దీని ప్రకారం మన రాష్ట్రానికి సింగరేణి కాలరీస్, మహానది కోల్‌ఫీల్డ్స్ నుంచి బొగ్గు సరఫరా జరుగుతున్నది. ఏపీజెన్‌కో తన అనుబంధ సంస్థ ఏపీపీడీసీఎల్‌తో కలిపి మొత్తం మూడు ప్లాంట్లలో 5,810 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం గల థర్మల్ విద్యుత్ కేంద్రాలు నిర్వహిస్తున్నది. కృష్ణపట్నంలోని శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఈ ఏడాది మార్చి 10న 800 మెగావాట్ల యూనిట్ వాణిజ్య ఉత్పత్తి ప్రారంభమైంది. రాష్ట్ర గ్రిడ్ అవసరాలను సాధ్యమైనంత ఎక్కువగా తీర్చాలనే లక్ష్యంతో ఏపీ జెన్‌కో ఉత్పత్తి పెంచుతూ వస్తున్నది. సామర్థ్యాన్ని మించి దాదాపు 10 మెగావాట్ల అధిక ఉత్పత్తి నమోదు చేస్తున్నది. ఇబ్రహీంపట్నంలోని డాక్టర్ ఎన్టీటీపీఎస్ (వీటీపీఎస్)లో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల యూనిట్–8లోనూ ఉత్పత్తి ప్రారంభమైంది. వీటీపీఎస్‌కి రోజుకి 28,500 మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం కాగా.. ప్రస్తుతం 57,352 మెట్రిక్ టన్నులు నిల్వ ఉంది. ఆర్టీపీపీకి 21 వేల మెట్రిక్ టన్నులు కావాల్సి ఉండగా..40,624 మెట్రిక్ టన్నులు ఉంది. కృష్ణపట్నం ప్లాంటుకు 29 వేల మెట్రిక్ టన్నులుండాల్సి ఉండగా.. 1,99,896 మెట్రిక్ టన్నులు ఉంది. హిందూజాలో 19,200 మెట్రిక్ టన్నులు ఒక రోజుకి వాడుతుండగా, 78,552 మెట్రిక్ టన్నుల నిల్వ సిద్ధంగా ఉంది. ఈ లెక్కన రాష్ట్రంలో బొగ్గు నిల్వలు సగటున రెండు రోజుల నుంచి వారం రోజులకు సరిపోతాయి. నిల్వలు తరిగిపోయి థర్మల్ విద్యుత్ ఉత్పత్తికి ఇబ్బంది తలెత్తకుండా నిత్యం రైల్వే ర్యాకుల ద్వారా బొగ్గు దిగుమతి జరుగుతున్నది.

జాషువా స్ఫూర్తితోనే ముందుకెళుతున్నాం

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ



జాషువా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రులు నాగార్జున, సురేష్, ఎంపీ నందిగం తదితరులు

సాక్షి, అమరావతి: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా ఆశయ స్ఫూర్తితోనే వైఎస్ జగన్ ప్రభుత్వం ముందుకెళుతోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. జాషువా జయంతిని గురువారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మేరుగ నాగార్జున, ఆదిమూలపు సురేష్, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి తదితరులు జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి నాగార్జున మాట్లాడుతూ సమాజంలో అనేక అవమానాలు, వివక్షను ఎదుర్కొని ఎదిగిన మహాకవి జాషువా అని కొనియాడారు. సమాజాన్ని మేల్కొలిపేలా రచనలు చేశారని చెప్పారు. ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ ఉన్నతమైన ఆయన రచనలు గబ్బిలం, క్రీస్తు చరిత్ర, ఫిరదౌసి వంటి వాటిని అన్ని భాషల్లోకి అనువాదం చేయాల్సిన అవసరం ఉందన్నారు. జాషువా స్ఫూర్తితో దళిత వర్గాల అభ్యున్నతికి అవిశ్రాంతంగా కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరం అండగా నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. నందిగం సురేష్ మాట్లాడుతూ వివక్షకు వ్యతిరేకంగా తనదైన శైలిలో సమాజాన్ని మేల్కొల్పిన మహనీయుడు జాషువా అని చెప్పారు. కార్యక్రమంలో పలు కార్పొరేషన్ల చైర్‌పర్సన్‌లు, డైరెక్టర్లు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

• తెలంగాణ

కన్నుల పండువగా గణేశ్ నిమజ్జనం

- ఆధ్యాత్మికతను సంతరించుకున్న భాగ్యనగరం
- సకాలంలో గంగ ఒడికి చేరిన మహా గణపతి
- వేడుకలు తిలకించి పులకించిన భక్తజనం
- హెలికాప్టర్ నుంచి పరిశీలించిన మంత్రులు, డీజీపీ



సాక్షి, హైదరాబాద్ : గణపతి నిమజ్జన వేడుకలు గురువారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగాయి. వేల సంఖ్యలో వినాయక విగ్రహాలను భక్తులు నిమజ్జనం చేశారు. భారీ సంఖ్యలో విగ్రహాలు, భక్తులతో రహదారులు కిటకిటలాడాయి. నగరం నలువైపుల నుంచి తరలి వచ్చిన భక్తజన సందోహంతో సాగరతీరం సందడిగా మారింది. ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్డు, పీపుల్స్‌ప్లాజా తదితర ప్రాంతాల్లో 'జైబోలో గణపతి మహారాజ్‌కీ జై 'అంటూ నినాదాలు హోరెత్తాయి. వైవిధ్య భరితమైన వినాయక మూర్తుల నిమజ్జన వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. భక్తుల నినాదాలు, నృత్యాలతో కూడిన శోభాయాత్రతో మహానగరం ఆధ్యాత్మికతను సంతరించుకుంది. 63 అడుగుల ఖైరతాబాద్ శ్రీ దశ మహా విద్యా గణపతి నిమజ్జన వేడుకలు మధ్యాహ్నం 1.27 గంటలకే ముగిశాయి. ఎక్కడా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా భక్త జనసందోహం నడుమ శోభాయాత్ర ప్రశాంతంగా సాగింది. ఉదయం 6.12 గంటలకు ప్రారంభమైన ఖైరతాబాద్ మహాగణపతి శోభాయాత్ర సెన్సేషన్ థియేటర్, రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మీనార్, సచివాలయం, ఎన్టీయార్ మార్గ్ మీదుగా ఉదయం 11.40 గంటలకు 4వ నంబర్ క్రేన్ వద్దకు చేరుకుంది. మధ్యాహ్నం 12.24 గంటలకు చివరి పూజ నిర్వహించిన అనంతరం నిమజ్జనం చేశారు. ఖైరతాబాద్ మహాగణపతిని పది రోజుల్లో 50 లక్షల మంది దర్శించుకున్నారని మంత్రి తలసాని చెప్పారు. హైదరాబాద్ నగర పరిధిలో గణేశ్ నిమజ్జన కార్యక్రమాన్ని మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి డీజీపీ అంజనీకుమార్ ఏరియల్ వ్యూ ద్వారా పర్యవేక్షించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.